
'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 313

శనివారం 3-2-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విజయీభవ...

అండర్‌–19 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతో నేడు భారత్‌ 'ఫైనల్‌' పోరు

–స్పోర్ట్స్‌లో



పంద్రాగస్టు లేదా గాంధీ జయంతి!

'మోదీ కేర్‌' ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం యోచన

-8లో



సెన్సెక్స్‌ 840 పాయింట్లు.. నిఫ్టీ 256 పాయింట్లు పతనం

'పన్ను' పడేసింది!

- రెండో రోజూ 'బడ్జెట్‌' నష్టాలు.. మార్కెట్‌కు రుచించని క్యాపిటల్‌ గెయిన్స్‌ ట్యాక్స్‌
- ద్రవ్యలోటు అంచనా పెంపూ ప్రతికూలమే.. వీటికి తోడైన ప్రపంచ మార్కెట్ల పతనం
- రాజస్థాన్లో బీజేపీ ఓటమి సెంటిమెంట్‌ను దెబ్బతీసింది

– బిజినెస్‌లో

■ ఈ ఏడాది ఆరంభంలోనే రికార్డ్‌ల మీద రికార్డ్‌ల సృష్టించిన స్టాక్‌ మార్కెట్‌ శుక్రవారం భారీగా పతనమైంది. ఈక్విటీ లాభాలపై దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధింపు స్టాక్‌ మార్కెట్‌ను నిండా ముంచింది. ద్రవ్యలోటు అంచనాలు పెరగడం, ప్రపంచ మార్కెట్ల పతనం కూడా ప్రభావం చూపడంతో సెన్సెక్స్‌, నిఫ్టీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్‌ 35,100 పాయింట్ల దిగువకు, నిఫ్టీ 10,800 పాయింట్ల దిగువకు పతనమయ్యాయి. రెండేళ్లలో సెన్సెక్స్‌కు ఇదే అత్యంత భారీ పతనం.



ఆధార్‌ డేటా సురక్షితం

రాజ్యసభలో స్పష్టం చేసిన కేంద్రం

8 లో

అంబటి ఓటు గల్లంతు..!

- ఆయన భార్య, ఇద్దరు కుమార్తెల ఓట్లు కూడా..
- సత్తెనపల్లి అంతటా ఇదే పరిస్థితి

2 లో

బాబుగారి 'బడ్జెట్‌' డ్రామా!



కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటిపై నాలుగేళ్లుగా కాలయాపన

- కేసుల భయంతో నోరు మెదిపే సాహసం చేయని సీఎం చంద్రబాబు
- కేంద్ర కేబినెట్‌లో కొనసాగుతున్న టీడీపీ ఎంపీలు
- బడ్జెట్‌ కన్నా ముందే డ్రామాకు తెరలేపిన సీఎం
- ఇప్పుడు బడ్జెట్‌పై ఆగ్రహం అంటూ మీడియాకు లీకులతో హడావుడి
- ఏపీకి జరుగుతున్న అన్యాయంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

సాక్షి, అమరావతి

కేంద్ర బడ్జెట్‌ కేటాయింపులపై ఒత్తిడి పెంచి విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు న్యాయంగా రావాల్సిన వాటిని సాధించటంలో ఘోరంగా విఫలమైన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కనీసం ప్రశ్నించే సాహసం కూడా చేయక పోవటంపై రాష్ట్రమంతా తీవ్ర చర్చ జరుగుతోంది. నాలుగేళ్లుగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా, బీజేపీ మిత్రపక్షంగా కొనసాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై నోరు మెదపటం లేదు. ఓటుకు కోట్లు కేసుతో సహా ఈ నాలుగేళ్లలో పలు అవినీతి, అక్రమాల్లో మునిగిపోయిన ముఖ్యమంత్రి సీబీఐ కేసులు పెడతారనే భయంతోనే దిక్కులు చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అభిప్రాయం రాష్ట్రంలోని అన్నివర్గాల్లో నెలకొందని, దీన్ని పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వ పెద్ద ఇన్నాళ్లూ మౌనం దాల్చారని అంటున్నారు.

సమావేశాలతో కాలహరణం

కేంద్రం బడ్జెట్‌ ప్రవేశపెట్టిన తరువాత రాష్ట్రాధినేతగా తన అభిప్రాయాన్ని మీడియా ముందుకు వచ్చి చెప్పాల్సిన చంద్రబాబు తెరవెనుక నుంచి నాయకులతో టెలికాన్ఫరెన్సులు, అభిప్రాయ సేకరణలు, సమన్వయ కమిటీ, కేబినెట్‌ సమావేశాలు, ఎంపీలతో మీటింగ్‌లు అంటూ కాలం గడుపుతున్నారు. ఇదంతా అయోమయానికి గురి చేసే కొత్త డ్రామాయేనని పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీకి పలుమార్లు వెళ్లినట్లు చెప్పుకుంటున్న చంద్రబాబు అక్కడ ఆయన సొంత పనులు చక్కపెట్టుకోవడమే తప్ప ఆంధ్రప్రదేశ్‌ గురించి పట్టించుకోలేదనే విషయం తాజా బడ్జెట్‌ కేటాయింపులతో తేటతెల్లమైంది. పోలవరం కాంట్రాక్టు పనులు తనకు నచ్చిన సంస్థలకు అప్పగించుకోవడం, అసెంబ్లీ సీట్ల పెంపు లాంటి వ్యవహారాలే తప్ప ఇతర అంశాలను చంద్రబాబు

మిగతా 2వ పేజీలో ▶

ఏపీకి నీరు విడుదల చేయాల్సిందే

- నాగార్జునసాగర్‌ ఎడమ కాలువకు నీరు నిలిపేయొద్దు
- ఏపీ కోటా పూర్తయ్యేవరకూ విడుదల చేయాలి
- తెలంగాణ సర్కార్‌కు కృష్ణా బోర్డు లేఖ

5 లో



కౌలు రైతులపై ఈ-క్రాప్‌ కత్తి!

ఆన్‌లైన్‌లో పంటకు భూ యజమానుల పేర్లు నమోదు

కౌలు రైతుకు దూరం కానున్న ప్రభుత్వ పథకాలు

- ఇలాగైతే ఇకపై పంట అమ్ముకోవడమూ కష్టమే
- కౌలు రైతుల రక్షణ చట్టానికి సర్కారు తూట్లు
- పెరుగుతున్న కౌలు రైతుల కడగండ్లు
- ఆందోళనకర స్థాయిలో ఆత్మహత్యలు

6 లో



కేబినెట్‌ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రులు కాలువ శ్రీనివాసులు, కళా వెంకట్రావు, ప్రభుత్వ సలహాదారు పరకాల

ప్రజారోగ్యానికి ప్రపంచబ్యాంకు రుణం

- ప్రాథమిక వైద్యరంగంలో మౌలిక వసతులకు రూ.3,365 కోట్లు ప్రపంచబ్యాంకు అప్పు
- టాటా ట్రస్టుకు 'బాలామృతం'
- ఎంపీల ట్రస్టుకు నిధుల కేటాయింపు
- కంటెంట్‌, డ్రోన్‌ కార్పొరేషన్‌లకు ఆమోదం
- అసెంబ్లీలో బిల్లుగా ఏపీ పోలీస్‌ ఆర్డినెన్స్‌–2017
- పోలవరం ప్రాజెక్టు పనులకు ప్రత్యేక ముందస్తు నిధుల పెంపు.. రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయాలు

6 లో

ప్రజా సంకల్ప యాత్ర 78 వ రోజు



నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉదయం 8 గంటలకు మరుపూరు నుండి

ముఖ్యాంశాలు

- నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని మట్టెంపాడు, మోపూరు గ్రామాల్లో పాదయాత్ర, ప్రజలతో మమేకం
- మొగళ్లపాలెంలో పార్టీ పతాకావిష్కరణ
- సౌత్ మోపూరులో బహిరంగ సభ

ఎలక్టోరల్ బాండ్లపై కేంద్రానికి నోటీసులు

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు కేంద్రం ఎలక్టోరల్ బాండ్లను జారీ చేయడాన్ని సవాలు చేస్తూ సీపీఎం శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని విచారణకు స్వీకరించిన సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం.. ఈ విషయమై ప్రతిస్పందించాల్సిందిగా కేంద్రానికి నోటీసులు జారీచేసింది. ఎలక్టోరల్ బాండ్ల జారీతో ప్రజాస్వామ్యానికి నష్టం జరుగుతుందనీ, దేశంలో తీవ్రమైన రాజకీయ అవినీతి నెలకొంటుందని పిటిషన్‌లో సీపీఎం ఆరోపించింది.

రాజ్యాంగ ధర్మాసనానికి జల్లికట్టు కేసు

న్యూఢిల్లీ: తమిళనాడులో నిర్వహించే జల్లికట్టు క్రీడపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించింది. జల్లికట్టుకు సంబంధించి ప్రధానంగా ఐదు ప్రశ్నలను రాజ్యాంగ ధర్మాసనం ముందు ఉంచినట్లు సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్‌ల ధర్మాసనం తెలిపింది. తమిళనాడులో జల్లికట్టు, మహారాష్ట్రలో ఎద్దుల బండి పోటీలపై దాఖలైన పిటిషన్లను త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనానికి నివేదిస్తామని గతేడాది డిసెంబర్ 12న సుప్రీంకోర్టు చెప్పిన సంగతి తెలిసిందే. ఈ క్రీడల్ని సాంస్కృతిక హక్కుగా గుర్తిస్తూ చట్టాలు చేసే అధికారం రాష్ట్రాలకు ఉందా? లేదా? అన్న విషయాన్ని ధర్మాసనం పరిశీలిస్తుందని సుప్రీం పేర్కొంది. కేంద్రం తెచ్చిన జంతు హింస నిరోధక చట్టం–1960ను సవరిస్తూ పోటీల్ని నిర్వహించుకోవచ్చని తమిళనాడు, మహారాష్ట్రలు తెచ్చిన చట్టాల్ని ఈ బెంచ్ సమీక్షిస్తుందని తెలిపింది.

అతిథి పక్షుల ఆర్తనాదాలు

చెంగుచెంగున ఎగిరే చేపపిల్లలు.. రమణీయమైన సరస్సులో వయ్యారంగా సాగిపోయే సంప్రదాయ తాటిదోనెలు.. కనువిందు చేసే అతిథి పక్షుల కిలకిలారావాలు.. మరులుగొల్పే పచ్చిక బయళ్లు.. గలగలపారే నీటి అలలు.. కొల్లేరు సరస్సు పేరు చెబితే గుర్తొచ్చేవివీ.. కానీ, నేడు కొల్లేరు కళావిహీనమై వలస పక్షులు ఆహారం దొరక్క ఆర్తనాదాలు చేస్తున్నాయి. పక్షులకు వేట కరువై దుర్భర స్థితి దాపురించింది. సహజసిద్ధంగా పెరిగే నల్లజాతి చేపలూ అంతరించిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు రెగ్యురేటర్ నిర్మిస్తామని విస్మరించడం.. ప్రాజెక్టుల పేరుతో నీటి మళ్లింపు.. కాస్తో కూస్తో పై ప్రాంతాల నుంచి వచ్చే నీటినీ పలు గ్రామాల ప్రజలు దారి మళ్లించడం.. వెరసి కొల్లేరు సరస్సులో వేసవి రాకముందే ఎడారి వాతావరణం కనిపిస్తోంది.



- నీరులేక కళావిహీనంగా కొల్లేరు సరస్సు
- ఆహారం కోసం అల్లాడుతున్న అతిథి పక్షులు
- సహజసిద్ధంగా పెరిగే నల్లజాతి చేపలూ కనుమరుగు
- పోలవరం, పట్టిసీమ ప్రాజక్టులకు నీరు మళ్లింపుతో ఇక్కట్లు
- వేసవి రాకముందే కొల్లేరులో ఎడారి వాతావరణం

కైకలూరు

కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 67 డ్రెయిన్లు, వాగుల ద్వారా లక్షా 10 వేల క్యూసెక్కుల నీరు కొల్లేరుకు చేరుతోంది. బుడమేరు, తమ్మిలేరు డ్రెయిన్ల నుంచి నీరు ఎక్కువగా వస్తోంది. కృష్ణాజిల్లా నుంచే వివిధ డ్రెయిన్ల ద్వారా 35,590 క్యూసెక్కుల నీరు కొల్లేరులో కలుస్తోంది. కృష్ణా, ఖమ్మం జిల్లాల సరిహద్దుల్లో తూర్పు కనుముల కొండ ప్రాంతాల నుంచి వచ్చే రామిలేరు, బుడమేరు, తమ్మిలేరు వాగులు కొల్లేరుకు ప్రధాన నీటి వనరులు. ఇటీవల వెలగలేరు వద్ద రామిలేరు, తమ్మిలేరును పోలవరం కుడికాల్వకు, మరి కొన్ని చిన్న కాల్వలు, డ్రెయిన్లును పట్టిసీమ కాల్వలకు కలపడంతో కొల్లేరుకు నీటి కొరత ఏర్పడింది.

పెరుగుతున్న వలసలు..

కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 9 మండలాల్లో కొల్లేరు సరస్సు విస్తరించింది. రెండు జిల్లాల్లో 122 కొల్లేరు పరీవాహక గ్రామాలున్నాయి. చేపల వేట సాగిస్తూ 3.20 లక్షల మంది జీవిస్తున్నారు. రెండేళ్లుగా డిసెంబర్ నాటికే కొల్లేరులో నీరు ఇంకిపోతోంది. లక్షలాది మంది చేపల వేట కరువై ఇతర రాష్ట్రాలకు వలసబాట పడుతున్నారు. సరస్సుకు ఏటా సైబీరియా, ఆస్ట్రేలియా, నైజీరియా వంటి దేశాల నుంచి వలస పక్షులు విడిదికి వస్తాయి. స్వదేశీ, విదేశీ కలిపి 189 రకాల పక్షులు ఇక్కడ నివసిస్తున్నాయి. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలు పక్షుల సంతానోత్పత్తికి అనుకూల కాలం. కొల్లేరులో నీరు లేకపోవడంతో పక్షులకు వేట కరువైంది. ఈ ప్రభావం సంతానోత్పత్తిపై చూపుతోంది. రెగ్యులేటర్ నిర్మించకపోవడంతో ఏటా సముద్రపు నీరు కొల్లేరులోకి ఎగదన్నుతోంది. దీంతో భూములు చౌడుబారడమే కాకుండా, కొల్లేరు సరస్సులో సహజసిద్ధంగా పెరిగే నల్లజాతి చేపలు అంతరిస్తున్నాయి. పక్షులు అనారోగ్యం పాలవుతున్నాయి.



కొల్లేరుకు నీటిని తరలించడానికి పెద ఎడ్లగాడి వంతెన వద్ద నీరు లేక వెలవెలబోతున్న దృశ్యం



మణుగునూరులంక వద్ద కొల్లేరులో నీరు లేకపోవడంతో మేత మేస్తున్న గొర్రెలు



పెద్ద ఎడ్లగాడి వద్ద నీరు లేక ఒడ్డుకు చేరిన వేటకు ఉపయోగించే తాటిదోనె

కొల్లేరు అంతరించిపోతోంది



కొల్లేరు సరస్సు పూర్వం నిండుకుండలా జల కళతో ఉండేది. ఎగువ నుంచి వచ్చే నీటి వనరులు రావడం లేదు. దీనికి తోడు పై ప్రాంతాల నుంచి వచ్చే నీటిని పలు గ్రామాల ప్రజలు దారి మళ్లిస్తున్నారు. గోదావరి నీటిని కొల్లేరుకు పంపుతామని నాయకులు చెప్పిన మాటలు అమలు కాలేదు. గ్రామాల్లో వలసలు పెరిగాయి. తక్షణం నీటిని విడుదల చేయాలి.

– ఘంటసాల వెంకటేశ్వరరావు, మత్స్యకార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు, కొవ్వాడలంక

రెగ్యులేటర్ నిర్మాణం ఎప్పుడు?



కొల్లేరు శివారున రెగ్యులేటర్ నిర్మాణం జరిగితే వర్షాల సమయంలో కొల్లేరు సరస్సులోకి వచ్చే నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ఆ సమయంలో చిన్న సైజు చేప పిల్లలను వదిలితే కొద్ది కాలానికి మత్స్యకారులకు వేటతో జీవనోపాధి కలుగుతోంది. రెగ్యులేటర్ నిర్మాణం లేకపోవడంతో ఫిబ్రవరి నుంచి సముద్రపు నీరు కొల్లేకులోకి వస్తుంది. ఉప్పునీరు కారణంగా సహజ సిద్ధ చేపలు మరణిస్తున్నాయి. ప్రభుత్వం రెగ్యులేటర్ నిర్మించాలి.

– బలే ఏసురాజు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల కొల్లేరు సంఘ ప్రధాన కార్యదర్శి, కొట్టాడ.

బాబుగారి 'బడ్జెట్' డ్రామా!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రస్తావించలేదని స్పష్టమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్యాబినెట్‌లోనూ ఆయన మంత్రులే

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో చంద్రబాబు భాగస్వామిగా కొనసాగుతున్నారు. నాలుగేళ్లుగా కేంద్రంలో ఆయన పార్టీకి చెందిన వారు మంత్రులుగా ఉన్నారు. వారు మంత్రులుగా ఉన్న కేబినెట్టే కేంద్ర బడ్జెట్‌ను ఆమోదించి పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కేబినెట్లో, పార్లమెంటులో బడ్జెట్‌ను తన వారితో ఆమోదింప చేసిన చంద్రబాబు బయటకు వచ్చాక రాష్ట్రానికి అన్యాయం జరిగిందని తాపీగా అనటాన్ని తప్పుబడుతున్నారు. రాష్ట్రానికి కేటాయింపులు ఏమీ లేకున్నా గత నాలుగేళ్లుగా కేంద్ర బడ్జెట్ అద్భుతంగా ఉందంటూ పొగిడిన చంద్రబాబు ఇప్పుడు సర్దుకుని సరిగా లేదంటూ తప్పించుకునే యత్నం చేస్తున్నారు. ఓటుకు కోట్లు కేసుతో సహా పలు అక్రమాలపై సీబీఐ కేసులు నమోదవుతాయనే భయంతో బడ్జెట్‌పై బహిరంగంగా మాట్లాడకుండా తెరవెనుక నుంచి అనుకూల మీడియా ద్వారా లీకులు ఇప్పిస్తున్నారు. కేసుల భయంతో కనీసం ప్రెస్‌మీట్ పెట్టే సాహసం కూడా చేయలేకపోతున్నారని, ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని పేర్కొంటున్నారు.

తన ప్యాకేజీ కోసం ముందునుంచే...

బడ్జెట్ కన్నా ముందే చంద్రబాబు ఈ డ్రామాకు తెరలేపారని గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలను విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం కేంద్రంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకే నాటకాన్ని నడిపిస్తున్నారని పేర్కొంటున్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ ఇవ్వకున్నా ఫర్వా లేదు, పోలవరం ప్రాజెక్టు పనులు మాత్రం తాము చెప్పిన కాంట్రాక్టర్‌కే అప్పగించాలనే ధోరణితో వెళుతున్నారు. బడ్జెట్‌కు ముందు ఢిల్లీలో జరిగిన సమావేశంలో చంద్రబాబు పేర్కొన్న సంస్థకు కాంట్రాక్టు బదలాయింపు జరగడాన్ని ఉదహరిస్తున్నారు. అందుకే బడ్జెట్లో ఏపీకి కేటాయింపులు లేకున్నా మారు మాట్లాడకుండా తెరవెనుక మాత్రం ఆగ్రహం అంటూ పక్కదారి పట్టించే యత్నాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల్లో కమీషన్ల కోసమే ఈ వ్యవహారాన్ని నడిపారన్నది అందరికీ తెలిసిందేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయింపులు చేయటం లేదనే విషయం చంద్రబాబుకు తెలుసని అంటున్నారు.

ప్రతిపక్షం హితోక్తులు పెడచెవిన...

ప్రత్యేక హోదా ఏమైనా సంజీవనా? అంటూ చంద్రబాబు ప్యాకేజీని తెరపైకి తెచ్చారు. ఇప్పుడు ప్యాకేజీలోనూ ఏమీ ఇవ్వడం లేదనే లీకులు ఇస్తున్నారు. ప్యాకేజీతో లాభం లేదని, హోదా ఉంటేనే రాయితీలు, ఇతర సదుపాయల వల్ల పరిశ్రమలు వాటంతట అవే వస్తాయని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు దీర్ఘకాలికంగా ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని ప్రతిపక్షం పదేపదే చెప్పినా చంద్రబాబు పట్టించుకోలేదు. 'కోడలు మగబిడ్డను కంటానంటే ఏ అత్త అయినా వద్దంటుందా?' అని చలోక్తులు విసిరారు. కేంద్రంలో భాగస్వాములుగా ఉంటూ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా మాట్లాడకుండా అధికారాన్ని అనుభవిస్తున్న చంద్రబాబు నెపాన్ని ఇతరులపైకి నెట్టే ప్రయత్నాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

ఇన్నాళ్లూ ఏం చేశారు?

ఇప్పటికే నాలుగు బడ్జెట్‌లు ముగిశాయి. విభజన చట్టం హామీలు నెరవేరడం లేదు. లోటు బడ్జెట్‌ను తొలి ఏడాదిలోనే భర్తీ చేయాలని చట్టంలో ఉన్నా నెరవేరలేదు. ఇంత జరుగుతున్నా రాష్ట్రాధినేతగా ఉన్న పెద్ద అడగడం లేదెందుకన్న ప్రశలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ సంస్థలకు నిధులు అరకొరగా ఇస్తున్నా నోరు మెదపడం లేదు. రైల్వేజోన్‌పై ఇన్నాళ్లూ మొద్దు నిద్ర నటించి ఇప్పుడు ఇక వచ్చే అవకాశం లేదని తన పార్టీ నాయకుల ద్వారా సంకేతాలు ఇస్తున్నారు. అమరావతి శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని నిధులకు బదులు మట్టి, నీరుతో సరిపెట్టినా చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకున్నారు. కేంద్రం నుంచి ఇతోధిక సాయం సాధిస్తామని పలు సమావేశాల్లో చెప్పుకొంటూ వచ్చారు. దుగరాజపట్నం ఓడరేవును సాధించాల్సింది పోయి తన స్వార్థం కోసం ఎకనమిక్ జోన్ అంటూ అదీ నెరవేరకుండా చంద్రబాబు అడ్డుతగలటాన్ని నిపుణులు పేర్కొంటున్నారు.

అప్పులపాలైన రాష్ట్రం

చంద్రబాబు తీరుతో ఒకపక్క కేంద్రంనుంచి నిధులు రాకపోగా మరోపక్క రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని నిపుణులు చెబుతున్నారు. తాత్కాలిక నిర్మాణాలు, పర్యటనల కోసం భారీగా నిధులు వ్యయం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సైతం తప్పుడు గణాంకాలతో మాయచేస్తున్నారని మండిపడుతున్నారు. ఫిస్కల్ రెస్పాన్సిబులిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంటు (ఎఫ్ఆర్‌బీఎం) నిబంధనల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో (జీఎస్‌డీపీ) 3 శాతం వరకు మాత్రమే రుణాలు తీసుకోవచ్చునని, కానీ చంద్రబాబు ఎక్కువ అప్పులు చేసేందుకు 12 శాతం వృద్ధి శాతం చూపించారని పేర్కొంటున్నారు. జాతీయస్థాయిలో జీడీపీ గ్రోత్‌రేట్ 6, 7 శాతానికి మించిలేదని, యూరోప్ లాంటి దేశాల్లో కూడా 3 శాతానికి మించిలేదని చెబుతున్నారు. చంద్రబాబు మాత్రం గ్రోత్‌రేట్‌ను భారీగా పెంచి రుణాలు తీసుకున్నారని, ఫలితంగా గతంలో ఏపీకి 96 వేల కోట్ల అప్పులుంటే చంద్రబాబు 1.20 లక్షల కోట్లు అప్పుచేశారని ఇదంతా కమీషన్ల కోసమేనని అందరికి తెలుసునంటున్నారు.

అన్నీ ఊదరగొట్టే ప్రకటనలు

కోట్ల రూపాయలు వెచ్చించి ఈవెంట్లను నిర్వహిస్తూ రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయంటూ ప్రభుత్వ పెద్దలు ఊదరగొట్టారు. తీరా అవన్నీ పచ్చి బూటకమేనని ఇండస్ట్రియల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ మెమొరాండం (ఐఈఎం) నివేదికల్లో తేటతెల్లమైందని గుర్తుచేస్తున్నారు. 2015 డిసెంబర్ 31 నాటికి రూ. 4500 కోట్లు, 2016 డిసెంబర్ 31 నాటికి 10వేల కోట్లు, 2017 డిసెంబర్ చివరి నాటికి 4400 కోట్లు మేరకు మాత్రమే పెట్టుబడులకు అవకాశముందన్న అంశం ఆయా నివేదికలు స్పష్టంచేస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు లక్షల కోట్లు పెట్టుబడులు అంటూ చంద్రబాబు చెప్పినవన్నీ తప్పుడు ప్రకటనలేనని అంటున్నారు. ఎన్నికల హామీలు ఒక్కటీ నెరవేర్చకపోవడం, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం, ప్రత్యేక హోదా లేక రాష్ట్రానికి కొత్తగా ప్రాజెక్టులు రాకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, దీన్ని పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు ఆడుతున్న డ్రామాలో భాగమే తాజా ఎత్తుగడలనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



గుట్టను చదును చేసి టెంట్లు వేసి కోడిపందాలు నిర్వహించిన ప్రదేశం



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్థులు

కొక్కొరో 'కోట్లు'

- పాకాలలో టీడీపీ నేతల 'బరి'తెగింపు
- హైకోర్టు ఆదేశాలు బేఖాతరు...
- భారీ స్థాయిలో కోడి పందేల నిర్వహణ
- ప్రారంభం రోజే రూ.3 కోట్ల పందేలు

సాక్షి, తిరుపతి/ తిరుపతి రూరల్: పండుగల పేరుతో కోడిపందేలు నిర్వహించటానికి వీల్లేదని హైకోర్టు గట్టిగా హెచ్చరించినా... అధికారపార్టీ నేతలు లెక్కచెయ్యలేదు. కొందరు పోలీసుల సహకారంతో పందేల నిర్వహణకు పథకం వేశారు. కోట్ల రూపాయలు వసూలు చేసుకుని జేబులు నింపుకునేందుకు నిర్ణయించారు. అయితే గ్రామస్తులు ఎస్పీకి సమాచారం ఇవ్వటంతో పథకం బెడిసికొట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం చంద్రగిరి పరిధిలో టీడీపీ నేతలే కోడిపందేలు నిర్వహించడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. వివరాలిలా ఉన్నాయి... పాకాల వద్ద కోడిపందేలు నిర్వహించాలని మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ ముఖ్య నాయకులు పథకం వేశారు. జిల్లావ్యాప్తంగా అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులతో పాటు బెంగళూరు, చెన్నైలో ఉన్నవారిని కోడిపందేలకు ఆహ్వానించారు. గాంధీనగర్ శివారులో రెండు కొండల మధ్య రెండు రోజులపాటు పందేలు నిర్వహించాలని నేతలు నిర్ణయించారు. జేసీబీలతో ఐదు ఎకరాల విస్తీర్ణాన్ని చదునుచేసి పందేలకు అనువుగా తయారు చేశారు. కోడిపందేలు వీక్షించేందుకు వచ్చినవారిని లోనికి పంపించేందుకు 14 కౌంటర్లను ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యిమందికిపైగా అక్కడకు చేరుకోవడంతో నిర్వాహకులు టోకెన్లు ఇవ్వటానికి వీలుకాని పరిస్థితి ఏర్పడింది. కౌంటర్ల ద్వారా గంటలో రూ.12 లక్షలు వసూలైందంటే ఏ స్థాయిలో నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కోడిపందేల నిర్వహణ ద్వారా సుమారు రూ.5 కోట్లు వసూలు చేసుకోవాలని టీడీపీ నేతల పథకంగా తెలుస్తోంది. ప్రారంభం రోజే చేతులు మారిన రూ.3 కోట్లు సమాచారం. సీఎం మాజీ పీఏ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో ఈ పందేలు జరిగినట్లు స్థానికుల కథనం. అయితే కొందరు దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో చిత్తూరు నుంచి పోలీసులు వచ్చి కోడిపందేలను ఆపివేశారు. టీడీపీలోని రెండు వర్గాల మధ్య వాటాల పంపకాల్లో తేడాలు రావడంతో ఒకవర్గం అధిపత్యం అడ్డుకునేందుకు మరో వర్గం ఎస్పీకి ఫిర్యాదు చేసింది.

రోడ్డెక్కిన టీడీపీ నేతలు...: కోడిపందేలను ఆపివేయడంపై టీడీపీ నేతలు తమ అనుచరులతో శుక్రవారం సాయంత్రం పాకాల బస్టాండ్ ముందు ధర్నాకు దిగారు. జెడ్పీటీసీ సురేష్‌చౌదరి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిషోర్‌నాయుడు, చలపతి, తదితరులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫిర్యాదు చేసినవారిపై, అడ్డుకున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని... పోలీసులకు తామిచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గంటపాటు సాగిన ఆందోళనను అడ్డుకోవడంలో సీఐ రామలింగయ్య, పోలీసులు విఫలమయ్యారు. దీనిపై ఎస్పీ సీరియస్ అయినట్లు సమాచారం. ధర్నా చేసిన పుటేజీని తెప్పించుకుని ఆందోళనకారులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. కోడిపందేల నిర్వహణలో స్థానిక సీఐ, పోలీసుల పాత్రపై నివేదిక కోరినట్లు సమాచారం.

పోలీసులకు వాటాలు!: గాంధీనగర్‌లో ఏటా కోడి పందేలు జరుగుతున్నా కన్నెత్తి చూడకుండా ఉండేందుకు పోలీసులు మామూళ్లు ముట్టజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. గతేడాది రూ.1.30 లక్షలు ముడుపులిచ్చినట్లు మండలంలో ప్రచారం జరుగుతుంది. ప్రస్తుతం నిర్వహించే కోడిపందేల నిర్వహణకు రోజుకు రూ.2 లక్షలు చెల్లించటంతో పాటు ఐదుగురు పోలీసు అధికారులకు రూ.10 లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం.

అంబటి ఓటు గల్లంతు!

సత్తెనపల్లి: గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో తన ఓటు గల్లంతయిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. అంబటి గత ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. అయితే.. సత్తెనపల్లిలో తనతో పాటు తన భార్య, ముగ్గురు కుమార్తెలకు ఓటు హక్కు ఉండగా, ప్రస్తుతం తన కుటుంబంలో కేవలం ఒక్క చిన్న కుమార్తెకు మాత్రమే ఓటు హక్కు ఉంచి, మిగిలినవన్నీ జాబితా నుంచి తొలగించారని అంబటి తెలిపారు. దీనివల్ల తాను ఉంటున్న గుంటూరులో, తాజాగా సత్తెనపల్లిలో కూడా ఓటు లేకుండా పోయిందని చెప్పారు. శుక్రవారం సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి పరిస్థితి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉందని అంబటి వెల్లడించారు. ఇతర పార్టీల వారి ఓట్లను తొలగించి, దొంగ ఓటర్లను చేర్పించి ఎన్నికల్లో గెలవడం కోడెల శివప్రసాదరావుకు అలవాటేనని విమర్శించారు. ఈ విషయం ఇప్పటికే స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఈసీ దృష్టికి కూడా తీసుకెళ్తామని చెప్పారు.

ఇదం జగత్



అబ్బ! చక్రం అంటే సైకిల్ చక్రం కాదయ్యా!!

రాష్ట్రంలో 24 పోస్టల్ బ్యాంకులు

చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బాలసుబ్రమణియన్



బొబ్బిలి: రాష్ట్రంలో 24 పోస్టల్ బ్యాంకులు ఏర్పాటు చేయనున్నట్టు చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.బాలసుబ్రమణియన్ తెలిపారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో శుక్రవారం నిర్వహించిన తపాలా జీవిత బీమా మెగా మేళాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పోస్టల్ బ్యాంకులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్పోర్ట్స్ కోటాలో 130 పోస్టల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 570 ఆధార్ అప్‌డేషన్ సెంటర్లు, మంజూరు కేంద్రాలను ఏర్పాటు చేస్తునట్టు తెలిపారు.

ఈసీలు, సీసీల డౌన్‌లోడ్‌కు కష్టాలు

- పనిచేయని ఉచిత డౌన్‌లోడ్
- సామాన్యులకు సులువుగా లేని రిజిస్ట్రేషన్
- ఈసీలు, సీసీల కోసం మీసేవా కేంద్రాలకు పరుగులు



సాక్షి, అమరావతి: సామాన్యులు.. భూక్రయ, విక్రయ లావాదేవీల వివరాలు (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్ –ఈసీ), దస్తావేజు నకళ్లు (సర్టిఫైడ్ కాపీలు – సీసీ) ఆన్‌లైన్‌లో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఎంత ప్రయత్నించినా వీలు కావడంలేదు. కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్) ద్వారా ఈసీలు, సీసీల డౌన్‌లోడ్ కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ఈ పత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవాలంటే ఆ వ్యక్తి ముందుగా తన వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ సులువుగా లేకుండా రకరకాల చిక్కులు పెట్టారు. దీంతో కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు ఆంగ్లం బాగా తెలిస్తే కానీ రిజిస్ట్రేషన్ చేసుకోలేని పరిస్థితి. దీంతో ప్రజలు పత్రాల కోసం మీసేవా కేంద్రాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రుసుం చెల్లించి ఈసీలు, సీసీలు తీసుకుంటున్నారు. దీనివల్ల అటు సమయం, ఇటు రుసుముల రూపంలో డబ్బు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నేరుగా డౌన్‌లోడ్ అవకాశం కల్పించాలి

రాష్ట్రంలో ఆంగ్లం రాని, కంప్యూటర్ పరిజ్ఞానంలేని వారు 80 శాతం మందికిపైగానే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈసీలు, సీసీల డౌన్‌లోడ్‌కు రిజిస్ట్రేషన్ కోసం ఏదో ఒక పాస్‌వర్డ్ పెట్టుకుంటే ఆమోదించకుండా ఒక క్యాపిటల్ లెటర్, ఒక సింబల్, మరో గణాంకం ఉండాలంటూ నిబంధన పెట్టడం సరికాదని ప్రజలు విమర్శిస్తున్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా నేరుగా 'కార్డ్' నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పిస్తే బాగుండేదని అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా ఇలా చేయాలని సూచిస్తున్నారు.

ఈసీలు, సీసీలు ఎందుకంటే..

భూమి, స్థలం, భవనం లాంటి స్థిరాస్తి ఎవరి పేరుతో నమోదై ఉంది? గతంలో ఈ స్థిరాస్తి ఎప్పుడెప్పుడు, ఎవరెవరి పేర్లతో చేతులు మారిందనే వివరాల పత్రాన్ని ఈసీ అంటారు. ఆస్తిని ఎవరు, ఎవరికి, ఎప్పుడు, ఎంతకు విక్రయించారు? ఆ ఆస్తి విక్రేతకు ఎలా సంక్రమించింది తెలుసుకోవాలంటే విక్రయ రిజిస్ట్రేషన్ దస్తావేజు నకలు (సీసీ) పరిశీలించక తప్పదు. అందుకే ఆస్తి కొనేవారు దానికి సంబంధించిన చిట్టచివరి సీసీ తీసుకుంటారు. ఇలా ఈసీలు, సీసీలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. రాష్ట్రంలో ఏటా సగటున 12 నుంచి 13 లక్షల స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఏటా 16 లక్షలకుపైగా ఈసీలు, 13 లక్షలకుపైగా సీసీలను ప్రజలు తీసుకుంటున్నారు.

ఇష్టానుసారంగా పోలింగ్ బూత్‌ల మార్పు

- నా ఓటుకే భద్రత లేదు.. సామాన్యుల పరిస్థితి ఏంటి?
- ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి




నరసరావుపేట: పోలింగ్ బూత్‌ల క్రమబద్ధీకరణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా మొత్తం ఓటరు జాబితా ప్రక్రియే అస్తవ్యస్తంగా తయారైందని గుంటూరు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఓటర్లను ఒక బూత్ నుంచి మరో బూత్‌కు ఇష్టానుసారంగా మార్చేశారని ధ్వజమెత్తారు. తన ఓటును 3వ వార్డు గుంటూరు రోడ్డు నుంచి సుదూరంలో ఉన్న 9వ వార్డు శ్రీనివాసనగర్‌కు మార్చేశారని పేర్కొన్నారు. శాసనసభ్యుడినైన తన ఓటుకే భద్రత లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పట్టణంలోని ఓటర్ల జాబితా మళ్లీ సరిచేయించాలని, ప్రజల్లోని ఆందోళనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి ఆర్డీవో గంధం రవీందర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్ అన్నాప్రగడ భానుప్రతాప్ కూడా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. వారికి ఎమ్మెల్యే పరిస్థితిని వివరించారు. ఏ దామాషా ప్రకారం ఓటర్లకు పోలింగ్ బూత్‌లు కేటాయించారని ప్రశ్నించారు. కంప్యూటర్లలో పోలింగ్ బూత్‌ల నంబర్లు పొరపాటుగా ఫీడ్ చేయడం వల్ల బూత్‌లు మారాయని కమిషనర్ వివరించారు. దీంతో పాటు తాము పంపిన జాబితా ఒకటి కాగా, తీరా ఎన్నికల కార్యాలయం నుంచి వచ్చింది మరొకటని చెప్పారు. పట్టణంలో ఇంటి నంబర్లు ఒక పద్ధతిగా లేకపోవడంతో ఈ సమస్య ఎదురైందన్నారు. ఓట్లు మారిన విధానాన్ని పరిశీలించి మొత్తం సరిచేయిస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర మంత్రులతో రాజీనామా చేయించాలి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని తమ మంత్రులతో రాజీనామా చేయించి, వెంటనే బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని సీఎం చంద్రబాబును ఆయన డిమాండ్ చేశారు. ఓటుకు కోట్లు కేసు, నియోజకవర్గాల పునర్విభజన కోసం రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. గుంటూరు జిల్లా నరసరావుపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆన్‌లైన్‌లో 61,858 ఆర్జితసేవా టికెట్లు

- టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్
- 45 టన్నుల విదేశీ నాణేల మార్పిడికి చర్యలు
- టీటీడీ కళ్యాణ మండపాలకు ఇక ఆన్‌లైన్ బుకింగ్



సాక్షి, తిరుమల: శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించి మే నెల కోటాలో మొత్తం 61, 858 టికెట్లను శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదల చేసినట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఆన్‌లైన్ డిప్ విధానంలో 10,913 సేవా టికెట్లు విడుదల చేశామని, ఇందులో సుప్రభాతం 8,013, తోమాల 150, అర్చన 150, అష్టదళపాదపద్మారాధన 300, నిజపాద దర్శనం 2,300 టికెట్లు ఉన్నాయని వివరించారు. పాతవిధానంలో 50,945 సేవాటికెట్లు ఉండగా, వీటిలో విశేషపూజ 1500, కల్యాణం 11,625, ఊంజల్‌సేవ 3,100, ఆర్జితబ్రహ్మోత్సవం 6,665, వసంతోత్సవం 13,330, సహస్రదీపాలంకారసేవ 14,725 టికెట్లు ఉన్నాయని తెలిపారు. టికెట్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నాలుగు రోజుల పాటు అవకాశం ఉంటుందని, లక్కీడిప్ ద్వారా టికెట్లు పొందిన భక్తులు ఆ తర్వాత 3 రోజుల్లోపు టికెట్లకు సంబంధించి నగదు చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు.

విదేశీ నాణేల మార్పిడికి చర్యలు: ఈవో

టీటీడీ ఖజానాలో మొత్తం 45 టన్నుల విదేశీ నాణేలు ఉన్నాయని, వాటిని మార్పిడి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఈవో అనిల్ కుమార సింఘాల్ తెలిపారు. మలేషియాకు చెందిన 8 టన్నుల నాణేలకు సంబంధించి బ్యాంకులతో చర్చించి 15 రోజుల్లోగా మార్పిడి చేస్తామన్నారు. స్వదేశానికి చెందిన 25 పైసల నాణేలు కూడా ఉన్నాయని, రిజర్వు బ్యాంకు అనుమతి తీసుకుని వీటిని కూడా ముంబైలోని మింట్ ద్వారా మార్చేందుకు చర్యలుచేపట్టామన్నారు. టీటీడీ కల్యాణ మండపాలు కూడా ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించామని, తొలిదశలో ప్రయోగాత్మకంగా చిత్తూరు జిల్లాలోని 39 కల్యాణమండపాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. కరెంట్ బుకింగ్‌తోపాటు పోస్టాఫీసుల్లోనూ వీటిని బుక్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు.

కర్ణాటక హైకోర్టు సీజేగా జస్టిస్ దినేశ్ మహేశ్వరి!

ప్రతిపాదించిన సుప్రీం కోర్టు కొలీజియం



సాక్షి, బెంగళూరు: కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దినేశ్ మహేశ్వరి నియామకం దాదాపుగా ఖరారైందని తెలుస్తోంది. శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతత్వంలోని కొలీజియం జస్టిస్ దినేశ్ మహేశ్వరి పేరును ప్రతిపాదించింది. దీంతో ఆయన నియామకం దాదాపుగా లాంఛనం కానున్నట్టు సమాచారం. గతేడాది అక్టోబర్ 9వ తేదీన జస్టిస్ ఎస్‌కే ముఖర్జీ పదవి విరమణ చేయగా.. అప్పటి నుంచి కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పోస్టు ఖాళీగా ఉంది. జనవరి 10న కొలిజీయం దినేశ్ పేరును ప్రతిపాదించింది. ఆ విషయాన్ని గురువారం సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దీంతో ప్రస్తుతం మేఘాలయా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ దినేశ్ మహేశ్వరి త్వరలో కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కర్ణాటక హైకోర్టుకు తాత్కాలిక సీజేగా జస్టిస్ హెచ్‌జీ రమేశ్ కొనసాగుతున్నారు.

కర్ణాటక మంత్రి జార్జ్ అనుచరుల ఇళ్లపై ఐటీ దాడులు

సాక్షి, బెంగళూరు: బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి కేజే జార్జ్ అనుచరుల ఇళ్లపై శుక్రవారం ఆదాయపన్ను విభాగం అధికారులు దాడులు నిర్వహించారు. మంత్రి సన్నిహితులైన గన్ ఇస్మాయిల్, యుగంధర్, వందిత్‌రెడ్డి కార్యాలయాలతోపాటు వారి ఇళ్లపైనా దాడులు జరిపారు. జార్జ్ ఆర్థిక వ్యవహారాలను ఇస్మాయిల్ చూస్తుంటారు. దీంతోపాటు బీబీఎంపీ, బీడీఏ కాంట్రాక్టులను నిర్వహిస్తుంటారు. జార్జ్ కుమారుడితోనూ ఇస్మాయిల్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. మరోవైపు కాంట్రాక్టరైన వందిత్‌రెడ్డి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. జార్జ్ కుమారుడు రాణా ఇంటికి పొరుగునే నివసిస్తుంటాడు. ఏపీ సీఎం చంద్రబాబుతోనూ వందిత్‌కు సత్సంబంధాలున్నాయి. అతనిపై బెంగళూరులోని చెరువుల పునరుద్ధరణ కాంట్రాక్టు పనులను టెండర్ లేకుండానే దక్కించుకున్నాడనే ఆరోపణలున్నాయి. మరోవైపు కాంట్రాక్టరైన యుగంధర్‌పై మంత్రి జార్జ్ వ్యక్తిగత వ్యాపారాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

జార్జ్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!

గతంలో డీఎస్పీ గణపతి అనుమానాస్పద మృతి కేసులో మంత్రి జార్జ్ పేరు ప్రధానంగా వినిపించింది. ఈ కేసు ఈనెల 10 లేదా 12 తేదీల్లో కోర్టు ముందు విచారణకొచ్చే అవకాశముంది. ఈ కేసులో మంత్రిని కస్టడీలోకి తీసుకునే వీలున్నట్టు సమాచారం. మరోవైపు ప్రధాని మోదీ ఆదివారం జరిపే రాష్ట్ర పర్యటన అనంతరం జార్జ్‌పై సీబీఐ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించే అవకాశాల్లేకపోలేదని కథనాలు వినిపిస్తున్నాయి.

ఏడాదిలో 500 అబార్షన్లు!

తమిళనాడులో ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన కేంద్ర బృందం

తిరువణ్ణామలై (తమిళనాడు): నిబంధనలకు విరుద్ధంగా గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేస్తున్న ఓ ప్రైవేటు ఆస్పత్రి, మూడు స్కానింగ్ కేంద్రాలను కేంద్ర వైద్య బృందం సీజ్ చేసింది. తమిళనాడులోని తిరువణ్ణామలై సన్నిధి వీధిలోని స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో కేంద్ర బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. తిరువూడల్ వీధిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించగా, గతేడాది సుమారు 500 మందికి అబార్షన్ చేసినట్లు తేలింది. దీంతో ఆస్పత్రిని, మూడు స్కానింగ్ సెంటర్లను సీజ్ చేశారు. కేంద్ర వైద్య నిఘా కమిటీ సభ్యుడు డాక్టర్ సుతేష్ జోషీ మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్న సెల్వంబాల్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. కాగా, తనిఖీ విషయం తెలుసుకుని పరారీలో ఉన్న డాక్టర్, వైద్య సిబ్బంది కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బళ్లారి ఎంపీ శ్రీరాములుకు ట్రంప్ ఆహ్వానం



సాక్షి, బళ్లారి: కర్ణాటకలోని బళ్లారి లోక్‌సభ సభ్యుడు శ్రీరాములును అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తమ దేశానికి ఆహ్వానించారు. అమెరికా అధ్యక్షుడిగా ఎవరైనా గెలిచాక 130 దేశాల ప్రముఖులను ఆహ్వానించి ఆ దేశ సంప్రదాయాల ప్రకారం విందు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే ఈ నెల 7, 8 తేదీల్లో విందు ఏర్పాటు చేసిన డొనాల్డ్ ట్రంప్ ఈ కార్యక్రమాల్లో పాల్గొనే ప్రముఖల జాబితాలో భారతదేశం నుంచి ఇద్దరు నేతలను ఎంపిక చేశారు. వీరిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఒకరు కాగా, బళ్లారి ఎంపీ శ్రీరాములు మరొకరిగా ఉన్నారు. వీరిద్దరికి ఇప్పటికే వైట్‌హౌస్ నుంచి ఆహ్వానాలు అందినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు తనను ఆహ్వానించడం మరిచిపోలేని సంఘటన అని తెలిపారు.

సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 3

మాల్దీవుల్లో మళ్లీ అశాంతి

నాలుగు దశాబ్దాలుగా ఒక సంక్షోభం నుంచి మరో సంక్షోభానికి పయనిస్తున్న హిందూ మహాసముద్ర ప్రాంత దేశం మాల్దీవులు మళ్లీ అశాంతితో అట్టుడుకుతోంది. జైళ్లలో ఉన్న విపక్ష నేతలందరినీ విడుదల చేయాలని, కొందరు ఎంపీలపై అనర్హత వేటు వేయడం చెల్లదని గురువారం రాత్రి అక్కడి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తాజా పరిణామాలకు మూలం. ఈ ఉత్తర్వులను తాను అమలు చేసేది లేదంటూ అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ప్రభుత్వం ప్రకటించడంతో దేశమంతా ఆందోళనలు మొదలయ్యాయి. రాజకీయపుటెత్తులు, పైయెత్తుల్లో అక్కడి న్యాయ వ్యవస్థ కూడా భాగం కావడం, ఇష్టానుసారం వ్యవహరిస్తుండటం తదితర కారణాల వల్ల సుప్రీంకోర్టుపై కూడా ఎవరికీ పెద్దగా విశ్వాసం లేదు. గత మూడు నాలుగేళ్లుగా రాజకీయ ప్రాధాన్యమున్న కేసుల్లో ఆ న్యాయస్థానం ప్రభుత్వానికి అనుకూలమైన తీర్పులే ఇచ్చింది. ఈ కేసులో సైతం అలాంటి తీర్పే వెలువడుతుందని ప్రభుత్వం భావించింది. కానీ అందుకు భిన్నంగా విపక్ష నేతలను విడుదల చేయమని, అనర్హత వేటు చెల్లదని వెలువడిన ఆదేశాలతో ప్రభుత్వం ఖంగుతింది. మాల్దీవులతో భారత్ సంబంధాలు సంక్లిష్టమైనవనే చెప్పాలి. హిందూమహాసముద్రం–అరేబియా సముద్ర కూడలిలో ఉన్న మాల్దీవులతో మన భద్రతా కారణాలరీత్యా అక్కడ చైనా ప్రాబల్యం పెరగకుండా చూసుకోవాలని మన దేశం భావిస్తోంది. అందుకే ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూడాలని, సంయమనం పాటించమని అన్ని పక్షాలనూ కోరడం మన దేశానికి రివాజు. ఇందుకు భిన్నంగా 1988లో ఒకసారి జరిగింది. అప్పట్లో మాల్దీవుల అధ్యక్షుడు గయూమ్‌కు వ్యతిరేకంగా సైనిక కుట్ర జరుగుతున్నదన్న సమాచారం అందుకున్న రాజీవ్‌గాంధీ ప్రభుత్వం హుటాహుటీన అక్కడికి మన సైన్యాన్ని తరలించి కుట్రదార్లందరినీ నిర్బంధించింది. ఆ ఉదంతం అప్పట్లో రెండు విధాలుగా ప్రకంపనలు రేపింది. ఈ ప్రాంతంలో భారత్ పెద్దన్న పాత్ర వహిస్తున్నదని, అక్కడేం జరుగుతున్నదో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ మెరుపు దాడులు నిర్వహించగల సత్తా భారత్‌కు ఉన్నదని అమెరికాతోసహా చాలా దేశాలకు అర్థమైంది. అదే సమయంలో గయూమ్ నియంతృత్వానికి భారత్ వంతపాడుతున్నదని అప్పటికే విపక్షాల్లో నెలకొన్న అనుమానాలు మరింత బలపడ్డాయి. ఆ ఘటన తర్వాత గయూమ్ మరింత రెచ్చిపోయారు. ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపారు.

ఎలా ఉద్యమించాలో, నిర్బంధాన్నెలా ధిక్కరించాలో ప్రజలకు నియంతలే నేర్పుతారు. మూడు దశాబ్దాలపాటు సైన్యాన్ని, పోలీసులను, న్యాయవ్యవస్థను గుప్పెట్లో పెట్టుకుని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన గయూమ్‌కు 2004లో మొదలైన దాడాపు రెండేళ్లపాటు వెల్లువెత్తిన ఉద్యమాలను అణచడం సాధ్యం కాలేదు. చివరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు అంగీకరించారు. 2008లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అప్పటికి జైల్లోనే ఉన్న మహమద్ నషీద్ గయూమ్‌పై విజయం సాధించారు. అంతా సవ్యంగా ఉంటే మాల్దీవుల్లో ప్రజాస్వామ్యం వేళ్లూనుకునేది. కానీ అదే సంవత్సరం పుట్టుకొచ్చిన ఆర్థిక మాంద్యం ఆ దేశాన్ని అతలాకుతలం చేసింది. కొత్తగా అధికారంలోకొచ్చిన నషీద్ ఆర్థిక, రాజకీయ సంస్కరణలు ప్రారంభించి చక్కదిద్దుతున్న సమయంలోనే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, ఉపాధి అవకాశాలు తగ్గడం వగైరా కారణాలతో జనంలో అసంతృప్తి పెరిగింది. అనంతర పరిణామాల్లో నషీద్ సైతం నియంతృత్వ విధానాలనే ఆశ్రయించారు. మాజీ అధ్యక్షుడు గయూమ్‌పై వచ్చిన అవినీతి కేసుల్లో చర్యలకు అడ్డుపడుతున్నారన్న కారణంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా మహమద్‌ను 2012లో అరెస్టు చేయించారు. చివరకు పోలీసులు, సైన్యమూ తన ఆదేశాలను ధిక్కరించడం ప్రారంభించాక నషీద్ రాజీనామా చేయాల్సివచ్చింది. అయితే తనకు వ్యతిరేకంగా సైనిక కుట్ర జరిగిందన్నది ఆయన ఆరోపణ. ఒకప్పుడు సైన్యాన్ని తరలించి గయూమ్‌ను కాపాడిన భారత్ తన విషయంలో కనీసం వ్యతిరేకంగా ప్రకటన కూడా చేయ లేదన్న అసంతృప్తి నషీద్‌కు ఉంది. అయితే మన దేశం ఆయనను మొదటినుంచీ నమ్మదగ్గ మిత్రుడిగా పరిగణించలేదు. నషీద్ చైనాకు సన్నిహితంగా ఉండటం, భారత్–పాక్‌ల మధ్య ఉన్న వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిగా ఉంటానని ప్రకటించడం లాంటివి మన దేశానికి రుచించలేదు. 2013లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ నషీద్‌ను ఓడించారు. అయితే ఆ ఎన్నికల్లో పెద్దయెత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలున్నాయి.

ఎప్పుడూ సంక్షోభంతో కొట్టుమిట్టాడే మాల్దీవుల విషయంలో మన దేశం ఆంటీముట్టనట్టు వ్యవహరించడం ప్రారంభించాక చైనా ఆ దేశానికి సన్నిహితమైంది. చైనా బృహత్తర ప్రాజెక్టు వన్ బెల్ట్ వన్ రోడ్(ఓబీఓఆర్)లో పాలుపంచుకోవాలని మాల్దీవులు నిర్ణయించింది. జీఎంఆర్ సంస్థ అక్కడ నిర్మించ తలపెట్టిన విమానాశ్రయం ప్రాజెక్టును సైతం చైనా ఒత్తిడితో ఏకపక్షంగా రద్దుచేసి అందుకు భారీమొత్తంలో ఆ సంస్థకు పరిహారం చెల్లించింది. మాజీ అధ్యక్షుడు గయూమ్ ప్రస్తుత అధ్యక్షుడు యమీన్ సమీప బంధువే. వారిద్దరి సంబంధాలూ చెడి ఆయన నషీద్‌తో చేతులు కలపడంతో నిరుడు ఉద్యమాలు ఊపందుకున్నాయి. అప్పట్లో గయూమ్ అనుకూల ఎంపీలు విపక్షంలోకి ఫిరాయించడంతో ప్రభుత్వం మైనారిటీలో పడింది. ఇలా ఫిరాయించినవారిని స్పీకర్ అనర్హులుగా ప్రకటించడం చెల్లదన్న సుప్రీంకోర్టు తాజా తీర్పుతో మళ్లీ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. 'సూర్యుడు ముద్దాడే దేశం'గా, 26 పగడాల దీవుల సముదాయంగా, కేవలం 4,30,000 జనాభా ఉన్న మాల్దీవులు వ్యూహాత్మకంగా కీలకప్రాంతం కావడం వల్లే ఆ దేశంపై మన దేశానికి ఆదుర్దా. అధికార, విపక్షాల నిరంతర ఘర్షణలతో అట్టుడుకుతున్న మాల్దీవుల్లో ఈ ఏడాది ఆఖరులో జరగబోయే ఎన్నికలతోనైనా ప్రశాంతత ఏర్పడుతుందేమో అన్నది చూడాలి.



ప్రజాభిప్రాయానికి, చట్టబద్ధతకు తావులేని చోట దుష్ట ప్రభుత్వమే రాజ్యమేలుతుంది. నిరంకుశాధికారానికి అదే తొలిమెట్టు.

– విలియం లియోన్ మెకెంజీ కెనడా పూర్వ ప్రధానమంత్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.తదియ ప.2.19 వరకు, తదుపరి చవితి, నక్షత్రం పుబ్బ ప.3.10 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం రా.10.11 నుంచి 11.45 వరకు, దుర్ముహూర్తం ఉ.6.33 నుంచి 8.03 వరకు, అమృతఘడియలు ఉ.8.57 నుంచి 10.30 వరకు.

సూర్యోదయం	: 6.36	10.30 వరకు	
సూర్యాస్తమయం	: 5.50	యమగండం:	
రాహుకాలం:		ప.1.30 నుంచి	
ఉ.9.00 నుంచి		3.00 వరకు	



నమాజ్ వేళలు

ఫజర్	: 5.33	మగ్రీబ్	: 6.12
జొహార్	: 12.30	ఇషా	: 7.27
అసర్	: 4.36		

మధ్య తరగతి ప్రజలే లోకువ



శేఖర్ గుప్తా

గొప్ప ప్రభుత్వం ఆ 1.7ను విస్తరింపచేయడానికి ఏదో ఒకటి చేయాలని ఇది సూచిస్తుంది. ఆ క్రమంలో మొదటి తెలివైన చర్య పెద్ద నోట్ల రద్దు అని భావించారు. తర్వాత జీఎస్టీని తీసుకొచ్చారు. కానీ ఆశించిన పెరుగుదల ఏదీ? వాస్తవానికి ఈ ఒక్క లక్ష్య సాధనలోనే అన్ని ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఫలితంగా, పెద్దమొత్తంలో పన్ను ఎగవేతదారులను, లేదా పన్ను చెల్లించని కోట్లాదిమందిని పట్టుకోవడానికి బదులుగా దాచుకోవడానికి తమవద్ద ఏదీ లేని వారిపైనే దాడిచేయడానికి సిద్ధమవుతున్నారు.

జాతిహితం



తరతరాలుగా కాసాబ్లాంకా సంస్కృతి విస్తరిస్తున్నది. ఆ కారణంగా దానికి సంబంధించినవే శిలాక్షరాల వంటి రెండు పంక్తులతో ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆఖరి బడ్జెట్ భారత మధ్య తరగతి ప్రజానీకానికి ఏం ఒరగబెట్టిందనే విషయం చెప్పవచ్చు. రిక్ కేఫ్ అమెరికన్ ఉదంతం సందర్భంలో కెప్టెన్ రెనాల్ట్ అనే ఎందుకూ కొరగాని పోలీసు చెబుతాడు చూడండి, 'ఎప్పుడూ పట్టుకునే అనుమానితులనే పట్టుకోండి!' అని. అలాగే జరిగింది.

భ్రష్టత్వం వల్ల కావచ్చు, రాజకీయం ప్రయోజనాలతో ఓట్ల కోసం డబ్బును వెదజల్లడం వల్ల కావచ్చు– మన ప్రభుత్వానికి నిరంతరం డబ్బుకి కొదవే. ప్రభుత్వం ఎప్పుడూ ఈ దురదృష్టకర మధ్య తరగతి మీదే పడుతుంది. మరీ ముఖ్యంగా వేతనాల మీద ఆధారపడి జీవించే ఉద్యోగులే కనిపిస్తూ ఉంటారు. వీళ్లని ఎంతవరకు వీలుంటే అంత వరకు ఊపిరి సలపకుండా చేసేయవచ్చు. వీళ్ల గురించి మాట్లాడేవారు లేరు. ప్రజా ప్రతినిధులు లేరు. అలాగే వీరందరికీ సమంగా వర్తించే ఏకసూత్రం కూడా ఏదీ లేదు. అలా వాళ్ల మెడ పట్టుకుని, వెనక ఒక్క తన్ను తన్నితే చాలు వారి నుంచి ఏదైనా సరే కక్కించవచ్చు. పైగా రాజకీయాలకు వచ్చిన ప్రమాదం కూడా ఏమీ ఉండదు.

పెద్ద నోట్ల రద్దు తరహా రాజకీయం

ఒకవేళ వారి నుంచి ఏదైనా పెద్ద ఆరోపణ వస్తే, అది పేదందరికి దృశ్యానందపు తృప్తిని కలిగించేదే అవుతుంది. ప్రస్తుత వాతావరణంలో ఈ పరిస్థితిని పెద్ద నోట్ల రద్దు తరహా రాజకీయం అని పిలవవచ్చు. ఏదో ఒకటి నాటకీయంగా చేయాలి. అది పేదల దగ్గరకు తీసుకెళ్లి, ఆ చర్యతో వారు నష్టపోయే అవకాశం ఉందని చెప్పేటట్టు చేయాలి. నేను చెప్పేది కొంచెం ఓర్పుగా వినండి, ధనవంతులు ఎంతగా నష్టపోతున్నారో మీకు అవగాహన లేదు. అయితే వాస్తవానికి ధనికులు ఎప్పుడూ దెబ్బతినరు. అది వేరే విషయం. పేదలు నమ్ముతారు. వారిలో గందరగోళం అనంతంగా సాగుతూనే ఉంటుంది. ఇక మధ్య తరగతినైతే ఎప్పుడు కావాలంటే అప్పుడు గాయపరచవచ్చు.

ఈ బడ్జెట్ మన స్మృతిపథంలో ఎంతోసేపు ఉండదు. అది వెంటనే వార్తాకథనం కూడా కాలేదు. అందులో చాలా విషయాలు 2019 సంవత్సరం వేసవిలో బీజేపీ ఎన్నికల ప్రణాళిక తయారయ్యే వరకు కూడా మనని వెంటాడుతూనే ఉంటాయి. కానీ స్టాక్, బాండ్ల మార్కెట్‌లో మారణహోమం సృష్టిస్తూ ఇవాళ మాత్రం సజీవంగానే ఉంది.

మార్కెట్ విధ్వంసక అత్యవసర బడ్జెట్‌గా వెళ్లింది కాబట్టి, ఇది దాదా ప్రణబ్ ముఖర్జీ పునరావృత ఒడాఫోన్ సవరణ తరగతికి చెందుతుంది. చాలా విషపూరితం. ఆయన తరువాత ఇద్దరు ఆర్థికమంత్రులు బడ్జెట్లు సమర్పించిన ఆరేళ్ల కాలంలో కూడా శస్త్ర చికిత్స చేసేటప్పుడు ధరించే గ్లోవ్స్ ధరించి కూడా అలాంటి బడ్జెట్ జోలికి మాత్రం వెళ్లలేదు. బ్యాంకు నగదు లావాదేవీలపై పన్ను, సెక్యూరిటీల లావాదేవీల మీద పన్ను, ఉద్యోగుల స్టాక్ ఆప్షన్‌ను తిరగరాసిన పన్నులను కూడా వెంటపెట్టుకుని వచ్చిన పి. చిదంబరం బడ్జెట్ కూడా మార్కెట్లను కకావికలు చేసింది. పైన ముగ్గురు ఆర్థిక మంత్రులలో ఆయన కూడా ఒకరు.

మధ్య తరగతి మదుపునకు దెబ్బ

కానీ ఈ బడ్జెట్ చేసిందేమిటంటే, మధ్య తరగతి మదుపులకు దశాబ్దంగా ఉన్న భద్రత మీద దాడి. మధ్య తరగతికి ఎటూ పాలుపోని పరిస్థితిని కల్పించింది. ఇదంతా నేను బిజినెస్ స్టాండర్డ్ లిమిటెడ్ సంస్థ చైర్మన్, ఆర్థిక వ్యవస్థ విశ్లేషకుడు టీఎన్ నైనన్ మాటల ఆధారంగా రాస్తున్నాను. ఆయన షేర్ల మీద దీర్ఘకాలిక కేపిటల్ గెయిన్స్ పన్నును ఉపసంహరించుకోమని గట్టిగా కోరారు. 2017, జనవరి 6న ఆయన నిర్వహించిన వారాంతపు జ్ఞాపకాల కార్యక్రమంలో ఈ విషయం గురించి వాదించారు. లోటును తగ్గించాలని ఆర్థిక మంత్రి కోరుకుంటే ఈక్విటీ ప్రాఫిట్ల మీద పన్ను విధించడం తప్ప మరో మార్గం లేదని నైనన్ చెప్పారు. ఆర్థికమంత్రి కూడా నైనన్ సలహా విలువైనదని గ్రహించారు. లోటును తగ్గించడానికి ఆయన సూచించిన విధానం బలమైనదని కూడా గుర్తించారు. ఈ అంశాన్నే నేను మరో కోణం నుంచి వివరిస్తున్నాను. ఆ కోణం పరిశీలించడానికి అనువైనది కూడా.

రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా?

మొదటిగా ఒక ప్రశ్న. ఆర్థిక విధానంలో ఎదరుయ్యే పరిణామాలతో, ఎగుడు దిగుళ్లతో ఏమాత్రం సంబంధం లేకుండా ఒక ప్రభుత్వం ఎన్నికల రాజకీయాల కోసం ప్రజాధనం యథేచ్ఛగా వెచ్చించగలదా? అలాగే తన ఇష్టం వచ్చినట్టు పన్నులు విధించగలదా? అలా అని నేను పేదల అనుకూల పథకాలను లేదా రాయితీలను విమర్శించడం లేదు. అయితే పెద్ద నోట్ల రద్దు వంటి ఒక వికృత ఆలోచన ఒక సంవత్సరపు స్థూల జాతీయోత్పత్తిలో 1 నుంచి 2 శాతం పెరుగుదలకు మంగళం పాడింది. అక్కడితో ఆగకుండా చిన్న చిన్న వ్యాపారులకు నష్టం చేయడంతో పాటు ఎన్నో ఉద్యోగాలను ఊడగొట్టింది. దీని వెనుక ఉన్న ఆర్థికపరమైన ప్రతిపాదన లక్షలాది మందిని అధికారిక ఆర్థిక వ్యవస్థ నుంచి అనధికార ఆర్థిక వ్యవస్థకు నెట్టింది. ఆర్థికవేత్త కౌశిక్ బసు ఆర్థికసర్వేలో ప్రత్యేకంగా కనిపించే కొన్ని వాక్యాలను కనుగొన్నారు. అవి పెద్ద నోట్ల రద్దు ఆలోచన విఫలమైందని అంగీకరించేవి. ముందు తీసుకున్న విధాన పరమైన చర్యల ప్రభావం అదృశ్యం కావడమే ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత మందగమనానికి కారణమని 2017–18 ఆర్థిక సర్వేలో చెప్పడమంటే పెద్ద నోట్ల రద్దు పెద్ద తప్పిదమని అంగీకరించడమేనని కౌశిక్ ట్వీట్ చేశారు.

తరువాతి వాదన లేదా ప్రశ్న రాజకీయాలకు సంబంధించినది. మధ్య తరగతిని ప్రభుత్వాలు (ఒక్క బీజేపీ ప్రభుత్వాలే కాదు, మొత్తం అన్ని ప్రభుత్వాల గురించి) అంత కర్కశంగా చూడడానికి కారణం వారి వెనుక ఎలాంటి లాబీ లేకపోవడమే. అలాగే ఎన్నికలను నిర్దేశించే ఎలాంటి శక్తి వారి వద్ద లేకపోవడం కూడా. ఈ తరహా బడ్జెట్ మీ రాజకీయాల వరకు సానుకూలమైనదే కావచ్చు. కానీ పేదలను ఒప్పించగలగాలి. అలాగే రైతుల సమస్యల పరిష్కారానికి కూడా కావలసినంత వెచ్చిస్తామని చెప్పాలి. ఎందుకంటే వారికి కూడా ఓటు హక్కు ఉంది. మీ ప్రభుత్వాన్ని ఓట్లతో ముంచెత్తిన మధ్య తరగతికి నష్టం జరగకుండా అదనపు పరిహారాలు ఇవ్వాలి. కొన్ని గణాంకాలు మన విశ్లేషణలో కనిపిస్తాయి. అందులో ఒక అంశం– కేవలం 1.7 శాతం భారతీయులు ఆదాయపు పన్ను చెల్లిస్తారు. 2015–16 నాటి అంచనాల అధికారిక సమాచారంలో ఈ విషయం పేర్కొన్నారు. 130 కోట్ల జనాభా ఉన్న దేశంలో, అదికూడా అత్యధికంగా మధ్య తరగతి ఉన్న దేశంలో ఈ విషయం భయంకరంగా అనిపిస్తుంది. దీనిని మరో ప్రశ్న రూపంలో చెప్పవచ్చు. అంటే దేశంలో వంద శాతం పన్నును ఈ 1.7 శాతమే చెల్లిస్తున్నారా?

పన్ను చెల్లింపుదారులు ఇంతేనా?

గొప్ప ప్రభుత్వం ఆ 1.7ను గొప్పగా విస్తరింపచేయడానికి ఏదో ఒకటి చేయాలని ఇది సూచిస్తుంది. ఆ క్రమంలో మొదటి తెలివైన చర్య పెద్ద నోట్ల రద్దు అని భావించారు. తర్వాత జీఎస్టీని తీసుకొచ్చారు. కానీ ఆశించిన పెరుగుదల ఏదీ? వాస్తవానికి ఈ ఒక్క లక్ష్య సాధనలోనే అన్ని ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఫలితంగా, పెద్దమొత్తంలో పన్ను ఎగవేతదారులను, లేదా పన్ను చెల్లించని కోట్లాదిమందిని పట్టుకోవడానికి బదులుగా దాచుకోవడానికి తమవద్ద ఏదీ లేని వారిపైనే దాడిచేయడానికి సిద్ధమవుతున్నారు.

ఇప్పుడు వేతన జీవులు తమ పొదుపులను ఎక్కడ పెడతారు? ఎందుకంటే వారివద్ద నగదు లేదు. వీరు ఆస్తుల కొనుగోళ్లవైపు అడుగు పెట్టడం కష్టం. పైగా ఎన్డీయే నాలుగేళ్ల పాలనలో ఆస్తులు తమ విలువను వేగంగా కోల్పోయాయి. బ్యాంకులు, ప్రభుత్వ పొదుపు పథకాలు కూడా వడ్డీ రేట్లను తగ్గించివేశాయి. కానీ ఈ బ్యాంకులే తాము అప్పులిచ్చినవారికి ఈఎమ్ఐ రేట్లను తగ్గించడానికి పూనుకోవడం లేదు. ప్రభుత్వాలలాగే దురాశాపూరితమైన బ్యాంకులు కూడా భారీస్థాయి ఎగవేతదారులు ధ్వంసం చేసిన బ్యాలెన్స్ షీట్లను మళ్లీ పూరించుకోవడానికి నివాస గృహాలు, విద్య, వాహనాలను ఆశించే మధ్యతరగతి డిపాజిట్‌దారులు, రుణగ్రహీతలపైనే కన్నేస్తున్నాయి.

నాటి ఆర్థిక మంత్రి చిదంబరం 2004లో ప్రవేశపెట్టిన బడ్జెట్ మార్కెట్ల తక్షణ పతనానికి కారణమైనప్పుడు, అలాంటి పరిస్థితుల్లో ఆర్థికమంత్రులు తరచుగా చెప్పే మాటలనే వల్లె వేశారు. నేను బడ్జెట్‌ను రైతుకోసం రూపొందించాలా లేక బ్రోకర్ కోసం రూపొందించాలా? అప్పట్లో నేను దీనిపై వ్యాఖ్యానిస్తూ ఆధునిక ఆర్థిక వ్యవస్థ పనితీరు ఇకపై రైతు వెర్సెస్ బ్రోకర్‌గా ఉండకూడదని, అది ఇక నుండి రైతు, అలాగే బ్రోకర్‌లాగా కూడా ఉండాలని రాశాను. ఎందుకంటే వ్యవసాయం, ద్రవ్యమార్కెట్లు ఒక దాన్నొకటి నిషేధించుకోవడం లేదు. అందుకే చిదంబరం బడ్జెట్ తర్వాత అనేక దిద్దుబాట్లకు గురైంది. పలు నష్టనివారణ చర్యలు చేపట్టింది. జైట్లీ సమర్పించిన ఈ బడ్జెట్ కూడా దాన్నే అనుసరించాల్సి ఉంటుంది.


భారతీయ మధ్యతరగతి దాదాపుగా పట్టణ స్వభావంతో కూడి ఉంటోంది. గుజరాత్ ఎన్నికల్లో మాదిరి అది ఇప్పటికీ నరేంద్రమోదీ పట్ల అభిమానం చాటుతోంది. గత నాలుగేళ్లుగా మోదీ ప్రభుత్వం తగ్గిన చమురు ధరల ప్రయోజనాన్ని మధ్యతరగతికి అందించకుండా, దానినుంచి అదనపు వసూళ్లకు పూనుకుంటున్నప్పటికీ ఆ వర్గం మోదీ పట్ల విశ్వాసం ప్రదర్శిస్తూనే ఉంది. ఇప్పుడు పొదుపులను నిరుత్సాహపరుస్తున్న ప్రభుత్వ చర్య మధ్య తరగతికి మరింత గాయాన్ని కలిగిస్తోంది.

వ్యాసకర్త దప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

స్వయంకృతాపరాధాలే శాపాలా!

రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన 'ప్రత్యేక తరగతి హోదా'ను వదులుకోవడమే చంద్రబాబు చేసిన అతిపెద్ద తప్పు! దాని స్థానంలో 'ప్రత్యేక ప్యాకేజీ''ని ఒప్పుకోవడం అంతకంటే పెద్దతప్పే. ప్రత్యేక తరగతి హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీని ఒప్పుకున్న రోజే రాష్ట్రానికి తీరని నష్టం జరిగిపోయింది.

విశ్లేషణ




డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

రాష్ట్ర విభజన గాయం కంటే రాష్ట్రానికి కేంద్ర ప్యాకేజీ ప్రహసనమే పెద్దదేమో! మూడున్నరేళ్లుగా ఊరిస్తూ వస్తున్న కేంద్ర ప్రత్యేక ప్యాకేజీ, విభజన బిల్లులోని ఇతర ప్రయోజనాలను అందించడానికి కేంద్రం సుముఖంగా లేదన్న సంకేతాల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవలి కలెక్టర్ల సమావేశంలో బహిర్గతం చేశారు. దాంతో, రాష్ట్రానికి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పిన ''పాచిపోయిన లడ్డూల వంటి ప్రత్యేక ప్యాకేజీ'' కూడ లభించదని తేలిపోయింది. ఏడాదిన్నర సుదీర్ఘ వ్యవధి తర్వాత.. అదికూడా బీజేపీ, టీడీపీ ఎంపీల దౌత్యం పుణ్యాన నరేంద్రమోదీతో భేటీ అయ్యే అవకాశం లభించిన బాబుకు.. మోదీ ఏమి హామీ ఇచ్చారో తెలియదు గానీ.. రాష్ట్రాన్ని ఆదుకోవడానికి కేంద్రం సిద్ధంగా లేదని అర్థమౌతుంది. అయినా, భేటీ అనంతరం.. ప్రధాని సానుకూలంగా స్పందించారని చెప్పుకొచ్చిన సీఎం... 48 గంటలు గడవకముందే అసలు విషయం బయటపెట్టారు. విభజన బిల్లులోని అంశాలను సాధించడానికి సుప్రీం కోర్టు తలుపు తడతామనడం ద్వారా మోదీ వైఖరిని చెప్పకనే చెప్పారు. వెంటనే మాటమార్చి.. కేంద్రం సహకరించకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కొంత కటువుగానే హెచ్చరించారు. తిరిగి ఆ హెచ్చరిక బీజేపీతో ఘర్షణాత్మక వైఖరి అవలంభించడం కాదని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోడానికి కోర్టును ఆశ్రయించడం ఒక మార్గం మాత్రమేనని తన హెచ్చరికలోని తీవ్రతని నీరుగారుస్తూ వివరణ ఇచ్చారు.

విభజన బిల్లులోని అంశాలను, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని గౌరవించని రాష్ట్ర ప్రభుత్వం.. తక్కిన ప్రయోజనాలను నెరవేర్చడం మీ బాధ్యత అంటూ కేంద్రాన్ని నిలదీయగలదా? కేంద్రం వైఖరిపై సుప్రీం కోర్టుకు వెళ్ళి వాదించి నెగ్గుకురాగలదా? కేంద్రంలో వున్న తమ మంత్రులతో రాజీనామా చేయించకుండా, తమ ప్రభుత్వంపైనే తాను కేసు వేయడం ఎలా సాధ్యం?

రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన 'ప్రత్యేక తరగతి హోదా'ను వదులుకోవడమే చంద్రబాబు చేసిన (తిరిగి దిద్దుకోలేని) అతిపెద్ద తప్పు! దాని స్థానంలో 'ప్రత్యేక ప్యాకేజీ''ని ఒప్పుకోవడం అంతకంటే పెద్దతప్పే. ఎప్పుడైతే ప్రత్యేక తరగతి హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీని ఒప్పుకున్నారో... ఆరోజే రాష్ట్రానికి తీరని నష్టం జరిగిపోయింది. ఇతర రాజకీయ, వ్యక్తిగత కారణాలతో ముఖ్యమంత్రిగారు ప్రత్యేక హోదాను వదులుకొన్నారని ప్రజలందరిలో విస్తృత చర్చ జరిగింది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల తర్వాత కూడా రాష్ట్ర అసెంబ్లీలో 'ప్రత్యేక హోదా' పై రెండుసార్లు ఏకగ్రీవ తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగింది. ప్రతిపక్షాలు నిర్ద్వంద్వంగా సహకరించాయి. కానీ.. 'ప్రత్యేక తరగతి హోదా' ఇవ్వడం సాధ్యం కాదని.. కేంద్ర ప్రభుత్వం అందుకు పలుసాకుల్ని చూపితే.. దానిని సీఎం ఖండించలేదు. కేంద్రం వాదనలో పసలేదని అందరూ అంటున్నా 'ప్రత్యేక తరగతి హోదాకు', 14వ ఆర్థిక సంఘం సిఫార్సులకు పొంతన లేదని స్వయంగా ఆ సంఘం సభ్యులు తేటతెల్లం చేసినా బాబు నోరు మెదపలేదు. ఆనాటి యూపీఏ.. దానిని చట్టంలో చేర్చలేదని వెంకయ్య లాంటివారు సమర్థించుకోవాలని చూసినపుడు... ''ఇప్పుడైనా పార్లమెంట్‌లో పెట్టి చట్టసవరణ చేయండి.. పోలవరం ముంపు మండలాల్ని ఏపీలో చేర్చేందుకు చట్టంలో ఆర్డినెన్స్ ద్వారా మార్పు చేసిన విధంగా చేయండి'' అని ఖరాఖండిగా చెప్పలేకపోయారు. ఆ మెతక ధోరణే రాష్ట్రానికి శాపంగా మారింది.

కేంద్రంలో భాగస్వామ్యపక్షం అధికారంలో ఉండటం రాష్ట్రంలోని అధికార పార్టీకి పెద్ద సానుకూల అంశం. కేంద్రం నుంచి సులువుగా కావల్సిన నిధులు, ప్రయోజనాలు విరివిగా సాధించుకోవచ్చు. కానీ, చట్టప్రకారం సాధించుకోవలసిన ప్రయోజనాలను పొందడానికి ఆపసోపాలు పడుతున్నది టీడీపీ ప్రభుత్వం. రాష్ట్ర పరిపాలన తీరుతెన్నులు చట్ట వ్యతిరేకంగా, సంప్రదాయాలకు భిన్నంగా ఉండటం కేంద్రానికి రుచించి ఉండకపోవచ్చు. నిధులు, వనరుల లేమితో బాధపడుతున్న రాష్ట్రానికి అవసరమైన ప్రాధాన్యతల్ని ఎంచుకోవడంలో తెలుగుదేశం చేసిన పొరపాట్లు అనేకం ఉన్నాయి. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం పేరుతో సాగించిన విన్యాసాలు.. నేల విడిచి సాము చేసిన చందమే. ఆర్థిక పరిస్థితి గడ్డుగా ఉందని, రూపాయి... రూపాయికి తడుముకొంటున్నామని ఒక ప్రక్క చెబుతూ.. ప్రత్యేక విమానాల్లో దేశదేశాలు తిరుగుతూ వాటికి పెట్టుబడుల ఆకర్షణ అనే ముసుగు తగిలించడం హర్షణీయం కాదు.



ఎన్నికల్లో గెలుపునకు రైతుల రుణమాఫీ లాంటి హామీలకు పెట్టిన ఖర్చును ఆర్థికలోటు ఖాతాలో చూపి రూ.16,079కోట్లు కేంద్రం ఇవ్వాలంటూ చెప్పిన లెక్కలు కేంద్రానికి మింగుడు పడలేదు. 13 జిల్లాల్లో 7 జిల్లాలు వెనుకబడినవిగా గుర్తింపు పొందినప్పటికీ వాటి అభివృద్ధిని పట్టించుకోకుండా.. ఖర్చులో అత్యధిక మొత్తాన్ని అమరావతిపై పెట్టడం, అధికారంలోకి రాగానే పోలవరం చేపట్టకుండా.. పట్టిసీమను, ఆ తర్వాత పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలకు దాదాపు రూ.4,000 కోట్లు ఖర్చుచేయడం.. అందులో నీటికంటే విరివిగా అవినీతి ప్రవహించడం మొదలైన అంశాల్ని కేంద్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలించింది. పోలవరంలో అవినీతిని సహించని కేంద్రం నిధుల విడుదలను నిలిపేసి, ఇచ్చిన డబ్బుతో చేసిన పనులకు లెక్క చెప్పమని కోరింది.


మరోవైపు ఫిరాయింపుదారులకు మంత్రిపదవులు అప్పజెప్పడం ద్వారా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిన సీఎం చంద్రబాబు... ఆర్థికంగా రాష్ట్రాన్ని ఆదుకోవడంలో కేంద్రం చేసే తాత్సార వైఖరిని ప్రశ్నించే నైతికబలం కోల్పోయారు. ఓటుకు కోట్లు కేసులో కూడా జాతీయ స్థాయిలో ఆయన అల్లరి పాలయ్యారు. సొంత ప్రతిష్టను చేజేతులారా దిగజార్చుకొన్నారు. వీటన్నింటి నేపథ్యంలోనే.. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి, నిలదీయడానికి, చివరి అస్త్రంగా కోర్టులను ఆశ్రయించే నైతిక స్థయిర్యం తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిగా కోల్పోయింది. వాటి పర్యవసానమే, ఆ స్వయంకృత అపరాధాలే ఈనాడు రాష్ట్రానికి అడుగడుగునా శాపాలుగా మారాయి.

న్యాయస్థానాల సూచనలను అమలుపర్చకుండా, రాజ్యాంగ నిబంధనలను గౌరవించకుండా, ఆర్థిక నిబంధనలను పాటించకుండా, అలవిగాని అప్పులతో రాష్ట్రాన్ని ఆర్థికంగా నిర్వీర్యంజేస్తూ ప్రభుత్వం అడుగడుగునా పాల్పడుతున్న 'స్వయంకృతాపరాధాలే రాష్ట్ర భవిష్యత్తుకు శాపాలుగా' మారుతున్నాయి. రాష్ట్రంలో ఇన్ని విధాలుగా పరిపాలన గాడి తప్పుతుంటే ఇతరులను నిందించడం ఏవిధంగా సమంజసమో ప్రభుత్వ పెద్దలు ఆత్మపరిశీలన చేసుకోవాలి.

వ్యాసకర్త ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నాయకులు
మొబైల్ : 99890 24579

మెడ తిరగని కణితి

మోదీ మొండిచెయ్యిచ్చాడని అంతా వ్యాఖ్యానిస్తుంటే, చక్రం తిప్పగలనన్న గట్టి నమ్మకంతో ఉన్న చంద్రబాబుకి దిక్కులు కనిపిస్తున్నాయ్.



శ్రీరమణ

''మొగుడు కొట్టినందుకు కాదు తోడుకోడలు నవ్వినందుకు'' అని సామెత. బడ్జెట్ వేళ మోదీ చేతి మొట్టికాయ తిన్న చంద్రబాబుకి పై సామెత చక్కగా అన్వయిస్తుంది. ప్రత్యేక హోదా కావాలని అందరూ ఘోషిస్తుంటే, కాదు ప్యాకేజీ లాభసాటి అంటూ వాదనకి దిగారు. ''మనం ఢిల్లీలో అన్యోన్యంగా ఉంటే కదా పోలవరం పూర్తి చేసుకోగలం, ప్రపంచ ప్రసిద్ధ క్యాపిటల్ నిర్మించుకోగలం'' అంటూ చంద్రబాబు పలుమార్లు సుదీర్ఘ సుత్తి వేస్తూ వచ్చారు. మన తలలు బొప్పెలు కట్టాయిగానీ ఏ మాత్రం పని జరగలేదు. ''మోదీ నా జేబులో ఉన్నాడు. ఏదైనా నన్ను కలుపుకోందే చెయ్యరు'' అని ధిలాసా ప్రదర్శిస్తున్న చంద్రబాబుకి గట్టి దెబ్బ ఎదురైంది. రైల్వే జోన్ పెద్ద విషయం కాదనుకున్నారు. అది కూడా పీటముడి పడి కూర్చుంది.

బీజేపీ వర్గాలేమంటున్నాయంటే, ఈ బడ్జెట్ పేదవాడికి, రైతుకి గొప్ప వరం. రైతుకి ఆశా కిరణం, కడుపేదకి ఆరోగ్యం. నిజమే, ఆర్థిక స్తోమతు లేక ఆప్తుల ప్రాణాల్ని చూస్తూ, చూస్తూ వదిలేసుకున్న సంఘటనలు కోకొల్లలు. ఇప్పుడు పదికోట్ల కుటుంబాలకు బతుకు భరోసా ఇచ్చారు. రైతుకి ఒకటిన్నర రెట్ల ఆదాయానికి గ్యారంటీ ఇచ్చారు. ఒక రైతుకు ఉన్న ఎకరంమీద నలభై వేలు ఖర్చు చేస్తే కనిష్టంగా అరవై వేలు ముడుతుంది. పంటలు, ధరలు బాగుండి అంతకు ఎక్కువ వస్తే మరీ సంతోషం. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా రైతన్నలు కునారిల్లిపోతున్నారు. అందరూ రైతుని దేశానికి వెన్నెముక, అన్నదాత అంటూ భావోద్వేగ బ్లాక్‌మెయిల్ చేయడం తప్ప వారికి గట్టి మేలు తలపెట్టిన నాథుడు లేడు. సింహభాగం చెందాల్సిన వారికి బడ్జెట్‌లో కేటాయించారనిపించింది.

అక్షర తూణీరం



పంచాయతీబోర్డు సర్పంచి తన గ్రామం గురించి ఆలోచిస్తాడు. ప్రధానమంత్రి దేశం మొత్తాన్ని కళ్లముందు నింపుకుంటాడు. వారి పార్లమెంట్ సభ్యులు ఎక్కడ చిక్కగా ఉన్నారో, ఎక్కడ పల్చగా ఉన్నారో చూస్తారు. ఆ నిష్పత్తిలో మొగ్గ చూపుతారు. ఇది రాజకీయ మూలసూత్రాలను బట్టి ధర్మమే కదా. ఇందుకు చిన్న ఉదాహరణ చెబుతాను. మా గ్రామం వేమూరుకు (రోశయ్యగారి ఊరు) రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వరహాపురం మూడు నాలుగు వేల జనాభా ఉన్న మంచి గ్రామం. ఆ ఊరికి రోడ్డు వేసి ఎనిమిదేళ్లు దాటింది. వేమూరు ఎమ్మెల్యే (ఇప్పుడు మంత్రి కూడా)ని అడిగితే, వరహాపురం వైఎస్సార్‌సీపీకి కంచు కోట. నాకు ఓటువేయని వారితో నాకేంటి అంటారు. కావచ్చు, కానీ ఒకసారి గెలిచాక అందర్నీ సమానంగా చూడాలి, కలుపుకుపోవాలి. ఒక చిన్న నియోజకవర్గ పరిధిలోనే ఇట్లా ఉంటే, ఆలిండియా స్థాయిలోకెల్లా ఉండాలో ఆలోచించండి.

చంద్రబాబు క్యాపిటల్ డ్రీమ్‌తో ఢిల్లీకి సంబంధం ఉండాల్సిన పన్లేదు. పోలవరం నిదానంగా పూర్తి చేస్తారు. మళ్లీ ఎన్నికల ముందే జాతికి అంకితం చేసి ఓట్లు దండుకోవాలంటే కుదరకపోవచ్చు. మోదీ మొండిచెయ్యిచ్చాడని అంతా వ్యాఖ్యానిస్తుంటే, చక్రం తిప్పగలనన్న గట్టి నమ్మకంతో ఉన్న చంద్రబాబుకి దిక్కులు కనిపిస్తున్నాయ్. హస్తినలో మనకీ, మన బలగానికీ ఏ మాత్రం సీన్ లేదని తేటతెల్లమైంది. ఇది చంద్రబాబుకి మెడతిరగని కణితైంది.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

‘మహా విశాఖ’ లెక్కల్లో మాయాజాలం

రూ.3,296 కోట్లతో జీవీఎంసీ బడ్జెట్
- అప్పుల్నీ ఆదాయంగా చూపించిన వైనం
- స్మార్ట్ సిటీకి నాలుగేళ్లలో రెండేళ్లే నిధులు మంజూరు
- కానీ నాలుగేళ్ల నిధులతో స్మార్ట్ పద్దులు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్ల కంటే పెద్దది. 640 చ.కి.మీ విస్తీర్ణంలో 72 వార్డులతో ఇది విస్తరించి ఉంది. దీనికి అనుగుణంగా 2018–19 వార్షిక బడ్జెట్‌ను రూ.3,292.96 కోట్లతో సిద్ధం చేశారు. రూ.252 కోట్ల ప్రారంభ నిల్వలతో కలిపి రూ.3,372.31 కోట్లను ఆదాయంగా చూపించారు. పక్కాగా లెక్కలు లేకపోయినా.. బడ్జెట్‌కు జనవరి 27న ఆమోదముద్ర వేశారు. 2012, ఫిబ్రవరి నుంచి ఎన్నికలు నిర్వహించకపోవడం.. పాలకవర్గం లేకపోవడంతో ప్రత్యేకాధికారి (జిల్లా కలెక్టర్) వరుసగా ఆరో బడ్జెట్‌ను ఆమోదించేశారు.

స్మార్ట్ సిటీ నిధులెక్కడ?

2017–18 వార్షిక బడ్జెట్‌లో స్మార్ట్‌సిటీ నిధులను రూ.800 కోట్లుగా లెక్కించారు. ఈ ఏడాది రూ.460 కోట్లుగా చూపిస్తున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన స్మార్ట్‌సిటీ, ఏడీబీ (ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్) నిధులనే ఇలా చూపుతున్నారు. స్మార్ట్ సిటీగా ఎంపికైన ప్రతి నగరానికి ఏడాదికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.100 కోట్లు చొప్పున ఇస్తాయి. ఈ లెక్కన జీవీఎంసీకి 2014–15 నుంచి ఇప్పటివరకూ రూ.800 కోట్లు రావాలి. కానీ.. రూ.400 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. అధికారులు గతంలో తీసుకున్న రూ.400 కోట్లకు సరిగ్గా లెక్కలు చెప్పకపోవడంతో మొదటి రెండేళ్ల నిధులను మాత్రమే ప్రభుత్వాలు విడుదల చేశాయి. ఇందులో కూడా రూ.67 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. జీవీఎంసీలో పనులు నత్తనడకన సాగుతుండటంతో నిధులు ఇచ్చేందుకు కేంద్రం ససేమిరా అంటోంది.

లేనిది ఉన్నట్లు..

ప్రభుత్వం.. జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జేఎన్ఎన్‌యూఆర్‌ఎం) కింద నిధులు నిలుపుదల చేసి ఏడాది దాటుతోంది. అయినా జీవీఎంసీ ఈ నిధులు రూ.75 కోట్లు వస్తాయని లెక్కకట్టింది. ప్రస్తుతం ఈ నిధులు రూ.25 కోట్లు మాత్రమే జీవీఎంసీ ఖజానాలో ఉన్నాయి. మిగిలిన రూ.50 కోట్లను రుణంగా తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. అమృత్ పథకం ద్వారా రూ.221.02 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో చెప్పారు. కానీ.. అమృత్ కింద కేంద్రం 33.33 శాతం నిధులు మాత్రమే అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం అందిస్తే.. మిగిలినవాటిని జీవీఎంసీ సమకూర్చుకోవాలి. ప్రస్తుతం ఈ పథకం కింద కేంద్రం నుంచి రూ.12.5 కోట్లు మాత్రమే వచ్చాయి. అమృత్ కింద జీవీఎంసీ పరిధిలో రూ.250 కోట్లు పనులు చేపట్టాలని టెండర్లు ఖరారు చేశారు. అయితే ఇందులో కేంద్రం నుంచి రావాల్సింది రూ.83 కోట్లే. మిగిలినదంతా జీవీఎంసీ అప్పు చేసి ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన పరిస్థితి. ఇప్పటికే జీవీఎంసీ రూ.400 కోట్ల వరకూ అప్పుల్లో ఉంది. అప్పు తీసుకోని పక్షంలో ప్రజలపై పన్నులు విధించి ఆ నిధులు సమకూర్చుకోవాల్సి ఉంది. జీవీఎంసీ మాయ లెక్కలు చూస్తుంటే విశాఖ వాసులపై త్వరలో భారం మోపేలా బడ్జెట్ ఉందనేది స్పష్టమవుతోంది.


బీసీల రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించాలి

- చట్టసభల్లో, ఉద్యోగాల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి
- రాజ్యసభలో రెండు ప్రైవేటు మెంబర్ బిల్లులు ప్రవేశపెట్టిన వైఎస్సార్‌సీపీ
- బీసీల హక్కుల పరిరక్షణకు కృషి: ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి: దేశంలో 55 శాతానికిపైగా జనాభా ఉన్న బీసీ కులాలకు చట్టసభల్లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగబద్ధత కల్పించాలని వైఎస్సార్ సీపీ కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు రాజ్యసభలో రెండు ప్రైవేటు మెంబర్ బిల్లులను శుక్రవారం ప్రవేశ పెట్టింది. బీసీలకు జనాభా ప్రాతిపదికన పార్లమెంటు, అసెంబ్లీ చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించేలా 330ఏ, 332ఏలకు సవరణలు ప్రతిపాదిస్తూ ఒక బిల్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మరో బిల్లును వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి సభలో ప్రవేశపెట్టారు. బీసీల హక్కుల్ని పరిరక్షించాలన్న ఉద్దేశంతో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ బిల్లులను ప్రవేశపెట్టినట్టు ఆయన మీడియాకు తెలిపారు. దేశంలో 55% జనాభా ఉన్న బీసీలు చట్టసభల్లో తగిన స్థాయిలో రిజర్వేషన్లు పొందలేకపోయారని, 2009 లోక్‌సభలో 18%, 2014లో 20% మందే చట్టసభల్లో ప్రాతినిధ్యం పొందారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను యథావిధిగా అమలు చేస్తూనే.. బీసీలకూ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

రేషన్ షాపుల ‘ప్రైవేటు’ను అడ్డుకోండి

ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు నిత్యావసరాల్ని అందించే రేషన్ షాపులను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసి మాల్స్‌గా మార్చడాన్ని అడ్డుకోవాలని విజయసాయిరెడ్డి కేంద్రాన్ని కోరారు. శుక్రవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో 6,500 రేషన్ షాపులను సీఎం చంద్రబాబు కుటుంబసభ్యులకు భాగస్వామ్యమున్న ఫ్యూచర్స్ గ్రూపునకు, రిలయన్స్ సంస్థలకు అప్పగించి



మాల్స్‌గా మార్చాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందుకుగాను కేంద్రం అనుమతిచ్చిందా? అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి సీఆర్ చౌదరి స్పందిస్తూ.. ఇది రాష్ట్ర పరిధిలోని అంశమని, ఈ విషయంలో తామేమీ చేయలేమని బదులిచ్చారు. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పేదలకు అన్యాయం జరుగుతుంటే కేంద్రం ప్రేక్షకపాత్ర వహించడం బాధాకరమన్నారు.

ఆహార ధాన్యాల సేకరణకు కొత్త పథకం

రైతులు పండించిన ఆహారధాన్యాల సేకరణకోసం కేంద్రం మార్కెట్ హామీ పథకం పేరిట కొత్త పథకాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆహార, ప్రజాపంపిణీ శాఖల మంత్రి రాంవిలాస్ పాశ్వాన్.. ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకిచ్చిన రాతపూర్వక సమాధానంలో తెలిపారు. కొత్త పథకానికి సంబంధించిన కాన్సెప్ట్ పేపర్‌ను రాష్ట్రప్రభుత్వాల పరిశీలనకు పంపామన్నారు. దక్షిణమధ్య రైల్వేలోని రక్షణ, భద్రత విభాగాల్లో పదివేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైల్వేశాఖ సహాయమంత్రి రంజన్ గోహెయిన్ తెలిపారు. వీటిని శాఖాపరమైన పదోన్నతులు, తరచూ జరిగే బహిరంగ నియామకాల ద్వారా భర్తీ చేస్తామన్నారు. పోస్టల్ ఏపీ విభాగంలో 1,922 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు కేంద్ర సహాయమంత్రి మనోజ్ సిన్హా.. సాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు బదులిచ్చారు. విశాఖలోని రైల్వే పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్ షాప్(వ్యాగన్ వర్క్‌షాపు) నిర్మాణానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించినట్లు రైల్వేశాఖ సహాయమంత్రి రంజన్ గోహెయిన్ ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ తెలిపారు.

బీసీలకోసం వైఎస్సార్‌సీపీ ప్రైవేట్ బిల్లుపై జంగా హర్షం

బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టడంపై ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. రాష్ట్రంలో బీసీల సంక్షేమం పట్ల ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ కృతనిశ్చయంతో ఉన్నారంటూ.. ఆత్మీయ సదస్సులద్వారా బీసీల సమస్యలను తెలుసుకుంటున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

ఏపీకి నీరు విడుదల చేయాల్సిందే

- నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీరు నిలిపేయొద్దు
- తెలంగాణకు కృష్ణా బోర్డు లేఖ

సాక్షి, అమరావతి: తెలంగాణ సర్కార్ తమ ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై కృష్ణా బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద.. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన కోటా మేరకు నీటిని విడుదల చేయాల్సిందేనని బోర్డు సభ్య కార్యదర్శి ఎ.పరమేశం శుక్రవారం తెలంగాణ సర్కార్‌కు లేఖ రాశారు. సరఫరా నష్టాలను మినహాయించి ఏపీ సరిహద్దుకు 12 టీఎంసీలు చేరే వరకూ నీటిని విడుదల చేయాలని సూచించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఏపీకి 12 టీఎంసీలను కృష్ణా బోర్డు కేటాయించింది. సరఫరా, ఆవిరి నష్టాలతో నిమిత్తం లేకుండా ఏపీ సరిహద్దుకు 12 టీఎంసీలను చేర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. నీటి సరఫరా నష్టాలపై కమిటీ నివేదిక ఇచ్చాక అందులో ఏపీ కోటా కింద వచ్చే నీటిని ఆ రాష్ట్రం కోటాలోనే వేస్తామని స్పష్టం చేసింది. గతేడాది నవంబర్ నుంచి ఇప్పటివరకూ ఏపీ సరిహద్దుకు కేవలం 5.49 టీఎంసీలు మాత్రమే చేరాయి. మరో 6.51 టీఎంసీలు చేరితేనే ఏపీ కోటా పూర్తవుతుంది. కానీ 12 టీఎంసీలు చేరినట్టు లెక్కలు చెబుతున్న తెలంగాణ సర్కార్ బుధవారం నుంచి నీటి సరఫరాను నిలిపివేస్తామని ప్రకటించింది. బోర్డు ఉత్తర్వులను తెలంగాణ సర్కార్ తుంగలో తొక్కుతున్నా ఏపీ నోరుమెదపడం లేదు. కనీసం మరో 45 రోజులపాటు నీటిని సరఫరా చేస్తేనే పంటలు చేతికి అందుతాయని సాగర్ ఎడమ కాలువ రైతులు ఆందోళన బాట పట్టారు. రైతులు రోడ్డెక్కడంతో స్పందించిన ఏపీ సర్కార్ తమ కోటా నీటిని విడుదలయ్యేలా చూడాలని గురువారం కృష్ణా బోర్డుకు లేఖ రాసింది.

ఉపాధి నిధులూ సబ్ ప్లాన్ ఖర్చు ఖాతాలోనే

- ఉపాధి కూలీల ఖాతాలకు కేంద్రం నుంచే వేతనాలు
- రూ.600 కోట్లు సబ్‌ప్లాన్‌లో ఖర్చుపెట్టినట్టు టీడీపీ ప్రచారం

సాక్షి, అమరావతి: ప్రచారానికి పనికొచ్చేది ఉంటే చేసింది కేంద్రమైనా టీడీపీ నేతలు మాత్రం తమ ప్రభుత్వ గొప్పతనంగా చెప్పుకుంటున్నారు. ఒక వేళ గొప్పగా చెప్పుకున్నదే ఇబ్బంది కలిగిస్తే అంతా కేంద్రమే చేసిందని నెపం నెట్టేస్తున్నారు. 3 నెలల క్రితం ‘ఇంటింటికీ టీడీపీ’ కార్యక్రమం నిర్వహించినప్పుడు ఉపాధి కూలీలు తమకు వేతనాల చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని టీడీపీ నేతల దృష్టికి తెచ్చారు. అప్పుడు కూలీలకు కేంద్రమే నేరుగా నిధులు చెల్లిస్తోందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తప్పేమీ లేదని టీడీపీ నేతలు వారికి చెప్పారు. ఇప్పుడు ఆ పార్టీనే నిర్వహిస్తున్న దళితతేజం ప్రచార కార్యక్రమంలో కేంద్రం నేరుగా రాష్ట్రంలో ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు చెల్లించిన రూ.600.03 కోట్లనూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచే ఖర్చు చేసినట్టు చెప్పుకుంటున్నారు. దళితతేజంలో మొత్తం రూ.9,847 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ షెడ్యూల్డ్ క్యాస్ట్ కాంపోనెంట్ కింద సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు పెట్టినట్టు ప్రచారం చేసుకుంటున్నారు.

ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం



ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న మంత్రులు

విమానాశ్రయం (గన్నవరం): ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి న్యూఢిల్లీ నుంచి భారత వాయుసేన విమానంలో ఉదయం గన్నవరం చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్, పలువురు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం జాతరకు బయల్దేరివెళ్లారు. తిరిగి మధ్యాహ్నం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న వెంకయ్యనాయుడుకు రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, నక్కా ఆనందబాబు, డీజీపీ మాలకొండయ్య, విజయవాడ సీపీ గౌతమ్ సవాంగ్, జీఏడీ సెక్రటరీ నాగులపల్లి శ్రీకాంత్, అదనపు కార్యదర్శి కల్నల్ అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జి.మధుసూదనరావు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గం ద్వారా ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్టుకు బయల్దేరి వెళ్లారు.

డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత ఏడాది అక్టోబర్, నవంబర్‌లో నిర్వహించిన డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీసీఏ డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షల ఫలితాల సీడీని వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు విడుదల చేశారు. ఈ ఫలితాలను www.aucoe.info, www.andhrauniversity.edu.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు, పరీక్షల డీన్ ఆచార్య డి.పుల్లారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.వి.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వం గతంలో జారీ చేసిన వేతన పెంపు జీవో వర్తించని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వేతనాలను పెంచుతూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 50 శాతం వేతనం పెంచుతున్నట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది. ఆర్థిక శాఖ ముందస్తు అనుమతితో నియమితులైన వారికి మాత్రమే వేతన పెంపు వర్తిస్తుంది. అవుట్ సోర్సింగ్ విధానంలో మూడు కేటగిరీల ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మొదటి కేటగిరీ వారికి రూ.12,000, రెండో కేటగిరీ వారికి రూ.15,000, మూడో కేటగిరీ వారికి రూ.17,500 చొప్పున పెరిగిన వేతనాలు అమలవుతాయని జీవోలో పేర్కొన్నారు.

పండుగలా నంది నాటకోత్సవాలు

ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

తెనాలి: రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాల్లో వారానికి రెండురోజులు చొప్పున నాటక ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నట్టు ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ వెల్లడించారు. ఇందుకు పర్యాటకశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆమోదం తెలియజేశారని చెప్పారు. రాష్ట్రంలోని 30–40 పర్యాటక కేంద్రాల్లో ఒక్కోచోట వారానికి రెండు చొప్పున ఏడాదిలో కనీసం 2 వేల నాటక ప్రదర్శనలకు అవకాశం ఉందన్నారు. ఏపీ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 21వ నంది నాటకోత్సవాలు శుక్రవారం గుంటూరు జిల్లా తెనాలిలో ప్రారంభమయ్యాయి. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే ఆలపాటి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అధ్యక్షత వహించిన గోపాలకృష్ణ మాట్లాడుతూ అకాడమీ తరఫున తెనాలిలో పౌరాణిక, సాంఘిక నాటకాల్లో ఔత్సాహికులకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఆలపాటి మాట్లాడుతూ సమాజాన్ని ప్రతిబింబించే నాటకం, ప్రజలకు ఎంతో కొంత స్ఫూర్తిని, చైతన్యాన్ని కలిగిస్తుందని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, కమిషనర్ కె.శకుంతల, కృష్ణబలిజ ఫెడరేషన్ చైర్మన్ కావేటి సామ్రాజ్యం, దుగ్గిరాల మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ చందు సాయిబాబు మాట్లాడారు.

కౌలు రైతుల సమస్యలు...

1. రుణ పరపతి లేదు: చంద్రబాబునాయుడి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంట రుణాలు కౌలు రైతులకు ఎండమావిగా మారాయి. రాష్ట్ర రుణ ప్రణాళికలో ఒక్క శాతం కూడా కౌలు రైతులకు అందడం లేదు. 2013-14లో లక్షా 55 వేల మందికి రూ. 318కోట్లు రుణాలు ఇవ్వగా, 2014-15లో రూ. 62 కోట్లు, 2015-16లో రూ 146కోట్లు, 2016-17లో రూ. 202 కోట్లు మాత్రమే ఇచ్చారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 87,471 కోట్లు రుణ లక్ష్యంగా ప్రకటించారు. ఇందులో పది శాతం కౌలు రైతులకు అంటే రూ.8740 కోట్లు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. అయితే ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభం అయినా కౌలు రైతులకు ఈ స్థాయిలో రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు.

2. రుణాలు ఎందుకు రావడం లేదంటే...: చట్టప్రకారం పంట రుణాలు కౌలు రైతులకే ఇవ్వాలి. భూములు కౌలుకు ఇచ్చిన భూ యజమానులు పంటలు సాగు చేయకుండానే 95 శాతం మంది పంట రుణాలు పొందుతున్నారు. ఒక సర్వే నెంబర్‌పై ఒకరు పంట రుణం పొందితే మరొకరికి ఇవ్వకూడదన్న బ్యాంకర్ల నిబంధన వల్ల కౌలు రైతులకు రుణాలు రాకుండా పోతున్నాయి.

3. ఏ సబ్సిడీలు అందవు: ఈ-క్రాప్ నమోదు ఆధారంగా ప్రభుత్వ వ్యవసాయ రాయితీ పథకాలు వర్తింపచేస్తే కౌలు రైతుకు ఒక్క పథకం కూడా అమలు కాదు. చివరికి పండించిన పంటను కూడా అమ్ముకునే హక్కును సైతం కోల్పోతాడు..

4. కౌలు పెరగడం: ఖరీఫ్‌లో కౌలు రేట్లు విపరీతంగా పెరిగాయి. గోదావరి జిల్లాల్లో గత ఏడాది రెండు పంటలకు వరికి 24 బస్తాలు (75 కిలోలు) కౌలు ఉంటే ఈ ఏడాది దాన్ని 32 బస్తాలకు పెంచారు. 2011 కౌలు రక్షణ చట్టంలో కౌలు రేట్ల ప్రస్తావన లేదు. అందువల్ల భూయజమాని ఎంత కౌలు నిర్ణయిస్తే అంత చెల్లించాల్సి వస్తోంది.

5. రుణ అర్హత కార్డులు అందితే...: 2011 భూఅధీకృత సాగుదారు చట్టం ప్రకారం కౌలు రైతులకు రుణ అర్హత గుర్తింపు కార్డులు అందడం లేదు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 11 లక్షల మందికి కౌలు కార్డులు ఇస్తామని చెప్పినా ఆరు లక్షల మందికే వచ్చాయి. పంటరుణం సాగుదారునికి ఇవ్వాలని ఉన్నా బ్యాంకులు తమ రుణాలకు గ్యారెంటీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

6. రుణమాఫీ జరిగితే...: 2013 డిసెంబర్ నాటికి కౌలు రైతులకు రెండు లక్షల 20 వేల మందికి ఇచ్చిన రూ. 574 కోట్ల రూపాయలు రుణ మాఫీ కావాల్సి ఉంది. ఇప్పటివరకూ ఐదు విడతలలో ప్రకటించిన రుణమాఫీలో కేవలం రూ. 144 కోట్లు మాత్రమే రుణ మాఫీ జరిగింది. భూయజమానుల రుణమాఫీకే ప్రాధాన్యత దక్కింది. కౌలు రైతులు బ్యాంకులకు రుణాలు చెల్లించకపోవడంతో తిరిగి పొందే అవకాశం లేకుండా పోయింది.

7. ఇన్‌పుట్ సబ్సిడీ: ఇన్‌పుట్ సబ్సిడీపై భూపీందర్‌సింగ్ హుడా కమిటీ ఆహార పంటలకు పది వేల రూపాయలు, వాణిజ్య పంటలకు రూ. 20 వేల చొప్పున ఎకరాకు ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇవ్వాలని సూచించింది. చంద్రబాబునాయుడి ప్రభుత్వం హెక్టార్‌కు రూ. 10 వేలు ఇస్తోంది. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే ఇన్‌ఫుట్ సబ్సిడీ రూ. 200 కోట్లు పెండింగ్ ఉంది.



ఏం కోరుకుంటున్నారు...

1. శాశ్వత రుణ విముక్తి పథకం: నోట్ల రద్దు తర్వాత ప్రైవేటు అప్పులు కూడా దొరకడం కష్టంగా మారింది. బంగారం గాని, ఇల్లుగాని తాకట్టు పెడితేగాని అప్పు దొరకడం లేదు. పెట్టుబడికి సరిపడా అప్పు ప్రభుత్వ సంస్థల ద్వారా ఇప్పించాలి. బ్యాంకుల్లో ఉన్న అప్పులతో పాటు ప్రైవేటు అప్పులను కూడా ఒకసారి మాఫీ చేయాలి. రుణమాఫీ విషయంలో కౌలురైతులను గుర్తించే విధంగా నిబంధనలు కావాలి.


2. రైతులకు గుర్తింపు కార్డులు...: కౌలు రైతులకు బ్యాంకులు కొత్తగా రుణాలు ఇవ్వడం లేదు. కౌలు రైతులకు ఇచ్చిన కౌలు గుర్తింపు కార్డులను బ్యాంకులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. పంటరుణం సాగుదారునికి ఇవ్వాలని ఉన్నా బ్యాంకులు తమ రుణాలకు గ్యారంటీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. బ్యాంకులు రుణాలు ఇచ్చే విధంగా కనీసం రూ.నాలుగు వేల కోట్లతో రుణ గ్యారంటీ నిధిని ఏర్పాటు చేయాలని బ్యాంకులు కోరుతున్నాయి. అప్పుడే కౌలుదారునికి రుణం వస్తుంది.

3. గిట్టుబాటు ధర కల్పించడం: కేంద్రం ప్రకటిస్తున్న గిట్టుబటు ధర శాస్త్రీయంగా ఉండటం లేదు. మరోవైపు కౌలు రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సమస్యగా మారుతోంది. మద్దుతు ధర అమలు కాక పోగా, అమ్ముకునే హక్కును కూడా ఈ-క్రాప్ విధానం ద్వారా కోల్పోతున్నాడు. దీంతో దళారులు, కమీషన్ దారులకు తమ పంటను వచ్చిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. పంటలు అమ్ముకునే విధంగా గిట్టుబాటు ధర గ్యారంటీ చట్టం తేవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

4. ఎంత మేర రుణాలు ఇవ్వాలి?: ప్రస్తుతం వ్యవసాయంలో కౌలురైతులే ఎక్కువ. వారి సంఖ్య ఆధారంగా దామాషా పద్ధతిలో ప్రభుత్వం రుణాలు ఇవ్వాలి. అయితే ఇప్పుడు 80 శాతంగా ఉన్న కౌలుదారులకు ఒక్కశాతం కూడా రుణాలు దక్కడం లేదు. ఈ ఏడాది 10 శాతం ఇస్తామని ప్రకటించినా అవి కూడా దక్కలేదు. సాగు ఆధారంగా రుణాలు ఇవ్వాలి.

కౌలు రైతులపై ఈ-క్రాప్ కత్తి!

పశ్చిమ గోదావరి జిల్లా పెదపాడు మండలం కొత్తూరుకు చెందిన అవాల మోహనరావు పదేళ్లుగా పదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా గిట్టుబాటు ధరలు లేకపోగా పెట్టుబడి ఖర్చు పెరిగిపోయింది. ఎకరాకు 30 నుంచి 32 బస్తాల ధాన్యం పండిస్తే 15 బస్తాల వరకూ కౌలుకే చెల్లించాల్సి వచ్చింది. కోత కోసిన దగ్గర నుంచి ధాన్యం బయటకు వచ్చేవరకూ అయిన ఖర్చుకే మిగిలిన మొత్తం సరిపోయింది. దీంతో ఎకరానికి రూ.15 వేల వరకూ నష్టం వచ్చింది. గత ఏడాది అపరాల పంటపై రూ.మూడు లక్షల వరకూ నష్టం వచ్చింది. కమీషన్ వ్యాపారుల వద్ద నుంచి వడ్డీలకు అప్పు తీసుకురావడంతో ఆ వడ్డీలు కట్టేందుకు తనకున్న కొంత స్థలాన్ని తక్కువ ధరకు తెగనమ్మాల్సి వచ్చింది.



అదే జిల్లాకు చెందిన తాళ్లగూడెంకు చెందిన కౌలు రైతు పల్లపోతు రెడ్డియ్య జేఎల్‌జీ గ్రూప్ కింద రుణం తీసుకున్నాడు. ఇదే గ్రూపులో ఉన్న ఇతర వ్యక్తులకు రుణమాఫీ అయినట్టు ప్రకటించినా రెడ్డియ్యకు రుణ మాఫీ రాలేదు. రుణమాఫీ వచ్చినట్లుగా పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డులో పెట్టిన తర్వాత బ్యాంకర్లు మాఫీ సొమ్ము మంజూరు కాలేదని చెప్పారు. ఇప్పుడు పారుబకాయిగా గుర్తించి రూ.88,740 చెల్లించి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకోవాలని నోటీసు ఇచ్చింది. పంటలు వేయడానికి డబ్బుల్లేక రెండేళ్లుగా వ్యవసాయానికి దూరంగా ఉంటున్న రెడ్డియ్య బ్యాంకు రుణం ఎలా చెల్లించాలో తెలియక సతమతమవుతున్నాడు.



సాక్షి ప్రతినిధి, ఏలూరు



ఇదీ రాష్ట్రంలోని కౌలు రైతుల దుస్థితి. గోరుచుట్టుపై రోకటిపోటు పడ్డట్టు... అప్పుల భారంతో తల్లడిల్లుతున్న కౌలు రైతుల పాలిట ఈ-క్రాప్ విధానం శరాఘాతంగా మారింది. ఆన్‌లైన్‌లో పంట నమోదు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విధానంలో కేవలం భూ యజమానుల పేర్లు మాత్రమే నమోదు చేస్తున్నారు. దీంతో కౌలు రైతుల రక్షణ చట్టంలో వారికి కల్పించిన సదుపాయాలు అమలుకాకుండా పోతాయి. కౌలు రైతు పంట అమ్ముకోవడం కష్టంగా మారింది. కౌలు రైతులకు రుణ పరపతి అందకపోవడంతో పెట్టుబడిలో 95శాతం ప్రైవేటు అప్పులే ఉంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో కౌలు రైతులకు అందింది అంతంత మాత్రమే. మరోవైపు ఏటికేడాదికి రుణాలు దొరకడం కష్టంగా మారింది. కొత్తగా ఈ క్రాప్ విధానంతో రుణాలు దొరికే మార్గాలు మూసుకుపోయినట్లేనని వారు వాపోతున్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం వచ్చిన తర్వాత 1,250 వరకూ రైతు ఆత్మహత్యలు జరిగితే అందులో 1100కు పైగా కౌలు రైతులే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.

కౌలు రైతుల హక్కులన్నీ మాయం

ఈ-క్రాప్ విధానంతోనే పంట కొనుగోలు, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు, ఇతర పథకాలు అమలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి ఏటా ప్రారంభ రోజుల్లో ఆ పంటను ట్యాబ్‌ల ద్వారా ఫొటోలు తీసుని ఆన్‌లైన్‌లో సాగుదారుని పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ-క్రాప్ విధానాన్ని వెబ్‌ల్యాండ్‌తో అనుసంధానం చేశారు. వెబ్‌ల్యాండ్‌లో భూయజమాని పేరు, సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం ఉంటాయి. ట్యాబ్ ద్వారా తీసిన పంట ఫొటోలు భూయజమానే వేసినట్లు నమోదు చేస్తున్నారు. దీంతో నిజంగా పంట వేసిన కౌలు రైతుల పేర్లు నమోదు కావడం లేదు. రుణ అర్హత గుర్తింపు కార్డులు ఉన్నా.. వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ నెల మొదటి వారం నుంచి కౌలు రైతుల నుంచి పంట కొనుగోలు నిలిపివేసింది. దీనిపై 'సాక్షి'లో కథనం రావడంతో స్పందించి మళ్లీ కొనుగోళ్లకు అవకాశం కల్పించింది. ఈ-క్రాప్ నమోదు ఆధారంగా ప్రభుత్వ వ్యవసాయ రాయితీ పథకాలు వర్తింపజేస్తే కౌలు రైతుకు ఒక్క పథకం కూడా అమలు కాదు. చివరికి పండించిన పంటనూ అమ్ముకునే హక్కునూ కోల్పోతాడు.

కొనసాగుతున్న ఆత్మహత్యలు

రాష్ట్రంలో 24 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్టు సామాజిక ఆర్థిక అధ్యయనాల సంస్థ (సెస్) చైర్మన్ ఆర్.రాధాకృష్ణ కమిషన్ లెక్కలు తేల్చింది. సాగుదారునికి ఆదాయం లేదని ఈ కమిషన్ లెక్కల్లో తేలింది. దీంతో అప్పులపాలైన రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ప్రతి 30 గంటలకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. 100 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే అందులో 90 శాతం కౌలు రైతులే ఉండటం గమనార్హం. ఈ ఖరీఫ్‌లో కౌలు రేట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో పండించిన పంటలో 30 నుంచి 40 శాతం ఆదాయం కౌలు చెల్లింపునకే సరిపోతోంది. ప్రకృతి వైపరీత్యాలు, నకిలీ విత్తనాలు, తెగుళ్ల వల్ల పంటల దిగుబడులు తగ్గుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో గత ఏడాది రెండు పంటలకు వరికి 24 బస్తాలు (75 కిలోలు) కౌలు ఉంటే ఈ ఏడాది దాన్ని 32 బస్తాలకు పెంచారు. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. కేంద్రం ఎరువులపై సబ్సిడీని ఏటా తగ్గించుకుంటూ వస్తోంది. డీజల్ ధరలు పెరుగుతుండటంతో ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాల అద్దెలు పెంచేస్తున్నారు. కౌలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు ఇవ్వడం లేదు.

ఆరు లక్షల మందికే కౌలుకార్డులు


2011 భూఅధీకృత సాగుదారు చట్టం ప్రకారం కౌలు రైతులకు రుణ అర్హత గుర్తింపు కార్డులు అందడం లేదు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 11 లక్షల మందికి కౌలు కార్డులు ఇస్తామని చెప్పినా ఆరు లక్షల మందికే వచ్చాయి. ఈ ఏడాది పరిస్థితి కూడా దీనికి భిన్నంగా లేదు. 2011 చట్టంలో కౌలు రైతుకు పంట హక్కు కల్పించారు. దీంతో పంటలు పండించడానికి, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల బీమా ఇలా కొన్ని రాయితీలు పొందడానికి వీలు పడింది.

రైతు రుణాలా!

బాబు ప్రభుత్వం వచ్చాక పంట రుణాలు కౌలు రైతులకు ఎండమావిగా మారాయి. రాష్ట్ర రుణ ప్రణాళికలో ఒక్క శాతం కూడా వీరికి అందడం లేదు. 2013-14లో లక్షా 55 వేల మందికి రూ. 318కోట్ల రుణాలు ఇవ్వగా, 2014-15లో రూ. 62 కోట్లు, 2015-16లో రూ. 146కోట్లు, 2016-17లో రూ.202 కోట్లు మాత్రమే ఇచ్చారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.87,471 కోట్ల రుణ లక్ష్యంగా ప్రకటించారు. ఇందులో పది శాతం కౌలు రైతులకు అంటే రూ.8,740 కోట్లు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. అయితే ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమైనా కౌలు రైతులకు ఈ స్థాయిలో రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. చట్ట ప్రకారం పంట రుణాలు కౌలు రైతులకే ఇవ్వాలి. భూములు కౌలుకు ఇచ్చిన భూ యజమానుల్లో 95 శాతం మంది పంటలు సాగు చేయకుండానే పంట రుణాలు పొందుతున్నారు. ఒక సర్వే నంబర్‌పై ఒకరు పంట రుణం పొందితే మరొకరికి ఇవ్వకూడదన్న నిబంధన వల్ల కౌలు రైతులకు రుణాలు రాకుండా పోతున్నాయి.

రుణమాఫీ కూడా అందని ద్రాక్షే

2013 డిసెంబర్ నాటికి రెండు లక్షల 20 వేల మంది కౌలు రైతులకు ఇచ్చిన రూ.574 కోట్ల రుణ మాఫీ కావాల్సి ఉంది. ఇప్పటివరకూ ఐదు విడతల్లో ప్రకటించిన రుణమాఫీలో రూ.144 కోట్లు మాత్రమే రుణ మాఫీ జరిగింది. భూయజమానుల రుణమాఫీకే ప్రాధాన్యం దక్కింది. బ్యాంకులకు రుణాలు చెల్లించకపోవడంతో తిరిగి పొందే అవకాశం లేకుండా పోయింది. ఆ బ్యాంకుల పరిధిలో రుణం పొందని కౌలు రైతులకూ రుణాలు ఇవ్వని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోకపోతే కౌలురైతు ఆత్మహత్యలు మరింత పెరిగే అవకాశం ఉంది.



2016లో 804 మంది రైతుల ఆత్మహత్యలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 2016 సంవత్సరంలో 804 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి పరషోత్తమ్ రూపాలా రాజ్యసభలో వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు శుక్రవారం మంత్రి ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) నివేదిక ప్రకారం 2014-15లో రాష్ట్రంలో 632 మంది రైతులు, 916 మంది రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఇంకా ప్రచురించని సమాచారం ప్రకారం 2016 సంవత్సరంలో రాష్ట్రంలో 804 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వెల్లడవుతోందని పేర్కొన్నారు. రైతులు దివాలా తీయడం, అప్పుల ఊబిలో కూరుకు పోవడం, వ్యవసాయంలో సంభవించే నష్టాలు రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణాలని ఈ నివేదికలో పేర్కొన్నట్లు మంత్రి వివరించారు. పెరిగి పోతున్న రైతుల ఆత్మహత్యల నిలువరించాలంటే వారి ఆదాయాన్ని రెండింతలు చేయడమొక్కటే మార్గమని తెలిపారు. కేంద్రం ఈ లక్ష్యసాధన కోసం రైతు సంక్షేమ విభాగంలో ఒక అంతర్ మంత్రిత్వ శాఖ బృందాన్ని ఏర్పాటు చేసి ఒక వ్యూహాన్ని సూచించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా కేంద్రం తన ప్రాధాన్యతలను మలచుకుంటుందని కూడా చెప్పారు.



రుణమాఫీ కావాలి

కౌలు రైతులకు రుణ మాఫీ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బ్యాంకు అప్పులు మాఫీ చేసినా వారికి ఉపయోగపడేది నామమాత్రమే. 90 శాతం వరకూ బయట అప్పులే ఉన్నారు. కౌలు రైతులకు న్యాయం జరిగేలా చట్టాన్ని గట్టిగా అమలు చేయాలి. రుణ గ్యారంటీ నిధిని ఏర్పాటు చేయాలి. కేంద్రప్రభుత్వం కూడా కౌలుదారులను దృష్టిలో పెట్టుకుని చట్టాలు చేయాలి. బ్యాంకుల నుంచి కౌలుదారులకు పూర్తిగా రుణాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. – కె.శ్రీనివాస్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

కౌలు రైతులను ఆదుకోవాలి

కౌలు రైతులు పూర్తిగా కష్టాల్లో ఉన్నారు. వీరు వ్యవసాయం మానేస్తే వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుంది. కౌలు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. సొంతభూమి కొంచెం ఉండి, మరికొంత కౌలుకు చేస్తున్న వారికే సొంతభూమిని గ్యారెంటీగా పెట్టుకుని రుణం ఇస్తున్నారు. కౌలుదారులకు రుణాలు రావడం లేదు. వ్యవసాయ రుణాలతో పాటు పాడిపరిశ్రమకు ప్రాధాన్యత ఇచ్చి వారికి ప్రత్యేకంగా రుణాలు ఇప్పించాలి. గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల కౌలు రైతుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. – ఎంవీఎస్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు



ఆరు ప్రైవేటు ఆర్థిక నగరాలు

- 980 ఎకరాల్లో ఏర్పాటుకు సీఎం ఆమోదం
- రూ.22,280 కోట్ల అంచనా వ్యయం..
- ఐదు కంపెనీలకు పనుల అప్పగింత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆరు ప్రైవేటు ఆర్థిక నగరాలు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు రాష్ట్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.22,280 కోట్ల వ్యయంతో 980 ఎకరాల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో సీఎం చంద్రబాబునాయుడు ఏపీ టిడ్కో, మున్సిపల్, పరిపాలన శాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో వీటికి ఆమోదం తెలిపారు. పినపాక-చెవుటూరు(కృష్ణాజిల్లా), మంగళగిరి(గుంటూరు జిల్లా), అచ్యుతాపురం(విశాఖ జిల్లా), తాంద్రపాడు-తడకనపల్లి(కర్నూలు జిల్లా), రాజమండ్రి సమీపంలోని వెలుగుబండ(తూర్పుగోదావరి), వెదురువాడ(విశాఖ జిల్లా)లలో ఈ ఆర్థిక నగరాల ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికలను అధికారులు సీఎంకు వివరించారు. రూ.2,706 కోట్లతో 90 ఎకరాల్లో చేపట్టే పినపాక-చెవుటూరు ఆర్థిక నగరం నిర్మాణ బాధ్యతను మా లక్ష్మి సంస్థకు అప్పగించినట్టు చెప్పారు. దీనివల్ల దాదాపు 19 వేల ఉద్యోగాలు వస్తాయని, ఉన్నత వర్గాలకోసం 20 వేల ఇళ్లు, బలహీన, అల్పాదాయ వర్గాలవారికి 19 వేల ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.13,580 కోట్లతో మంగళగిరి, అచ్యుతాపురంలో నిర్మించనున్న ఆర్థిక నగరాల పనుల్ని ఎల్‌ఈపీఎల్ సంస్థకిచ్చామని, 355 ఎకరాల్లో వీటి నిర్మాణం జరుగుతుందని వివరించారు. ఇక్కడ 91 వేల ఉద్యోగాలొస్తాయని, ఉన్నత వర్గాలకోసం 36 వేల ఇళ్లు, పేదలకు 22 వేల ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. తాంద్రపాడు-తడకనపల్లి వద్ద నిర్మించే ఆర్థిక నగరం పనుల్ని రాగమయూరి సంస్థకు రూ.1,667 కోట్లకు అప్పగించామని, 183 ఎకరాల విస్తీర్ణంలో దీని నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఇందులో 10,500 మందికి ఉద్యోగాలు వస్తాయని, ఉన్నత వర్గాలవారికి 8,690 ఇళ్లు, పేదలకు 6,320 ఇళ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. రూ.1,821 కోట్లతో 150 ఎకరాల్లో వెలుగుబండ వద్ద ఆర్థిక నగరం నిర్మాణానికి చైతన్య డెవలపర్స్ ముందుకొచ్చినట్లు తెలిపారు. ఇక్కడ 12,600 మందికి ఉద్యోగాలు వస్తాయని, సుమారు 22 వేల ఇళ్లను ఉన్నత, పేదల వర్గాలకోసం నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. రూ.2,496 కోట్లతో వెదురువాడలో నిర్మించనున్న ఆర్థిక నగరం పనుల్ని ఆర్ఎస్ బిల్డర్స్‌కిచ్చామని, ఇందులో 28 వేల ఉద్యోగాలు వస్తాయని, 35 వేల ఇళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్ని త్వరగా ప్రారంభించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ నగరాల్లో చేపట్టే ఆర్థిక కార్యకలాపాలు ముమ్మరంగా జరిగేలా ముందునుంచే ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ప్రజారోగ్యానికి ప్రపంచబ్యాంకు రుణం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజారోగ్య కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రపంచబ్యాంకు రుణం తీసుకోవాలని శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రి మండలి నిర్ణయాలను విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళావెంకట్రావు, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్‌లతో కలిసి సమాచారశాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు మీడియా సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రంలో ప్రాథమిక వైద్యరంగంలో మౌలిక వసతుల కల్పనకు రూ.4,807 కోట్లు అవసరమని, వాటిలో ప్రపంచబ్యాంకు నుంచి 70 శాతం (రూ.3,365 కోట్లు) రుణంగానూ, మిగిలిన 30 శాతం (రూ.1,442 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెట్టాలని మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. ఈ నిధులతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లుగా అభివృద్ధి, ఆసుపత్రుల్లో పేషెంట్ సేఫ్టీ తదితర అంశాలపై దృష్టి పెడతారని చెప్పారు. వైద్య సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తారు. కేబినెట్ మిగతా నిర్ణయాలిలా ఉన్నాయి...

- టాటా ట్రస్ట్‌కు బాలామృతం కార్యక్రమంలో పౌష్టికాహారాన్ని అందించే బాధ్యత అప్పగింత. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఈ ట్రస్టు ద్వారా మహిళలకు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంటుంది.
- రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి, అవసరాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల రూపకల్పనకు 'మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ అలయెన్స్ ఫర్ కలెక్టివ్ ట్రాన్స్‌ఫర్మేషన్' ట్రస్టుకు రూ.1.20 కోట్లు కేటాయింపు. ఈ పనులకు సంబంధించిన పురోగతిని ఎప్పటికప్పుడు ప్రణాళికా శాఖకు అందించాలని నిబంధన.



సచివాలయంలో మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు

- ఆంధ్రప్రదేశ్ పోలీస్ (రిఫామ్స్) (అమెండ్‌మెంట్) ఆర్డినెన్స్-2017 స్థానంలో బిల్లును రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు నిర్ణయం.
- పోలవరం ప్రాజెక్టు పనులకు సంబంధించి ప్రత్యేక ముందస్తు నిధులు (స్పెషల్ ఇంప్రెస్ట్ అమౌంట్) రూ.150 కోట్ల నుంచి రూ.160 కోట్లకు పెంపు.
- గోరకల్లు బైపాస్ కెనాల్ పనులకు చేపట్టిన కాంట్రాక్టరుకు ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ అమౌంటు కింద రూ.4,78,77,638లను చెల్లించడానికి అంగీకారం.
- ఏపీ కంటెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం. ఏపీ ఫైబర్ నెట్‌కు అనుసంధానంగా ఈ కంటెంట్ కార్పొరేషన్ పని చేస్తుంది.
- ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా దీన్ని నిర్వహిస్తారు.
- పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వం చేపడుతున్న 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఏపీ టిడ్కో నిధులు సమకూర్చునేందుకు బ్యాంకులకు ప్రభుత్వం హామీ.
- రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో రూ.38,265 కోట్లతో 5 లక్షల ఇళ్ల నిర్మాణం. ఈ హౌజింగ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13,035 కోట్లు, కేంద్రం రూ.7,500 కోట్లు భరిస్తాయి. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుడు సమకూర్చుకుంటాడు.
- టీటీడీ పరిధిలోని అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామిఆలయంలో పనిచేస్తున్న ఎనిమిది మంది పోస్టులకు హైకోర్టు ఆదేశానుసారం రెగ్యులర్ చేయడానికి అనుమతి.
- గుంటూరు జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో 2,34,420 చదరపు అడుగుల విస్తీర్ణంలో 597 పడకలతో మాతాశిశు ఆరోగ్య కేంద్రం 'మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్' ఏర్పాటుకు ఆమోదం.
- అనంతపురం జిల్లా కుదేరులో ఏపీఐఐసీకి అప్పగించిన 421.37 ఎకరాల భూమిలో 16.50 ఎకరాలను వెనక్కి తీసుకుని ఎన్ఆర్ఈడీ క్యాప్ వైస్ చైర్మన్, ఎండీకి ముందస్తుగా స్వాధీనం చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు అప్పగింత.

కేంద్రంపై ఎలా ఒత్తిడి తేవాలో నిర్ణయిస్తా

అమరావతిని నగరంగా చూడడం లేదు

మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి కేంద్రంపై ఒత్తిడి తెద్దామని, అదెలా అనేది రెండురోజుల్లో నిర్ణయిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో కేంద్ర బడ్జెట్ తీరుతెన్నులపై ఆయన మాట్లాడారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్త రాజధాని అమరావతిని కేంద్రం నగరంగా చూడడంలేదని... ముంబై, బెంగుళూరు మెట్రో రైలు ప్రాజెక్టులకు రూ.వేల కోట్లు ఇచ్చి అమరావతి మెట్రోను పరిగణనలోకి తీసుకోలేదని సీఎం వ్యాఖ్యానించారు. ఇది అటు పూర్తిగా పల్లెటూరుగానూ, పూర్తిగా నగరంగానూ లేకపోవడంవల్ల దీన్ని పట్టించుకోలేదని అభిప్రాయపడ్డారు. కనీసం విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకైనా నిధులిస్తే బాగుండేదన్నారు. బడ్జెట్‌లో ఉత్తరాది రాష్ట్రాలకే ఎక్కువ నిధులిచ్చారని, దక్షిణాది రాష్ట్రాలపై నిర్లక్ష్యం చూపారని చెప్పారు. నీతి ఆయోగ్ నిధులను రాష్ట్రానికి ఎలా తేవచ్చో అధ్యయనం చేయాలని, ఈఏపీ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు.

12న అగ్రిగోల్డ్ మృతులకు ఎక్స్‌గ్రేషియా: అగ్రిగోల్డ్ మృతుల కుటుంబాలకు ఈ నెల 12వ తేదీన రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని తానే స్వయంగా అందిస్తానని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. మొత్తం 96 కుటుంబాలకు చెక్కులు సిద్ధం చేయాలన్నారు. రాజధానిలో ఏర్పాటు చేయాలనుకుంటున్న 108 అడుగుల ఎన్టీఆర్ విగ్రహానికి సంబంధించిన నాలుగు డిజైన్లను సమావేశంలో పరిశీలించి కొన్ని మార్పులు సూచించారు.

ఎంత అన్యాయం జరిగిందో అధ్యయనం చేస్తున్నాం: కళా వెంకట్రావు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎంత అన్యాయం జరిగిందో అధ్యయనం చేస్తున్నామని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు చెప్పారు. ఆయన శుక్రవారం మంత్రివర్గ సమావేశం నిర్ణయాలను వెల్లడించేందుకు మంత్రి కాలువ శ్రీనివాసులుతో సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, పార్టీలో దీనిపై చర్చిస్తున్నామని తెలిపారు. కేంద్రంపై ఏవిధంగా ఒత్తిడి తేవాలో ఆలోచిస్తున్నామన్నారు. ఆదివారం టీడీపీ ఎంపీలతో కూడా సమావేశమైన తర్వాత ఏంచేయాలో నిర్ణయిస్తామని తెలిపారు.

కల్తీ మద్యం డొంక కదిలింది!

- శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో కల్తీ మద్యం
- ఖరీదైన బ్రాండ్ల మూతలతో నకిలీ సీసాలు
- మద్యం వ్యాపారులే సూత్రధారులు
- 13 మందిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కల్తీ మద్యం డొంక కదులుతోంది. లైసెన్సీలే కల్తీ మద్యం తయారీ సూత్రధారులని తేలింది. సంతలు, శ్మశానాలు కేంద్రాలుగా అమ్మకాలు సాగుతున్నాయి. గుంటూరు జిల్లా రేపల్లెలో గాదెవారిపాలెం కేంద్రంగా రెక్టిఫైడ్ స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు చేసి గత నెలలో వ్యాపారులు పట్టుబడ్డారు. దీన్ని మరువక ముందే శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో మద్యం లైసెన్సీలు కల్తీ మద్యాన్ని ఖరీదైన మద్యం బాటిళ్లలో నింపి అమ్మకాలు సాగిస్తున్నారు. దీని వెనుక ఉన్న 13 మంది నిందితుల్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం శుక్రవారం అరెస్ట్ చేసింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు కల్తీ మద్యం రాకెట్ గురించి మీడియాకు వివరించారు. శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలంలోని విక్రమపురంలో జనతా వైన్స్ నిర్వాహకుడు అనిల్, విశాఖ జిల్లా అచ్యుతాపురానికి చెందిన మద్యం లైసెన్సీ అనంత్ ఈ కల్తీ మద్యం రాకెట్‌కు సూత్రధారులని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో మద్యం షాపుపై దాడులు చేస్తే నకిలీ మద్యం భారీగా లభించిందని వెల్లడించారు. ఆ రెండు జిల్లాల్లో బాటిళ్లలో కల్తీ మద్యం నింపి, వాటికి ఖరీదైన మద్యం బాటిళ్ల మూతలను పెట్టి మద్యం షాపులతోపాటు సంతల్లో, శ్మశానాల సమీపాల్లో విక్రయిస్తున్నారని తెలిపారు. నకిలీ మూతలు భారీగా పట్టుబడ్డాయని, నాలుగు లోడుల మద్యం తయారుచేసేందుకు వీటిని సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

కల్తీ మద్యం ఎలా తయారుచేస్తున్నారంటే..: హైదరాబాద్ బాలానగర్‌లోని స్వాతి ఇండస్ట్రీస్‌లో ఖరీదైన మద్యం బ్రాండ్ల పేరిట మూతలు తయారుచేయిస్తున్నారు. వీటితో 180 ఎంఎల్ ఖాళీ బాటిళ్లలో చీప్ లిక్కర్ నింపి విక్రయిస్తున్నారు. ఈ కల్తీ మద్యాన్ని బెల్టు షాపుల్లో అమ్ముతున్నారు. ఎక్కడెక్కడికి కల్తీ మద్యాన్ని సరఫరా చేయాలనే డీల్‌ను విజయవాడలో కుదుర్చుకుంటున్నారని, ఈ ఘటనలో అరెస్ట్ అయిన మద్యం వ్యాపారులు కూడా విజయవాడ రైల్వేస్టేషన్‌లో డీల్ కుదుర్చుకున్నారని అధికారులు చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో అన్ని మండలాలతోపాటు విశాఖలోని యలమంచిలి, అనకాపల్లిలో భారీగా కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

ఈ-వే బిల్లు అమలు మరో వారం వాయిదా

సాక్షి, అమరావతి: ఈ నెల ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకురావాలనుకున్న ఈ-వే బిల్లు విధానం మరో వారం రోజులు పాటు వాయిదా పడింది. ఈ-వే బిల్లు జారీలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఈ విధానాన్ని వాయిదా వేసినట్లు రాష్ట్ర వాణిజ్యశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఇప్పుడు కూడా మన రాష్ట్రంలో అంతర్రాష్ట్ర సరుకు రవాణా చేయడానికి ఈ-వేబిల్లు తప్పనసరి అని, కేవలం రాష్ట్రంలో సరుకు రవాణా చేయడానికి మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందన్నారు. రూ.50,000 విలువ దాటిన సరుకును తీసుకెళ్లాలంటే ఈ-వేబిల్లు తప్పనిసరి. ఫిబ్రవరి 1 నుంచి దేశవ్యాప్తంగా ఈ వేబిల్లు విధానం తీసుకురావడం కోసం జనవరి 15 నుంచి ప్రయోగాత్మకంగా జారీ చేయడం మొదలు పెట్టారు. ఈ సమయంలో జీఎస్టీ ఎన్ పోర్టల్ 2.84 లక్షల ఈ-వే బిల్లులను జారీ చేసింది. ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే ఈ బిల్లుల్లో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఫిబ్రవరి 8 వరకు వాయిదా వేసినట్లు తెలిపారు.

జస్టిస్ జైశ్వాల్‌కు ఘనంగా వీడ్కోలు



జస్టిస్ జైశ్వాల్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయవాదులు

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్ ఈ నెల 4న పదవీ విరమణ చేయనున్న సందర్భంగా ఆయనకు హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ అధ్యక్షతన వీడ్కోలు సమావేశం జరిగింది. హైకోర్టుకు జస్టిస్ జైశ్వాల్ అందించిన సేవలు మరువలేనివని, పాలనాపరమైన అంశాల్లో తనకు చేదోడువాదోడుగా ఉన్నారని ఈ సందర్భంగా ఏసీజే కొనియాడారు. యువ న్యాయవాదులు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అడ్వొకేట్ జనరల్స్ దమ్మాలపాటి శ్రీనివాస్, దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కుటుంబసభ్యుల ప్రోత్సాహం వల్లే తాను ఈ స్థాయికి వచ్చానని, వృత్తిపరంగా తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు జస్టిస్ జైశ్వాల్ తెలిపారు. అనంతరం ఏసీజే ఆయనను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘాలు జస్టిస్ జైశ్వాల్ దంపతులను ఘనంగా సన్మానించాయి. కార్యక్రమంలో జస్టిస్ జైశ్వాల్ కుటుంబసభ్యులు, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు హాజరయ్యారు.

అభివృద్ధికి కేంద్రం సహకారం: మాణిక్యాలరావు



సాక్షి, అమరావతి: రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రం తన సహకారం అందజేస్తుందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు అన్నారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని కితాబిచ్చారు. అలాగే పోలవరం విషయంలో కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రైల్వే జోన్ విషయంలో కొద్ది రోజుల్లో కేంద్రం ప్రత్యామ్నాయలు చూపుతుందని మంత్రి వ్యాఖ్యానించారు.

మాపై చిన్నచూపు వద్దు

భట్రాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు

సాక్షి, అమరావతి: భట్రాజులను చిన్నచూపు చూడవద్దని, పొగడ్తలు వస్తే భట్రాజులా పొగుడుతున్నారని అనడం సరికాదని ఆంధ్రప్రదేశ్ భట్రాజు సంఘం అధ్యక్షుడు కూరపాటి రామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు గవర్నర్‌ను భట్రాజుల పొగుడుతున్నారని పత్రికల్లో రావడం బాధ కలిగించిందన్నారు. అన్ని సామాజిక వర్గాల మాదిరి తమను కూడా గౌరవించాలని ఆయన కోరారు.

కేసీ కెనాల్ బ్రిడ్జికి బీటలు!

- పక్కనే కాజ్‌వే కోసం ఓపెన్ బ్లాస్టింగ్
- అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరుల నిర్వాకం
- బ్రిడ్జి దెబ్బతింటుందని హెచ్చరిస్తున్న ఇంజనీర్లు
- పట్టించుకోవద్దంటున్న ఎమ్మెల్యే

కేసీ కెనాల్ బ్రిడ్జి వద్ద ఓపెన్ బ్లాస్టింగ్ చేస్తున్న దృశ్యం



సాక్షి ప్రతినిధి, కర్నూలు: కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు సాగు నీరందించే కర్నూలు–కడప (కేసీ) కెనాల్ బ్రిడ్జికి బీటలు పడే ప్రమాదం పొంచి ఉంది. కర్నూలులోని ఆనంద్ థియేటర్‌కు సమీపంలో కేసీ కెనాల్ బ్రిడ్జికి అతి చేరువలో ఓపెన్ బ్లాస్టింగ్ చేస్తుండడమే ఇందుకు కారణం. నగరంలోని రాజ్‌విహార్ సెంటర్లో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ఆనంద్ థియేటర్ నుంచి కిసాన్‌ఘాట్ వరకు కాజ్‌వేను రూ.15 కోట్లతో నిర్మిస్తున్నారు. ఈ పనులను అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యే అనుచరులే చేపడుతున్నారు. కేసీ కెనాల్ బ్రిడ్జికి సమీపంలోనే పనులు జరుగుతున్నాయి. వాస్తవానికి కంట్రోల్ బ్లాస్టింగ్ చేయాలి. అలాకాకుండా ఓపెన్ బ్లాస్టింగ్ చేస్తుండడంతో సమీపంలోనే ఉన్న కేసీ కెనాల్ బ్రిడ్జికి బీటలు వారే ప్రమాదం పొంచి ఉందని సాగునీటి శాఖ ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయాన్ని పనులు చేపడుతున్న ఎమ్మెల్యే అనుచరుల కంపెనీ దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికీ తీసుకెళ్లారు. అయితే, దీనిపై చూసీచూడనట్టు ఉండాలని ఎమ్మెల్యే హితోపదేశం చేసినట్టు సమాచారం. కేసీ కెనాల్ నీరు ఆయకట్టుకు పోయేందుకు వీలుగా కర్నూలులో ఎక్కడా లేని విధంగా కింద రోడ్డు.. పై భాగంలో బ్రిడ్జి నిర్మించారు. ఈ కెనాల్ ద్వారా కేసీ కింద ఉన్న 2.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు పారుతుంది. ఒకవేళ పనుల నిమిత్తం బ్లాస్టింగ్ చేయాల్సి ఉన్నా.. కనీసం అధ్యయనం చేయాల్సి ఉంటుంది. బ్లాస్టింగ్ ద్వారా బ్రిడ్జికి ఏమైనా ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉందా? అనే కోణంలో అధ్యయనం చేసిన తర్వాతే ముందుకెళ్లాలి. ఈ పనులను అడ్డదారిలో దక్కించుకున్న సంస్థ.. సబ్ కాంట్రాక్టును ఎమ్మెల్యే అనుచరులకు కట్టబెట్టింది. వీరు అడ్డదిడ్డంగా పనులు చేస్తున్నారు. కేసీ కెనాల్ బ్రిడ్జికి బీటలు పడితే ఆయకట్టు రైతులకు తిప్పలు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది.

నత్తే నవ్వేలా..

- విజయవాడ కనకదుర్గ ఫ్లైఓవర్ పనులు
- ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్న ప్రభుత్వం
- ట్రాఫిక్‌తో నగరవాసుల నరకయాతన
- ఏడాది గడువుతో 2015 డిసెంబర్‌లో ఫ్లైఓవర్ పనులు ప్రారంభం
- రెండేళ్లలో పూర్తయింది 55 శాతమే

సాక్షి, విజయవాడ : విజయవాడ నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఇంద్రకీలాద్రి వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కనకదుర్గ ఫ్లైఓవర్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఏ దేశానికి వెళితే ఆ దేశంలా రాజధాని అమరావతిని తీర్చిదిద్దుతానని గొప్పలు చెప్పే ముఖ్యమంత్రి.. విజయవాడ నగరానికి ఎంతో కీలకమైన ఒక్క ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేయలేకపోతున్నారు. 2015 డిసెంబర్‌లో ఈ ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యాయి. రెండేళ్లు పూర్తయినా పనులు ఇంకా మందకొడిగానే సాగుతున్నాయి. నిత్యం లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ మార్గాన్ని రెండేళ్లుగా మూసివేయడంవల్ల నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2.6 కి.మీల పొడవైన ఈ ఫ్లైఓవర్ పనులు రెండేళ్లలో కేవలం 55 శాతం మాత్రమే పూర్తయ్యాయి. తాజాగా ఆగస్టు 15లోగా ఫ్లైఓవర్ పనులు పూర్తిచేయాలని నిర్దేశించినా , మరో రెండేళ్లకు కానీ ఫ్లైఓవర్ పనులు పూర్తికాక పోవచ్చని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు.

స్పైన్స్ నిర్మాణంలోనూ తీవ్ర జాప్యం

ఫ్లైఓవర్‌లో పిల్లరు, పిల్లరుకు మధ్య స్పైన్స్ వేస్తారు. ఈ ఫ్లైఓవర్‌కు మొత్తం 667 స్పైన్స్ అవసరమవుతాయి. ఇప్పటివరకు కేవలం 373 స్పైన్స్ మాత్రమే తయారయ్యాయి. అలాగే, కేవలం 16 పిల్లర్ల మధ్యనే వీటిని అమర్చారు. ఇంకా 30 పిల్లర్ల మధ్య స్పాన్స్ అమరాల్సి ఉంటుంది. అలాగే, మొత్తం 47 స్తంభాలకు గాను పూర్తిస్థాయిలో పూర్తయినవి 39 మాత్రమే. వీటిపై నిర్మించే క్యాప్స్ కూడా 37 మాత్రమే పూర్తయ్యాయి. నదిలోనూ, కాల్వలోనూ పిలర్లు వేయాల్సి రావడంవల్ల పనుల్లో జాప్యం జరుగుతోందని ఇంజనీర్లు చెబుతున్నారు. మరోవైపు.. ఇది ఆరులైన్ల ఫ్లైఓవర్ కావడంతో పిల్లర్లకు ఇరువైపులా ఏర్పాటు చేయాల్సిన వింగ్స్ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. మొత్తం 1406 వింగ్స్‌కు గాను ఇప్పటివరకు కేవలం 749 వింగ్స్ మాత్రమే తయారుకాగా, కేవలం 3 పిల్లర్లకు మాత్రమే వాటిని అమర్చారు. దీంతో 5,290 మీటర్ల బీటీ రోడ్డు పనులు ప్రారంభమే కాలేదు.

నగరవాసులకు తీవ్ర ఇబ్బందులు

ఫ్లైఓవర్ పనులు మందకొడిగా సాగుతుండడంతో నగర వాసులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలతో పాటు ఇబ్రహీంపట్నం, భవానీపురం, విద్యాధరపురం, కామకోటినగర్ తదితర ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చేవారు చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ మీదుగా పాల ప్రాజెక్టు.. అక్కడ నుంచి చిట్టినగర్ మీదుగా నగరంలోకి చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. దీనివల్ల ట్రాఫిక్‌లో గంటల సమయం వృధా అవుతోంది.



కొనసాగుతున్న దుర్గగుడి ఫ్లైఓవర్ పనులు



ఫ్లైఓవర్ పూర్తికాకపోవడంతో ద్విచక్ర వాహనదారుల ఇక్కట్లు

పనుల పూర్తికి ప్రయత్నిస్తున్నాం

మార్చి నెలాఖరుకల్లా ఇంద్రకీలాద్రి వరకు పనులు పూర్తిచేసి ట్రాఫిక్ వదిలే దిశగా పనులు చేయిస్తున్నాం. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– జాన్‌మోషి, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ

జాప్యానికి కారణాలు ఇవే..

- ఫ్లైఓవర్ నిర్మించేందుకు భవానీపురంలో స్పాన్స్, వింగ్స్ నిర్మాణానికి కావాల్సిన యార్డ్ స్థలం కాంట్రాక్టర్‌కు కేటాయింపులో తీవ్ర జాప్యం చేసింది. దీంతో పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.
- కృష్ణలంక వైపు కార్పొరేషన్ కార్యాలయం వద్ద గోడకు బదులు పిల్లర్లు మార్చడంతో దీన్ని కేంద్రం ఇప్పటివరకు ఆమోదించలేదు. అలాగే ఇక్కడున్న ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌ను ఇంకా తొలగించలేదు.
- ఫ్లైఓవర్ పనులకు అవసరమైన సంఖ్యలో సిబ్బంది లేరనే విమర్శలున్నాయి. అయినా ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.



ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అవసరం

- విదేశీ విద్యార్థులను రప్పించగలిగే బోధనా సామర్థ్యం కావాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్

గుంటూరుఎడ్యుకేషన్/ఘంటసాల(అవనిగడ్డ): ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య ప్రస్తుతం దేశానికి ఎంతో అవసరమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. గుంటూరులోని జేకేసీ కళాశాలలో శుక్రవారం జరిగిన నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ స్వర్ణోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్ర కలిగిన నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా స్థాపించిన ఎనిమిది సంస్థల్లో 10 వేల మంది విద్యార్థులు చదువుతుండడం అభినందనీయమన్నారు. ఇటీవల తాను మిచిగాన్, కార్నల్ విశ్వవిద్యాలయాల ఆహ్వానం మేరకు అక్కడకు వెళ్లి, బోధనా ప్రమాణాలను పరిశీలించి, పలు ఆసక్తికరమైన విషయాలను తెలుసుకున్నానని వివరించారు. అక్కడి వర్సిటీల్లో చదువుతున్న వారిలో భారతీయ విద్యార్థులే అధికంగా ఉన్నారని, మన దేశంలోని యూనివర్సిటీల్లో విదేశీ విద్యార్థులను అంతగా ఆకర్షించలేకపోవడానికి కారణాలేమిటనే విషయంపై పునరాలోచించాల్సిన అవసరముందన్నారు. 50 ఏళ్ల క్రితం కొద్దిసంఖ్యలో ఉన్న విద్యాసంస్థలు సమాజంలో విద్యాభివృద్ధికి బాటలు వేశాయని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు భర్తీ కాకపోవడాన్ని చూస్తే, ఆయా కాలేజీల్లో ఎంతవరకూ ప్రమాణాలతో కూడిన విద్య దొరుకుతుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, ఎంపీ రాయపాటి సాంబశివరావు, మాజీ ఎంపీ యలమంచలి శివాజీ, ఎమ్మెల్యేలు షేక్ మొహమ్మద్ ముస్తఫా, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, ఏఎన్‌యూ వీసీ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌ను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తలు

సహజ వాతావరణం పల్లెసీమల్లోనే

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సహజమైన వాతావరణం పట్టణాల్లో లభించదని, అందుకే స్వచ్ఛమైన గ్రామీణ ప్రాంతాలంటే తనకు ఇష్టమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఘంటసాల-దేవరకోట ఇలవేల్పు శ్రీ కోట ముత్యాలమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో తెలుగులోగిలి అధ్యక్షులు డాక్టర్ పేర్ల శ్రీనివాసరావు ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని శుక్రవారం జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన తర్వాత స్వగ్రామమైన పెదముత్తేవిలోనే ఉంటానని, అప్పుడు మళ్లీ వచ్చి ఘంటసాల ప్రజలతో ఎక్కువసేపు గడుపుతానన్నారు. ముందుగా చల్లపల్లి పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన అమరావతి నృత్యరూపకం విశేషంగా ఆకట్టుకోవడంతో జస్టిస్ జాస్తి చలమేశ్వర్ విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే శ్రీకోట ముత్యాలమ్మతల్లి దేవస్థానం 3వ వార్షిక సంచికను జస్టిస్ చలమేశ్వర్ విడుదల చేశారు.

చేతగాని బాబుతో రాష్ట్రానికి అన్యాయం

ప్రజలకు వాస్తవాలు తెలిసిపోవటంతో కొత్త డ్రామాలు: బొత్స సత్యనారాయణ



సాక్షి, హైదరాబాద్: సీఎం చంద్రబాబు చేతగానితనం వల్లే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నోచుకోవడం లేదని కేంద్ర బడ్జెట్ ద్వారా తేటతెల్లం అయిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు సాధించలేకపోయారని దుయ్యబట్టారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో బొత్స శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు వాస్తవాలన్నీ తెలిశాక రాష్ట్రానికి అన్యాయం జరిగిపోయిందంటూ చంద్రబాబు కొత్త డ్రామాకు తెర తీశారని మండిపడ్డారు. కేంద్ర తొలి బడ్జెట్ నుంచీ రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ పోరాడుతుంటే చంద్రబాబు తమపై బురద చల్లేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇలాంటి సీఎం ఎక్కడైనా ఉంటారా?

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని తాము కోరుతుంటే 14వ ఆర్థిక సంఘం ఒప్పుకోవడం లేదని కేంద్రం కంటే ముందే చంద్రబాబు గళం విప్పటం వాస్తవం కాదా? అని బొత్స ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టే ఇటువంటి సీఎం దేశంలో మరెవరైనా ఉంటారా? అని నిలదీశారు. చట్టంలో ఉన్న దుగ్గరాజుపట్నం పోర్టును పక్కనబెట్టి దానికి బదులు ఎకనామిక్ జోన్ ఇవ్వమని సీఎం అడగడం ఏమిటన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు టెండర్ విషయంలో కమీషన్లు రావని టెండర్లు రద్దు చేశారన్నారు. చంద్రబాబు అనుభవం అవినీతికే తప్ప రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడదన్నారు. పోలవరం ప్రాజెక్టులో కాంట్రాక్టుల కోసమే ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని విమర్శించారు. ఎపుడైతే మొదటి బడ్జెట్‌లో కేంద్రం పోలవరానికి రూ.100 కోట్లు కేటాయించారో.. అప్పుడే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని గ్రహించి మనమంతా కలిసి కట్టుగా ఉద్యమం చేద్దామని వైఎస్సార్ కాంగ్రెస్ చెబితే తమపై బురదజల్లే యత్నం చేశారన్నారు.

ప్రజా ప్రయోజనాలే మాకు ముఖ్యం

చంద్రబాబు లాంటి చేతగాని సీఎం ఉండడం వల్లే బడ్జెట్‌లో ఏపీ పేరు కూడా లేకుండా పోయిందన్నారు. టీడీపీ ఎన్ని విమర్శలు చేసినా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యంగా వైఎస్సార్ సీపీ ముందుకు వెళుతోందని బొత్స చెప్పారు. చంద్రబాబు తీరుపై దివంగత వైఎస్సార్ ఏమనేవారో ఈ సందర్భంగా బొత్స గుర్తు చేసుకున్నారు. 'కోర్టు బోనులో నిలబడ్డ ముద్దాయి జడ్జి గారితో.. మీరు ఏశిక్ష వేస్తారో తెలీదు. తల్లిదండ్రులు లేనివాడిని, అనాథని అని శరణు కోరతాడు. నేరం ఏమిటని న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నిస్తే... ముద్దాయి తల్లిదండ్రులను హత్య చేశాడని చెబుతారు. అదే మాదిరిగా ఇప్పుడు బాబు కూడా రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ లీకులు ఇస్తున్నారు' అని బొత్స పేర్కొన్నారు.

టెండర్లు గిండర్లు జాన్తానై..

- రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీజీ సెంటర్ల నిర్మాణ బాధ్యత ఒకే సంస్థకు
- ముఖ్య నేత ఆదేశంతో అనధికారిక అప్పగింతకు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: అన్ని జిల్లా కేంద్రాల్లో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) సెంటర్ల నిర్మాణ పనులు ఒక ప్రయివేటు సంస్థకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. గుంటూరు జిల్లాలోని సీఎం నివాస ప్రాంగణంలో గ్రీవెన్స్ హాల్ నిర్మించిన సంస్థకే రాష్ట్రమంతా ఆర్టీజీ సెంటర్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించాలని కీలకనేత ఆదేశించారు. దీంతో అన్ని జిల్లాల్లో ఈ కేంద్రాల నిర్మాణ పనులను ఆ సంస్థకు అనామత్తుగా టెండర్లు లేకుండా అప్పగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ పద్ధతిపై కూడా కాకుండా అనధికారికంగానే ఈ సంస్థకు పనులు అప్పగించనున్నారు. సీఎం నివాస ప్రాంగణంలో గ్రీవెన్స్ భవనం నిర్మాణానికి కూడా టెండర్లు పిలవకుండా అంచనాలు వేయకుండా అనధికారికంగా అప్పగించేశారు. దీంతో భవన నిర్మాణ సంస్థకు ఏప్రాతిపదిక నిధులు ఇవ్వాలనే అంశం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇదే సంస్థకు ఆర్టీజీ సెంటర్ల నిర్మాణ పనులను కూడా ఇదే పద్ధతిలో అనధికారికంగా అప్పగించడం సమంజసం కాదని అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.

టెండర్లనుకుని కూర్చుంటే పనులు కావు: సీఎం

ఆర్టీజీ సెంటర్ల నిర్మాణానికి జిల్లా కేంద్రాల్లో మంచి స్థలాలను తక్షణమే కేటాయించాలని సీఎం చంద్రబాబు ఇటీవల ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో ఇంకా స్థలాలు ఇవ్వలేదని ఆర్టీజీ ఉన్నతాధికారి చెప్పడంతో 'మీకు స్థలాలు ఇవ్వడానికి ఇబ్బంది ఏమిటి? తక్షణమే మంచి స్థలాలు అప్పగించండి.' అని జిల్లా కలెక్టర్లను సీఎం తీవ్ర స్వరంతో ఆదేశించారు. 'ఎన్ని రోజుల్లో జిల్లాల్లో ఆర్టీజీ సెంటర్ల నిర్మాణం పూర్తిచేస్తారు? అని ఆ శాఖకు చెందిన అధికారిని సీఎం ఇటీవల ప్రశ్నించారు. టెండర్లు పిలిచి మార్చిలో పనులు ప్రారంభిస్తామని ఆ అధికారి చెప్పడంతో 'అవన్నీ అనుకుంటే సకాలంలో పనులు పూర్తికావు కలెక్టర్ల సదస్సు నిర్వహించిన గ్రీవెన్స్ భవనం ఎన్ని రోజుల్లో నిర్మించారనుకుంటున్నారు 25 రోజుల్లోనే నిర్మించారు. ఈ సంస్థకే జిల్లాల్లో ఆర్టీజీ సెంటర్ల నిర్మాణ పనులు ఇస్తే త్వరగా పూర్తి చేసి అప్పగిస్తారు.' అని సీఎం ఆదేశించారు. దీంతో ఇక టెండర్లు ఏమీ ఏమీ ఉండవని, సీఎం చెప్పినట్లు ఆ సంస్థకు పనులు అప్పగిస్తామని ఒక ఉన్నతాధికారి అధికారులకు చెప్పారు.

104 అదనపు ఉద్యోగుల ఆకలి కేకలు

- 470 మందికి ఆరు నెలలుగా అందని వేతనాలు
- పస్తులతో కటుంబాలను నెట్టుకొస్తున్న ఉద్యోగులు

సాక్షి, అమరావతి బ్యూరో: వైద్య ఆరోగ్య శాఖలో 104 సంచార వాహన అదనపు సిబ్బంది ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. ఆరునెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలను అప్పులతో నెట్టుకొస్తున్నారు. ఇక అప్పులిచ్చేవారు లేక పస్తులతో వీధిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు జీతాల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ ద్వారా ఎంపికై 104 సంచార వాహనాల్లో పనిచేసిన 470 మంది అదనపు ఉద్యోగులు ప్రస్తుతం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో పనిచేస్తున్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగతనేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇంటి వద్దకే వైద్య సేవలని 104 సంచార వాహనాలను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2012లో ప్రభుత్వం ఓ కమిటీని వేసి 104 వాహనాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో అవసరమేరకు ఉంచుకుని మిగులు సిబ్బందిని ఆయా జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో నియమించారు. 2014లో వచ్చిన టీడీపీ ప్రభుత్వం 104 వైద్య సేవలకు 'చంద్రన్న సంచార చికిత్స' అని పేరు పెట్టి నిర్వాహణను 'పిరమిడ్' సంస్థకు అప్పగించింది. అయితే అదనపు సిబ్బందిని ప్రభుత్వాసుపత్రులలో నియమించి పనిచేయించుకుంటూ జీతాలు ఇవ్వడం మరిచారు. వీరికి ఆరు నెలలుగా వేతనాలు అందడంలేదు. బకాయిలు రూ.3 కోట్లకు పైగా పేరుకుపోయాయి. ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖాధికారులు ఉద్యోగుల వేతన బకాయిల విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. జీఓ151 ప్రకారం గుంటూరు, తూర్పు, పశ్చిమ, కృష్ణా, చిత్తూరు జిల్లాలోని కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓలు కలసి ఆయా జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రం మానవత్వంతో వేతనాలు ఇస్తున్నారు.

జీతాలులేక అవస్థలు పడుతున్నాం



ఆరు నెలలుగా జీతాలు లేక నానా అవస్థలు పడుతున్నాం. ఈ విషయాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారికి తెలియచేశాం. అయినా ఫలితం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. జీతాలు త్వరగా ఇస్తే చాలా మంచిది. –ఆర్‌ఫ్రైడ్, డీఈఓ, నెల్లూరు


కుటుంబం జరగడం కష్టం



జీతాలు లేకపోవడంతో కుటుంబం జరగడం కష్టంగా ఉంది. అప్పు చేసుకుంటూ అతికష్టం మీద నెట్టుకొస్తున్నాం. రాష్ట్ర ఉన్నతాధికారులు మా మీద దయతలచి వెంటనే జీతాలు ఇస్తే ఇప్పుడు మేమున్న పరిస్థితుల్లో మాకు అంతకంటే సంతోషం మరొకటి లేదు. – మారుతి, ఉద్యోగి చిత్తూరుజిల్లా

స్థానికత ఆధారంగా విభజన రాజ్యాంగ విరుద్ధం

- విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగుల విభజనపై హైకోర్టు
- మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉత్తర్వుల కొట్టివేత
- దీనిపై రెండు నెలల్లో కమిటీ ఏర్పాటు చేయాలి
- వాటి ఆధారంగా ఉద్యోగుల విభజన జరగాలని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులను స్థానికత ఆధారంగా విభజించడాన్ని ఉమ్మడి హైకోర్టు తప్పుబట్టింది. ఇలా స్థానికత ఆధారంగా విభజిస్తూ విద్యుత్ సంస్థలు రూపొందించిన మార్గదర్శకాలు, వాటికి ఆమోదముద్ర వేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. వాటిని అమలు చేయడానికి ఎంత మాత్రం వీల్లేదంటూ.. ఆ మార్గదర్శకాలను, ఉత్తర్వులను కొట్టివేసింది. అంతేగాకుండా ఇప్పటికే ఏపీకి రిలీవ్ చేసిన ఉద్యోగులను ఇతర ఉద్యోగులతో సమానంగా ఎటువంటి వివక్షకు తావు లేకుండా కొనసాగించాలని విద్యుత్ సంస్థలకు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సి.వి.నాగార్జు నరెడ్డి, జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. దీంతో 2015 నుంచి కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల విభజన వివాదానికి తెరపడింది.

రోజు వారీగా విచారణ జరిపి..

ఏపీ స్థానికత ఆధారంగా ఉద్యోగులను విభజిస్తూ తెలంగాణ విద్యుత్ సంస్థలు జారీ చేసిన మార్గదర్శకాలు, వాటిని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ 2015లో ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాజ్యాల్లో పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు సి.వి.మోహన్‌రెడ్డి, వేదుల వెంకటరమణ, లక్ష్మీనర్సింహ తదితరులు వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, తెలంగాణ ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. రోజువారీ పద్ధతిలో వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పును వాయిదా వేసింది. తాజాగా శుక్రవారం తీర్పు వెలువరించింది.

కొత్త మార్గదర్శకాలు రూపొందించండి

స్థానికత ఆధారంగా ఉద్యోగులను విభజించడం సరికాదని ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై ప్రస్తుతమున్న జాయింట్ కమిటీతోగానీ, కొత్త కమిటీలను వేసిగానీ ఉద్యోగుల విభజనకు స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించుకోవాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలని, ఉద్యోగుల విభజన ప్రక్రియను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అప్పటివరకు ఆయా ఉద్యోగులను ఇతర ఉద్యోగులతో సమానంగా ఎటువంటి వివక్షకు తావు లేకుండా కొనసాగించాలని తెలంగాణ విద్యుత్ సంస్థలకు సూచించింది. వారి సీనియారిటీని పునరుద్ధరించాలని.. విభజన పూర్తయ్యేనాటి వరకు వారి అర్హతలను బట్టి పదోన్నతులకు సైతం పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. అంతేకాక వారికి చెల్లించాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలను చెల్లించాలని స్పష్టం చేసింది. రిలీవ్ చేసిన ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు ఏవైనా జీతభత్యాలు చెల్లించి ఉంటే.. ఆ సొమ్మును మూడు నెలల్లోపు తిరిగి చెల్లించేయాలని సూచించింది. అయితే తెలంగాణ విద్యుత్ సంస్థలు రిలీవ్ చేసిన ఉద్యోగులను పక్కనపెట్టి ఇచ్చిన పదోన్నతుల విషయంలో జోక్యానికి నిరాకరించింది. పదోన్నతులపై దాఖలైన వ్యాజ్యాలను వేరుగా విచారించాలని పేర్కొంది. కాగా ధర్మాసనం సభ్యులైన జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్‌కు ఇదే చివరి తీర్పు. ఈ తీర్పు వెలువరించిన అనంతరం పదవీ విరమణ సందర్భంగా హైకోర్టు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికింది.

కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జీల నియామకం

సాక్షి, అమరావతి: సోషల్ మీడియాకు సంబంధించి 13 జిల్లాలకు కో–ఆర్డినేటర్లను నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్లు వీరికి సహకరించాలని ఎన్.రఘువీరారెడ్డి కోరారు. కొత్తగా నియమితులైన ఇన్‌చార్జిలను రఘువీరాతో పాటు పీసీసీ ఉపాధ్యక్షుడు నాదెండ్ల మనోహర్‌లు అభినందించారు. ఇన్‌చార్జిలుగా నియమితులైన వారిలో బి.సతీష్ (శ్రీకాకుళం, విజయనగరం జిల్లా), మనోహర్ గంగిరెడ్డి (విశాఖపట్నం అర్బన్, రూరల్), తాళ్లూరి విజయ్‌కుమార్ (పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లా), ఎస్కే మౌలాలి (కృష్ణా, గుంటూరు జిల్లా), అంబటి రామకృష్ణ (ప్రకాశం, నెల్లూరు జిల్లా) పీఎస్ అహ్మద్ హుస్సేన్ (అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లా) ఉన్నారు.

హామీలు అమలు చేయకపోతే ధిక్కారమే

- 'డీఈఈల'కేసులో రెండు రాష్ట్రాలకు హైకోర్టు స్పష్టీకరణ
- 8వ తేదీలోగా ఏపీకి జాబితా ఇస్తాం: తెలంగాణ
- జాబితా అందిన 4 నెలల్లోగా సీనియార్టీ ఖరారు చేస్తాం: ఏపీ

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో రాష్ట్ర విభజనకు ముందున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (డీఈఈ) సీనియార్టీ తుది జాబితా ఖరారు విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కోర్టు ధిక్కారంగా పరిగణిస్తామని హైకోర్టు పేర్కొంది. రాష్ట్ర విభజనకు పూర్వం ఉన్న ఉద్యోగుల ప్రకారం జోన్ 5, జోన్ 6లలోని డీఈఈల సీనియార్టీ జాబితాను ఈ నెల 8లోగా ఏపీ సర్కార్‌కు అందజేస్తామని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. తెలంగాణ నుంచి జాబితా అందిన నాలుగు నెలల్లోగా సీనియార్టీ జాబితాను ఖరారు చేస్తామని ఏపీ సర్కార్ కూడా హైకోర్టు స్పష్టం చేసింది. రెండు ప్రభుత్వాల హామీలను ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేశ్ కుమార్ కెయిత్, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలిలతో కూడిన ధర్మాసనం రికార్డుల్లో నమోదు చేసింది. వీటిని అమలు చేయనిపక్షంలో కోర్టు ధిక్కారంగా పరిగణిస్తామని ఇటీవల ధర్మాసనం ప్రకటించింది.

ఇదీ నేపథ్యం...: డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా (ఈఈ) పదోన్నతులు కల్పించే విషయంలో తెలంగాణ ఓ సీనియారిటీ జాబితా రూపొందించింది. ఈ జాబితాను సవాల్ చేస్తూ కొందరు ఇంజనీర్లు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం నిబంధనల ప్రకారం సీనియారిటీ జాబితా రూపొందించే అధికారం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ఉందని, అందువల్ల ఈఈ పదోన్నతులకు తెలంగాణ ఈఎన్‌సీ రూపొందించిన సీనియారిటీ జాబితా అమలును నిలిపేయాలని వారు వాదించారు. ఒకే బ్యాచ్‌కు చెందిన ఇంజనీర్లు కొందరు ఐదో జోన్‌లో చీఫ్ ఇంజనీర్ స్థాయిలో ఉంటే, అదే బ్యాచ్‌కు చెందిన ఇంజనీర్లు జోన్–6లో డిప్యూటీ ఇంజనీర్ల స్థాయిలోనే పనిచేస్తున్నారని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సైతం జూనియర్ల కింద సీనియర్లు పనిచేయరాదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం విడిగా పదోన్నతులు కల్పిస్తే తమకు అన్యాయం జరుగుతుందని హెచ్.మనోహర్ మరో ఇద్దరు దాఖలు చేసిన కేసులో గతంలో హైకోర్టు.. సీనియార్టీ జాబితా విషయంలో ముందుకెళ్లవద్దని మధ్యంతర ఆదేశాలిచ్చింది.

పంద్రాగస్టు లేదా గాంధీ జయంతి!

'మోదీ కేర్' ప్రారంభించేందుకు కేంద్రం ప్రయత్నం

- నిధుల సమకూర్పులో కేంద్ర, రాష్ట్రాల వాటా 60:40
- తొలి ఏడాదికి రూ 2వేల కోట్ల మూలనిధి ఏర్పాటు: జైట్లీ
- నిధులు కాదు.. అమలే సవాల్: నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్
- 'ఆరోగ్యశ్రీ' తరహాలో ట్రస్టుగానే 'మోదీ కేర్'?

న్యూఢిల్లీ: దేశంలోని 10 కోట్ల పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల కవరేజ్ అందించేందుకు ప్రభుత్వం ఉద్దేశించిన 'మోదీ కేర్' పథకాన్ని ఆగస్టు 15 లేదా, గాంధీ జయంతి (అక్టోబర్ 2) ప్రారంభించాలని కేంద్రం యోచిస్తోంది. వచ్చే (2018–19) ఆర్థిక సంవత్సరంలో ప్రారంభిస్తామని ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటించినప్పటికీ పథకం ప్రాముఖ్యత దృష్ట్యా స్వాతంత్ర్య దినోత్సవం లేదా గాంధీ జయంతిల్లో ఒకరోజు అట్టహాసంగా ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. 'జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం' (దీన్నే మోదీ కేర్ అంటున్నారు)లో 60 శాతం కేంద్ర ప్రభుత్వం మిగిలిన 40 శాతాన్ని రాష్ట్రాలు భరించాల్సి ఉంటుందని జైట్లీ అన్నారు. బడ్జెట్‌లో ఈ ఏడాది 'మోదీ కేర్' కోసం రూ.2వేల కోట్లతో ప్రాథమిక మూలనిధిని ఏర్పాటుచేశామన్నారు. పథకం అమలు ఆధారంగా వచ్చే ఏడాది తర్వాత మరిన్ని నిధులు సమకూరుస్తామన్నారు. దీని ద్వారా 10 కోట్ల కుటుంబాలకు (దాదాపు భారత జనాభాలో 40 శాతం మందికి) లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ వైద్య పథకం క్యాష్‌లెస్‌గానే ఉంటుందని రీయింబర్స్‌మెంట్ పథకం కాదని చెప్పారు. 'ఈ పథకం ఆసుపత్రిలో చికిత్సను, అనంతర సంరక్షణను అందిస్తుంది. ఇందులో పలు ప్రభుత్వాసుపత్రులు, ఎంపికచేసిన ప్రైవేటు ఆసుపత్రులు ఉంటాయి. ఇదో ట్రస్టు లాగా లేదా ఇన్సూరెన్స్ లాగా పనిచేస్తుంది. రీయింబర్స్‌మెంట్ సాధ్యం కాదు' అని అన్నారు. పాలసీదారులు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రీమియం తగ్గటం సహజమేనన్నారు. ఈ విధానాన్ని నీతి ఆయోగ్, వైద్య శాఖ సంయుక్తంగా రూపొందించాయని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1 తర్వాత)లో ఏదో ఒకరోజు దీన్ని ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన 'ఆరోగ్యశ్రీ' ట్రస్టులాగే మోదీకేర్‌ను ట్రస్టులా నిర్వహించొచ్చనే భావనా వ్యక్తమవుతోంది. ఈ పథకం ద్వారా రూ.11వేల కోట్ల భారం పడుతుందని అంచనా.




నిధులు కాదు.. అమలే సవాల్

ఈ పథకానికి నిధుల సమస్యలేదని వైద్య మంత్రి జేపీ నడ్డా అన్నారు. అమల్లో ఉండే అవరోధాలనూ కేంద్రం పరిశీలిస్తోందన్నారు. త్వరలోనే పథకానికి సంబంధించిన అన్ని వివరాలనూ వెల్లడిస్తామన్నారు. పథకాన్ని అమలు చేయాలా? వద్దా? లేక సొంత నిధులతో నడుపుకోవాలా? అనేది రాష్ట్రాలు నిర్ణయించుకోవచ్చన్నారు. అన్ని అనారోగ్య సమస్యలకూ ఈ పథకంలో చికిత్స అందుతుందన్నారు. నిధుల సమీకరణ ఇబ్బందేం కాదని.. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయటమే అసలు సవాల్ అని నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ తెలిపారు. 'ఏడాదికి రూ.5 లక్షల రూపాయల కవరేజీ ఇచ్చేందుకు ఒక్కో కుటుంబానికి రూ.1,000 నుంచి 1,200 వరకు ఖర్చవుతుంది. ఈ మొత్తాన్ని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి' అని నీతి ఆయోగ్ సలహాదారు అలోక్ కుమార్ పేర్కొన్నారు.

ఒక్క శాతం సెస్ పెంచితే చాలు

ఈ పథక రూపశిల్పి, నీతి ఆయోగ్ సభ్యుడు వినోద్ కుమార్ పాల్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక్క శాతం అదనపు విద్య, వైద్య సెస్ ద్వారా ఈ పథకానికి అవసరమైన నిధిని సమకూర్చవచ్చన్నారు. 2011 సామాజిక, ఆర్థిక, కుల జనగణన ఆధారంగానే పేదల గుర్తింపు ఉంటుందన్నారు. పథకాన్ని వాడుకునేందుకు ఆధార్ తప్పనిసరి కాదన్నారు. కాగా, బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేకుండా పథకాన్ని ప్రకటించడం అంటే.. దారం లేకుండా గాలిపటాన్ని ఎగరేయటమేనని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం ఎద్దేవా చేశారు. 'వాస్తవానికి అక్కడ గాలిపటమూ ఉండదు, ఎగరటమూ ఉండదు' అని ఆయన వ్యాఖ్యానించారు.

అమలు ఎలా..?



కేంద్ర బడ్జెట్‌లో అందరినీ ఆకర్షించిన ప్రధానాంశం జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్). దేశ జనాభాలో మూడోవంతుకు దీర్ఘకాలంలో ఆరోగ్యబీమా కల్పించడమే ఈ పథకం లక్ష్యం. ఒబామాకేర్ తరహాలో ప్రభుత్వం మోదీ కేర్ అని పిలుస్తోంది. మరి ఈ మోదీ కేర్ పథకం ఎలా ఉంటుంది? దీన్ని ఏయే సంస్థలు అమలు చేస్తాయన్న వివరాలను ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007 ఏప్రిల్ ఒకటిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి అధ్యక్షతన నడిచే ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా విజయవంతంగా అమలు చేశారు. ఐఏఎస్ అధికారి ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) గా ఉన్న ట్రస్ట్ ఆరోగ్యపరిరక్షణరంగ నిపుణులతో సంప్రదించి ఆరోగ్యశ్రీని సాధ్యమైనంత పకడ్బందీగా అమలు చేసింది. ఎన్‌హెచ్‌పీఎస్ అమలుకు చేతులు కలపాలని తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా ప్రైవేటు కంపెనీలను కూడా కేంద్ర సర్కారు కోరవచ్చు. కాని, ప్రతి ఏటా అదనంగా అవసరమైన సొమ్మును ప్రైవేటు పారిశ్రామికవేత్తలు సకాలంలో ఎలా అందజేస్తారన్న విషయం కూడా ప్రస్తుతానికి ప్రశ్నార్థకమే. అయితే.. ఈ పథకాన్ని హడావుడిగా అమలు చేస్తే లాభపడేది ఇన్సూరెన్స్ కంపెనీలు, ప్రైవేటు ఆస్పత్రులేనని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.



చైనాలో నూతన చాంద్రమాన సంవత్సరం ప్రారంభంకానున్న నేపథ్యంలో విపరీతమైన రద్దీని తట్టుకునేందుకు వీలుగా హుబే ప్రావిన్సులోని ఓ డిపోలో సిద్ధంగా ఉంచిన హైస్పీడ్ హార్మనీ బుల్లెట్ రైళ్లు. వీటి వేగం గంటకు 300 కి.మీ.

సుప్రీం ముందుకు 'బోఫోర్స్'

- 2005 నాటి హైకోర్టు తీర్పుపై సీబీఐ పిటిషన్
- అటార్నీ జనరల్ సూచనతో.. 12 ఏళ్ల తర్వాత

న్యూఢిల్లీ: బోఫోర్స్ కుంభకోణంపై 2005లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ శుక్రవారం సుప్రీంలో పిటిషన్ వేసింది. కేసుకు సంబంధించి మరిన్ని స్పష్టమైన ఆధారాలు, కీలక సాక్ష్యాలతో ఈ పిటిషన్ వేసినట్లు సీబీఐ పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి బీజేపీ నేత అజయ్ అగర్వాల్ గతంలో ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంను ఆశ్రయించారు. అగర్వాల్ వేసిన పిటిషన్‌లో ప్రతివాదిగా మరో పిటిషన్ వేయాలంటూ అటార్నీ జనరల్ వేణుగోపాల్ ఇటీవలే సీబీఐకి మౌఖికంగా సూచించారు. పిటిషన్ వేసిన 90 రోజుల్లోనే



సీబీఐ స్పెషల్ లీవ్ పిటిషన్ వేయాల్సి ఉన్నప్పటికీ వివిధ కారణాలతో అది జరగలేదు. ఈ నేపథ్యంలో బోఫోర్స్ కేసుకు సంబంధించిన కీలకమైన దస్తావేజులు, సాక్షాలతో హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రూ.64కోట్లు చేతులు మారినట్లు ఆరోపణలున్న ఈ కేసులో యూరప్ పారిశ్రామిక వేత్తలైన హిందూజా సోదరులతోసహా పలువురిపై సీబీఐ వద్ద పూర్తి ఆధారాలున్నట్లు సమాచారం. మే 31, 2005న అప్పటి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ సోధి ఈ కుంభకోణంలో సీబీఐ కేసును కొట్టేశారు. అంతకుముందు, 2004 ఫిబ్రవరి4న మరో జడ్జి జస్టిస్ జేడీ కపూర్ ఈ కేసులో మాజీ ప్రధాని రాజీవ్ ప్రమేయం లేదంటూ నిర్దోషిగా ప్రకటించారు.

'బోఫోర్స్' కథాకమామిషు..

భారత ప్రభుత్వం స్వీడన్ ఆయుధ తయారీ సంస్థ ఏబీ బోఫోర్స్ మధ్య నాలుగు వందల 155ఎంఎం హోవిట్జర్‌లను కొనుగోలు చేసేందుకు 1986 మార్చి 24న రూ.1,437 కోట్ల ఒప్పందం కుదిరింది. 1987 ఏప్రిల్ 16న స్వీడన్ రేడియో.. ఆయుధాల కొనుగోలుకు సంబంధించి భారతీయ ప్రముఖ రాజకీయ నాయకులకు, రక్షణశాఖ అధికారులకు బోఫోర్స్ ముడుపులు చెల్లించిందని వెల్లడించింది. దీంతో 1990 జనవరి 22న సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఏబీ బోఫోర్స్ అధ్యక్షుడు మార్టిన్ అర్డ్‌బో, మధ్యవర్తులుగా ఉన్న విన్ చద్దా, హిందూజా సోదరులపై నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీతోపాటుగా అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసింది. దీంతోపాటుగా 1982 నుంచి 1987 మధ్య పలువురు భారతీయ అధికారులు, ప్రైవేటు వ్యక్తులు అవినీతి, మోసానికి పాల్పడటం ద్వారా నేరపూరిత కుట్రలో భాగస్వాములయ్యారని పేర్కొంది. 1999 అక్టోబర్ 22న దాఖలు చేసిన తొలి చార్జిషీటులో చద్దా, ఒట్టావియో ఖత్రోచి, అప్పటి రక్షణ కార్యదర్శి ఎస్కే భట్నాగర్, బోఫోర్స్ కంపెనీ, అర్డ్‌బోల పేర్లను పేర్కొంది. 2000, అక్టోబర్ 9 దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీటులో హిందూజా సోదరుల పేర్లనూ పేర్కొంది. మార్చి4, 2011న సీబీఐ ప్రత్యేక కోర్టు ఖత్రోచీకి కేసు నుంచి విముక్తి కల్పించింది. 2013 జూలై 13న ఖత్రోచీ మరణించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న భట్నాగర్, చద్దా, అర్డ్‌బోలు కూడా చనిపోయారు.

ఫిడెల్ క్యాస్ట్రో పెద్ద కుమారుడి ఆత్మహత్య



హవానా: క్యూబా మాజీ అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రో పెద్ద కొడుకు డియాజ్ బలార్ట్(68) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. 'గత కొన్ని నెలలుగా డియాజ్ తీవ్రమైన డిప్రెషన్‌కు చికిత్సపొందుతున్నారు' అని క్యూబా అధికార పత్రిక గ్రాన్మా తెలిపింది. క్యాస్ట్రో మొదటి భార్య మిర్తా డియాజ్ బలార్ట్‌కు 1949 సెప్టెంబర్ 1న డియాజ్ జన్మించారు. డియాజ్ రాజకీయాల్లో లేనప్పటికీ అచ్చు తన తండ్రి కాస్ట్రో పోలికలతో ఉండటంతో అక్కడి వారికి ఈయన ఫిడెల్ జూనియర్‌గా చాలా ఫేమస్. ఫిజిక్స్‌లో శాస్త్రవేత్త అయిన డియాజ్ క్యూబాలో అణుశక్తి కార్యక్రమాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. చనిపోయే దాకా ఆయన క్యూబా ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా, అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేశారు.

రూ.1.25 కోట్ల ప్రమాద పరిహారం

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో మరణించిన సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) కానిస్టేబుల్ కుటుంబానికి మోటారు యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్(ఎంఏసీటీ) ఏకంగా రూ.1.25 కోట్ల నష్టపరిహారం అందజేసింది. సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్‌కు భార్య, కుమార్తె, ఇద్దరు కొడుకులున్నారు. 2016 డిసెంబర్‌లో భార్య, కుమార్తెతో కలసి బైక్‌పై అలీఘర్ నుంచి ఢిల్లీకి బయలుదేరారు. కలింద్ కుంజ్ వద్ద ట్రక్కు గుద్దేయడంతో రాజ్‌కుమార్, భార్య, కుమార్తె రితు(9) చనిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ట్రిబ్యునల్ విచారణ చేపట్టి కుమారులకు రూ.1.25 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని, ట్రక్కు యజమానిని, బీమా సంస్థను ఆదేశించింది.

ఇది సెన్సెక్స్ అవిశ్వాస తీర్మానం: రాహుల్



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సెన్సెక్స్ 840 పాయింట్లు కోల్పోవడంపై కాంగ్రెస్ చీఫ్ రాహుల్ వ్యంగ్యంగా స్పందించారు. 'పార్లమెంటరీ పరిభాషలో చెప్పాలంటే మోదీ బడ్జెట్‌పై సెన్సెక్స్ 800 పాయింట్ల బలమైన అవిశ్వాస తీర్మానాన్ని ఇచ్చింది' అని రాహుల్ ట్వీట్ చేశారు. కేంద్రం గడువు ఇంకో ఏడాది ఉండటాన్ని గుర్తుచేస్తూ.. 'మరో ఏడాదే మిగిలింది' అన్న హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. బడ్జెట్ దెబ్బకు బీఎస్ఈ సెన్సెక్స్ రెండున్నరేళ్లలో ఎన్నడూ లేనంతగా 840 పాయింట్లు, ఎన్ఎస్ఈ 256 పాయింట్లను కోల్పోయింది.

16న విద్యార్థులతో మోదీ 'టౌన్ హాల్' భేటీ

న్యూఢిల్లీ: పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా, సన్నద్ధమవ్వాల్సిన అవసరాన్ని వివరించేందుకు ప్రధాని మోదీ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులతో సమావేశం కానున్నారు. ఈ నెల 16న ఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో లేదా ఇందిరా గాంధీ మైదానంలో విద్యార్థులతో ముచ్చటించనున్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సామాజిక మాధ్యమాలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోదీ సమాధానాలిస్తారు.

'లోయా మృతిపైనే మా విచారణ'

న్యూఢిల్లీ: సీబీఐ దివంగత జడ్జి బీహెచ్ లోయా మృతికి సంబంధించి మాత్రమే తమ విచారణ ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ లోయా అనుమానాస్పద మృతిపై తదుపరి విచారణకు ఆదేశించాలా? వద్దా? అనేదే పరిశీలిస్తామంది. సోహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ చేసిన కేసులో బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు, నాటి గుజరాత్ హోం మంత్రి అమిత్ షాను నిర్దోషిగా ప్రకటించడం సహా...మరే ఇతర అంశాల జోలికి తాము వెళ్లబోమని తేల్చిచెప్పింది. అమిత్ షా నిందితుడిగా ఉండిన సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తుండగానే 2014 డిసెంబర్ 1న లోయా అనుమానాస్పద స్థితిలో గుండెపోటుతో మరణించారు.

ఎల్‌పీయూ అవార్డుల ప్రదానం

న్యూఢిల్లీ: ఉత్తమ పాఠశాలలు, ఉపాధ్యాయులకు మాజీ రాష్ట్రపతి ప్రణబ్ 'ఎల్‌పీయూ ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్' అవార్డులను తన నివాసంలో ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా 89 పాఠశాలలు, 29 కోచింగ్ సెంటర్లకు రూ. కోటి విలువైన గ్రాంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులతో మాట్లాడేందుకు వీలుగా 'ప్రణబ్ సర్ కి పాఠశాల' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా తొలి కార్యక్రమంలో లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ(ఎల్‌పీయూ) విద్యార్థులతో ముచ్చటిస్తూ.. రిజర్వేషన్లు, సమానత్వం, భావి భారత దార్శనికత తదితర అంశాలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

ఆధార్ డేటా సురక్షితం

రాజ్యసభలో స్పష్టం చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: యూపీ కాస్‌గంజ్‌లో మతఘర్షణలు, ఢిల్లీలో సీలింగ్ డ్రైవ్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలతో శుక్రవారం ఉదయం కొంతసేపు రాజ్యసభ వాయిదా పడింది. ఉదయం సమావేశం ప్రారంభం కాగానే ఎస్పీ, ఆప్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేయటంతో డిప్యూటీ స్పీకర్ కురియన్ సభను ఉదయం కొద్దిసేపు వాయిదా వేశారు. అనంతరం ఆధార్ డేటా లీకేజీ వార్త అవాస్తవమని ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఐటీ మంత్రి రవిశంకర్ రాజ్యసభలో స్పష్టంచేశారు. ఏ వ్యక్తికి సంబంధించిన ఆధార్ సమాచారమైనా ఎవరైనా రూ.500కే కొనుక్కోవచ్చంటూ మీడియాలో వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. రాజ్యసభలో ప్రవేశపెట్టిన వివాదాస్పద గో సంరక్షణ బిల్లును బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి ఉపసంహరించుకున్నారు. సుప్రీంకోర్టు సీజేఐ, నలుగురు సీనియర్ న్యాయమూర్తుల మధ్య వివాదాన్ని పరిష్కరించుకునే సామర్థ్యం న్యాయవ్యవస్థకు ఉందని న్యాయశాఖ సహాయ మంత్రి చౌదరి తెలిపారు. రైలు ప్రయాణికుల సంఖ్యతోపాటు ఆదాయాన్ని పెంచే ఫ్లెక్సి–చార్జీల విధానం అమలు చేయాలని యోచిస్తున్నట్లు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న డిప్యూటీ చైర్మన్ కురియన్

నేపాల్ అభివృద్ధే మా ధ్యేయం

సుష్మా స్వరాజ్ వ్యాఖ్య

ఖాట్మండు: ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు నేపాల్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వంతో కలసి పనిచేసేందుకు భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ప్రకటించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం ఖాట్మండు చేరుకున్న సుష్మా శుక్రవారం నేపాల్ అధ్యక్షురాలు బిద్యాదేవీ భండారీ, ప్రధాన మంత్రి షేర్ బహదూర్ ద్యూబ, సీపీఎన్ మావోయిస్టు సెంటర్ చైర్మన్ ప్రచండతో సమావేశమయ్యారు. నేపాల్‌లో రాజకీయ స్థిరత్వం సాధించేందుకు, ఆ దేశ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ప్రచండతో సమావేశం సందర్భంగా ఆమె ప్రకటించారు. నేపాల్‌లో రాజకీయ స్థిరత్వం.. అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని సుష్మా హామీ ఇచ్చారని ప్రచండ ఈ సందర్భంగా చెప్పారు. తమ చర్చలు సానుకూల పంథాలో సాగినట్టు చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం సుష్మా స్వరాజ్ నేపాల్ పర్యటన ముగించుకుని స్వదేశం చేరుకున్నారు.



నేపాల్ ప్రధానితో సుష్మా కరచాలనం

రామ మందిరం కోసం పోలీస్ ప్రతిజ్ఞ



లక్నో: అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి బహిరంగంగా మద్దతు పలికిన డీజీపీ స్థాయి అధికారి కొత్త వివాదానికి కేంద్ర బిందువుగా మారారు. మూడు రోజుల క్రితం రామ మందిర నిర్మాణంపై లక్నో యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో హోంగార్డ్స్ డీజీ సుర్యకుమార్ శుక్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ మందిర నిర్మాణం సత్వరమే చేపట్టాలంటూ ఆయన చేసిన ప్రమాణం శుక్రవారం సామాజిక మాధ్యమాలు, టీవీల్లో ప్రసారమైంది. 'రామ భక్తులమైన మనం ఈ కార్యక్రమంలో భాగంగా రామ మందిర నిర్మాణానికి పూనుకుందాం. జై శ్రీరాం!' అని శుక్లా అన్నట్లు వీడియోలో కనిపించింది.

వారు డ్రీమర్లు కాదు: ట్రంప్



వాషింగ్టన్: అమెరికాలోకి చిన్నప్పుడే తల్లిదండ్రులతోపాటు ప్రవేశించి అక్కడే అక్రమంగా ఉండిపోయిన స్వాప్నికుల (డ్రీమర్స్)ను అలా పిలవకూడదని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అన్నారు. వారు డ్రీమర్స్ కాదని, తన పార్టీ సభ్యులు ఆ ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. 'కొందరు వారిని డ్రీమర్లుగా పిలుస్తారు. వారు డ్రీమర్లు కాదు. మన సొంత డ్రీమర్లు మనకు ఉన్నారు' అని పశ్చిమ వర్జీనియాలో ఓ సమావేశంలో అన్నారు.

'ఎఫ్‌బీఐ మెమో బహిర్గతం చేయండి'

వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై ఎఫ్‌బీఐ జరిపిన దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగలేదంటూ రూపొందించిన ఒక రిపబ్లికన్ మెమోను సంపూర్ణంగా బహిర్గతం చేసేందుకు శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపారు. ఈ మెమో బహిర్గతం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎఫ్‌బీఐ డైరెక్టర్ చేసిన హెచ్చరికలను సైతం డొనాల్డ్ ట్రంప్ పక్కనబెట్టారు. ఈ సందర్భంగా ఎఫ్‌బీఐ సీనియర్ అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'చాలామంది సిగ్గుపడాల్సి ఉంది' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన కాంగ్రెస్ సభ్యుడు డెవిన్ న్యూన్స్ ఈ మెమోను రూపొందించారు. ఎలాంటి మార్పులూ చేయకుండానే ఈ మెమోను విడుదల చేయాలని ట్రంప్ ఆదేశించినట్లు శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి.

మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం

- ప్రతిపక్ష నేతల విడుదలకు సుప్రీంకోర్టు ఆదేశం
- అధ్యక్షుడు యమీన్ రాజీనామా కోరుతూ నిరసనలు

మాలే: మాల్దీవుల్లో మరోసారి రాజకీయ అనిశ్చితి తలెత్తింది. జైళ్లలో ఉన్న ప్రతిపక్ష నేతల శిక్షల్ని రద్దు చేస్తూ ఆ దేశ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. జైలు శిక్ష ఎదుర్కొంటోన్న మాజీ అధ్యక్షుడు నషీద్ ప్రవాసంలో ఉండగా.. జైళ్లలో ఉన్న మిగిలిన రాజకీయ నేతల్ని విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. అధ్యక్షుడు వెంటనే పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేస్తూ నషీద్ పార్టీకి చెందిన కార్యకర్తలు ఆందోళనలు చేపట్టడంతో రాజధాని మాలిలో ఉద్రిక్తత నెలకొంది. తీర్పు చెల్లుబాటవుతుందో? లేదో? పరిశీలిస్తున్నామని మాల్దీవుల సర్కారు పేర్కొంది. కాగా, 'మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి అధికారం చేజిక్కించుకుంటాం' అని కొలంబోలో ఉన్న నషీద్ అన్నారు. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని భారత్ తెలిపింది. యమీన్ నిరంకుశ పాలనతో పర్యాటక ప్రాంతమైన మాల్దీవుల ప్రతిష్ట దెబ్బతింది. అధికారంలోకొచ్చాక స్వపక్షంలోని అసంతృప్త నేతలు, ప్రతిపక్ష నేతలను యమీన్ జైల్లో పెట్టించారు. ప్రవాసంలో ఉన్న నషీద్ ఉగ్రవాదం ఆరోపణలపై జైలు శిక్ష ఎదుర్కొంటున్నారు.



మాలెలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు

12 మంది ఎంపీలపై అనర్హత ఎత్తివేత

గురువారం కోర్టు తీర్పును వెలువరిస్తూ.. 'రాజకీయ ఉద్దేశాలతో నషీద్, మరో ఎనిమిది మందిపై నేర విచారణ కొనసాగించారు. ఇది దేశ రాజ్యాంగంతో పాటు అంతర్జాతీయ చట్టాల్ని ఉల్లంఘించడమే' అని స్పష్టం చేసింది. 12 మంది పార్లమెంటు సభ్యులపై అనర్హతను కోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో 85 మంది సభ్యుల మాల్దీవుల పార్లమెంటులో యమీన్ వ్యతిరేక వర్గం ఆధిక్యత పెరిగింది. 'కోర్టు ఉత్తర్వుల్ని పాటిస్తాం' అని మాల్దీవుల పోలీసు విభాగం ట్వీటర్‌లో స్పందించడంతో ఆగ్రహించిన ప్రభుత్వం.. పోలీసు చీఫ్ అహ్మద్ అరీఫ్‌ను తొలగించింది. నషీద్‌కు చెందిన మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు.

ప్రతిపక్ష నేతల్ని జైల్లో పెట్టించిన యమీన్

అధ్యక్ష పదవి నుంచి యమీన్‌ను తొలగించాలని, అతని అవినీతిపై దర్యాప్తు జరిపించాలని కోరతూ ప్రతిపక్ష నేతలు ఈ వారం మొదట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. యమీన్‌తో పాటు, అతని కుటుంబ సభ్యులు, రాజకీయ అనుచరులు ప్రభుత్వ ఆస్తుల్ని కొల్లగొట్టారని ఆరోపించారు. పిటిషన్ దాఖలు చేసిన వారిలో యమీన్ సవతి సోదరుడితో పాటు మాల్దీవుల మాజీ అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్ తదితరులు ఉన్నారు. వివాదాస్పదమైన 2013 అధ్యక్ష ఎన్నికల్లో నషీద్‌పై విజయం సాధించాక యమీన్ అధికారంలోకి వచ్చారు. ప్రతిపక్ష నేతల్ని, అధికార పక్షంలోని వ్యతిరేకుల్ని జైలులో పెట్టించగా.. మరికొందరు విదేశాల్లో తలదాచుకుంటున్నారు.

స్కూల్‌లోనే కొట్టిచంపారు!

న్యూఢిల్లీ: గతేడాది గురుగ్రామ్‌లోని ర్యాన్ పాఠశాలలో ప్రద్యుమ్న ఠాకూర్ హత్యోదంతం మర్చిపోకముందే ఢిల్లీలో మరో ఘోరం జరిగింది. ఈశాన్య ఢిల్లీలోని జీవన్‌జ్యోతి సీనియర్ సెకండరీ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న తుషార్ కుమార్(16)పై నలుగురు తోటి విద్యార్థులు దాడిచేయడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనలో పోలీసులు, ముగ్గురు విద్యార్థుల్ని అదుపులోకి తీసుకున్నారు. పాఠశాల వాష్‌రూమ్ దగ్గర గురువారం సాయంత్రం తుషార్‌కు, నలుగురు తోటి విద్యార్థులకు గొడవ జరిగిందని పోలీసులు తెలిపారు. వారందరూ తుషార్‌పై పిడి గుద్దులు కురిపించడంతో స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటికి అటుగా వచ్చిన కొందరు విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తుషార్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. తొమ్మిదో తరగతిలోని రెండు గ్రూపుల మధ్య గొడవలో జోక్యం చేసుకోవడంతో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది.

అటకెక్కిన బెజవాడ మెట్రో!?



- ఇంకా మొదలుకాని లైట్ మెట్రో డీపీఆర్ పనులు
- గతంలో హఠాత్తుగా మీడియం మెట్రో ప్రాజెక్టును రద్దుచేసిన సర్కార్
- దానిపై మూడేళ్లు పనిచేసిన శ్రీధరన్ నేతృత్వంలోని డీఎంఆర్‌సీ
- ఎల్ అండ్ టీకి పనులు అప్పగించలేదని శ్రీధరన్‌తో విభేదాలు
- చివరికి దాన్ని వద్దని లైట్ మెట్రో వైపు మొగ్గు
- ఇప్పుడు దాన్నీ అటకెక్కించిన సర్కారు పెద్దలు

సాక్షి, అమరావతి: విజయవాడలో మెట్రో రైలును పరుగులు పెట్టిస్తామని కొద్దికాలం వరకూ హడావుడి చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఆ విషయాన్నే మరచిపోయింది. పనులు ప్రారంభమయ్యే దశలో మీడియం మెట్రో ప్రాజెక్టును రద్దు చేసుకుని లైట్ మెట్రో వైపు వెళ్లిన ప్రభుత్వం ఇప్పుడు దాన్నీ పట్టించుకోడంలేదు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో కేంద్రం కూడా ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. ఈసారి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.

అసలు ఇప్పటివరకూ లైట్ మెట్రో రైలు ప్రాజెక్టు సవివర నివేదిక (డీపీఆర్) రూపకల్పనకే ముందడుగు పడలేదు. దీంతో మెట్రో ప్రాజెక్టు ఉంటుందో లేదోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారుల ఒత్తిడికి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టేసిందనే ప్రచారం జరుగుతోంది.

విజయవాడ నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం మూడేళ్ల క్రితం శ్రీధరన్ నేతృత్వంలోని ఢిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ)తో డీపీఆర్ (సవివర నివేదిక) తయారుచేయించి ఆమోదించింది. రూ.7,200 కోట్లతో బందరు, ఏలూరు రోడ్లలో రెండు కారిడార్లుగా ఈ ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించి దాని నిర్మాణ బాధ్యతను కూడా డీఎంఆర్‌సీకే ప్రభుత్వం అప్పగించింది. డిజైన్లు, ఎలైన్‌మెంట్ సహా అన్ని పనులను డీఎంఆర్‌సీ పూర్తిచేసి ప్రాజెక్టు నిర్మాణానికి రెండుసార్లు టెండర్లు కూడా పిలిచింది. అయితే, టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించాల్సిన సమయంలో ప్రభుత్వం హఠాత్తుగా అసలు ఈ ప్రాజెక్టే వద్దని యూ టర్న్ తీసుకుంది.

ఎల్ అండ్ టీకి శ్రీధరన్ నిరాకరణ

ఎల్ అండ్ టీ సంస్థకు ప్రాజెక్టు పనులు అప్పగించాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడం, 30 శాతం అదనంతో ఆ సంస్థ దాఖలు చేసిన టెండర్లపై శ్రీధరన్ అసంతృప్తి వ్యక్తంచేసి టెండర్లనే రద్దు చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఎల్ అండ్ టీకి పనులు అప్పగించేందుకు ఆయన నిరాకరించిన నేపథ్యంలో ప్రభుత్వం ఏకంగా ప్రాజెక్టునే రద్దు చేసింది. మరోవైపు.. ఈ ప్రాజెక్టువల్ల బందరు, ఏలూరు రోడ్లకిరువైపులా ఉన్న తమ సంస్థల వ్యాపారం దెబ్బతింటుందని బడా వ్యాపారులంతా గగ్గోలు పెట్టారు. కేంద్ర మంత్రి సుజనాచౌదరి ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఒకవైపు వ్యాపారుల ఒత్తిడి, మరోవైపు అదనపు రేటుకు తాను చెప్పిన కంపెనీకి పనులిచ్చే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టును అటకెక్కించినట్లు తెలుస్తోంది.

తెర మీదకు లైట్‌మెట్రో

ఇదిలా ఉంటే.. తక్కువ వ్యయంతో లైట్ మెట్రో ప్రాజెక్టును చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి దాని డీపీఆర్ బాధ్యతను జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యు సంస్థకు అప్పగించింది. వాస్తవానికి మెట్రో ప్రాజెక్టుకు రుణం ఇచ్చే విషయాన్ని పరిశీలించేందుకు కేఎఫ్‌డబ్ల్యు ఇక్కడకు వచ్చింది. దానికి డీపీఆర్ బాధ్యత అప్పగించడంతో ఇప్పటివరకూ ఆ పని పూర్తిస్థాయిలో మొదలుకాలేదు. ఆ సంస్థ ఉత్సాహంగా ఉన్నా ప్రభుత్వం దీని గురించి పట్టించుకోవడం మానేసింది. ఈ నేపథ్యంలో అసలు లైట్ మెట్రో అయినా పట్టాలెక్కుతుందా లేదో అనుమానంగానే మారింది. ఒకవేళ కేఎఫ్‌డబ్ల్యు సంస్థ డీపీఆర్ రూపకల్పన పనిని వెంటనే ప్రారంభించినా అది పూర్తయ్యేసరికి ఆరు నెలలు పడుతుంది. ఆ తర్వాత భూసేకరణ, ఇతర పనులకు సమయం కావాలి. అంటే ఇప్పట్లో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే పరిస్థితి ఏమాత్రం కనిపించడంలేదు. మరోవైపు, ప్రభుత్వ పెద్దలే కావాలని మెట్రోను పక్కన పెట్టేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బెజవాడ మెట్రో రైలు ప్రస్థానం ఇలా..

జులై 2014: విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు సలహాదారుగా శ్రీధరన్ నియామకం

సెప్టెంబర్ 2014 : డీఎంఆర్‌సీకి మెట్రో ప్రాజెక్టు డీపీఆర్ (సవివర నివేదిక) రూపకల్పన బాధ్యత అప్పగింత

ఏప్రిల్ 2015 : ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించిన డీఎంఆర్‌సీ. ప్రాజెక్టు వ్యయం రూ.6769 కోట్లు. బస్టాండ్–పెనమలూరు, బస్టాండ్–నిడమానూరు కారిడార్లను 26 కిలోమీటర్ల మేర నిర్మాణానికి ప్రతిపాదన. 70 ఎకరాల భూసేకరణ.. ఇందుకు అదనంగా రూ.431 కోట్లు ఖర్చు అంచనా

మే 2015 : డీఎంఆర్‌సీ ఇచ్చిన డీపీఆర్‌ను ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం

అక్టోబర్ 2015 : మెట్రో ప్రాజెక్టు నిర్మాణం కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు. దానికి అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ (ఏఎంఆర్‌సీ)గా నామకరణం.

ఫిబ్రవరి 2016: మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం జపాన్‌కు చెందిన జైకాతో చర్చలు

జూన్ 2016: ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచిన డీఎంఆర్‌సీ

ఆగస్టు 2016: టెండర్లను రద్దు చేసిన డీఎంఆర్‌సీ

డిసెంబర్ 2016: జైకాతో రుణం మంజూరు చర్చలు విఫలం

మార్చి 2017: నూతన మెట్రో విధానాన్ని రూపొందిస్తున్న నేపథ్యంలో ప్రస్తుత విజయవాడ మెట్రో ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం

ఆగస్టు 2017: ప్రాజెక్టు కోసం రెండోసారి టెండర్లు పిలిచిన ఏఎంఆర్‌సీ

అక్టోబర్ 2017 : మళ్లీ టెండర్లు రద్దు చేసిన ఏఎంఆర్‌సీ

నవంబర్ 2017 : విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు స్థానంలో ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన

నవంబర్ 2017: డీఎంఆర్‌సీతో తెగతెంపులు, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యుతో లైట్ మెట్రో ప్రాజెక్టు గురించి చర్చలు

నవంబర్ 2017: విజయవాడకు లైట్ మెట్రో ప్రాజెక్టు తీసుకొస్తామని ప్రకటించిన చంద్రబాబు, డీపీఆర్ ఇవ్వాలని కేఎఫ్‌డబ్ల్యుకు బాధ్యత.

'రాజకీయ' క్షమాభిక్ష

- సొంతవారిని విడిపించుకునేలా టీడీపీ నేతల పైరవీలు
- రిపబ్లిక్ డే పేరుతో ఉగాదికి విడుదలకు ప్రభుత్వం కసరత్తు
- వివిధ జైళ్లలో 124 మంది ఖైదీల విడుదలకు ప్రతిపాదనలు
- కమిటీ పరిశీలన తర్వాతే తుది నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ సెంట్రల్ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న జీవిత ఖైదీల విడుదలకు రాజకీయ రంగు పడుతోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారి విడుదలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజున జీవిత ఖైదీలకు క్షమాభిక్ష పెట్టనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే అసలు తంతు పూర్తికాకపోవడంతో ఉగాది రోజున విడుదల చేస్తారని విశ్వసనీయ సమాచారం. గతంలో కూడా అధికార పార్టీకి అనుకూలురైన జీవిత ఖైదీలను విడుదల చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కాగా, రాజకీయ పార్టీల సిఫారసులు, ప్రజా సంఘాలు, కుటుంబ సభ్యుల వినతి మేరకు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష పెట్టే నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది.

మార్గదర్శకాలతో ఆలస్యంగా జీవో విడుదల


ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం రోజున జీవిత ఖైదీలకు క్షమాభిక్ష పెట్టే విషయంలో సర్కారు ఆలస్యంగా స్పందించింది. జనవరి 26న విడుదల చేయాలంటే కనీసం రెండు నెలల ముందు నుంచే కసరత్తు చేపట్టాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఈ నెల 23న ఇందుకు సంబంధించిన జీవోఎంఎస్ 8 విడుదల చేసింది. ఆయా సెంట్రల్ జైళ్లలో అర్హత కలిగిన ఖైదీల పూర్వాపరాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవడానికి కమిటీని ఏర్పాటు చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, న్యాయశాఖ కార్యదర్శి, డీజీపీ, సీఐడీ ముఖ్య న్యాయ సలహాదారు, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ, జైళ్ల శాఖ డీఐజీ సభ్యులుగా ఉండే కమిటీ క్షమాభిక్షకు అర్హులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. హత్యలు, తీవ్ర నేరాలు చేసి జీవిత ఖైదు అనుభవిస్తున్నవారు సత్ప్రవర్తనతో మెలిగితే క్షమాభిక్షకు అర్హులుగా సిఫారసు చేస్తారు. 65 ఏళ్లు నిండినవారు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారిని కూడా క్షమాభిక్షకు అర్హులుగా నిర్ణయించారు. అయితే ప్రభుత్వ అధికారులను హత్య చేసినవారు, గృహహింస కేసులో భార్యను హత్య చేసినవారు, నక్సల్స్‌కు క్షమాభిక్ష లేదు.

క్షమాభిక్ష జాబితాలో మొద్దు శ్రీను హంతకుడు

క్షమాభిక్ష జాబితాలో మొద్దు శ్రీను హత్య కేసులో నెల్లూరు సెంట్రల్ జైలులో జీవితఖైదు అనుభవిస్తున్న మల్లెల ఓంప్రకాశ్ కూడా ఉన్నాడు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఓంప్రకాశ్ క్షమాభిక్షకు అర్హుడేనని, ఆయనపై సీబీఐ కేసు ఉంటే ప్రభుత్వ నియమించిన కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుందని నెల్లూరు జైలు అధికారులు చెబుతున్నారు. సెంట్రల్ జైళ్ల వారీగా చూస్తే రాజమండ్రి– 69, విశాఖపట్నం–14, నెల్లూరు–16, కడపల్లో 25 మంది జీవిత ఖైదీలు ఉన్నారు. క్షమాభిక్ష పెడతామని ప్రకటించిన ప్రభుత్వం ఉగాదికి వాయిదా వేయడంతో వారంతా విడుదల కోసం ఆశ, నిరాశల నడుమ నలిగిపోతున్నారు.

తొలిసారైనా తొండే!

- గుట్టుగా ఈబీసీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం
- పదిరోజులు మాత్రమే గడువు
- 8,294 యూనిట్లకు.. 66,014 దరఖాస్తులు
- జన్మభూమి కమిటీలు ఒకే చేస్తేనే రుణాలు
- ప్రభుత్వ వైఖరిపై నిరుద్యోగుల విమర్శలు



సాక్షి కడప: ఈబీసీ రుణాల విషయంలో ప్రభుత్వ అనుసరిస్తున్న వైఖరిపై విమర్శలు చెలరేగుతున్నాయి. తొలిసారిగా ఇస్తున్న వీటికి ఎలాంటి ప్రచారం కల్పించకుండా.. హడావుడిగా ప్రకటించి 10రోజుల్లోనే వెబ్‌సైట్‌ను మూసివేయడంపై నిరుద్యోగులు పెదవి విరుస్తున్నారు. పైగా జనాభాతో సంబంధంలేకుండా అన్ని జిల్లాలకూ ఒకే లెక్కన 638 యూనిట్లు చొప్పున కేటాయించారు. ప్రభుత్వ వైఖరి చూస్తుంటే ఈబీసీ రుణాలన్నీ జన్మభూమి కమిటీలు సూచించిన వారికే అన్నట్లు ఉందని వారు ఆరోపిస్తున్నారు. ముందస్తు ఎన్నికల వార్తలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సామాజికవర్గాల వారికి వ్యక్తిగత రుణాల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రతి యూనిట్ విలువ రూ.2 లక్షలు కాగా.. అందులో బ్యాంకు రుణం రూ.లక్ష, సబ్సిడీ రూ.లక్షగా నిర్ణయించారు. ఇందుకు ఎలాంటి ప్రచారం కల్పించకుండా కేవలం 10రోజులు మాత్రమే జనవరి 19 నుంచి 31వరకు మాత్రమే గడువు ఇచ్చింది. దీంతో అనేకమంది దరఖాస్తు చేయలేని పరిస్థితి. చివరి రెండు రోజుల్లోనే దరఖాస్తులు వచ్చాయి. రుణం వస్తే ఏదో ఒక వ్యాపారం పెట్టుకోవచ్చన్న ఆశతో వీరంతా దరఖాస్తు చేసుకున్నారు. అయితే, రాష్ట్రంలో అన్ని జిల్లాలకు కలిపి 8,294 యూనిట్లు మాత్రమే మంజూరు చేశారు. అంటే.. ఒక్కో జిల్లాకు సరాసరిన 638 యూనిట్లు కేటాయించారు. ఇందుకు అన్ని జిల్లాల నుంచి మొత్తం 66,014 దరఖాస్తులు రాగా, అందులో అత్యధికంగా పశ్చిమగోదావరి జిల్లాలో 12,950 మంది దరఖాస్తు చేసుకున్నారు. తర్వాత ప్రకాశం జిల్లా నుంచి 10,141 దరఖాస్తులు, తూర్పు గోదావరి జిల్లా నుంచి 8,301 దరఖాస్తులు వచ్చాయి. ఇదిలా ఉంటే.. వ్యక్తిగత రుణాలు పొందేందుకు ఈబీసీలకు తొలిసారిగా అవకాశం వచ్చినా అవి అందరికీ అందేనా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే.. రుణాల మంజూరులో జన్మభూమి కమిటీలదే కీలకపాత్ర. నిజమైన అభ్యర్థులకు ఎంత మేరకు అవకాశం వస్తుందోనన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.


ఈబీసీ రుణాలకు జిల్లాల వారీగా యూనిట్లు, దరఖాస్తుల వివరాలు

జిల్లా	మంజూరైన యూనిట్లు	దరఖాస్తులు
శ్రీకాకుళం	638	550
విజయనగరం	638	2,256
విశాఖపట్టణం	638	2,558
పశ్చిమగోదావరి	638	12,950
తూర్పుగోదావరి	638	8,301
కృష్ణా	638	7,353
గుంటూరు	638	5,279
ప్రకాశం	638	10,141
పొట్టిశ్రీరాములు నెల్లూరు	638	4,444
కర్నూలు	638	3,059
వైఎస్సార్	638	4,141
అనంతపురం	638	4,122
చిత్తూరు	638	860
మొత్తం	8,294	66,014

టీటీడీలో మేం ఉద్యోగం చేయకూడదనడం

రాజ్యాంగ విరుద్ధం

- ఆ రూల్‌ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించండి
- మాకిచ్చిన షోకాజ్ నోటీసులను కొట్టేయండి
- హైకోర్టులో పలువురు క్రిస్టియన్, ముస్లిం ఉద్యోగుల పిటిషన్



సాక్షి, హైదరాబాద్: తిరుమల, తిరుపతి దేవస్థానాలతో పాటు, ఆ దేవస్థానాల ఆర్థిక సాయంతో నడిచే ఏ దేవాలయాలు, ఇతర సంస్థల్లోనూ హిందూయేతరలను ఏ పోస్టుల్లో కూడా నియమించడానికి వీల్లేదంటున్న టీటీడీ ఉద్యోగుల సర్వీసు నిబంధనల్లో రూల్ 9(4)ను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ రూల్‌ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించడంతో పాటు, ఈ రూల్ కింద హిందూయేతరులమైన తమకు టీటీడీ జారీ చేసిన షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని కోరుతూ టీటీడీ పరిధిలో వివిధ పోస్టుల్లో పనిచేస్తున్న 36 మంది క్రిస్టియన్, ముస్లిం ఉద్యోగులు పిటిషన్‌ను వేశారు. ఇందులో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, టీటీడీ ఈవోలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరపనుంది. ప్రభుత్వంపై ఆధారపడి టీటీడీ పనిచేయడం లేదని, ఆ సంస్థకు స్వతంత్ర ప్రతిపత్తి ఉందని పిటిషనర్లు తెలిపారు. టీటీడీలో జరిగే నియామకాల విషయంలోనూ ప్రభుత్వానికి ఎటువంటి పాత్ర లేదన్నారు. తామంతా 1998 నుంచి 2004 మధ్యకాలంలో వివిధ పోస్టుల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులయ్యాయని, టీటీడీ, దాని పరిధిలో ఉన్న పలు ఆసుపత్రులు, ఇతర కార్యాలయాల్లో మజ్దూర్, పారిశుద్ధ్య కార్మికులు, అటెండర్లు, తోటమాలి, కాపలాదారు, డ్రైవర్లు ఇలా పలు బాధ్యతలు నిర్వర్తిస్తున్నామన్నారు. కొన్ని హిందూ సంస్థల ఒత్తిడితో టీటీడీతో పాటు దాని పరిధిలోని సంస్థలు, దేవాలయాల్లో ఎక్కడా హిందూయేతరులు పనిచేయడానికి వీల్లేదంటూ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేశారని, వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న మొత్తం 42 మంది ఉద్యోగులకు టీటీడీ ఈవో గతనెల 11న షోకాజ్ నోటీసులు జారీ చేశారని వివరించారు. టీటీడీ ఉద్యోగుల సర్వీసు నిబంధనల్లో రూల్ 9(4) ప్రకారం క్రిస్టియన్లు, ముస్లింలమైన తాము టీటీడీ పరిధిలో ఉద్యోగాలు చేయడానికి అర్హులం కాదని, దీనిపై మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారని తెలిపారు. ఇన్నేళ్లు లేని అభ్యంతరం ఇప్పుడు వచ్చిందని, ఇది కేవలం బయటి శక్తుల ఒత్తిడి వల్ల తీసుకున్న నిర్ణయమని తెలిపారు. తిరుమల దేవస్థానంలో పనిచేయడం లేదని, టీటీడీ పరిధిలోకి వచ్చే సంస్థల్లో పనిచేస్తున్నామని తెలిపారు. కాబట్టి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని వారు కోర్టును కోరారు.

రాజధానిపై కేంద్రానికి డీపీఆర్

మంత్రి నారాయణ వెల్లడి



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన సవివర నివేదిక(డీపీఆర్)ను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చామని, డీపీఆర్ ఇవ్వలేదనే విమర్శల్లో నిజం లేదని మంత్రి పి.నారాయణ వెల్లడించారు. శుక్రవారం రాత్రి మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పూర్తిస్థాయి అమరావతి నిర్మాణానికి రూ.5 లక్షల కోట్లు అవసరం అవుతాయని పేర్కొంటూ డీపీఆర్ ఇచ్చామన్నారు. తొలివిడతగా భవనాల నిర్మాణానికి రూ.5 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని, కానీ కేంద్రం రూ.2,500 కోట్లు ఇస్తామని చెప్పిందని అన్నారు.

చేనేత రంగానికి అన్యాయం

వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్

అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి అన్యాయం జరిగిందని వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో చేనేతలకు రూ.396 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో 3 లక్షల మంది ప్రత్యక్షంగా, 8 లక్షల మంది చేనేతలు పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. వీరికి ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం, నేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర లభించడందేని.. దీంతో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

రాజ్యసభలో కేవీపీ ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు శుక్రవారం రాజ్యసభలో ఆందోళన చేశారు. 'ఆంధ్రప్రదేశ్‌కు సాయం చేయండి' అన్న నినాదంతో కూడిన ప్లకార్డును ప్రదర్శించారు. సభాపతి స్థానంలో కూర్చున్న ఉప సభాపతి పీజే కురియన్ కేవీపీని వారించారు. 'కేవీపీ.. ఏమైంది మీకు. గులాం నబీ ఆజాద్ గారూ.. మీ సభ్యుడిని వెనక్కి పిలవండి. ఆయన ఏం చేస్తున్నారు. ఏదైనా అంశంపై చర్చించాలంటే నోటీసు ఇవ్వకుండా ఇలా ఎవరైనా చేస్తారా?' అంటూ వారించారు. అయినప్పటికీ కేవీపీ తన ఆందోళనను కొనసాగించారు. మరోవైపు విపక్షాలు మత కలహాలపై ఆందోళన నిర్వహించడంతో సభను వాయిదావేశారు. తిరిగి మధ్యాహ్నం రాజ్యసభ ప్రారంభమైనప్పుడు కూడా కేవీపీ నిరసనను తెలియజేశారు. ఆయనకు మద్దతుగా కొందరు ఎంపీలు తమ స్థానాల్లో నిలబడి సంఘీభావం తెలిపారు. అనంతరం కేవీపీ మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని ధ్వజమెత్తారు.

బీజేపీతో చివరికి తెగతెంపులు

రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్

సాక్షి, న్యూఢిల్లీ: విభజన హామీలను అమలు చేయకుండా ఏపీకి అన్యాయం చేస్తున్న బీజేపీతో అంచలంచెలుగా పోరాటం చేసి, చివరకు తెగతెంపులు ఉంటాయని రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆదివారం సీఎం చంద్రబాబుతో ఎంపీలు సమావేశమవుతారని తెలిపారు. బీజేపీతో పోరుకు సంబంధించి చంద్రబాబే ప్రకటన చేస్తారని చెప్పారు. ప్రస్తుతం కేంద్రం ప్రభుత్వంలో బీజేపీకి తగిన సంఖ్య బలం ఉండటం వల్లే ఆ పార్టీ మిత్రపక్షాల్ని పట్టించుకోవడం లేదన్నారు.

అఫ్గానిస్తాన్‌లో చైనా మిలటరీ బేస్!

వాఖన్ కారిడార్‌లో ఏర్పాటుకు చర్చలు

కాబుల్: అఫ్గానిస్తాన్‌లో మిలటరీ బేస్ నిర్మించేందుకు చైనా ఆ దేశంతో చర్చలు జరుపుతోంది. పర్వతాలతో కూడిన మారుమూల ప్రాంతమైన వాఖన్ కారిడార్‌లో ఇది ఏర్పాటు కానుందని అఫ్గానిస్తాన్ అధికారులు చెప్పారు. చైనా, అఫ్గాన్ బలగాలు ఇక్కడ సంయుక్తంగా గస్తీ కాసినట్లు గతంలోనే వార్తలు వెలువడ్డాయి. వాఖన్ కారిడార్ నుంచి దాని పొరుగునే ఉన్న తమ సరిహద్దు ప్రాంతం జిన్‌జియాంగ్‌లోకి ఉగ్రవాదులు ప్రవేశిస్తున్నారని ఆందోళన చెందుతున్న చైనా..అక్కడ మిలటరీ బేస్ నిర్మించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఆ దేశం ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు. ఆర్థికంగా, భౌగోళికంగా తన పలుకుబడిని విస్తరించుకునేందుకు కూడా ఈ ప్రణాళిక దోహదపడుతుందని భావిస్తున్నారు. దక్షిణాసియాలో మౌలిక వసతుల కల్పనకు బిలియన్ల కొద్దీ డాలర్లు కుమ్మరిస్తున్న చైనాను అఫ్గాన్‌లోని అస్థిర పరిస్థితులు కలవరపెడుతున్నాయి. అజ్ఞాతంలో ఉన్న తుర్కెస్తాన్ ఇస్లామిక్ మిలిటెంట్లు వాఖన్ గుండా తమ దేశంలోకి ప్రవేశించి దాడులు చేస్తారేమోనని ఆందోళన చెందుతోంది. వాఖన్‌లో మిలటరీ బేస్ నిర్మాణానికి సంబంధించి డిసెంబర్‌లోనే చర్చలు జరిగినా పూర్తి వివరాలు వెల్లడి కాలేదు. అఫ్గాన్‌లో సామర్థ్య పెంపునకే చైనా పాత్ర పరిమితమని కాబుల్‌లోని చైనా రాయబారి అన్నారు. అఫ్గాన్ ప్రజలకు దూరంగా ఉండే వాఖన్ వాసులకు జిన్‌జియాంగ్ ప్రజలతో మంచి సంబంధాలే ఉన్నాయి. చైనా పర్యాటకులు తరచూ వాఖన్‌లో పర్యటిస్తారు.

నిర్బంధ తమిళ బోధన వద్దు

తమిళనాడు గవర్నర్‌కు కేతిరెడ్డి వినతి

సాక్షి, హైదరాబాద్: తమిళనాడు రాష్ట్రంలో అమల్లో ఉన్న నిర్బంధ తమిళ భాష బోధన చట్టాన్ని రద్దు చేయాలని తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ చట్టంతో తమిళనాడులో ఉన్న తెలుగు విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ రాష్ట్ర గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ దేశంలో 27 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రాథమిక స్థాయి విద్యలో త్రిభాషా విద్యావిధానం అమల్లో ఉందన్నారు. కానీ ఒక్క తమిళనాడులో మాత్రం రెండు భాషల విద్యావిధానం అమలు చేస్తున్నారన్నారు. రాజ్యాంగం మాతృభాషలో చదువుకునే హక్కు ప్రజలకు ఇచ్చినప్పటికీ తమిళ ప్రభుత్వం దాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. ఈ సమస్యపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని కేతిరెడ్డి చెప్పారు.

కొనుగోళ్లలో పా'పాలు'!

- వేసవి కోసం అధిక ధరకు పాలపొడి సేకరణ
- ఇతర రాష్ట్రాల్లో కేజీ రూ.140 ఉంటే.. మహారాష్ట్ర నుంచి కేజీ 210కి కొనుగోలు
- ఆ తర్వాత పడిపోయిన ధరలు
- తొందరపాటుతో అదనంగా రూ.17.50కోట్ల చెల్లింపు
- కృష్ణా మిల్క్ యూనియన్ తీరుపై విమర్శలు



సాక్షి, విజయవాడ: పాల పొడి కొనుగోలుకు కృష్ణా మిల్క్ యూనియన్ తీసుకున్న నిర్ణయంపై తీవ్రస్థాయిలో విమర్శలు తలెత్తుతున్నాయి. వచ్చే వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు కొనుగోలు చేసిన పాల పొడికి చెల్లించిన రేటు ఇందుకు కారణం. విజయవాడ పాలప్రాజెక్టు ద్వారా ప్రతిరోజూ 2.80 లక్షల లీటర్ల పాలు విక్రయాలు సాగుతాయి. అయితే, వేసవిలో స్థానికంగా ఆ మేరకు పాల ఉత్పత్తి జరగకపోగా డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ కాలంలో పాల పొడిని ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తారు. దానిని పాలుగా మార్చి అందులో వెన్నశాతం తగినంతగా ఉండేటట్లు చూసి విక్రయిస్తారు. ఇలా ఏటా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో పాల పొడితో తయారైన పాలు 40 శాతం వరకు మిల్క్ యూనియన్ నుంచి సరఫరా అవుతాయి.

కొల్హాపూర్ నుంచి 2,500 టన్నుల కొనుగోలు

ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు నెలల్లో పాల తయారీ అవసరాల కోసం మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా కో–ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ (గోకుల్) నుంచి 2,500 టన్నుల పాలపొడిని కొనుగోలు చేయడానికి కృష్ణామిల్క్ యూనియన్ అధికారులు గత అక్టోబర్‌లో నిర్ణయించారు. కిలో రూ.210 చొప్పున 2,500 టన్నుల పాలపొడిని ఆర్డర్ ఇచ్చారు. ముందుగా 1500 టన్నుల పాలపొడిని దిగుమతి చేసుకున్నారు. ఆ తర్వాత దేశంలోని అనేక రాష్ట్రాల్లో పాల ఉత్పత్తి బాగా పెరగడంతో ఉత్పత్తుల ధరలు పడిపోయాయి. ప్రస్తుతం గుజరాత్, కేరళ తదితర రాష్ట్రాలు గేదె పాల నుంచి తయారుచేసిన పాలపొడిని కిలో రూ.140లకే విక్రయిస్తున్నాయి. అయితే, కొల్లాపూర్ నుంచి రూ.210 చొప్పున కొనుగోలు చేయడంతో రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా.. పాలపొడి రేట్లు తగ్గుతున్న నేపథ్యంలో మిగిలిన 1000 టన్నుల పాల పొడిని వెంటనే సరఫరా చేస్తామంటూ కొల్లాపూర్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ అధికారులు ఇప్పటికే పలుమార్లు లేఖలు రాశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఈ పాల పొడిని కూడా తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

రూ.17.50 కోట్లు నష్టం..

కాగా, కిలోకు రూ.70 చొప్పున 2,500 టన్నులకు రూ.17.50కోట్లను అదనంగా కృష్ణా మిల్స్ యూనియన్ అధికారులు చెల్లిస్తున్నారు. అధికారులు అత్యుత్సాహంతో ఒకేసారి 2500 టన్నులకు ఆర్డర్ ఇవ్వకుండా తొలుత 1500 టన్నులకు ఆర్డర్ ఇచ్చి ఆ తరువాత మిగిలిన 1000 టన్నులకు ఆర్డర్ ఇస్తే బాగుండేదని పాల ప్రాజెక్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే, పాలపొడిని కేజీ రూ.210 పెట్టి కొనుగోలు చేయడంపై గత నెల 30న జరిగిన పాల ప్రాజెక్టు బోర్డు మీటింగ్‌లో బోర్డు సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో రూ.140లకే లభిస్తున్నప్పుడు గోకుల్ వద్ద రూ.210 చెల్లించి ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించినట్లు సమాచారం. కాగా, గత ఏడాది కేజీ రూ.180కు కొనుగోలు చేయగా, ఈ ఏడాది రూ.210కు కొనుగోలు చేయడం గమనార్హం.

గేదె పాల పాలపొడికి ప్రాధాన్యత ఇచ్చాం

గేదె పాలతో తయారైన నాణ్యమైన పాలపొడినే కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చాం. గతంలో ఒంగోలులోనూ కొనుగోలు చేసేవారం. అయితే, ఇప్పుడు అక్కడ పెద్ద మొత్తంలో లభించడంలేదు. గేదె పాలపొడి 30 శాతం, ఆవు పాలపొడి 70 శాతం కలిపి ఉత్తరాది రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. అయితే, ఆ పాలు దెబ్బతింటాయని పూర్తిగా గేదెపాలతో తయారైన పాలపొడిని గోకుల్ నుంచి కొనుగోలు చేశారు. గోకుల్ సహకార రంగంలో నడుస్తున్న ఫ్యాక్టరీ తప్ప ప్రైవేటు సంస్థ కాదు. మూడేళ్లుగా అక్కడే కొంటున్నాం.

– బాబూరావు, ఎండీ, కృష్ణా మిల్క్ యూనియన్

పెరుగుతున్న గనుల ఆదాయం

- లక్ష్యానికి మించి 17 శాతం రాబడి
- గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 50శాతం వృద్ధి
- కృష్ణా జిల్లాలో 292, తూర్పుగోదావరి జిల్లాలో 183 శాతం రాబడి

సాక్షి, అమరావతి: భూగర్భ గనుల శాఖ ఆదాయం భారీగా పెరిగింది. 2017 -18 ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసికాల్లో (ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకూ) లక్ష్యానికి మించి రాబడి వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో రూ.1333 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ. 1562 కోట్ల రాబడి వచ్చింది. గత ఆర్థిక సంవత్సరం (2016 -17) ఇదే కాలంలో వచ్చిన దానితో పోల్చితే 50 శాతం పెరగడం గమనార్హం. కృష్ణా జిల్లాలో అత్యధికంగా 292 శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 183 శాతం రాబడి వచ్చింది. గత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో వచ్చిన ఆదాయంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కృష్ణా జిల్లాల్లో మూడున్నర రెట్ల ఆదాయం వచ్చింది. గనుల శాఖకు ఈ జిల్లాల్లో గత ఏడాది మొదటి మూడు త్రైమాసికాల్లో రూ. 80 కోట్ల రాబడి రాగా ఈ సంవత్సరం ఇదే కాలంలో రూ. 295 కోట్లకు చేరడం గమనార్హం. ఇదే కాలంలో తూర్పుగోదావరి జిల్లాలో రాబడి రూ.222 కోట్ల నుంచి రూ. 461 కోట్లకు ఎగబాకింది.

మొదటి మూడు క్వార్టర్లలో గనుల శాఖ ఆదాయ వివరాలు (గణాంకాలు రూ. కోట్లలో)

జిల్లా	2017-18లక్ష్యం	వచ్చింది	2016-17ఆదాయం
కృష్ణా	101	295	80
తూర్పుగోదావరి	252	461	222
ప్రకాశం	182	164	158
అనంతపురం	74	66	64
విజయనగరం	24	21	20
నెల్లూరు	60	53	51
విశాఖపట్నం	58	49	47
చిత్తూరు	80	65	58
కర్నూలు	151	120	133
గుంటూరు	120	95	100
వైఎస్సార్	129	100	95
పశ్చిమగోదావరి	29	21	26
శ్రీకాకుళం	74	53	44
మొత్తం	1333	1562	1096

ఆయకట్టు ప్రయోజనాలు తాకట్టు!

- ఆర్డీఎస్ ఆయకట్టుకు సుంకేశుల నుంచి 8.2 టీఎంసీల తరలింపు
- తుమ్మిళ్ల ఎత్తిపోతల పనులు శరవేగంగా చేస్తున్న తెలంగాణ సర్కారు.. జూన్‌లో నీళ్లు ఇచ్చేందుకు సిద్ధం
- పంటలు ఎండిపోయి విలవిల్లాడుతున్న కేసీ కెనాల్ రైతులు
- పనులు మొదలైనప్పుడు నోరెత్తని టీడీపీ సర్కారు
- ఇప్పుడు తాపీగా కృష్ణా బోర్డుకు లేఖతో సరి

సాక్షి, అమరావతి: నదీ జలాలపై రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో టీడీపీ సర్కారు దారుణ వైఫల్యానికి ఇది మరో తార్కాణం! 148 ఏళ్ల చరిత్ర ఉన్న కలిగిన కేసీ కెనాల్ ఆయకట్టు ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా తెలంగాణ సర్కారు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టినప్పుడు కనీసం నోరు మెదపని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు తీరిగ్గా పనులు ఆపాలంటూ కృష్ణా బోర్డుకు ఓ లేఖ రాయటంపై రైతులు మండిపడుతున్నారు. టీడీపీ సర్కారు అలసత్వాన్ని అవకాశంగా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తుమ్మిళ్ల ఎత్తిపోతలను పూర్తి చేస్తోంది.

కేసీ కెనాల్‌కు 39.90 టీఎంసీలు కేటాయించిన ట్రిబ్యునల్

సుదీర్ఘ చరిత్ర కలిగిన కేసీ కెనాల్‌కు బచావత్ ట్రిబ్యునల్ 39.90 టీఎంసీలు కేటాయించింది. ఇందులో 10 టీఎంసీలను తుంగభద్ర జలాశయం నుంచి విడుదల చేయాలని, మిగతా 29.90 టీఎంసీలు తుంగభద్ర జలాశయం దిగువ నుంచి సుంకేశుల బ్యారేజీ వరకూ నదిలో లభిస్తాయని ట్రిబ్యునల్ తన తీర్పులో స్పష్టంగా పేర్కొంది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కూడా బచావత్ ట్రిబ్యునల్ తీర్పునే సమర్థించింది.

ఆర్డీఎస్ ఆయకట్టు స్థిరీకరణ పేరుతో..

తెలంగాణలోని పాత మహబూబ్‌నగర్ జిల్లాలో ఆర్డీఎస్ కింద 86 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆర్డీఎస్‌కు కూడా బచావత్ ట్రిబ్యునల్ 6.50 టీఎంసీలను కేటాయించింది. అయితే వర్షాభావ పరిస్థితుల వల్ల నదిలో నీటి లభ్యత నానాటికీ తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో కేసీ కెనాల్‌కు నీటిని సరఫరా చేసే సుంకేసుల జలాశయం నుంచి 8.20 టీఎంసీలను ఆర్డీఎస్ ఆయకట్టుకు తరలించేందుకు తెలంగాణ సర్కారు సిద్ధమైంది. ఈమేరకు రూ.783 కోట్ల అంచనా వ్యయంతో గతేడాది ఏప్రిల్ 24న తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసింది. దీనిపై అప్పట్లోనే కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు, సంఘాలు, ప్రతిపక్ష పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినా టీడీపీ సర్కారు కనీసం స్పందించలేదు.

హడావుడి లేకుండా పనులు

చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యాన్ని అలుసుగా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతలకు గతేడాది జూలై 14న టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించేసింది. శంకుస్థాపన చేయకముందే ఎలాంటి హడావుడి లేకుండా పనులను చేపట్టి యుద్ధప్రాపతికన పూర్తి చేస్తోంది. పనులు కొలిక్కి వచ్చాక జనవరి 8న గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం తుమ్మిళ్ల వద్ద తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది జూన్‌లో తుమ్మిళ్ల ఎత్తిపోతలను జాతికి అంకితం చేసి ఆర్డీఎస్ ఆయకట్టుకు నీళ్లందిస్తామని ప్రకటించారు.

కృష్ణా బోర్డుకు లేఖతో సరి

వర్షాభావం వల్ల ఈ ఏడాది కేసీ కెనాల్ కింద ఖరీఫ్ పంటలు సాగు చేయలేదు. రబీలో వేసిన పంటలకు నీళ్లందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పూర్తయితే సుంకేసుల జలాశయంలోకి వచ్చిన నీటిని వచ్చినట్లుగా తెలంగాణ సర్కారు తోడేయడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది. కేసీ కెనాల్ ఆయకట్టుకు సాగునీటి మాట దేవుడెరుగు కనీసం తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవని రైతులు చెబుతున్నారు.

ఆర్డీఎస్ కుడి కాలువ పనులు చేయని రాష్ట్ర సర్కార్

ఎండుతున్న రబీ పంటలకు నీటిని విడుదల చేసి రక్షించాలని, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని నిలుపుదల చేయాలంటూ కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో కేసీ కెనాల్ పరిధిలోని రైతులు ఆందోళన నిర్వహించారు. దీంతో తుమ్మిళ్ల ఎత్తిపోతలను ఆపివేసేలా ఆదేశించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం కృష్ణా బోర్డుకు శుక్రవారం ఓ లేఖ రాసి ఊరుకుంది. ఓటుకు కోట్లు కేసులో ఇరుక్కుపోయిన సీఎం చంద్రబాబు పొరుగు రాష్ట్రానికి మోకరిల్లుతూ కేసీ కెనాల్ రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఆర్డీఎస్ కుడి కాలువకు నాలుగు టీఎంసీలు కేటాయించినా ఇంతవరకూ కాలువ పనులను చంద్రబాబు సర్కారు చేపట్టకపోవడాన్ని గుర్తు చేస్తున్నారు.

ఇదీ కేసీ కెనాల్ చరిత్ర

డచ్ కంపెనీ 1867-70లోనే తుంగభద్ర-పెన్నా నదులను అనుసంధానం చేస్తూ కర్నూలు-కడప(కేసీ) కెనాల్ తవ్వింది. మొదట్లో దీన్ని సరుకుల రవాణాకు వినియోగించే వారు. డచ్ కంపెనీ నుంచి 1933లో ఈ కాలువను కొనుగోలు చేసిన బ్రిటీష్ ప్రభుత్వం అనంతరం నీటి పారుదల పథకంగా మార్చింది. కేసీ కెనాల్ కింద కర్నూలు జిల్లాలో 1,73,627 ఎకరాలు, వైఎస్సార్ జిల్లాలో 92,001 ఎకరాలు కలిపి మొత్తం 2,65,628 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో ప్రస్తుతం 1,55,208 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తున్నారు.

బడ్జెట్‌పై బాబు వ్యాఖ్యలు విడ్డూరం

- 23సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారు?
- రాష్ట్రానికి అర్థమైన ఆయన సీనియారిటీ
- నాలుగేళ్లుగా సీఎం మోసం చేస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ నేత పార్థసారథి



విజయవాడ సిటీ : కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజన తరువాత నవ్యాంధ్రను అభివృద్ధి చేయాలంటే సీనియర్‌నైన తానే సీఎం కావాలని మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ఆయన సీనియారిటీ ఏమిటో రాష్ట్ర ప్రజలకు ఇప్పుడు బాగా అర్థమైందన్నారు. విజయవాడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్లుగా చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారని సారథి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతుంటే కేంద్రంపై ఎందుకు పోరాటం చేయలేకపోతున్నారో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి అవసరమైన నిధులు ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. టీడీపీలో కొందరు మంత్రులు బడ్జెట్‌పై కేంద్రాన్ని ప్రశంసిస్తుంటే.. మరికొందరేమో అన్యాయం జరిగిందంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఇందులో ఏది నిజమని పార్థసారథి నిలదీశారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజ చట్టంలోని హామీల కోసం ఉద్యమిస్తుంటే ఆ పోరాటాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారే కానీ, కేంద్రం నుంచి చంద్రబాబు ఏమైనా సాధించారా? అన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ సొమ్ముతో 23సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం.. తనపై ఉన్న కేసుల కోసమే వెళ్లినట్లు ఇప్పుడు అర్థమవుతోందన్నారు. ప్రతిపక్షంగా తాము చెప్పింది ఏనాడు చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. పోలవరం కాంట్రాక్టర్లను మార్చడానికి నాగపూర్, ఢిల్లీల చుట్టూ తిరిగిన సీఎం.. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించుకోవడంలో ఆ శ్రద్ధ చూపలేదన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎన్‌డీఏలో భాగస్వాములైన టీడీపీ, బీజేపీ ఇద్దరూ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యశ్రీపై వైఎస్‌ఆర్ ముందుచూపు

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన ఆరోగ్య బీమాను డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 14 ఏళ్ల కిందటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన విషయాన్ని సారథి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజా సంక్షేమంపై ఆ మహానేతకు ఉన్న విజన్ అలాంటిదని ఆయన కొనియారు. ఇన్నేళ్ల తరువాత ఎన్‌డీఏ గుర్తించి ప్రవేశపెట్టిందని తెలిపారు.

మోదీ ప్రయోజనం కోసమే ఏకకాల ఎన్నికలు

సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ప్రతిపాదిస్తున్న ఏకకాల ఎన్నికల విధానం దేశం కోసం కాదని, కేవలం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయోజనం కోసమేనని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం సీపీఐ జాతీయ నాయకులతో కలసి మగ్దూంభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఒక వ్యక్తి కోసం ఏకకాల ఎన్నికలు పెట్టడమంటే ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలకున్న హక్కులను బలవంతంగా తీసుకోవడమే అవుతుందన్నారు. ఆయా రాష్ట్రాల్లో పరిస్థితులకు తగినట్లు రాజకీయ పరిణామాలుంటాయని, వాటికి అనుకూలంగా ప్రభుత్వాలు సైతం మారతాయన్నారు. రాజస్థాన్‌లో బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇస్తోందని భావించామని, కానీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ఊహించలేదన్నారు. దీని ప్రభావం ఇతర రాష్ట్రాల్లోనూ ఉంటుందన్నారు. కేంద్ర బడ్జెట్‌పై మోదీ ప్రభుత్వాన్ని పార్లమెంటులో ఎండగడతామని సురవరం చెప్పారు. అన్ని పార్టీల సమన్వయంతోనే కేంద్రాన్ని నిలదీస్తామన్నారు. తాజా బడ్జెట్‌పై లోతుగా చర్చించి ప్రత్యామ్నాయ చర్యలు సైతం చేపడతామన్నారు. మోదీ ప్రజలకు మోసపూరిత ప్రకటనలు చేస్తూ కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారని, తాజా బడ్జెట్ ఇందుకు నిదర్శనమన్నారు. వైద్య సదుపాయాలు బీమా సంస్థల ద్వారా అమలు చేస్తే ఇబ్బందులుంటాయని, ప్రజలకు సార్వత్రికంగా వైద్య సాయాన్ని అందించాలని, అందులో ప్రభుత్వ ఆస్పత్రుల భాగస్వామ్యం పెంచాలన్నారు. అన్ని రంగాల్లో కాంట్రాక్టు, దినసరి కార్మికులను అనుమతించడం కార్మిక సామాజిక భద్రత లేకుండా చేయడమేనన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ అజీజ్‌పాషా, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య @ 84.. కేసీఆర్ @ 52

వన దేవతలకు తులాభారం సమర్పించిన ఉప రాష్ట్రపతి, తెలంగాణ సీఎం



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తులాభారం

సాక్షి ప్రతినిధి, వరంగల్: వరంగల్ జిల్లా మేడారంలో సమ్మక్క, సారలమ్మ వన దేవతలను ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం దర్శించుకున్నారు. బంగారం (బెల్లం) తులాభారం మొక్కులు చెల్లించుకున్నారు. వెంకయ్యనాయుడు 84 కిలోల బరువు, కేసీఆర్ 52 కిలోల బరువు తూగగా.. వారి బరువు మేరకు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు.

భారత్ దర్శన్ స్పెషల్ యాత్ర

- ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో...
- ఈ నెల 12 నుంచి 20 వరకు

సాక్షి, హైదరాబాద్: ఐఆర్‌సిటీసీ మరో దక్షిణ భారత యాత్రకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 12 నుంచి 20 వరకు కొనసాగే 'భారత్ దర్శన్ స్పెషల్'యాత్రలో కర్ణాటక, గోవాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను సందర్శించ వచ్చని ఐఆర్‌సీటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజీవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైలు ఈ నెల 12న రాత్రి 12.05 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి 20న మధ్యాహ్నం తిరిగి కాచిగూడ చేరుకుంటుంది. ఈ పర్యటనలో హంపి, గోవా, గోకర్ణం, మురుదేశ్వర్, మూకాంబిక, శృంగేరీ శారదాపీఠం, అన్నపూర్ణేశ్వరి, ధర్మస్థల, మైసూర్, బేలూరు, హళిబీడు తదితర ప్రాంతాలను సందర్శించవచ్చు. మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు కొనసాగే ఈ యాత్రలో వసతి, భోజనం, రవాణా తదితర అన్ని సదుపాయాలు ఉంటాయి. స్లీపర్ క్లాస్ చార్జీ రూ.10,375, థర్డ్ ఏసీ చార్జీ రూ.12,265 చొప్పున ఉంటుంది. యాత్రకు సంబంధించిన వివరాలు, బుకింగ్స్ కోసం ఫోన్ 040-27702407, 9701360701 నంబర్లలో సంప్రదించవచ్చు.

డెల్టా ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పు

సాక్షి, హైదరాబాద్: రేపల్లె-సికింద్రాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్ (17626) ప్రయాణ వేళల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ప్రస్తుతం రేపల్లెలో రాత్రి 10.30కు రైలు బయలుదేరి మర్నాడు ఉదయం 7.55 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఏప్రిల్ 8 నుంచి రాత్రి 10.30కు రేపల్లెలో బయలుదేరి మర్నాడు ఉదయం 6.55కు సికింద్రాబాద్ చేరుకోనుంది. సికింద్రాబాద్-వికారాబాద్ (57605) ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం ఉదయం 8.10కు సికింద్రాబాద్‌లో బయలుదేరి 10.20 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. ఏప్రిల్ 9 నుంచి ఉదయం 7.40కి సికింద్రాబాద్‌లో బయలుదేరి 9.25కు వికారాబాద్ చేరుకోనుంది.

ఇద్దరు భారతీయ-అమెరికన్‌ల హత్య

వాషింగ్టన్: అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో ఓ భారతీయ-అమెరికన్ వృద్ధురాలు, ఆమె కొడుకును తుపాకీతో కాల్చి హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాలా మన్వానీ (65) అనే మహిళ, ఆమె కొడుకు రిషి మన్వానీ (32)ని దుండగులు వారి ఇంట్లోనే కాల్చి చంపారు. ఈ వారం మొత్తం మాలా తన విధులకు హాజరు కాకపోవడంతో అనుమానం వచ్చిన సహోద్యోగులు పోలీసులకు సమాచారం అందిచడంతో విషయం వెలుగు చూసింది. ఇద్దరి శరీరాలపై బుల్లెట్ గాయాలున్నాయని పోలీసులు తెలిపారు. ఎవరో ప్రణాళిక ప్రకారమే ఈ పని చేసి ఉంటారనీ, ఇది యాధృచ్చికంగా జరిగిన ఘటన కాదని అంటున్నారు. ఇతర వివరాలేవీ తెలియరాలేదు.

మనోళ్లే కళ్లుమూసుకోండి..!

దాడులు చేయొద్దు • మా మాటంటే లెక్కలేదా?
• గనుల శాఖ అధికారులకు మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేల బెదిరింపులు

సాక్షి, అమరావతి:

- 'ఎవరిపేర్లతో ఉన్నప్పటికీ ఆ గనులు మావే.. వాటి జోలికెళ్లొద్దు. చిన్న చిన్న తప్పులు జరుగుతుంటాయి. చూసీ చూడనట్లు ఉండాలి. చూడటం ఇష్టం లేకపోతే కళ్లు మూసుకోండి. జరిగిందేదో జరిగింది. ఇక మా మాట మీరి దాడులు, గీడులు అంటే శంకరగిరి మాన్యాలు పట్టిస్తాం..' గనుల శాఖ అధికారికి ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఒక మంత్రి చేసిన హెచ్చరిక ఇదీ.
- 'తాత్కాలిక పర్మిట్లతోనే ఆ క్వారీ నడుస్తుంది. దాని జోలికెళ్లవద్దు. ఎవరైనా కాదూ కూడదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మేము చెప్పినట్లు నడుచుకోవడం ఇష్టంలేకపోతే బదిలీ చేయించుకుని వెళ్లిపోండి. లేదంటే దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లండి. మా అనుచరుల (బినామీల) గ్రానైట్ క్వారీలపై దాడులు చేయాలని ప్రయత్నిస్తే సస్పెండు చేయిస్తా..' గనుల శాఖ సహాయ సంచాలకునికి రాయలసీమకు చెందిన ఒక మంత్రి హుకుం.
- '25 శాతం అక్రమాలు మాత్రమే జరుగుతుంటాయి. వీటిని పట్టుకుని గనుల పైనా, ఖనిజ రవాణా వాహనాలపైనా దాడులు చేయడమంటే లీజుదారులను భయపెట్టడం, అవమానించడమే అవుతుంది. పైపెచ్చు. మన ప్రభుత్వంలో మనవారి గనులపైనే దాడులు చేస్తే ఎలా.. చూసీ చూడనట్లు వెళ్లాలని చెప్పండి...' గనుల శాఖ మంత్రికి, ఉన్నతాధికారులకు అధికార పార్టీ నేతల విజ్ఞప్తి.

అడ్డగోలుగా ఖనిజాలు తవ్వి అక్రమంగా తరలిస్తూ వందల కోట్లు దండుకుంటున్నా చూసీచూడనట్లు ఉండాలని గనుల శాఖ అధికారులపై అధికార పార్టీ నేతలు చేస్తున్న తీవ్ర ఒత్తిళ్లకు మచ్చుకు ఇవి ఉదాహరణలు మాత్రమే. అటు శ్రీకాకుళం నుంచి ఇటు కర్నూలు జిల్లా వరకూ అన్ని జిల్లాల్లోనూ కొందరు మంత్రులు, అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు బినామీ పేర్లతో గ్రానైట్, సున్నపురాయి, ఇనుప ఖనిజం, కంకర క్వారీలు, లేటరైట్, బెరైటీస్ తదితర ఖనిజ లీజులున్నాయి. లీజులున్న వారు



కొందరు లీజు పరిధులు దాటి బయట ప్రాంతాల్లోనూ తవ్వకాలు జరుపుతుండగా ఇంకొందరు తవ్విన ఖనిజంలో నాలుగో వంతుకు కూడా లెక్క చూపకుండా అక్రమాలు సాగిస్తూ సర్కారుకు చెల్లించాల్సిన ఖనిజ రాయల్టీ ఎగవేస్తున్నారు. కృష్ణా, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో కొందరు కీలక ప్రతినిధులు లీజులు లేకుండానే తవ్వకాలు సాగిస్తూ కోట్లు దండుకుంటున్నారు. ప్రకాశం జిల్లాలో ఒక మంత్రి భారీగా గ్రానైట్ అక్రమ తవ్వకాలు సాగిస్తున్నా అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. చిత్తూరు, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వానికి చూపుతున్న లెక్కలకు పోలికా పొంతనా లేదు. ఏటా వందల కోట్ల రాయల్టీ ఎగవేస్తున్న విషయం బహిరంగ రహస్యమేనని క్షేత్రస్థాయి అధికారులు అంగీకరిస్తున్నారు.

అడ్డుకున్నందుకు బదిలీ...

రాయలసీమ జిల్లాలో బినామీ పేరుతో ఒక మంత్రి నిర్వహిస్తున్న క్వారీకి నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక పర్మిట్లు ఇచ్చేందుకు నిరాకరించినందుకు ఆరు నెలల క్రితం గనుల శాఖ సహాయ సంచాలకుడిని బదిలీ చేయించారు. గతంలో శ్రీకాకుళం జిల్లాలో అక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన అధికారి చివరకు చిక్కుల్లో పడి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆడింది ఆట పాడింది పాట అంటూ తలాడిస్తూ ఉండిపోయారు. 'ఇటీవల కృష్ణా జిల్లాలో క్వారీలో ప్రమాదం జరిగి ముగ్గురు చనిపోతే మృతుల కుటుంబాలకు ఎంతో కొంత ఇచ్చి విషయాన్ని ఈ విషయం బాహ్య ప్రపంచం దృష్టికి రాకుండా అధికార పార్టీ నేతలు మేనేజ్ చేశారు. ఇంత చేస్తున్న వారు అధికారులను బెదిరించడం ఒక లెక్కా... దాడులు చేయవద్దని మమ్మల్ని బెదిరిస్తున్న విషయం, తీవ్ర స్థాయిలో ఒత్తిడి ఉన్న విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం...' అని సీమ ప్రాంతానికి చెందిన ఒక సహాయ సంచాలకులు, కోస్తా ప్రాంతానికి చెందిన ఒక ఉప సంచాలకులు 'సాక్షి'కి తెలిపారు.

ఒత్తిళ్ల నుంచి తట్టుకునేందుకు

రాజకీయ ఒత్తిళ్ల గురించి ఒక అధికారి వద్ద ప్రస్తావించగా 'ఒత్తిళ్లు ఉన్న విషయం వాస్తవమే. అక్కడ పనిచేసేవారు కొంత మొహమాటంతో, భయంతోనూ వ్యవహరించక తప్పనిపరిస్థితి. అందుకే రాష్ట్ర స్థాయిలో ఒక ప్రాంతం వారితో మరో ప్రాంతంలోనూ, మరో ప్రాంతం వారితో ఇంకో ప్రాంతంలోనూ విజిలెన్సు దాడులు చేయించాలని నిర్ణయించాం. ఈమేరకు రాయలసీమ జిల్లాల్లో జరిపించాం... ఇంకా పూర్తి ఫలితాలు రాలేదు...' అని భూగర్భ గనుల శాఖకు చెందిన ఒక అధికారి తెలిపారు.

• తెలంగాణ

హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌పై ఏసీబీ దాడులు

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రెండోసారి...
- రూ. 5.35 కోట్ల ఆస్తుల గుర్తింపు.. మార్కెట్ విలువ రూ.25 కోట్లు
- పురుషోత్తమ్‌రెడ్డి, అతడి బావమరిది ఇళ్లు సీజ్ చేసిన ఏసీబీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్లానింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కట్టా పురుషోత్తంరెడ్డి ఇంటిపై శుక్రవారం ఏసీబీ దాడులు నిర్వహించింది. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ, సాగర్ సొసైటీ, ఆయన కార్యాలయంతో పాటు మరో తొమ్మిది ప్రాంతాలు, బంధువుల ఇళ్లపై ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.5.35 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. వీటికి సంబంధించిన డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం గుర్తించిన ఆస్తుల మార్కెట్ విలువ రూ.25 కోట్లకుపైగా ఉంటుందని ఏసీబీ పేర్కొంది. 1985లో బిల్డింగ్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగంలో చేరిన పురుషోత్తమ్‌రెడ్డి ప్రస్తుతం డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్నారు. గతంలో 2009లోనూ పురుషోత్తమ్‌రెడ్డిపై ఏసీబీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. ఆ సమయంలో రూ.3.7 కోట్ల అక్రమాస్తులు కూడబెట్టినట్టు ఏసీబీ డైరెక్టర్ జనరల్ పూర్ణచందర్‌రావు ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు.

పరారీలో పురుషోత్తమ్‌రెడ్డి

పురుషోత్తమ్‌రెడ్డి నెల రోజుల నుంచి సెలవులో ఉన్నట్టు తెలిసింది. దాడుల సందర్భంగా సాగర్ సొసైటీలోని మరో ఇంటికి వెళ్లిన ఏసీబీ అధికారులు తాళం వేసి ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఆ ఇంటిని సీజ్ చేసి, ఆ మేరకు ఉత్తర్వులను ఇంటి తలుపులకు అంటించారు. అదే విధంగా పురుషోత్తమ్‌రెడ్డికి బినామీగా ఉన్న ఆయన బావమరిది ఇళ్లు సైతం తాళం వేసి ఉండటంతో ఆ ఇళ్లను సైతం సీజ్ చేసినట్టు ఏసీబీ డీజీ తెలిపారు. ప్రస్తుతం పురుషోత్తమ్‌రెడ్డితో పాటు ఆయన బావమరిది శ్రీనివాస్‌రెడ్డి పరారీలో ఉన్నారని, వారు దొరకగానే వీరి ఇళ్లను తెరిచి మరోసారి సోదాలు నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

మరో ఇద్దరిపైనా డీఏ కేసులు నమోదు...

ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె భాస్కర్, కరీంనగర్ ఏఎస్ఐ మోహన్‌రెడ్డిపై కూడా కేసులు నమోదు చేసినట్టు ఏసీబీ డీజీ పూర్ణచందర్‌రావు మరో పత్రికా ప్రకటనలో తెలిపారు.

తెలంగాణలో రాత్రిళ్లు చలి తీవ్రం

అన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రాత్రి వేళల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గణనీయంగా పడిపోతున్నాయి. గత 24 గంటల్లో ఆదిలాబాద్‌లో 7 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలం, ఖమ్మంలలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఏకంగా 9 డిగ్రీలు, మెదక్‌లో 6 డిగ్రీలు తగ్గి 10 డిగ్రీల చొప్పున నమోదు కావడం గమనార్హం. రామగుండంలో ఐదు డిగ్రీలు తక్కువగా 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్‌లో 4 డిగ్రీలు తగ్గి 13 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. హన్మకొండలో 14, నిజామాబాద్, హకీంపేటల్లో 15, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లలో 17 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలావుంటే పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కాస్తంత పెరిగాయి. ఖమ్మంలోనైతే సాధారణం కంటే 4 డిగ్రీలు ఎక్కువగా 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. కాగా శని, ఆదివారాల్లో ఆదిలాబాద్ జిల్లాలో చలిగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ప్రధానిని ఒప్పించి బీసీ బిల్లు పెట్టించాలి

- టీటీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య డిమాండ్
- 6న కలెక్టరేట్ల వద్ద నిరాహార దీక్షలు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు అఖిలపక్షాలతో వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని కలసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేవిధంగా ఒప్పించాలని తెలంగాణ తెలుగుదేశం ఎమ్మెల్యే, బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో అత్యధిక శాతమున్న బీసీలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. సంపద సృష్టిస్తున్న బీసీలకు ఏ రంగంలోనూ వాటాలేదని, ఇప్పటికైనా అన్ని రంగాల్లో వాటా ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ధనస్వామ్యంగా మారిన ఈ ప్రజాస్వామ్యంలో డబ్బులు లేని బీసీలు ఎన్నికల్లో గెలవలేరని అన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, క్రీమీలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లను 27 నుండి 56 శాతానికి పెంచాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నామని తెలిపారు.

ఒంటరి పోరే మేలు

- టీడీపీతో పొత్తుకు బీజేపీ దూరం
- అమిత్‌షా భేటీలో తెలంగాణ రాష్ట్ర నేతల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: టీడీపీతో పొత్తు నుంచి బయటకు రావాలని బీజేపీ భావిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ణయించుకుంది. కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు గురువారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీ బండారు దత్తాత్రేయ, బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో సొంతంగా పోటీ చేయడమే మేలని, టీడీపీతో పొత్తు వద్దని అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఒంటరి పోరుకే సిద్ధం కావాలని అమిత్ షా స్పష్టం చేశారని సమాచారం. టీడీపీ కన్నా బీజేపీ బలంగా ఉందని, కొన్ని చోట్ల కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టే పరిస్థితిలో ఉందని తమ అంతర్గత సర్వేలో తేలిందని వారు అమిత్‌షాతో పేర్కొన్నట్లు తెలిసింది. అధికార టీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, దాన్ని అందిపుచ్చుకుని పుంజుకునే సత్తా కాంగ్రెస్‌కు లేదని, దీన్ని ఉపయోగించుకుని బలపడే సరైన సమయం ఇదేనని పేర్కొన్నట్లు తెలిసింది. కాగా, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, ఈ మేరకు ఢిల్లీ నాయకత్వం కూడా ఒప్పుకొందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయం అని, అందుకే తమను చూసి టీఆర్ఎస్ భయపడుతోందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పెద్దమొత్తంలో నిధులిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తోందని చెప్పారు. ఈ నెలలో అమిత్‌షా రాష్ట్రానికి వచ్చి మరోసారి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

నియోజకవర్గాల పునర్విభజన లేనట్లే

నియోజకవర్గాల పునర్విభజన ఇప్పట్లో ఉండదని మరోసారి స్పష్టమైంది. తెలంగాణ బీజేపీ నేతలతో జరిగిన సమావేశంలో అమిత్‌షా ఈ విషయాన్ని తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్య అలాగే ఉంటుందని, వాటి సంఖ్య పెంచే యోచన లేదని స్పష్టం చేశారని సమాచారం. ఎన్నికలకు ఎక్కువ సమయం లేనందున అందుకు తగ్గ వ్యూహాలు సిద్ధం చేసుకోవాలని, అభ్యర్థుల ఎంపిక, పనితీరుపై దృష్టి సారించాలని పేర్కొన్నట్లు తెలిసింది. ముందస్తు ఎన్నికలు జరుగుతాయన్న చర్చల్లో కూడా నిజం లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం. సాధారణ షెడ్యూల్ ప్రకారమే వచ్చే ఎన్నికలు జరుగుతాయని, ముందస్తు పేరుతో హడావుడి పడాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారని పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి.

ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ ప్రవేశాలు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్: ఎయిమ్స్).. న్యూఢిల్లీతోపాటు పాట్నా, భోపాల్, జోధ్‌పూర్, భువనేశ్వర్, రిషికేశ్, రాయ్‌పూర్, గుంటూరు (మంగళగిరి), నాగపూర్‌లోని ఎయిమ్స్‌ల్లో 2018కి ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది. ఇంగ్లిష్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు అర్హులు. ఈ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో 2018, ఫిబ్రవరి 5 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. చివరి తేదీ మార్చి 5, 2018. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక నిర్వహిస్తారు. వయోపరిమితి, దరఖాస్తు రుసుం తదితర పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.aiimsexams.org

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

బడ్జెట్ 2018 | జాబ్స్, స్కిల్స్



ఉపాధికి ఊతమిచ్చేనా..!

ఓ వైపు ఉద్యోగ కల్పన గురించి బడ్జెట్‌లో ప్రత్యక్ష చర్యలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతుంటే... మరోవైపు డిజిటల్ ఇండియాకు రెట్టింపు బడ్జెట్.. 2022 నాటికి 50 లక్షల మందికి నైపుణ్యాల శిక్షణ.. ప్రధాన మంత్రి ముద్ర యోజన.. చిన్న మధ్యతరహా పరిశ్రమలకు కేటాయింపులు.. 5లక్షల వైఫై హాట్ స్పాట్స్ వంటి కార్యక్రమాలు పరోక్షంగా ఉద్యోగ కల్పనకు దోహదపడతాయని ప్రభుత్వం పేర్కొంటోంది. దేశంలో కోట్ల మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో.. 2018-19 బడ్జెట్‌లో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి ప్రతిపాదనలపై నిపుణుల విశ్లేషణ...

1.86 కోట్ల మంది నిరుద్యోగులు

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తాజా నివేదిక ప్రకారం దేశంలో నిరుద్యోగిత రేటు 3.5 శాతంగా ఉంది. ముఖ్యంగా 15-24 ఏళ్ల వయసు పరంగా 2010లో 10 శాతం ఉన్న నిరుద్యోగిత రేటు.. 2017 నాటికి 10.5 శాతానికి చేరుకుంది. 2018లో దేశంలో 1.86 కోట్ల మంది నిరుద్యోగులు ఉండగా... 2019 నాటికి ఆ సంఖ్య 1.89 కోట్లకు చేరుకుంటుందని ఐఎల్‌వో నివేదిక పేర్కొంది. దేశంలో ప్రతి నెలా 10 లక్షల మంది కొత్తగా శ్రామిక శక్తికి జతపడుతున్నారు. కానీ, ఉపాధి కల్పన ఆ స్థాయిలో జరగడంలేదు. 2016లో ప్రారంభించిన ప్రధాన మంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన (పీఎంఆర్‌పీవై) కింద ఇప్పటి వరకూ 21,64,575 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. పీఎంఆర్‌పీవై కింద 2018-19 బడ్జెట్‌లో రూ.1,652 కోట్లు కేటాయించారు.

ఎగుమతులు, ఎంఎస్‌ఎంఈకి ఊతం

బడ్జెట్‌కు కొద్ది రోజుల ముందు నుంచే దేశంలో ప్రధాన సమస్యగా ఉన్న నిరుద్యోగ సమస్యపై సర్వత్రా చర్చ జరిగింది. మౌలిక సదుపాయాల కల్పనపై వ్యయం, ఎగుమతులకు ప్రోత్సాహం వంటివి ఉద్యోగావకాశాలు పెంచుతాయని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ఉపాధి కల్పన తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని ఆయన తెలిపారు. అందుకు అనుగుణంగా 2018-19 బడ్జెట్‌లో ఎగుమతులకు ప్రోత్సాహం ఇవ్వడం, గ్రామీణ, మౌలిక సదుపాయాల రంగాలకు కేటాయింపులు పెంచడం; చిన్న తరహా పరిశ్రమలకు పన్ను మినహాయింపులు; టెక్స్‌టైల్స్ రంగానికి ప్రత్యేక ప్యాకేజీ వంటి చర్యలు చేపట్టినట్టు భావిస్తున్నారు. 2018-19 బడ్జెట్‌లో ఉద్యోగాల సృష్టి దిశగా టెక్స్‌టైల్ రంగానికి రూ.7,148 కోట్ల ప్యాకేజీ; అలాగే చిన్న, మధ్యతరహా రంగానికి రూ.3,794 కోట్లు; నవకల్పనలకు ప్రోత్సాహం తదితర ప్రతిపాదనలు చేశారు. దేశంలో తోళ్ల పరిశ్రమ ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశముందని భావిస్తున్నారు. లెదర్ అండ్ ఫుట్‌వేర్ రంగంలో ఉపాధి కల్పించేలా పీఎంఆర్‌పీవై కింద శిక్షణ ఇస్తున్నారు.

స్థిర కాలావధి ఉద్యోగాలు

తాజా బడ్జెట్‌లో స్థిర కాలావధి ఉద్యోగాల (ఫిక్స్‌డ్ టెన్యూర్ జాబ్స్) సౌకర్యం అన్ని రంగాలకు వర్తింపచేయడం వంటి కీలక ప్రతిపాదనలు చేశారు. స్థిర కాలావధి ఉద్యోగాల విధానంవల్ల కంపెనీలు అవసరమైన కాలావధికి మాత్రమే ఉద్యోగులను నియ మించుకొని... ఉత్పత్తి లేనప్పుడు తొలగించే వెసులుబాటు లభిస్తుంది. ఈ 'నియమించు-తొలగించు'(హైర్ అండ్ ఫైర్) విధానం వల్ల సంస్థలు వ్యవస్థీకృత రంగంలో ఎక్కువ ఉద్యోగాలను కల్పించేలా ప్రోత్సహించినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు ఈ స్థిర కాలావధి విధానం వస్త్ర తయారీ రంగంలో మాత్రమే ఉంది. ప్రతిపాదిత స్థిర కాలావధి విధానాన్ని కార్యనిర్వాహక ఆదేశం (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్)ద్వారా అమలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రతిపాదిత విధానాన్ని నిపుణులు స్వాగతిస్తూనే.. పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాయి. స్థిర కాలావధి ఒప్పందం.. ద్వైపాక్షికం కాకుండా.. త్రైపాక్షికం (ప్రభుత్వం, సంస్థ, ఉద్యోగి) ఒప్పందంలా ఉండాలని తద్వారా ఉద్యోగి పని దినాలు కోల్పోకుండా చూడొచ్చని పేర్కొంటున్నారు.

డిజిటల్ ఇండియా

తాజా బడ్జెట్‌లో టెక్నాలజీకి ఊతం ఇచ్చే చర్యలను పరిశ్రమ వర్గాలు స్వాగతిస్తున్నాయి. ముఖ్యంగా డిజిటల్ ఇండియాకు ప్రోత్సాహం ఉద్యోగ కల్పనతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం; ఆరోగ్యరంగంలో మెరుగైన సేవలు, గ్రామీణ ప్రగతికి సైతం దోహదపడతాయని భావిస్తున్నారు. డిజిటల్ ఇండియా కార్యక్రమానికి బడ్జెట్‌లో గత కేటాయింపు కంటే రెట్టింపు చేసి రూ.3,073కోట్లకు పెంచారు. ఇది డిజిటల్ ఎకానమీ దిశగా అడుగులు వేసేందుకు ఉపయోగపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/రోబోటిక్స్, బ్లాక్‌చైన్ టెక్నాలజీలో పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. తద్వారా భవిష్యత్ టెక్నాలజీ పరంగా మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్, కాగ్నిటివ్స్, ఆటోమేషన్‌కు భారత్ కేంద్రంగా మారే అవకాశం ఉంది. ఈ సరికొత్త టెక్నాలజీ రంగంలో యువత ఉద్యోగాలు అందుకునే వీలు కలుగుతుంది. దీంతోపాటు గ్రామాల్లో 5 లక్షల వై-ఫై హాట్ స్పాట్స్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం... అందుకోసం రూ.10,000 కోట్ల కేటాయింపు వల్ల గ్రామీణ అనుసంధానం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నారు. ఇలా డిజిటల్ ఇండియా దిశగా బడ్జెట్‌లో చేసిన పలు ప్రతిపాదనలు ఉద్యోగాల కల్పనకు దోహదం చేసే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు.

స్కిల్స్, మహిళా శ్రామిక శక్తి

కొత్తగా ఉద్యోగాల్లో చేరిన మహిళలు చెల్లించే ఈపీఎఫ్ చందాను తగ్గించడం, 2022 నాటికి 50 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ వంటి పలు చర్యలను ప్రతిపాదించింది. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన మహిళల ఈపీఎఫ్ చందాను 12 శాతం నుంచి 8 శాతానికి తగ్గించారు. శ్రామిక శక్తిలో మహిళల సంఖ్యను పెంచేందుకు, వారి చేతికందే వేతనం మొత్తం పెంచేందుకు ఈ చర్య దోహదపడుతుందని భావిస్తున్నారు. అలాగే స్వయం ఉపాధి దిశగా కేంద్రం ప్రవేశ పెట్టిన ముద్రా యోజన ద్వారా 2018-19లో రూ.3 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించడం కూడా ఉత్పత్తికి ఊతమిచ్చి.. ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు.

స్కిల్స్‌లో శిక్షణ.. స్పష్టత ఉంటే బాగుండేది



"వచ్చే నాలుగేళ్లలో 50 లక్షల మంది యువతకు నైపుణ్యాల అభివృద్ధిలో శిక్షణ ఇవ్వాలనే నిర్ణయంలో స్పష్టత ఉంటే బాగుండేది. వాస్తవానికి ప్రస్తుతం అమలవుతున్న నేషనల్ అప్రెంటీస్ షిప్ ప్రోగ్రామ్ పరిధిలోనే ఈ శిక్షణ అని పేర్కొన్నారు. అయితే ఇందులో గమనించాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. నిర్దేశిత లక్ష్యంగా పేర్కొన్న 50 లక్షల మంది జాబితాలో ఏఏ కోర్సుల విద్యార్థులు ఉంటారు? అదే విధంగా ఒక్కో కోర్సుకు సంబంధించి ఎంత మందికి శిక్షణనివ్వదలచుకున్నారు? ఈ శిక్షణకు సంబంధించి ఫెసిలిటేషన్ సెంటర్స్‌పై స్పష్టత ఇస్తే బాగుండేది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పరిధిలో ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్‌తో శిక్షణ కేంద్రాలు నెలకొల్పి అన్ని వర్గాల వారికి శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, స్కిల్ ఇండియా, అటల్ ఇన్నోవేషన్ మిషన్ వంటివి ఎన్నో కార్యక్రమాలు యువతకు ఆయా రంగాల్లో శిక్షణనిచ్చేందుకు నెలకొల్పడం జరిగింది. వీటిపై ఇంకా యువతకు సరైన అవగాహన లభించట్లేదు. ఈ దిశగానూ చర్యలు తీసుకోవాలి. 50 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోణంలో గమనించాల్సిన అంశం.. నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రామ్ కింద వీటిని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇది ప్రధానంగా టెక్నికల్ అర్హతలు ఉన్న విద్యార్థులకు ఉద్దేశించింది. మరి మిగతా కోర్సుల విద్యార్థులకు అవసరమైన జాబ్ స్కిల్స్ అందించేందుకు కొత్త కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది.

- దిలీప్ చెనాయ్, ఫిక్కీ డైరెక్టర్ జనరల్, ఎన్‌ఎస్‌డీసీ మాజీ సీఈఓ.

ఏఐలో ఉపాధి అవకాశాలు



"తాజా బడ్జెట్‌లో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై పరిశోధనలు యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని చెప్పొచ్చు. అదేవిధంగా రోబోటిక్స్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక టెక్నాలజీలకు ఊతమిచ్చేలా చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించడం కూడా ఈ రంగాల్లో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందు కు దోహదం చేస్తుంది. బడ్జెట్‌లో డిజిటల్ ఇండియాకు ప్రోత్సాహం ద్వారా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతోపాటు దాని అనుబంధ రంగాల్లోనూ వృద్ధి నమోదవడమే కాకుండా.. యువతకు భారీ అవకాశాలు లభిస్తాయి. రానున్న కాలంలో డిజిటల్ ఇండియా వంటి పథకాలను మరింత బలోపేతం చేసే సంకేతాలు కనిపిస్తున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుంటే యువతకు ఆధునిక విభాగాల్లో అవకాశాలు లభించడం ఖాయం. మధ్యతరహా సంస్థలకు పన్ను మినహాయింపులు, ఇతర రాయితీలను కల్పించడం కూడా ఉపాధి కోణంలో కలిసొచ్చే అంశంగా పేర్కొనొచ్చు. ఈ మినహాయింపులు, రాయితీల ఫలితంగా ఈ రంగంలో భారీ ఎత్తున పెట్టుబడులు వస్తాయి. దానికి అనుగుణంగా నూతన మానవ వనరుల కోసం అన్వేషణ సాగుతుంది. ఇది యువతకు ఉపాధి అవకాశాలను పెంచుతుంది. వాస్తవానికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు వాటికి సంబంధించిన కార్యక్రమాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించకపోవడం వాస్తవమే. అయితే ఇక్కడ బడ్జెట్‌లో ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యం కల్పించింది. ఇది కచ్చితంగా అన్ని రంగాల్లో అవకాశాల కల్పనకు దోహదం చేస్తుంది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి భారీ స్థాయిలో కేటాయింపుల ఫలితంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ప్రస్తుత బడ్జెట్ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకుంటే.. సమీప భవిష్యత్తులో అందరికీ అవకాశాలు లభించే విధంగా రూపొందించినట్లు చెప్పొచ్చు. దీనికి అనుగుణంగా యువత ఇప్పటినుంచే అడుగులు వేయాలి. ఎప్పటికప్పుడు కొత్తగా అమల్లోకి వచ్చే టెక్నాలజీ, పథకాలను అందిపుచ్చుకుని ఉద్యోగావకాశాలు పొందేందుకు కృషి చేయాలి.

- వి.రాజన్న, వైస్ ప్రెసిడెంట్, టీసీఎస్ టెక్నాలజీ బిజినెస్ యూనిట్ హెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్.

బులెటిన్ బోర్డ్

ఐవోసీఎల్... 58 జూనియర్ ఆపరేటర్లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) ఈస్టర్న్ రీజియన్ మార్కెటింగ్ డివిజన్... 58 జూనియర్ ఆపరేటర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** జూనియర్ ఆపరేటర్.
- **స్టేట్/రీజియన్ వారీ ఖాళీలు:** అండమాన్ నికోబార్-2; అరుణాచల్‌ప్రదేశ్-2; అసోం-18; బిహార్-2; జార్ఖండ్-6; మణిపూర్-1; మేఘాలయ-1; ఒడిశా-7; త్రిపుర-3; పశ్చిమ బెంగాల్-16.
- **అర్హతలు:** కనీసం 45 శాతం (ఎస్సీ/ఎస్టీ-40 శాతం) మార్కులతో ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యతోపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్. అలాగే హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో కనీసం ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 18-26 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ ప్రొఫిషియెన్సీ ఫిజికల్ టెస్ట్ (ఎస్‌పీపీటీ). ❖ రాతపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెరిట్ జాబితా నుంచి 1:2 నిష్పత్తిలో ఎస్‌పీపీటీకి ఎంపిక చేస్తారు.
- **ఎస్‌పీపీటీ విధానం:** దీన్ని అర్హత పరీక్షగా పరిగణిస్తారు. ఇందులో టూల్స్/ఎక్విప్‌మెంట్ నిర్వహణలో అభ్యర్థుల టెక్నికల్ స్కిల్స్/ప్రొఫిషియెన్సీ/ఫిజికల్ ఎబిలిటీని పరిశీలిస్తారు.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ రూ.150.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి 'పోస్ట్‌బాక్స్ నెం.10205, బాలీగంజ్ పోస్ట్ ఆఫీస్, కోల్‌కతా-700019, వెస్ట్ బెంగాల్' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 10, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 16, 2018.
- **వెబ్‌సైట్:** www.iocl.com

ఆర్‌బీఐలో 27 అసిస్టెంట్ పోస్టులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)... స్పెషల్ డ్రైవ్-2018 కింద దేశవ్యాప్తంగా ఉన్న తన కార్యాలయాల్లోని 27 ఖాళీల భర్తీకి దివ్యాంగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** అసిస్టెంట్
- **వేతన శ్రేణి:** రూ.13,150-రూ.34,990 (ప్రారంభ బేసిక్ పే-రూ.14,650).
- **కార్యాలయాల వారీ ఖాళీలు:** అహ్మదాబాద్-2; బెంగళూరు-1; భోపాల్-1; భువనేశ్వర్-1; చండీగఢ్-3; హైదరాబాద్-1; జైపూర్-2; జమ్మూ-1; కాన్పూర్ అండ్ లక్నో-5; కోల్‌కతా-4; ముంబై-4; నాగ్‌పూర్-1; పాట్నా-1. ❖ **అర్హతలు:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ వర్డ్ ప్రాసెసింగ్ తెలిసుండాలి. అలాగే దరఖాస్తు చేసుకొనే కార్యాలయం ఉన్న ప్రాంతానికి చెందిన స్థానిక భాషలో పట్టు (రాయడం, మాట్లాడడం, చదవడం) ఉండాలి. సాయుధ దళాల్లో కనీసం 15 ఏళ్లు పనిచేసిన మాజీ సైనికోద్యోగ కేటగిరీకి చెందిన అభ్యర్థులకు పదోతరగతి/తత్సమాన విద్య ఉత్తీర్ణత సరిపోతుంది.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి 20-28 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (ఎల్‌పీటీ). ❖ **లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (ఎల్‌పీటీ):** మెయిన్ ఎగ్జామినేషన్‌లో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారికి దీన్ని నిర్వహిస్తారు. అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న కార్యాలయం ఉన్న రాష్ట్రానికి చెందిన స్థానిక/అధికార భాషలో పట్టుపై పరీక్ష ఉంటుంది. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.50 (ఇంటిమేషన్ చార్జీలు). స్టాఫ్ అభ్యర్థులకు మినహాయింపు ఉంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** ఫిబ్రవరి 19, 2018.
- **వెబ్‌సైట్:** www.rbi.org.in

'పవర్ గ్రిడ్'లో 150 ఖాళీలు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్).. 150 ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** అసిస్టెంట్ ఇంజనీర్ ట్రైనీ (ఏఈటీ).
- **స్టైపెండ్/వేతనం:** ఏడాది శిక్షణలో స్టైపెండ్ నెలకు రూ.24,500; ఉద్యోగంలో నియమితులయ్యాక వేతనశ్రేణి రూ.20,600-రూ.46,500. ❖ **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్-100, ఎలక్ట్రానిక్స్-20, సివిల్-20, కంప్యూటర్ సైన్స్-10. ❖ **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి కనీసం 65 శాతం మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో బీఈ/బీటెక్/బీఎస్సీ (ఇంజనీరింగ్). అలాగే గేట్ 2017 స్కోర్.
- **వయసు:** 2016, డిసెంబర్ 31 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** గేట్-2017 స్కోర్, గ్రూప్ డిస్కషన్(జీడీ), ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. ఇందులో గేట్ స్కోర్‌కు 85శాతం, జీడీకి 3శాతం, ఇంటర్వ్యూకు 12 శాతం వెయిటేజీ ఉంటుంది. ఇంటర్వ్యూలో అన్‌రిజర్వుడ్‌కు 40శాతం, మిగిలిన కేటగిరీలకు 30శాతం మార్కులు రావాలి.
- **దరఖాస్తు రుసుం:** రూ.200; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ/డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** ఫిబ్రవరి 17, 2018.
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్... 131 ఆపరేటర్లు


లక్నోలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) యాక్సెసరీస్ డివిజన్.. నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లోని 131 ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ❖ **పోస్టు:** ఆపరేటర్

- **వేతనం:** రూ.40,000. ❖ **ట్రేడ్ విభాగాల వారీ ఖాళీలు:** మెషినిస్ట్-22, టర్నర్-21, గ్రైండర్-5, ఫిట్టర్-59, ఎలక్ట్రానిక్స్ మెకానిక్-15, ఎలక్ట్రీషియన్-5, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్-4.
- **అర్హతలు:** సంబంధిత ట్రేడ్ విభాగాల్లో ఐటీఐ+ ఎన్ఏసీ/ఎన్‌సీటీవీటీ. అలాగే సంబంధిత రంగంలో ఉద్యోగానుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** అకడమిక్ మార్కుల మెరిట్, రాతపరీక్ష. ❖ **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.200; మిగిలిన కేటగిరీలకు ఫీజు లేదు. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 14, 2018.
- **వెబ్‌సైట్:** www.hal-india.com

పద్మ అవార్డులు-2018

జీకే, కరెంట్ అఫైర్స్

69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం జనవరి 25న 85 మందికి పద్మ పురస్కారాలు ప్రకటించింది. ముగ్గురికి పద్మ విభూషణ్, తొమ్మిది మందికి పద్మభూషణ్, 73 మందికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. గ్రహీతల్లో 14 మంది మహిళలు, ఆరుగురు క్రీడాకారులు, 16 మంది విదేశీయులు/ప్రవాస భారతీయులు ఉన్నారు. మరణానంతరం ముగ్గురికి పురస్కారాలు లభించాయి.



- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కిడాంబి శ్రీకాంత్‌కు పద్మశ్రీ పురస్కారం లభించింది. ఈ ఏడాది పద్మ అవార్డుకు ఎంపికైన ఏకైక తెలుగువ్యక్తి.. శ్రీకాంతే కావడం గమనార్హం. ఆసియాన్ కూటమిలోని పది దేశాల వ్యక్తులకు పద్మశ్రీ (దేశానికి ఒకటి చొప్పున) పురస్కారాలు ప్రకటించారు. ఆసియాన్ కూటమిలో బ్రూనై, కాంబోడియా, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్, లావోస్, వియత్నాం, మయన్మార్, థాయిలాండ్, ఫిలిప్పీన్స్ సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈసారి ప్రతిఫలాపేక్ష లేకుండా సేవా కార్యక్రమాలు చేపడుతున్న అనేక మందికి పద్మ అవార్డులు దక్కడం విశేషం.

పద్మ విభూషణ్




1. ఇళయరాజా (కళలు). తమిళనాడుకు చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు.
2. గులాం ముస్తఫా ఖాన్ (కళలు). మహారాష్ట్రకు చెందిన ప్రముఖ హిందూస్థానీ గాయకుడు.
3. పి.పరమేశ్వరన్ (సాహిత్యం, విద్య). తిరువనంతపురంలోని భారతీయ విచార కేంద్రం వ్యవస్థాపక డైరెక్టర్.

పద్మభూషణ్

1. మహేంద్రసింగ్ ధోనీ (క్రీడలు). ధోనీ కెప్టెన్సీలో భారత్ 2007లో టీ-20 ప్రపంచకప్; 2011లో వన్డే ప్రపంచకప్; 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలుచుకుంది.
2. పంకజ్ అద్వానీ (క్రీడలు). బిలియర్డ్స్/స్నూకర్ క్రీడాకారుడు. క్యూ స్పోర్ట్స్‌లో 18 ప్రపంచ టైటిల్స్ సాధించిన ఏకైక క్రీడాకారుడు.
3. ఫిలిపోస్ మార్ క్రిసోస్టోమ్ - ఆధ్యాత్మికం.
4. ఆర్.నాగస్వామి - ఆర్కియాలజిస్ట్.
5. లక్ష్మణ్ పాయ్ - కళలు, చిత్రలేఖనం.
6. అరవింద్ పారిఖ్ - కళలు, సంగీతం.
7. శారదా సిన్హా - కళలు, సంగీతం.
8. వేద్ ప్రకాశ్ నందా - విద్య, సాహిత్యం; అమెరికా.
9. అలెగ్జాండర్ కదకిన్ -ప్రజా వ్యవహారాలు. భారత్‌లో రష్యా రాయబారిగా విధులు నిర్వర్తిస్తూ గతేడాది మరణించారు. తాజాగా కదకిన్‌కు పద్మభూషణ్ ప్రకటించారు.

పద్మశ్రీ

కొంత మంది వివరాలు:



1. కిడాంబి శ్రీకాంత్ - క్రీడలు (బ్యాడ్మింటన్). 2017లో ఇండోనేషియా, డెన్మార్క్, ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్స్ గెలుచుకున్నాడు.
2. సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్ -క్రీడలు (టెన్నిస్). 2010 కామన్వెల్త్ క్రీడలు; 2010 ఆసియా క్రీడల్లో బంగారు పతకాలు సాధించాడు. గతేడాది టెన్నిస్‌కు గుడ్ బై చెప్పాడు.
3. మీరాబాయ్ ఛాను -క్రీడలు (వెయిట్ లిఫ్టింగ్). కరణం మల్లీశ్వరి (1995) తర్వాత ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం నెగ్గిన రెండో భారతీయ వెయిట్ లిఫ్టర్. ఛాను 2017 నవంబర్‌లో అమెరికాలో జరిగిన ప్రపంచ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 48 కిలోల విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకుంది.
4. మురళీకాంత్ పేట్కర్ - క్రీడలు(ఈత). 1972లో జర్మనీలో జరిగిన పారాలింపిక్స్ ఈత పోటీల్లో బంగారు పతకం గెలుచుకున్నాడు. పారాలింపిక్స్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం అందించాడు.
5. సుభాషిణి మిస్త్రీ - సామాజిక సేవ. పశ్చిమ బెంగాల్‌కి చెందిన పేద మహిళ. 20 ఏళ్ల పాటు కూలి పనులు చేసి పేదల కోసం పశ్చిమ బెంగాల్‌లో 'హ్యూమానిటీ హాస్పిటల్' నెలకొల్పారు.
6. సూలగత్తి నరసమ్మ - వైద్య రంగం. వ్యవసాయ కూలీ. కర్ణాటకలోని అత్యంత వెనకబడిన ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. నరసమ్మ కాన్పులు చేయించడంలో నేర్పరి.
7. లక్ష్మికుట్టీ - వైద్యం. కేరళకు చెందిన గిరిజన మహిళ. 500 రకాల మూలికలతో మందులు తయారుచేసి వేల మందికి వైద్య సహాయం అందిస్తున్నారు. పాముకాటుకు గురైన వారి ప్రాణాలు కాపాడుతున్నారు.
8. సీతవ్వా జొడ్డతి - సామాజిక సేవ. కర్ణాటకలోని దేవదాసీలు, దళిత మహిళల అభివృద్ధి, సాధికారతకు కృషి చేస్తున్నారు.
9. వి.నానమ్మల్ - యోగా. 98 ఏళ్ల నానమ్మల్ దేశంలోనే అత్యంత పెద్ద వయస్కురాలైన యోగా గురువు. తమిళనాడులో వేల మందికి శిక్షణ ఇచ్చారు.
10. విజయలక్ష్మీ నవనీతకృష్ణన్ - కళలు. తమిళనాడులో జానపదకళలు, గిరిజనుల సంగీత పరిరక్షణకు అంకితమయ్యారు.
11. లెంటినా టక్కర్ - సామాజిక సేవ. నాగాలాండ్‌లో గాంధేయ వాదాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన మహిళ.
12. జయశ్రీ గోస్వామి మహంత - సాహిత్యం, విద్య. అసోం మాజీ ముఖ్యమంత్రి ప్రఫుల్ల కుమార్ మహంత సతీమణి. రాజ్యసభ మాజీ సభ్యురాలు, ప్రముఖ రచయిత్రి.
13. రాజగోపాలన్ వాసుదేవన్ -సైన్స్, ఇంజనీరింగ్. మదురైకి చెందిన రసాయనశాస్త్ర విశ్రాంత ప్రొఫెసర్. ప్లాస్టిక్ వ్యర్థాలతో రహదారులు నిర్మిస్తున్నారు. 'ప్లాస్టిక్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ప్రసిద్ధి చెందారు.
14. అరవింద్ గుప్తా - సాహిత్యం, విద్య. ఐఐటీ కాన్పూర్‌లో విద్య అభ్యసించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్ నేర్పిస్తున్నారు. విద్యార్థుల కోసం 'తరంగ్' అనే టీవీ షో నిర్వహించారు.
15. భజ్జు శ్యామ్ - కళలు (చిత్రలేఖనం). మధ్యప్రదేశ్‌కు చెందిన గోండు చిత్రకారుడు. శ్యామ్ రూపొందించిన 'ద లండన్ జంగిల్ బుక్' బహుళ ప్రాచుర్యం పొందింది.
16. రోమ్యులస్ విటేకర్ - వన్యప్రాణి సంరక్షణ. హెర్పటాలజిస్ట్ అయిన విటేకర్ అమెరికాలో పుట్టి భారత పౌరసత్వం తీసుకున్నారు. మద్రాస్ స్నేక్ పార్క్, మద్రాస్ క్రొకడైల్ బ్యాంక్ ట్రస్ట్‌లను స్థాపించారు.
17. సందుక్ రూయిత్ - వైద్యం. నేపాల్‌కు చెందిన ప్రముఖ నేత్ర వైద్యుడు. తక్కువ ఖర్చుతో కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు.
18. మనోజ్ జోషి - కళలు (సినిమా). ప్రముఖ మరాఠీ, హిందీ సినిమా నటుడు.



ఎన్.విజయేందర్‌రెడ్డి
విజయేందర్ అకాడమీ
హైదరాబాద్.

సాక్షి బిజినెస్
శనివారం 3-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
840 ▼	256 ▼
35,067	10,761

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	7,301	▼	85
డోజోన్స్	25,801	▼	385
ఎఫ్‌టీఎస్ఈ 100	7,443	▼	47
డాక్స్	12,785	▼	219
షాంఘై	3,463	▲	16
నికాయ్	23,275	▼	212

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో (చివరి మూడు 1న ముగింపు)

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.90	65.03
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.97	93.16
€	యూరో	ఎస్‌బీఐ	81.45	81.61
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.43	59.55
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.24	52.35
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.64	49.74
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.40	18.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.77	18.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.16	11.62



'పన్ను' పడేసింది!

రెండో రోజూ 'బడ్జెట్' ప్రకంపనలు

- మార్కెట్‌కు రుచించని క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్
- ద్రవ్యలోటు అంచనాలు పెంచటమూ ప్రతికూలమే
- భారీ రుణభారం రేటింగ్ పెంపుకు అడ్డంకే: ఫిచ్
- వీటన్నిటికీ తోడైన ప్రపంచ మార్కెట్ల పతనం
- సెంటిమెంట్‌ను దెబ్బతీసిన.. రాజస్థాన్లో బీజేపీ ఓటమి
- 840 పాయింట్లు పతనమైన సెన్సెక్స్..35,067 వద్ద ముగింపు
- 256 పాయింట్ల నష్టంతో 10,761కు నిఫ్టీ

ఈ ఏడాది ఆరంభంలోనే రికార్డ్‌ల మీద రికార్డ్‌లు సృష్టించిన స్టాక్ మార్కెట్ శుక్రవారం భారీగా పతనమైంది. ఈక్విటీ లాభాలపై దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధింపు స్టాక్ మార్కెట్‌ను నిండా ముంచింది. బడ్జెట్ నష్టాలు రెండో రోజు కూడా కొనసాగాయి. ద్రవ్యలోటు అంచనాలు పెరగడం, ప్రపంచ మార్కెట్ల పతనం కూడా ప్రభావం చూపడంతో సెన్సెక్స్, నిఫ్టీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 35,100 పాయింట్ల దిగువకు, నిఫ్టీ 10,800 పాయింట్ల దిగువకు పతనమయ్యాయి. రాజస్తాన్ ఉపఎన్నికల్లో బీజేపీకి చుక్కెదురవడం, వచ్చే వారం ఆర్‌బీఐ పాలసీలో రేట్ల కోత అవకాశాలు ఉండక పోవచ్చన్న అంచనాలు సైతం ప్రతికూల ప్రభావం చూపించాయి. సెన్సెక్స్ ఏకంగా 840 పాయింట్లు పతనమై 35,067 పాయింట్ల వద్ద ముగిసింది. రెండేళ్లలో ఇదే అత్యంత భారీ పతనం. 2015, ఆగస్టు 24 (ఆ రోజు సెన్సెక్స్ 1,625 పాయింట్లు నష్టపోయింది) తర్వాత సెన్సెక్స్ ఒక్క రోజులో ఇన్ని పాయింట్లు నష్టపోవడం ఇదే మొదటిసారి. నిఫ్టీ 256 పాయింట్లు పతనమై 10,761 పాయింట్ల వద్ద ముగిసింది. ఐటీ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లు నష్టపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 900 పాయింట్ల వరకూ, నిఫ్టీ 281 పాయింట్ల వరకూ నష్టపోయాయి. సెన్సెక్స్, నిఫ్టీలు రెండు వారాల కనిష్ట స్థాయికి పతనమయ్యాయి. ఇక వారం పరంగా చూస్తే సెన్సెక్స్ 984 పాయింట్లు (2.72 శాతం), నిఫ్టీ 309 పాయింట్లు (2.79 శాతం) చొప్పున నష్టపోయాయి.



పీసీ జ్యుయలర్‌పై వక్రంగీ ఎఫెక్ట్ ...

పీజీ జ్యుయలర్ షేర్ ఇంట్రాడేలో 60% వరకూ పతనమైంది. వక్రంగీ కంపెనీతో తమకెలాంటి వ్యాపార లావాదేవీలూ లేవని, తమ ప్రమోటర్లు ఎవరూ షేర్లను విక్రయించడం కానీ, తనఖా పెట్టడం కానీ చేయలేదని, తమ ఫండమెంటల్స్ పటిష్టంగా ఉన్నాయని కంపెనీ ఇచ్చిన వివరణ కారణంగా చివరకు 24% నష్టంతో రూ.366 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,653 కోట్లు తగ్గి రూ.14,418 కోట్లకు పరిమితమయింది. గత నెల 25న వక్రంగీ కంపెనీ 20 లక్షల పీసీ జ్యూయలర్ షేర్లను రూ.112 కోట్లకు కొనుగోలు చేసింది. వక్రంగీ కంపెనీ షేర్లు గత ఐదు రోజులుగా బాగా పతనమవుతుండటం, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అవకతవకలకు పాల్పడిందంటూ వక్రంగీపై సెబీ విచారణ జరిపే అవకాశాలున్నాయన్న వార్తల ప్రభావం పీసీ జ్యూయలర్ షేర్‌పై పడిందని నిపుణులు చెబుతున్నారు.

ఇంకా ఏం జరిగిందంటే...

- క్యూ3 ఫలితాలు అంచనాలకు అనుగుణంగా లేకపోవడంతో బజాజ్ ఆటో 4.9 శాతం క్షీణించి రూ.3,243 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.3,473ను తాకింది. సెన్సెక్స్‌లో బాగా పతనమైన షేర్ ఇదే. భారతీ ఎయిర్‌టెల్ 4.2 శాతం తగ్గింది. యాక్సిస్ బ్యాంక్, మారుతీ సుజుకీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా స్టీల్, మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, హీరో మోటోకార్ప్, కోటక్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, ఎస్‌బీఐ, టాటా మోటార్స్, యస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 4 శాతం వరకూ నష్టపోయాయి.
- బీఎస్ఈ 500 సూచీలోని దాదాపు వంద షేర్లు ఇంట్రాడేలో వాటి వాటి ఏడాది గరిష్ట స్థాయిల నుంచి 25% వరకూ నష్టపోయాయి. పీసీ జ్యూయలర్, వక్రంగీ, జస్ట్ డయల్, వోకార్డ్, యూనిటెక్, అబాన్ ఆఫ్‌షోర్, రెయిన్ ఇండస్ట్రీస్, జిందాల్ సా, ప్రజ్ ఇండస్ట్రీస్, ఫిలిప్స్ కార్బన్ బ్లాక్, తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్, రిలయన్స్ నేవల్, రిలయన్స్ కమ్యూనికేషన్స్ షేర్లది కూడా ఇదే వరుస.
- ఇంట్రాడేలో ఐదు ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లతో పాటు బీఎస్ఈ 500 సూచీలోని 29 షేర్లు తాజా ఏడాది కనిష్ట స్థాయికి పడిపోయాయి. అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కార్పొరేషన్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, కమిన్స్ ఇండియా, డీసీఎమ్ శ్రీరామ్ ఇండస్ట్రీస్, వివిమెడ్ ల్యాబ్స్, విమ్ ప్లాస్ట్.. తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

4.6 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ భారీ పతనం కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.4.6 లక్షల కోట్లు ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.6 లక్షల కోట్లు తగ్గి రూ.148.5 లక్షల కోట్లకు పడిపోయింది.

పతనానికి పలు కారణాలు...

■ ఎల్‌టీసీజీతో లాభాల స్వీకరణ

ఈక్విటీ లాభాలపై 10 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) విధిస్తామని ప్రకటించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ ద్వారా వచ్చే డివిడెడ్ ఆదాయంపై కూడా 10 శాతం పన్ను విధిస్తామనటం ఈ ప్రతికూల సెంటిమెంట్‌ను మరింత తీవ్రం చేసింది. 10% ఎల్‌టీసీజీ కారణంగా విదేశీ నిధుల జోరుకు బ్రేక్ పడుతుందన్న ఆందోళనతో అమ్మకాలు వెల్లువెత్తాయి.

■ ద్రవ్యలోటు అంచనాల పెంపు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యాన్ని 3.2 శాతం నుంచి 3.5 శాతానికి పెంచుతున్నట్లు బడ్జెట్లో ఆర్థిక మంత్రి చెప్పారు. అంతేకాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యాన్ని అందరూ అంచనా వేసినట్లు 3.2 శాతంగా కాకుండా 3.3 శాతంగా నిర్ణయించారు. ఈ అంచనాల పెంపు స్టాక్ సూచీలను కుదేలు చేసింది.

■ ఆర్‌బీఐ పాలసీ

పంటలకు కనీస మద్దతు ధర పెంపు కారణంగా రిటైల్ ధరలు పెరుగుతాయని, ఫలితంగా రిటైల్ ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుందని, దీంతో ద్రవ్యోల్బణం నియంత్రణకు ఆర్‌బీఐ కఠిన చర్యలకు పూనుకుంటుందన్న అంచనాలు హల్‌చల్ చేశాయి. దీంతో వచ్చే వారం (6–7 తేదీల్లో) జరిగే ఆర్‌బీఐ పాలసీలో రేట్లు యథాతథంగానే ఉంటాయన్న అంచనాలకు మరింత బలం చేకూరింది.

■ ఫిచ్ హెచ్చరిక

కేంద్ర ప్రభుత్వ తాజా బడ్జెట్ ప్రతిపాదనల కారణంగా రుణ భారం పెరుగుతుందని, ఈ భారీ రుణ భారం భారత రేటింగ్ పెంపుకు ప్రతిబంధకంగా నిలుస్తుందంటూ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ చేసిన హెచ్చరిక బాగానే ప్రభావం చూపించింది.

■ ప్రపంచ మార్కెట్ల పతనం

అమెరికాలో బాండ్ల రాబడులు నాలుగేళ్ల గరిష్ట స్థాయికి పెరగడంతో అక్కడి స్టాక్ మార్కెట్ గురువారం నష్టపోయింది. ఈ ప్రభావంతో ఆసియా మార్కెట్లు నష్టపోగా, యూరప్ మార్కెట్లు సైతం నష్టాల్లో మొదలయ్యాయి. ఇవన్నీ కలసి మన మార్కెట్ల ప్రతికూలతను పెంచాయి.

■ బాండ్లు, రూపాయి ఒడిదుడుకులు

ద్రవ్యలోటు లక్ష్యాలు అంచనాలను మించాయి. వచ్చే వారం వెలువడే ఆర్‌బీఐ పాలసీలో ద్రవ్యోల్బణం కట్టడికి ఆర్‌బీఐ కఠినంగా వ్యవహరించే అవకాశాలున్నాయన్న అంచనాలతో బాండ్లలో ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయి. ఈ రెండిటికీ తోడు డాలర్‌తో రూపాయి మారకంలో హెచ్చుతగ్గులు కూడా తగినంత ప్రభావం చూపించాయి.

■ రాజస్తాన్‌లో బీజేపీ ఓటమి

రాజస్తాన్ ఉప ఎన్నికల్లో పాలక బీజేపీ ఓడిపోవడం సెంటిమెంట్‌ను ఒకింత దెబ్బతీసింది.

ఈ పతనం తాత్కాలికమే: ఆర్థికశాఖ

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ పతనం తాత్కాలికమేనని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ వ్యాఖ్యానించారు. భారత వృద్ధి జోరుగా ఉందదని, ఇన్వెస్టర్లు ఆందోళన చెందాల్సిన అవసరమే లేదని ఆయన అభయం ఇచ్చారు. ఎల్‌టీసీజీ విధింపు కారణంగా మార్కెట్ నష్టపోతుందని ముందుగానే అంచనా వేశామని పేర్కొన్నారు. అయితే ఈ పతనం తాత్కాలికమేనని, ఇన్వెస్టర్లు భయపడాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- ప్రభుత్వోద్యోగులకు ఏ పెన్షన్ స్కీమ్ బెటర్?
- నిఫ్టీ టార్గెట్ 10,400?
- ఎల్‌టీసీజీతో మార్కెట్‌కు నష్టం: అరోరా
- ఐడీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ పట్ల ఎందుకు బుల్లిష్?
- అదాగ్ షేర్ల పతనం
- పీసీ జ్యువెలర్ 60 శాతం క్రాష్..

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..

ఏడాది ఆఖరుకల్లా ఎయిరిండియా ప్రైవేటీకరణ

- జూన్ నాటికి తుది బిడ్డరు ఖరారు
- కేంద్ర మంత్రి జయంత్ సిన్హా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన దిగ్గజం ఎయిరిండియా ప్రైవేటీకరణ ప్రక్రియ ఈ ఏడాది ఆఖరు నాటికి పూర్తికాగలదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జయంత్ సిన్హా తెలిపారు. సంస్థను దక్కించుకునే బిడ్డరు పేరు జూన్ నాటికల్లా వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎయిరిండియాలో వ్యూహాత్మక వాటాల విక్రయానికి సంబంధించిన మెమోరాండంను మరికొన్ని వారాల్లో విడుదల చేయనున్నట్లు సిన్హా చెప్పారు. ఏయే అసెట్స్‌ను విక్రయిస్తున్నారు, ప్రభుత్వ వాటా ఎంత ఉంటుంది తదితర అంశాలన్నీ ఇందులో



ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటిదాకా రెండు ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు తమ శాఖకు అందాయని మంత్రి వివరించారు. రుణభారంతో కుంగుతున్న ఎయిరిండియాను నాలుగు వేరు విభాగాలుగా విక్రయానికి ఉంచనున్నట్లు చెప్పారు. ఎయిరిండియా.. దాని చౌక చార్జీల విభాగం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, అనుబంధ సంస్థ ఏఐఎస్ఏటీఎస్‌లను ఒక సంస్థగాను, ప్రాంతీయ విభాగం అలయన్స్ ఎయిర్‌ని మరో ప్రత్యేక సంస్థగా బిడ్డింగ్‌కి ఉంచనున్నారు. అలాగే, ఎయిరిండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ (ఏఐఏటీఎస్ఎల్), ఎయిరిండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఏఐఈఎస్ఎల్)ను విడివిడిగా విక్రయించనున్నట్లు సిన్హా తెలిపారు. ఎయిరిండియా, సింగపూర్ ఎయిర్‌లైన్స్ గ్రూప్‌నకు చెందిన ఎస్ఏటీఎస్ కలిసి చెరి సగం వాటాలతో ఏఐఎస్ఏటీఎస్‌ను ఏర్పాటు చేశాయి.

బిగ్‌బాస్కెట్‌లోకి ఆలీబాబా 1,920 కోట్లు

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గ్రోసరీ సంస్థ, బిగ్ బాస్కెట్ తాజాగా 30 కోట్ల డాలర్ల (రూ.1,920 కోట్లు) పెట్టుబడులను సమీకరించింది. చైనా ఈ కామర్స్ దిగ్గజం ఆలీబాబా, అబ్రాజ్ క్యాపిటల్, శాండ్స్ క్యాపిటల్, ఐఎఫ్‌సీ తదితర సంస్థల నుంచి ఈ నిధులు సమీకరించామని బిగ్ బాస్కెట్ సీఈఓ హరి మీనన్ చెప్పారు. ఈ నిధులతో రైతుల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తామని, తమ సేవలను మరింతగా విస్తరిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం 1,800 మంది రైతులతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని, ఈ సంఖ్యను 3,000కు పెంచనున్నామని వివరించారు. మరోవైపు తమ బ్రాండ్ అంబాసిడర్‌గా షారూక్ ఖాన్ కొనసాగుతారని, ఆయనతో కాంట్రాక్టును రెన్యువల్ చేశా మని పేర్కొన్నారు. ఇటీవలనే 80 లక్షల వినియోగదారుల మైలురాయిని దాటామని, హైదరాబాద్, బెంగళూరుల్లో బ్రేక్ ఈవెన్‌కు వచ్చామని, గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,410 కోట్ల ఆదాయం సాధించామని వివరించారు. గ్రోఫర్స్, అమెజాన్‌లకు గట్టిపోటీనివ్వడానికి బిగ్‌బాస్కెట్‌కు ఈ తాజా నిధులు ఉపయోగపడతాయని నిపుణులంటున్నారు. ఈ డీల్ ప్రాతిపదికన బిగ్‌బాస్కెట్ విలువ 90 కోట్ల డాలర్లని అంచనా.



జొమాటోలో ఆలీబాబా పెట్టుబడులు

కాగా ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్ యాప్ జొమాటోలో చైనాకు చెందిన ఆలీబాబా అనుబంధ సంస్థ, ఆంట్ స్మాల్ అండ్ మైక్రో ఫైనాన్షియల్ సర్వీసెస్ గ్రూప్ 20 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టింది.

మధ్యతరగతికి గతంలో చాలా ఇచ్చాం!

- వీలును బట్టి ఇకపైనా ఊరటనిచ్చే చర్యలు
- బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: తాజా ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో మధ్యతరగతి వర్గాలకు ఊరటనిచ్చేలా ప్రత్యేక ప్రతిపాదనలేమీ చేయకపోవడాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమర్థించుకున్నారు. గత బడ్జెట్‌లో మధ్యతరగతి వర్గాలకు చాలానే చేశామని వ్యాఖ్యానించారు. వెసులుబాటును బట్టి భవిష్యత్‌లోనూ మరికొన్ని ప్రయోజనాలు కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు. 'భారత్‌లో చట్టాలను అమలు చేయడంలో చాలా సవాళ్లున్నాయి. అలాగే పన్నులు చెల్లించే వారి సంఖ్యను పెంచే విషయంలోనూ పెద్ద సవాళ్లే ఉన్నాయి. నేను ప్రవేశపెట్టిన నాలుగైదు బడ్జెట్‌లను పరిశీలిస్తే.. పద్ధతిప్రకారం చిన్న స్థాయి పన్ను చెల్లింపుదారులకు ప్రతీ బడ్జెట్‌లోనూ ఎంతో కొంత ఊరట కల్పిస్తూనే ఉన్నాను' అని ఓపెన్ మ్యాగజైన్ నిర్వహించిన బడ్జెట్ అనంతర చర్చా కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ. 2 లక్షల నుంచి పెంచామని, అదనంగా పొదుపునకు సంబంధించి మినహాయింపు పరిమితిని మరో రూ. 50,000 పెంచి మొత్తం రూ. 1.5 లక్షలకు చేర్చామని, గృహ రుణాల రీపేమెంట్స్‌పై పరిమితిని కూడా ఏడాదికి రూ. 2 లక్షలకు పెంచామని జైట్లీ చెప్పారు. ఇక రూ. 50 లక్షల దాకా ఆదాయం ఉన్న డాక్టర్లు, లాయర్లు మొదలైన వృత్తి నిపుణులకు ట్యాక్సేషన్‌ను సరళతరం చేశామన్నారు. రూ. 5 లక్షల దాకా వార్షికాదాయం ఉన్న వారిపై పన్ను శాతాన్ని పది నుంచి అయిదు శాతానికి తగ్గించామని జైట్లీ వివరించారు. మౌలిక సదుపాయాల కల్పన, సరిహద్దుల రక్షణ, సామాజిక సంక్షేమ పథకాలు మొదలైన వాటన్నింటి కోసం నిధులు సమకూర్చుకోవడం తప్పనిసరి అని ఆయన చెప్పారు. ఇందుకోసం తక్కువ మొత్తంలోనైనా పన్నులు కట్టేలా పెద్ద సంఖ్యలో ప్రజలను పన్ను పరిధిలోకి తేవడం ద్వారా దేశ ప్రయోజనాలను పరిరక్షించగలమన్నారు.

చమురు రేట్లు ఆందోళనకరమే అయినా..

ముడిచమురు ధరల పెరుగుదల ఆందోళన కలిగించేదే అయినా, పరిస్థితులు ప్రస్తుతం అదుపులోనే ఉన్నాయని జైట్లీ చెప్పారు. అధిక ద్రవ్యోల్బణ జమానా నుంచి భారత్ బైటపడ్డట్లేనని ఆయన తెలిపారు. రెండు శాతం అటూ ఇటూగా నాలుగు శాతం ద్రవ్యోల్బణ గణాంకాల లక్ష్యం సహేతుకమైనదేనని, సాధించగలిగే లక్ష్యమేనని జైట్లీ పేర్కొన్నారు. కూరగాయలు, ముడిచమురు ధరల పెరుగుదల, కేంద్ర



ప్రభుత్వ ఉద్యోగుల జీతాల పెంపు తదితర అంశాలు ఇటీవలి ద్రవ్యోల్బణం పెరుగుదలకు కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం, ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, బ్యాంకుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడిన తర్వాత తగిన సమయంలో తగు నిర్ణయం తీసుకోగలమని జైట్లీ చెప్పారు.

నిజాయితీగా పన్ను చెల్లించే వారికి ప్రయోజనం!

స్టాండర్డ్ డిడక్షన్‌పై హస్‌ముఖ్ ఆదియా

న్యూఢిల్లీ: తాజా బడ్జెట్‌లో ప్రతిపాదిన రూ.40,000 స్టాండర్డ్ డిడక్షన్ నిజాయితీగా పన్ను చెల్లించే వారికి ప్రయోజనం కలిగిస్తుందని ఆర్థిక శాఖ కార్యదర్శి హస్‌ముఖ్ ఆదియా పేర్కొన్నారు. పన్ను రహిత ఆదాయాన్ని ఉద్యోగ వర్గాలు, పెన్షనర్లు రూ.2.9 లక్షల వరకూ పెంచుకునే వెలుసుబాటు దీనివల్ల కలుగుతోందన్నారు. నిజాయితీగా పన్ను చెల్లించే వేతన వర్గం ప్రధాన లక్ష్యంగా ఆర్థికమంత్రి ఈ ప్రయోజనాన్ని బడ్జెట్‌లో పొందిపరిచారని అన్నారు. కాగా స్టాండర్డ్ డిడక్షన్ నేపథ్యంలో ప్రస్తుతం మినహాయింపు పరిధిలో ఉన్న రవాణా, వైద్య చికిత్స అలవెన్సులను పన్ను పరిధిలోకి తేవడంతో కొంత నిరాశ వ్యక్తమయిన సంగతి తెలిసిందే.

ప్రైవేటు పెట్టుబడులు పెంచే చర్యల్లేవ్...

ద్రవ్యలోటు లక్ష్యాల పెంపు పట్ల భారత ప్రముఖ ఆర్థికవేత్త,, కార్నెల్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ (వాణిజ్య విధానం) ఈశ్వర ప్రసాద్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ఆర్థిక వ్యవస్థలో పలు విభాగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ద్రవ్య క్రమశిక్షణ కట్టుతప్పినట్లేనని పేర్కొన్నారు. అలాగే ప్రైవేటు పెట్టుబడులు పెరగడానికీ బడ్జెట్‌లో చర్యలు లేవని విమర్శించారు. అయితే బడ్జెట్‌లో ప్రతిపాదిత ఆరోగ్య బీమా పథకం పేదలకు ప్రయోజనం చేకూర్చుతుందని అన్నారు. కాగా ఇది వృద్ధికి దోహదపడే బడ్జెట్ అని అమెరికా ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నిషా దేశాయ్ బిస్వాల్ పేర్కొన్నారు.



జీహెచ్ఐఏఎల్‌లో జీఎంఆర్ వాటా పెంపు!




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో (జీహెచ్ఐఏఎల్) జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్) 11 శాతం వాటా పెంచుకుంటోంది. మలేసియన్ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్, ఎంఏహెచ్‌బీ (మారిషస్) నుంచి ఈ వాటాను కొనుగోలు చేస్తోంది. డీల్ విలువ సుమారు రూ.484 కోట్లు. మూడు నెలల్లో ఈ లావాదేవీ పూర్తి కానుందని సమాచారం. డీల్ పూర్తి అయితే జీహెచ్ఐఏఎల్‌లో జీఏఎల్ షేరు 74 శాతానికి చేరనుంది. జీహెచ్ఐఏఎల్‌లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు 13 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 13 శాతం వాటా ఉంది. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని స్పెషల్ పర్పస్ వెహికిల్ అయిన జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నిర్వహిస్తోంది.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	--	--
మిర్చి (వరంగల్, తేజ)	--	--
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.4,100 (కనిష్టం)	రూ.7,127 (గరిష్టం)
ఉల్లి (కర్నూలు)	రూ.1,140 (కనిష్టం)	రూ.1,760 (గరిష్టం)
చక్కెర (చెన్నై)	రూ.3,500	
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్‌ఎంటీ)	
కందిపప్పు (చెన్నై)	రూ.7,200	
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)	
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--	


దక్షిణాదిపై దృష్టిసారించిన ఎవరెస్ట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రూఫింగ్, సీలింగ్, వాల్, ఫ్లోరింగ్ వంటి ప్రీ ఇంజనీరింగ్ బిల్డింగ్ సొల్యూషన్స్ కంపెనీ ఎవరెస్ట్ ఇండస్ట్రీస్ దక్షిణాది రాష్ట్రాలపై దృష్టిసారించింది. నిర్మాణ సామగ్రి ప్లాంట్ల ఏర్పాటు యోచనలో ఉన్నామని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతో చర్చిస్తున్నామని ఇదింకా కొలిక్కి రాలేదని ఎవరెస్ట్ ఇండస్ట్రీస్ ఎండీ మనీష్ సంఘీ తెలిపారు. శుక్రవారమిక్కడ ఎవరెస్ట్ ఇండస్ట్రీస్ విభాగమైన స్టీల్ బిల్డింగ్ సొల్యూషన్స్ ప్రెసిడెంట్ మనీష్ గారాగ్‌తో దేశంలోనే తొలిసారిగా ప్రీ ఇంజనీరింగ్ బిల్డింగ్ (పీఈబీ) టెక్నికల్ మాన్యువల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పీఈబీ పరిశ్రమ రూ.5 వేల కోట్లుగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.500 కోట్ల టర్నోవర్‌ను చేరుకున్నామని.. ఈసారి 20 శాతం వృద్ధిని లక్ష్యించామని తెలిపారు. గత ఐదేళ్లలో దక్షిణాది రాష్ట్రాల్లో 50 లక్షల చ.అ.ల్లో పీఈబీ నిర్మాణాలను పూర్తి చేశామని.. ప్రస్తుతం మథర్‌సన్ సుమీ, సుందరం మోటార్స్, బ్రిటానియా, రిలయెన్స్ వంటి ఇతర కంపెనీల ప్లాంట్ల నిర్మాణ ప్రాజెక్ట్ ఆర్డర్లున్నాయని తెలిపారు. పీఈబీ నిర్మాణాలు త్వరితగతిన పూర్తవుతాయని, నిర్మాణ వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.




పీఈబీ టెక్నికల్ మాన్యువల్‌ను విడుదల చేస్తున్న మనీష్ సంఘీ, మనీష్ గార్గ్

హిందాల్కో లాభం రూ.376 కోట్లు



ముంబై: ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన ప్రధాన కంపెనీ హిందాల్కో నికర లాభం(స్టాండలోన్)ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో 17 శాతం వృద్ధి చెంది రూ.376 కోట్లకు పెరిగింది. అల్యూమినియమ్ ధరలు పెరగడంతో పాటు తమ వ్యయ నియంత్రణ పద్ధతులు సత్ఫలితాలనివ్వడంతో ఈ స్థాయి నికర లాభం సాధించామని కంపెనీ ఎమ్‌డీ సతీష్ పాయ్ చెప్పారు. ఆదాయం రూ.9,914 కోట్ల నుంచి రూ.11,023 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. అల్యూమినియం విభాగం ఆదాయం రూ.5,323 కోట్లకు చేరిందని తెలిపారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో హిందాల్కో షేర్3 శాతం నష్టంతో రూ.294 వద్ద ముగిసింది.

బజాజ్ ఆటో లాభం1,013 కోట్లు



న్యూఢిల్లీ: బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,013 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో సాధించిన నికర లాభం రూ.977 కోట్లతో పోలిస్తే 4 శాతం వృద్ధి సాధించామని కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.5,354 కోట్ల నుంచి రూ.6,369 కోట్లకు పెరిగినట్లు బజాజ్ ఆటో ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ అష్యూరెన్స్) ఎస్.రవికుమార్ తెలిపారు.


ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైకు షేర్..: గత నెల విక్రయాలు బాగా ఉండటంతో ఫలితాలు కూడా బాగుంటాయనే అంచనాలతో బీఎస్‌ఈలో బజాజ్ ఆటో షేర్ ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై, రూ.3,473ను తాకింది. అయితే ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో చివరకు 5 శాతం క్షీణించి రూ.3,243 వద్ద ముగిసింది.

బీఎస్‌ఈ లాభం 11 శాతం అప్...



ముంబై: బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్(బీఎస్‌ఈ) నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 11 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.53 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.59 కోట్లకు పెరిగిందని బీఎస్‌ఈ తెలిపింది. ఆదాయం రూ.86 కోట్ల నుంచి 45 శాతం వృద్ధితో రూ.126 కోట్లకు పెరిగిందని బీఎస్‌ఈ ఎమ్‌డీ, సీఈఓ అశీష్‌కుమార్ చౌహాన్ చెప్పారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ఎన్‌ఎస్‌ఈలో బీఎస్‌ఈ షేర్ 2.4 శాతం నష్టపోయి రూ.849 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో తాజా ఏడాది కనిష్ట స్థాయి రూ.842ను తాకింది.

పోకర్ణ నికరలాభం రూ.14 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో పోకర్ణ నికరలాభం రూ.18.6 కోట్ల నుంచి రూ.14 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవరు రూ.93 కోట్ల నుంచి రూ.89 కోట్లకు పడిపోయింది. ఏప్రిల్–డిసెంబరు కాలంలో రూ.245 కోట్ల టర్నోవరుపై రూ.33 కోట్ల నికరలాభం పొందింది.

గాయత్రి షుగర్స్‌కు లాభం..

డిసెంబరు క్వార్టరులో గాయత్రి షుగర్స్ రూ.4.7 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.2.6 కోట్ల నికర నష్టం వాటిల్లింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల్లో రూ.99 కోట్ల టర్నోవరుపై రూ.20 కోట్ల నికర నష్టం చవిచూసింది.

రెండింతలైన తాజ్ జీవీకే లాభం..

కన్సాలిడేటెడ్ ఫలితాల్లో తాజ్ జీవీకే హోటల్స్, రిసార్ట్స్ నికరలాభం రెండింతలపైగా పెరిగి రూ.9 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.72 కోట్ల నుంచి రూ.83 కోట్లను తాకింది. ఏప్రిల్–డిసెంబరు మధ్య రూ.205 కోట్ల టర్నోవరుపై రూ.14 కోట్ల నికర లాభం పొందింది.

తగ్గిన న్యూలాండ్ లాభం..


డిసెంబరు త్రైమాసికం స్టాండలోన్ ఫలితాల్లో న్యూలాండ్ ల్యాబొరేటరీస్ నికరలాభం రూ.3.6 కోట్ల నుంచి రూ.1.2 కోట్లకు పడిపోయింది. టర్నోవరు రూ.135 కోట్ల నుంచి రూ.117 కోట్లకు వచ్చి చేరింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో రూ.363 కోట్ల టర్నోవరుపై రూ.6 కోట్ల నికరలాభం నమోదైంది.

సింఫనీ లాభం 21 శాతం అప్

హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎయిర్ కూలర్స్ తయారీ సంస్థ సింఫనీ నికర లాభం 21 శాతం పెరిగి రూ. 66 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో లాభం రూ. 55 కోట్లు. మరోవైపు తాజాగా ఆదాయం రూ. 21 శాతం పెరిగి రూ. 180 కోట్ల నుంచి రూ. 217 కోట్లకు చేరింది. రూ. 2 ముఖవిలువ గల షేరు ఒక్కింటికి 50 శాతం (రూ.1) చొప్పున మూడో మధ్యతర డివిడెండు కింద చెల్లించనున్నట్లు సంస్థ తెలిపింది.

4జీ స్పీడ్‌లో జియో టాప్..

టెలికం రెగ్యులేటర్ ట్రాయ్



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో జోరు కొనసాగుతూనే ఉంది. ఇది వరుసగా 11వ నెలలోనూ 4జీ స్పీడ్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. జియో డౌన్‌లోడ్ స్పీడ్ 2017 నవంబర్‌లో 25.6 ఎంబీపీఎస్‌గా నమోదయ్యింది. టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ తాజాగా ఈ విషయాలను వెల్లడించింది. వొడాఫోన్ డౌన్‌లోడ్ స్పీడ్ 10 ఎంబీపీఎస్‌గా రికార్డయ్యింది. ఇక వీటి తర్వాతి స్థానాల్లో భారతీ ఎయిర్‌టెల్ (9.8 ఎంబీపీఎస్), ఐడియా సెల్యులార్ (7 ఎంబీపీఎస్) ఉన్నాయి. జియో డౌన్‌లోడ్ స్పీడ్ అక్టోబర్‌లో 21.8 ఎంబీపీఎస్‌గా ఉంది. అప్‌లోడ్ స్పీడ్ విషయానికి వస్తే.. వొడాఫోన్ 6.9 ఎంబీపీఎస్‌తో టాప్‌లో నిలిచింది. దీని తర్వాతి స్థానంలో ఐడియా సెల్యులర్ (6.6 ఎంబీపీఎస్), జియో (4.9 ఎంబీపీఎస్), ఎయిర్‌టెల్ (4 ఎంబీపీఎస్) ఉన్నాయి.


ఇండియన్ బ్యాంక్ నుంచి కొత్త రుణ పథకం



ఇండియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో 'ఐబీ ముద్రా టీవీఎస్ కింగ్' అనే త్రి–వీలర్ లోన్ ప్రాడక్టును, కొత్త ఫీచర్లతో కూడిన అప్‌డేటెడ్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ సైట్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంక్ ఎండీ, సీఈవో కిశోర్ కారత్.

ఆఫీసుకొచ్చారా.. సెల్ఫీ ఇవ్వండి!

- సెల్ఫీతోనే హాజరు సేవలందిస్తున్న రెగ్యులర్.లి
- 60 కంపెనీలు; 10 వేల ఉద్యోగులు నమోదు
- 'స్టార్టప్ డైరీ'తో సంస్థ ఫౌండర్ అవిజిత్ సర్కార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 'సెల్ఫీ'.. సెల్‌ఫోన్ వినియోగదారులకు పరిచయం చేయాల్సిన పనిలేదేమో! ప్రమాదాలు కోరితెచ్చుకున్న వాళ్లనూ చూశాం. కానీ, అదే సెల్ఫీతో వ్యాపారం చేసేవాళ్లూ పెరుగుతున్నారు. రెగ్యులర్.లి... ఆ కోవలోదే. సెల్ఫీతో హెచ్ ఆర్ సేవలందిస్తోంది. వివరాలు వ్యవస్థాపకుడు అవిజిత్ సర్కార్ మాటల్లోనే...

''గతంలో ఉద్యోగులు, విద్యార్థులు, మార్కెటింగ్ వారు ఎవరైనా సరే.. హాజరైనట్టుగా రిజిస్టర్‌లో సంతకం చేసేవారు. తర్వాత బయోమెట్రిక్స్.. ఇకిప్పుడు ఐరిస్, ఫేసియల్ స్కానర్లు వచ్చేశాయి. వీటిలో దేనికైనా నిర్వహణ వ్యయం కాసింత ఎక్కువ. కానీ, సెల్ఫీ ఫొటోనే అటెండెన్స్ రిజిస్టర్‌లా మార్చేస్తే ఈ వ్యయం ఉండదుగా అనే ఆలోచన వచ్చింది. ఇంకేముంది మాతృసంస్థ అయిన అవీఫా ఇన్ఫోటెక్ బృందంతో కలిసి రెగ్యులర్.లి పేరిట క్లౌడ్ ఆధారిత యాప్‌ను అభివృద్ధి చేశాం. రూ.4 లక్షలతో గతేడాది ఆగస్టులో కోల్‌కతా కేంద్రంగా ప్రారంభించాం.

ఎలా పనిచేస్తుందంటే?

ఇది క్లౌడ్ టెక్నాలజీతో పనిచేస్తుంది. రెగ్యులర్ యాప్‌లో ఒప్పంద కంపెనీకి ప్రత్యేక ఖాతా తెరిచి అందులో వారి ఉద్యోగులను నమోదు చేయాలి. ఉద్యోగి ఆఫీసు పరిసరాల్లోకి చేరగానే ఆటోమేటిక్‌గా యాప్‌కు అనుసంధానమై పోతాడు. అందులో ఉన్న చెకిన్ బటన్‌ను నొక్కగానే సెల్ఫీతో కూడిన హాజరు నమోదవుతుంది. ఇది నేరుగా యాజమాన్యానికి చేరిపోతుంది. అంతే !! స్మార్ట్‌ఫోన్ లేని ఉద్యోగులు ఆఫీసులోని ల్యాప్‌ట్యాప్ లేదా డెస్క్‌టాప్ ద్వారా చెకిన్ కావచ్చు. ఇందులో క్యూఆర్ లేదా బార్ కోడ్ ఉంటుంది. దాన్ని ఫొటో ఐడీతో స్కాన్ చేయగానే సెల్ఫీతో కూడా చెకిన్ అవుతుంది. జీపీఎస్, వైఫై ఎస్‌ఎస్‌ఐడీ ఆధారంగా ఔట్ డోర్ ఉద్యోగుల ఫీల్డ్ ట్రాకింగ్ కూడా చేస్తుంది. యాజమాన్యానికి ఉద్యోగి లొకేషన్ మ్యాప్స్ ద్వారా కనిపిస్తుంటుంది.

స్టార్టప్ డైరీ

జీతభత్యాలు; ప్రదర్శన సేవలు కూడా..

హాజరు నమోదొక్కటే కాదు. సమయ పాలన, పనితీరు నివేదికలు, సెలవుల నిర్వహణ సేవలూ ఈ యాప్‌తోనే నిర్వహించుకునే వీలుంది. ఒప్పందం కంపెనీల హెచ్‌ఆర్ విభాగం పనిభారాన్ని తగ్గించేందుకు వచ్చే ఏడాది తొలి త్రైమాసికం నాటికి జీతభత్యాల నిర్వహణ సేవలను కూడా అందిస్తాం. జీపీఎస్, వైఫైలకు లాకింగ్స్ ఉంటాయి. కాబట్టి భద్రత విషయంలోనూ అనుమానాలవసరం లేదు.

60 కంపెనీలు; 10 వేల ఉద్యోగులు..

ప్రస్తుతం ఇండియాతో పాటు ఆగ్నేయాసియా దేశాల్లో సేవలందిస్తున్నాం. లెన్స్‌కార్ట్, వెస్ట్‌విండ్, సరళ్ డయాగ్నస్టిక్స్, నానో ఐడీ, గ్రాబ్ ట్యాక్సీ వంటి 60కి పైగా సంస్థలు మా కస్టమర్లుగా ఉన్నాయి. వీటిలో 10 వేలకు పైగా ఉద్యోగుల అటెండెన్స్‌ను మేం నిర్వహిస్తున్నాం. చార్జీలు నెలకు ఒక యూజర్‌కు 1 డాలర్.

రూ.6 కోట్ల నిధుల సమీకరణ..: జూలై నాటికి బ్రేక్ ఈవెన్‌కొస్తాం. ఈ ఏడాది ముగిసే నాటికి 200 మంది కస్టమర్లను చేరుకోవాలని లక్ష్యించాం. ప్రస్తుతం మా సంస్థలో ఐదుగురు ఉద్యోగులున్నారు. తొలిసారిగా నిధుల సమీకరణ చేయాలని నిర్ణయించాం. పలువురు వీసీ ఇన్వెస్టర్లు రూ.6 కోట్ల పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నారు. కానీ విస్తరణ తర్వాతే సమీకరిస్తాం'' అని అవిజిత్ వివరించారు.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే **startups@sakshi.com** కు మెయిల్ చేయండి...

బోర్డ్ మీటింగ్స్

న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జేకే సిమెంట్, రిలాక్సో ఫుట్‌వేర్, ఆంధ్రా సిమెంట్, పీఐ ఇండస్ట్రీస్, ప్రొక్టర్ అండ్ గ్యాంబుల్ హైజీన్ అండ్ హెల్త్‌కేర్, ఆర్తి ఇండస్ట్రీస్, లుమాక్స్ ఇండస్ట్రీస్, ఎన్‌పీసీఎల్ ఇండియా, రుషీల్ డెకోర్

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,635	▲	185
బంగారం (99.5, 10గ్రా)	30,485	▲	185
వెండి (కిలో)	39,270	▼	65
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	--		
బంగారం (22 క్యారెట్లు)	29,180	▲	250
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,640	▲	260
బంగారం (22 క్యారెట్లు)	29,180	▲	250
వెండి (కిలో)	42,500	▲	100
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,050	▲	200
బంగారం (22 క్యారెట్లు)	28,800	▲	250
వెండి (కిలో)	40,700	▲	200
విశాఖపట్నం			
బంగారం(24 క్యారెట్లు)	31,900	▲	320
బంగారం (22 క్యారెట్లు)	29,250	▲	300
వెండి (కిలో)	41,000		0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,400	▼	50
బంగారం (22 క్యారెట్లు)	28,900	▲	150
వెండి(కిలో)	40,800	▲	400
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,550	▲	270
బంగారం (22 క్యారెట్లు)	29,180	▲	250
వెండి (కిలో)	40,500	▲	100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.78 (రాత్రి 11.00కు)	$65.80 (గురువారం ముగింపు)
బ్రెంట్	68.18 (రాత్రి 11.00కు)	$69.65 (గురువారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 03-2-2018

విశాఖ	365–00
చిత్తూరు	383–00
వరంగల్	362–00
ముంబై	405–00
చెన్నై	390–00
విజయవాడ	360–00
గోదావరి	360–00
నమక్కల్	375–00
02–2–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	360–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.20
బెంగళూరు	380–00
ఢిల్లీ	385–00
కోల్‌కతా	398–00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	417.95	428.75
AMBUJA C	259.55	266.45
ASIAN PA	1137.9	1153
AXIS BAN	564.9	592.8
BAJAJ AU	3241.3	3412.95
[illegible]	[illegible]	[illegible]

A B C D … E F G H … I J K L … M N O P … R S T U … V W X Z

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
3M INDIA	18317.5	19282.05
5PAISA C	289.5	304.7
63 MOONS	97	103.45
8K MILES	656.6	718.15
AARTI DR	589.95	622.5
AARTI IN	1090.45	1100.1
AARVI EN	92	92.75
ABAN OFF	193.2	206.6
BATA IND	689.7	710.3
BAYER CR	4136.4	4582.15
BEARDSEL	59.65	62.5
BEML LIM	1283.05	1455.75
BERGER P	246.85	260.15
BETA DRU	157.05	166.5
BF INVES	285.6	309.15
BF UTILI	431.4	469
BGR ENER	123.45	131.65
BHAGERIA	299.85	325.65
BHANSALI	168.15	176.95
DHUNSERI	411.6	425.95
DIC INDI	521.55	552.45
DILIP BU	928	960.55
DISH TV	72.4	77.35
DISHMAN	358.75	375.85
DIXON TE	3687.75	3825.55
DOLLAR I	427.1	439.9
DOLPHIN	104.75	115.1
DR. LAL	906	910.45
DYNAMATI	1772.65	1823.85
GUJ NAR	433.75	467.3
GUJ STAT	129.1	140.1
GUJ. APO	213.6	220
GUJARAT	140.85	142.25
GUJARAT	138.5	146.6
GUJARAT	192.95	200.4
GUJARAT	236.05	241.15
GUJARAT	708.55	753.45
GUJARAT	796.35	819.55
GUJARAT	849.45	845.4
GULF OIL	875.95	904.1
JET AIRW	685.6	769.15
JET KNIT	97.2	108
JHS SVEN	64.05	69.05
JIND POL	67.35	71.3
JINDAL D	177.7	193.2
JINDAL P	342.85	362.55
JINDAL S	102.2	109.35
JINDAL S	131	151.75
JINDAL S	179.4	193
JINDAL S	250.55	265.95
JINDAL W	627.85	657.2
MAN INFR	59.6	64.15
MANAKSIA	62.85	65.3
MANAPPUR	106.25	116.05
MANG.CHE	66.2	70.55
MANGALAM	165.35	174.2
MANGALAM	375.05	397.3
MANPASAN	376.35	386.55
MARATHON	517.25	551.75
MAS FINA	618.05	638.9
MASTEK L	431.45	473.3
MATRIMON	904	941.9
PETRON E	125.1	128.3
PFIZER L	2230.35	2314.9
PG ELECT	352.8	402.95
PHILIPS	1045.4	1159.75
PI INDUS	886.6	913.5
PIONEER	185.7	195.55
PLASTIBL	190.4	212.35
PNB HOUS	1291.95	1295.15
PNC INFR	175.3	185
PODDAR H	1147.65	1127.45
PODDAR P	288.8	287.4
SHALIM P	181.2	188.4
SHANKARA	1573.45	1656.95
SHANTHI	140	148.4
SHARDA C	417.65	437.3
SHARDA M	2278.95	2341.45
SHEELA F	1603	1601.8
SHEMAROO	520.15	525.3
SHILPA M	526.2	573.15
SHIPPING	74.65	79.7
SHIRPUR	148.3	156.1
SHIVA TE	578.05	595.15
THE HI-T	463.65	484.7
THE INDI	129	138.35
THE INDI	153.3	166.2
THE MAND	144.1	152
THE NEW	653.05	669.15
THE P K	512.05	539
THE PHOE	634.5	674.65
THE RAMC	736.4	758.7
THE RUBY	342.95	361.1
THE TINP	235.15	257.35
THEMIS M	555.75	589.35
[illegible]	[illegible]	[illegible]

బీఎస్‌ఈ ఎస్‌ఎంఈ షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని ద్రోహం: మధు



ఎన్బీఎమ్ కాలనీ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని ద్రోహం జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కర్ణాటకకు కొన్ని కేటాయింపులు చేసి, మిగిలిన రాష్ట్రాలన్నింటికీ కేంద్రం మొండిచేయి చూపిందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుకు నిధులు తదితర హామీలను చివరి బడ్జెట్‌లోనూ అమలు చేయకపోవడం దారుణమన్నారు. బీజేపీతో పొత్తుపై తెలుగుదేశం ప్రభుత్వం తన విధానమేంటో తెలియజేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. వామపక్షాలు శనివారం విజయవాడలో సమావేశమై భవిష్యత్ ప్రణాళిక ఖరారు చేయనున్నట్లు చెప్పారు. కాగా, 'గొట్టిపాడు' ఘటనపై ఈ నెల 23న సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో గుంటూరు కార్యక్రమానికి సీపీఎం పూర్తి మద్దతునిస్తోందని ప్రకటించారు.

చంద్రబాబు కేసులకు భయపడుతున్నారు

మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య



కడప వైఎస్ఆర్ సర్కిల్: ముఖ్యమంత్రి చంద్రబాబు కేసులకు భయపడి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ధ్వజమెత్తారు. చంద్రబాబు చేతకానితనం వల్లే బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా కడపలోని ఇందిరాభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్లో ఎక్కడా విభజన చట్టంలోని అంశాలు లేకపోవడం బాధకరమన్నారు. చంద్రబాబు ఓటుకు నోటు కేసులో ఇరుక్కోవడం వల్లే కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం చేయలేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా చంద్రబాబు తన మంత్రులు, ఎంపీలతో రాజీనామా చేయించి, అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి విభజన హామీల అమలుకు కేంద్రంతో పోరాడాలన్నారు.

అప్పులు ఉసురు తీశాయి..

- ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో ఇద్దరు రైతుల ఆత్మహత్య
- తీర్చాలంటూ రుణదాతల నుంచి ఒత్తిడి
- తట్టుకోలేక పురుగుమందు తాగిన అన్నదాతలు

బేస్తవారిపేట/మద్దికెర: పెరిగిపోయిన అప్పులు రాష్ట్రంలో మరో ఇద్దరు రైతుల ఉసురు తీశాయి. అప్పు తెచ్చి మరీ వేసిన పంట సరిగా పండకపోవడం, అప్పులు తీర్చమంటూ ఒత్తిడి రావడంతో మనస్తాపానికి గురై ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో శుక్రవారం ఇద్దరు రైతులు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం పిటికాయగుళ్ల రైతు చేగిరెడ్డి బాలవెంకటరెడ్డి(42)కి ఎకరన్నర పొలముంది. దీనికితోడు తన ఇద్దరు సోదరులకు చెందిన మరో ఐదెకరాల పొలాన్ని కౌలుకు(ఎకరా రూ.15 వేలు చొప్పున) తీసుకుని ఐదేళ్లుగా మిర్చి, పత్తి, కాకర, బెండ సాగు చేస్తున్నాడు. ఇందుకోసం పెద్ద ఎత్తున అప్పు చేశాడు. అంతేగాక గ్రామంలోని ఎస్‌బీఐలో క్రాఫ్‌లోన్ కింద 2013లో రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. మరోవైపు 2015, 2017లలో భార్య నగలు బ్యాంకులో పెట్టి రూ.లక్ష తీసుకున్నాడు. మొత్తం రెండున్నర లక్షలకు కలిపి వడ్డీ రూ.80 వేలు వచ్చింది. అయితే రుణమాఫీ కింద మొదటి, రెండో విడతల్లో రూ.40 వేలు రాగా.. అది వడ్డీకే సరిపోలేదు. ఈ సీజన్‌లో రెండెకరాల్లో మిర్చి, మరో రెండెకరాల్లో బెండ, కాకర సాగుచేశాడు. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటడంతో మిర్చికి నీరందక పంట దెబ్బతింది. సోదరులకు చెందిన పొలమే అవడంతో పంటల్ని కాపాడుకునేందుకు ఐదునెలల వ్యవధిలో ఐదు బోర్లు వేశాడు. ఇందుకోసం రూ.3 లక్షలు, మిర్చి పంటకోసం రూ.2 లక్షల వరకు అప్పు చేయాల్సి వచ్చింది. మొత్తంగా అప్పులు రూ.12 లక్షలకుపైగా పెరిగిపోయాయి. అప్పు తీర్చాలంటూ ఒత్తిడి ఎక్కువవడంతో మనస్తాపం చెందాడు. శుక్రవారం ఉదయం బెండ పొలానికి పురుగుమందు కొట్టాలని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం భర్తకు అన్నం తీసుకెళ్లిన రాజ్యలక్ష్మికి పొలంలో విగతజీవిగా కనిపించాడు. పక్కనే పురుగుమందు డబ్బా ఉండటం చూసి.. వెంటనే గ్రామస్తుల సహకారంతో అతన్ని బేస్తవారిపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించింది. అయినా ప్రయోజనం లేకపోయింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు.



బాలవెంకటరెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

యువ రైతు ఆత్మహత్య



కర్నూలు జిల్లా మద్దికెరలో యువ రైతు ఉప్పర వీరేష్(35) తండ్రి పేరుమీదున్న నాలుగెకరాల్లో సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది పప్పుశనగ వేశాడు. వర్షాభావంతో పంట పండలేదు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి. పెట్టుబడులు సైతం తిరిగి రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. గతంలోనూ అప్పులు ఎక్కువ కావడంతో మూడెకరాల పొలం అమ్మి చెల్లించారు. మిగతా నాలుగెకరాల్లో పంటల సాగుకోసం రూ.5 లక్షలదాకా అప్పు చేశాడు. ఇందులో రూ.50 వేల పంటరుణాన్ని ఇటీవలే వీరేష్ తండ్రి పేరుపై మద్దికెరలోని సహకార బ్యాంకులో తీసుకున్నారు. భార్య విజయలక్ష్మి పేరిట పోస్టాఫీసులో రూ.లక్ష రుణం తీసుకున్నారు. మిగిలినదంతా ప్రైవేటు అప్పు. అప్పులు పెరిగిపోతుండడంతో మనస్తాపానికి గురైన వీరేష్ శుక్రవారం ఉదయం ఇంట్లోనే పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్సకోసం అనంతపురం జిల్లా గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. వీరేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

స్థానిక మాండలికాల్లోనే విద్యా బోధన

సర్వశిక్షా అభియాన్ ఎస్పీడీ శ్రీనివాస్ వెల్లడి



రాయవరం (మండపేట): స్థానిక మాండలికాల్లోనే విద్యాబోధన చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్పీడీ) జి.శ్రీనివాస్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాయవరం మండలం పసలపూడి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 'బడి రుణం తీర్చుకుందాం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వేర్వేరు మాండలికాలు ఉన్నాయని చెప్పారు. స్థానికంగా మాట్లాడే మాండలికంలోనే విద్యాబోధన సాగిస్తే విద్యార్థులు బడికి మరింత చేరువవుతారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఒకటి, రెండు తరగతులకు స్థానిక మాండలికాల ఆధారంగా పాఠ్య పుస్తకాలు రూపొందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రూ.1.05 లక్షల మంది చిన్నారులు బడి బయట ఉన్నట్లు గుర్తించామన్నారు. 'బడి రుణం తీర్చుకుందాం' పథకానికి దాతల నుంచి ఇప్పటి వరకు రూ.39 కోట్ల విరాళాలను సేకరించామన్నారు. విద్యార్థుల యూనిఫామ్‌కు ఒక్కో జతకు రూ.200 చొప్పున రెండు జతలకు రూ.400 కేటాయిస్తున్నామని తెలిపారు. అయితే నాణ్యత కొరవడిందనే విమర్శల నేపథ్యంలో యూనిఫామ్‌కు రూ.2 వేలు కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదించినట్లు తెలిపారు.

విజ్ఞాన్ మహోత్సవ్‌లో వరుణ్, రాశీఖన్నా



చేబ్రోలు(పొన్నూరు): 'తొలిప్రేమ' సినిమా యూనిట్ సభ్యులు శుక్రవారం గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ వర్సిటీలో జరుగుతున్న విజ్ఞాన్ మహోత్సవ్ కార్యక్రమానికి హాజరయ్యారు. సినీ హీరో వరుణ్‌తేజ్, నటి రాశీఖన్నా, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్, దర్శకుడు అట్లూరి వెంకీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా 'తొలిప్రేమ' సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

గాల్లో దీపంలా ఆహార భద్రత

- ఆహార పదార్థాలు అమ్మే 90 శాతం షాపులకు లైసెన్సే లేదు
- సిబ్బంది అవసరం వందల్లో..
- పదుల సంఖ్యలో మాత్రమే అనుమతిచ్చిన ప్రభుత్వం
- హైకోర్టు మందలించినా స్పందించని రాష్ట్ర సర్కార్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆహార భద్రత గాలిలో దీపమైంది. తినే ప్రతి ఆహార పదార్థం కల్తీ అవుతున్నా పట్టించుకునే దిక్కు లేదు. ఆహార భద్రతా విభాగానికి వేల కొద్దీ ఫిర్యాదులు వస్తున్నా అక్కడ పట్టించుకునే నాథుడే లేడు. దీంతో వినియోగదారుడికి ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. మరోవైపు కల్తీ ఆహారం తిని ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తినుబండారాలు అమ్ముతున్న 90 శాతం షాపులకు లైసెన్సులు లేవు. ఏ ఆహార పదార్థం ఎక్కడ తయారవుతోంది? ఎవరు అమ్ముతున్నారు? లైసెన్సు ఉందా? లేదా? అనే విషయాలను ఇటు ప్రభుత్వమూ, అటు అధికార వర్గాలూ గాలికొదిలేశాయి. పాలు, నెయ్యి, కంది పప్పు, బియ్యం, గోధుమ పిండి, గులాబ్ జామ్ పౌడర్, ఊరగాయలు, చిప్స్ ఇలా సుమారు 2,500 రకాల ఆహార పదార్థాలను ఎలాంటి లైసెన్సూ లేకుండా అమ్ముతున్నారనే విషయం వెల్లడైంది. రాష్ట్రంలో ఆహార భద్రత విభాగం నామమాత్రంగా కూడా లేదు. వందల్లో అధికారులు కావాల్సి ఉండగా, పదుల సంఖ్యలో కూడా లేరు. దీంతో యధేచ్ఛగా కల్తీ ఆహార పదార్థాలు స్వైరవిహారం చేస్తున్నాయి.

26 మంది నియామకానికి మాత్రమే అనుమతి

కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో ఉండే ఆహార నియంత్రణ (ఫుడ్ కంట్రోల్) విభాగానికి రాష్ట్రంలో 629 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లింది. అధికారుల లేమితో కల్తీ ఆహారాన్ని నియంత్రించేవారు లేరని, దీంతో మార్కెట్లో విచ్చలవిడిగా కల్తీ ఆహారం అమ్ముతున్నారని ప్రతిపాదనలో పేర్కొన్నారు. కానీ దీన్ని ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కేవలం 26 మంది అధికారుల నియామకానికి మాత్రమే అనుమతించింది. ఈ నిర్ణయంతో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కూడా కుదేలైపోయారు.

10 శాతం కూడా లైసెన్సులు లేవు

ఏదైనా పట్టణంలో చిన్న ఇడ్లీ, దోసె బండి పెట్టుకోవాలన్నా ఆ మున్సిపాలిటీ నుంచి లైసెన్సు ఖచ్చితంగా ఉండాల్సిందే. కానీ రాష్ట్రంలో ఆహార పదార్థాల అమ్మకందారులకు, చిల్లర వర్తకులకు ఎక్కడా లైసెన్సులు లేని పరిస్థితి. 10% లైసెన్సులు ఇస్తేనే రూ.25 కోట్ల ఆదాయం వచ్చిందని, సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించి అన్ని ప్రాంతాల్లో లైసెన్సులు ఇవ్వగలిగితే ఏటా రూ.100 కోట్లు శాఖకు రావడంతో పాటు కల్తీ ఆహారం నియంత్రణపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు.

హైకోర్టు తీవ్రంగా స్పందించినా..

15 రోజుల క్రితం తెలుగు రాష్ట్రాల్లో కల్తీ ఆహారంపై ఉమ్మడి హైకోర్ట్ చీఫ్ జస్టిస్ తీవ్రంగా స్పందించారు. అన్నీ కల్తీ అయిపోయాయని, స్వచ్ఛమైన ఆహారం తీసుకునే అర్హత కూడా ప్రజలకు లేదా అని ఆయన ప్రశ్నించారు. దీనిపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఏపీతోపాటు తెలంగాణకు ఆదేశాలు ఇచ్చారు. ఇలా కోర్టు మొట్టికాయలు వేసినా సర్కార్‌లో చలనం రాలేదు. కల్తీ ఆహారం నియంత్రణలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ అట్టడుగున ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రంలో ఆహార నియంత్రణ విభాగంలో ఖాళీల సంఖ్య ఇలా..

కేడర్	ఖాళీల సంఖ్య
అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్స్	09
ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్	605
ఆఫీస్ సూపరింటెండెంట్స్	14
సీనియర్ అసిస్టెంట్స్	10
జూనియర్ అసిస్టెంట్స్	10
డేటా ఎంట్రీ ఆపరేటర్స్	28

ప్రమాదాల ప్రయాణం!

- కిక్కిరిసిన జనరల్ బోగీల్లో ప్రయాణిస్తూ మృత్యువాత
- రైలు నుంచి జారిపడి తరచూ దుర్ఘటనలు



సాక్షి, అమరావతి బ్యూరో: ఆనందంగా సాగాల్సిన రైలు ప్రయాణాలు కిక్కిరిసిన బోగీల కారణంగా విషాదాంతమవుతున్నాయి. కొందరి సరదా మరికొందరి నిర్లక్ష్యం ఆ కుటుంబాలకు తీరని వేదన మిగులుస్తోంది. జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. రైలు నుంచి జారి పడి ప్రాణాలు కోల్పోతున్న వారిలో 80 శాతం మంది మెట్ల వద్ద ప్రయాణిస్తున్న వారేనని రైల్వే పోలీసుల విచారణలో తేలింది.

డివిజన్ పరిధిలో 300 మరణాలు..

విజయవాడ నుంచి నిత్యం పలుచోట్లకు 350కిపైగా ఎక్స్‌ప్రెస్‌లు, పాసింజర్లు, ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ స్టేషన్‌లో లక్ష మందికి పైగా ప్రయాణిస్తుంటారు. వీరిలో 40 శాతం మందికి జనరల్ బోగీలే దిక్కు. పండుగలు, సెలవలు, వేసవి సీజన్‌లో రైళ్లలో కాలుమోపేందుకూ కూడా స్థలం లేక తలుపులు, మరుగుదొడ్ల వద్ద నిలబడే ప్రయాణిస్తున్నారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 2016 ఆరంభం నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు రైలు నుంచి జారిపడిన వారు దాదాపు 100 మంది ఉన్నారు. వీరిలో 80 శాతం పురుషులే. చనిపోయిన వారంతా 20–25 ఏళ్ల మధ్య వయసు వారే కావటం గమనార్హం. ఇక రైలు పట్టాలు దాటుతూ ప్రాణాలు పోగొట్టుకున్న వారు 50 మంది ఉన్నారు. పట్టాలపై ఆత్మహత్యలు చేసుకున్న వారు మరో 50 మంది ఉన్నారు. పలు కారణాలతో డివిజన్ పరిధిలో మొత్తం 300 మరణాలు నమోదయ్యాయి.

బీమా ఉన్నా కొందరికే...

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో జారిపడి మృతి చెందిన వారిలో 30 మందికి కూడా బీమా అందలేదు. మరణించిన వారి దగ్గర టికెట్ దొరికితేనే బీమా వర్తింపజేస్తున్నారు. రైలు నుంచి జారిపడినప్పుడు ఒక్కోసారి ఇవి దొరకటం లేదు. జారిపడి మరణించిన వారికి రూ.5 లక్షలు బీమా వర్తింప జేస్తున్నారు. అయితే బాధిత కుటుంబాలు రైల్వే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి ఏళ్ల తరబడి పోరాటం చేయాల్సి వస్తోంది. ఇతర రాష్ట్రాల వారు తిరిగే ఓపిక లేక మిన్నకుండిపోతున్నారు.

72 సీట్లకు 400 మంది పోటీ

జనరల్ బోగీల్లో 72 సీట్లు మాత్రమే ఉంటాయి. కానీ 300–400 మంది ఎక్కటంతో కిక్కిరిసిపోతున్నాయి. దీంతో గత్యంతరం లేక రైలు బోగీ తలుపుల వద్ద ప్రయాణిస్తున్న వారు మలుపుల వద్ద ప్రమాదాల బారినపడుతున్నారు. జనరల్ బోగీల్లో సుదూర సమయం ప్రయాణించటం, నిద్రలోకి జారుకోవటం తదితర కారణాలతో మృత్యువాత పడుతున్నారు. మృతదేహాల జేబులో డబ్బులు, ఆభరణాలు, పర్సులు చోరీకి గురవటంతో పోలీసులు వివరాలు గుర్తించటంకష్టంగా మారుతోంది. దీంతో గుర్తు తెలియని మృతదేహాలుగా కేసులు నమోదు చేస్తున్నారు. ఈ ఏడాది రైలు నుంచి జారిపడిన ఘటనల్లో 20 శాతం మరణాలు సరదా కోసం నిలబడటం, మద్యం తాగి మత్తులో జారిపడిన వారేనని పోలీసులు చెబుతున్నారు.

40 దాటితే ప్రమాదమే

ప్రసూతి వయసుపై తాజా అధ్యయనంలో వెల్లడి

టొరంటో: నలభై అంతకంటే ఎక్కువ వయసున్న మహిళలు గర్భం ధరించడం వల్ల ముందస్తు ప్రసవాలు జరిగే ప్రమాదముందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో గర్భధారణ వయస్సు పెరుగుతుండటంతో ముందస్తు ప్రసవాలు జరిగే ప్రమాదముందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. కెనడాలోని చూ సెయింటె–జస్టిన్‌కు చెందిన పరిశోధకులు 2008–2011 మధ్యకాలంలో ఆ దేశంలోని 32 ఆస్పత్రుల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించారు. దీనికి సంబంధించిన కథనాన్ని ఇటీవల ప్లస్‌వన్ అనే పత్రికలో ప్రచురించారు. ఈ అధ్యయనంలో మొత్తం 1,65,282 మంది గర్భిణీలను వయసు ప్రకారం 5 గ్రూపులుగా విభజించి వారి ప్రసూతి సమస్యలు, లక్షణాలు వంటి అంశాలపై అధ్యయనం చేశారు. ఈ అధ్యయనంలోనే 40 ఏళ్లు, ఆపై వయసున్న మహిళలు ముందస్తు ప్రసవాలకు వెళ్లినట్లు తేల్చారు. ముందస్తు ప్రసవాలు జరిగే మహిళల్లో కడుపులో వికారంగా ఉండటం, మధుమేహవ్యాధి పెరుగుదల, ప్రసవానంతరం అధిక రక్తస్రావం వంటి సమస్యలు కన్పించాయి. 30 ఏళ్లకు తక్కువ వయసున్న మహిళల్లో మత్తు మందుల వినియోగం, పొగత్రాగడం చేసిన వారికి పిల్లలు కలిగే అవకాశం తక్కువని అధ్యయనంలో వెల్లడైంది.

'నడికుడి–శ్రీకాళహస్తి' భూ సేకరణకు 21 కోట్లు

సాక్షి, అమరావతి: నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా గుంటూరు జిల్లాలో భూసేకరణకు శుక్రవారం ప్రభుత్వం రూ.21.54 కోట్లు కేటాయించింది. నూజెండ్ల మండలం, ముక్కెళ్లపాడు, ఐనవోలు, చింతలచెరువు గ్రామాల్లో 111.87 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

సాక్షి స్పోర్ట్స్
శనివారం 3-2-2018



సిరీస్ నుంచి దక్షిణాఫ్రికా కెప్టెన్ డు ప్లెసిస్ ఔట్

దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత్‌తో జరిగిన తొలి వన్డేలో సెంచరీ సాధించిన దక్షిణాఫ్రికా కెప్టెన్ డు ప్లెసిస్ చేతి వేలి గాయం కారణంగా సిరీస్‌లోని ఐదు వన్డేలకు... ఆ తర్వాత మూడు టి20 మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదు. ఇప్పటికే స్టార్ బ్యాట్స్‌మన్ డివిలియర్స్ తొలి మూడు వన్డేలకు దూరమైన సంగతి తెలిసిందే. వీరిద్దరి స్థానంలో ఫర్హాన్ బెహర్డీన్, హెన్రీ క్లాసెన్‌లను జట్టులోకి తీసుకున్నారు.

సైనా ఇంటికి... సింధు సెమీస్‌కి

మిక్స్‌డ్ సెమీస్‌లో సిక్కిరెడ్డి జోడీ • ఇండియా ఓపెన్ టోర్నీ

టాప్ సీడ్ సింధు ఈ సీజన్‌లో తొలి టైటిల్ దిశగా అడుగులు వేస్తోంది. స్వదేశంలో జరుగుతున్న ఇండియా ఓపెన్‌లో ఆమె సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మరో స్టార్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ కథ క్వార్టర్స్‌లో ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి జోడీ సెమీస్ చేరింది.

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బరిలో భారత్ నుంచి సింగిల్స్‌లో సింధు, డబుల్స్‌లో సిక్కి రెడ్డి మిగిలారు. మిగతా వారంతా క్వార్టర్‌ఫైనల్స్‌కే పరిమితమయ్యారు. ఈ ఏడాది తొలి టైటిల్‌పై కన్నేసిన భారత స్టార్, టాప్ సీడ్ పీవీ సింధు మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఇండోనేసియా టోర్నీ రన్నరప్, నాలుగో సీడ్ సైనా నెహ్వాల్ క్వార్టర్స్‌లోనే కంగుతింది. పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాళ్ల పోరాటం ముగిసింది. ఎనిమిదో సీడ్ సాయిప్రణీత్, సమీర్ వర్మ, పారుపల్లి కశ్యప్ పరాజయం చవిచూశారు.

శ్రమించిన సింధు...

ఈ టోర్నీలో అలవోక విజయాలతో నెగ్గుకొచ్చిన సింధుకు క్వార్టర్స్‌లోనూ అలాంటి ఫలితమే ఎదురవుతుందని తొలి గేమ్‌తో అనిపించింది. కానీ రెండో గేమ్‌లో ఆమె ప్రత్యర్థి బియాట్రిజ్ కొరాలెస్ (స్పెయిన్) నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. దీంతో సింధు ఈ టోర్నీలో తొలిసారి మ్యాచ్ గెలిచేందుకు మూడో గేమ్ వరకు పోరాడింది. చివరకు తెలుగు తేజం 21–12, 19–21, 21–11తో గెలుపొందింది. సెమీఫైనల్లో సింధు... ప్రపంచ మూడో ర్యాంకర్ రచనోక్ (థాయ్‌లాండ్)తో తలపడుతుంది. మరో మ్యాచ్‌లో సైనా 10–21, 13–21తో బీవెన్ జాంగ్ (అమెరికా) చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎనిమిదో సీడ్ సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా జోడీ 21–8, 21–13తో హన్ చెంగ్‌కాయ్–కా తొంగ్ వీ (చైనా) జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ భమిడిపాటి సాయిప్రణీత్ 15–21, 13–21తో మూడో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలయ్యాడు. ఇస్కందర్ జుల్కర్‌నైన్ (మలేసియా) 21–17, 21–14తో సమీర్ వర్మను ఓడించగా, కశ్యప్‌నకు 16–21, 18–21తో కియావో బిన్ (చైనా) చేతిలో చుక్కెదురైంది. మహిళల డబుల్స్‌లో ఏడో సీడ్ మేఘన–పూర్విషా జంట 10–21, 15–21తో జోంగ్ కొల్ఫన్ – ప్రజోంగ్జయ్ (థాయ్‌లాండ్) జోడీ చేతిలో, సిక్కి–అశ్విని జంట 17–21, 21–23తో డు యుయి–యిన్‌హుయ్ (చైనా) ద్వయం చేతిలో కంగుతిన్నాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్–అశ్విని జంట 17–21, 11–21తో క్రిస్టియన్సన్–క్రిస్టినా (డెన్మార్క్) జోడీ చేతిలో, పురుషుల డబుల్స్‌లో మనూ–సుమీత్ రెడ్డి ద్వయం 19–21, 19–21తో ఫెర్నాల్డి–సుకముల్జో (ఇండోనేసియా) జంట చేతిలో ఓడాయి.



సింధు



పృథ్వీ షా
జాసన్ సంఘా

ఈసారి వదలొద్దు!

మరొక్క విజయం...
చరిత్ర పుటల్లో చోటుకు!
ఇంకొక్క గెలుపు...
మన సత్తా ప్రపంచానికి చాటేందుకు!
ఒకే ఒక్క అడుగు...
భవిష్యత్ తారలుగా వెలిగేందుకు!

యువ భారత క్రికెట్ జట్టు ముంగిట సువర్ణావకాశం. జోరు మీదున్న కుర్రాళ్లు లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇంకొక్క మ్యాచే. అండర్–19 ప్రపంచకప్ క్రికెట్ తుది సమరం నేడే. ప్రత్యర్థి సమ ఉజ్జీలాంటి ఆస్ట్రేలియా. అయినా... మొగ్గు మనవైపే. అన్నిరంగాల్లో బలంగా ఉన్న పృథ్వీ షా సేన... ఆసేతు హిమాచలం ఆకాంక్షలను నెరవేరుస్తూ కప్‌ను ఒడిసిపట్టాలని దీవిద్దాం!

నేడు అండర్-19 ప్రపంచకప్ ఫైనల్

- ఆస్ట్రేలియాతో భారత్ 'ఢీ'
- జోరు మీదున్న పృథ్వీ షా బృందం

మౌంట్‌మాంగనీ: కుర్రాళ్ల క్రికెట్ సమరం తుది అంకానికి చేరింది. శనివారం ఇక్కడ జరిగే అండర్–19 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. పటిష్టమైన ఈ రెండు జట్లలో ఏది గెలిచినా రికార్డు స్థాయిలో నాలుగోసారి కప్‌ను సొంతం చేసుకున్నట్లవుతుంది. ఈ నేపథ్యంలో హోరాహోరీ పోరుకు అవకాశం ఉంది. మరోవైపు ఫేవరెట్‌గా టోర్నీలో అడుగుపెట్టిన టీమిండియా అందుకు తగ్గట్లే ఆడుతూ వచ్చింది. పెద్దగా పోరాడాల్సిన అవసరం లేకుండానే లీగ్, క్వార్టర్స్, సెమీస్‌లో అలవోకగా గెలుపొందింది. ఇదే ఊపు టైటిల్ పోరులోనూ చూపితే తిరుగుండదు. కానీ... ఆసీస్ వంటి జట్టు ఏ స్థాయి క్రికెట్‌లోనైనా ప్రమాదకరమే. అయినప్పటికీ కుర్రాళ్లు ఒత్తిడిని దరి చేరనీయకుండా ఆడితే ప్రత్యర్థిని మట్టికరిపించవచ్చు. ముఖ్యంగా 2016 అండర్–19 ప్రపంచకప్ ఫైనల్లో వెస్టిండీస్ చేతిలో అనూహ్య పరాజయాన్ని గుర్తుపెట్టుకొని ఆడాలి.

ఉదయం గం 6.15 నుంచి స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం

భారత్‌కు ఎదురుంటుందా?

బ్యాటింగ్‌లో పృథ్వీ షా, మన్‌జోత్ కల్రా, శుభ్‌మన్ గిల్, బౌలింగ్‌లో కమలేశ్ నాగర్‌కోటి, శివం మావి, ఇషాన్ పోరెల్, ఆల్‌రౌండర్‌గా అభిషేక్ శర్మ నైపుణ్యం, స్పిన్‌తో చుట్టేసే అనుకూల్ రాయ్, శివ సింగ్... ఇలా భారత్ అన్ని రంగాల్లో దుర్భేధ్యంగా కనిపిస్తోంది. ఫీల్డింగ్‌లోనూ చురుకుదనం జట్టు సొంతం. లీగ్ దశలో ఆస్ట్రేలియాను 100 పరుగుల తేడాతో, సెమీస్‌లో దాయాది పాకిస్తాన్‌ను 203 పరుగులతో ఓడించడమే దీనికి నిదర్శనం. ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతున్న జట్టుకు గాయాల బెడద కూడా లేదు. ఈ సమీకరణాల ప్రకారం చూస్తే ఫైనల్లో ద్రవిడ్ శిష్యులదే పైచేయి కావాలి. అయితే కలవర పెడుతున్న ఏకైక అంశం మిడిలార్డర్. ఇప్పటివరకు టాప్ ఆర్డరే అంతా చూసుకోవడంతో మిగతా బ్యాట్స్‌మెన్‌కు సత్తా నిరూపించుకునే అవకాశం రాలేదు. తుది పోరులో అవసరానికి తగ్గట్లు రియాన్ పరాగ్, హర్విక్ దేశాయ్ రాణిస్తే విజయంపై ధీమాగా ఉండొచ్చు.

ఆసీస్ ఎలా ఆడుతుందో?

జాసన్ సంఘా నేతృత్వంలోని ఆస్ట్రేలియా టోర్నీ తొలి మ్యాచ్‌లోనే భారత్ చేతిలో భంగపడినా తర్వాత కుదురుకుంది. అయితే... తుది జట్టులో స్థిరంగా కొనసాగిన, నిలకడగా ఆడిన ఆటగాళ్లు కనిపించడం లేదు. పపువా న్యూ గినియాపై ఏడు వికెట్ల ప్రదర్శన చేసిన పేసర్ రాల్‌స్టన్ తర్వాత ఇంగ్లండ్‌తో మ్యాచ్‌కు జట్టులోనే లేడు. మరో పేసర్ హ్యాడ్లీ అన్ని మ్యాచ్‌లు ఆడినా మెరుపులు మెరిపించలేదు. క్వార్టర్స్‌లో స్పిన్నర్ లాయిడ్ పోప్ 8 వికెట్ల ఘనత ఒక్క మ్యాచ్‌కే అన్నట్లుంది. ఇక బ్యాటింగ్‌లో భారీ స్కోర్లు ఛేదించే సందర్భం రాలేదు. భారమంతా జాక్ ఎడ్వర్డ్స్ మోస్తున్నాడు. పపువా న్యూ గినియాపై మెక్ స్వీనీ చేసిన 156 పరుగులే ఆసీస్ బ్యాట్స్‌మెన్ నుంచి భారీ ఇన్నింగ్స్. కెప్టెన్ సంఘా స్థాయికి తగ్గట్లు ఆడటంలేదు. ప్రధాన బ్యాట్స్‌మన్ బ్రయాంట్ ఫామ్‌లో లేడు. పరమ్ ఉప్పల్ పర్వాలేదు. ఆస్టిన్ వా, విల్ సదర్లాండ్ పెద్దగా రాణించలేదు. అయితే... తమ దేశ వాతావరణానికి దాదాపు దగ్గరగా ఉండే న్యూజిలాండ్‌లో ఆడుతుండటం ఆసీస్‌కు అదనపు బలం కానుంది. కాబట్టి భారత కుర్రాళ్లు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా ఆడాలి.

జట్లు (అంచనా)

భారత్: పృథ్వీ షా (కెప్టెన్), మన్‌జోత్ కల్రా, శుభ్‌మన్ గిల్, హర్విక్ దేశాయ్, రియాన్ పరాగ్, అభిషేక్ శర్మ, అనుకూల్ రాయ్, కమలేశ్ నాగర్‌కోటి, శివం మావి, ఇషాన్ పోరెల్, శివసింగ్.

ఆస్ట్రేలియా: జాసన్ సంఘా (కెప్టెన్), జాక్ ఎడ్వర్డ్స్, మ్యాక్స్ బ్రయాంట్, పరమ్ ఉప్పల్, మెక్ స్వీనీ, జొనాథన్ మెర్లో, విల్ సదర్లాండ్, బాక్స్టర్ హోల్ట్, జాక్ ఎవాన్స్, ర్యాన్ హ్యాడ్లీ, పోప్.



కుర్రాళ్లూ... ద్రవిడ్‌కు కానుకివ్వండి

ప్రపంచకప్‌లో ఆడుతున్నది అండర్–19 జట్టయినా... వారితోపాటు వార్తల్లో నిలుస్తున్నది భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్. కోచ్ పాత్రలో అంతగా యువకులను ముందుండి నడిపిస్తున్నాడు 'ది వాల్'. కుర్రాళ్లు కప్ గెలిస్తే మొదటగా అత్యంత ఎక్కువ సంతోషపడేది అతడే అనడంలో సందేహం లేదు. తానాడిన రోజుల్లో బ్యాట్స్‌మన్‌గా, జట్టు మనిషిగా ఎంతో బాధ్యతను మోసిన ద్రవిడ్‌కు ప్రపంచకప్ సాధించలేకపోవడం పెద్ద లోటుగా ఉండేది. 2003లో ఫైనల్‌కు చేరిన భారత జట్టులో సభ్యుడైనప్పటికీ ఆస్ట్రేలియా చేతిలో ఓడటంతో కల నెరవేరలేదు. ఇక విండీస్‌లో జరిగిన 2007 వరల్డ్‌కప్ అయితే ద్రవిడ్‌కు కెరీర్ పరంగా, వ్యక్తిగతంగా పీడకలే. అతడి సారథ్యంలో భారీ అంచనాల మధ్య బరిలో దిగిన జట్టు తొలి దశలోనే వెనుదిరిగింది. దీంతో 'ది వాల్'... కెప్టెన్సీకి రాజీనామా చేయాల్సి వచ్చింది. తమ గురువుకు మానసికంగా వ్యథ మిగిల్చిన ఈ అనుభవాలను సంపూర్తిగా చెరిపేసే అవకాశం తాజాగా కుర్రాళ్ల ముందుంది. 2003లో సీనియర్స్ కప్‌ను చేజార్చుకున్న ఆస్ట్రేలియాపైనే ఇప్పుడు విజయం సాధిస్తే అది ద్రవిడ్‌కు బోనస్ ఆనందాన్నిస్తుంది. కీలక సమరానికి ముందు కుర్రాళ్లు ఏకాగ్రత కోల్పోకుండా ఉండేందుకు ద్రవిడ్ జాగ్రత్తలు తీసుకున్నాడు. ఆటగాళ్లెవరూ ఫైనల్ ముగిసేదాకా సెల్‌ఫోన్‌ల జోలికి వెళ్లొద్దని ఆదేశించాడు.

పేసర్లే మా బలం

మా పేస్ త్రయం టోర్నీ ఆసాంతం అద్భుతంగా రాణించింది. ఫైనల్లోనూ వారే మా బలం. వారి ఫిట్‌నెస్ అద్భుతం. జట్టుకు అవసరమైనప్పుడల్లా వికెట్లు తీశారు. వారి కారణంగా జట్టులో మంచి దృక్పథం ఏర్పడింది. మంచి ఆరంభం లభిస్తే మేం 250 నుంచి 300 వరకు చేయగలం. లీగ్ మ్యాచ్‌లో ఓడిన తర్వాత ఆస్ట్రేలియా మెరుగైంది. మా ప్రణాళికల ప్రకారం ఆడితే గెలుపు కష్టమేం కాదు. –పృథ్వీ షా, భారత జట్టు కెప్టెన్

భారత్‌కు అభిమానుల దన్ను

మౌంట్‌మాంగనీ ప్రాంతంలో భారత్ నుంచి వలస వెళ్లిన సిక్కు కుటుంబాలు అధికం. ఇక్కడ వారి జనాభా 4 వేల వరకు ఉంటుంది. ఫైనల్లో వీరిలో ఎక్కువమంది భారత్‌కు మద్దతుగా స్టేడియానికి వచ్చే అవకాశం ఉంది. స్టేడియం సామర్థ్యం 8 వేలు.

పిచ్

మ్యాచ్ జరిగే బే ఓవల్ పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. పొట్టి ఫార్మాట్ క్రికెట్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ పిచ్‌పై తొలి మ్యాచ్‌లో భారత్ ఆస్ట్రేలియాపైనే 328 పరుగులు చేసింది.

వాతావరణం

వాతావరణంపై కొంత అనిశ్చితి నెలకొంది. శుక్రవారం భారీగా ఎండ కాసినా, శనివారం మేఘావృతంగా ఉండే అవకాశం ఉంది. రెండు రోజులుగా పిచ్‌ను కవర్లతో కప్పి ఉంచుతున్నారు.

ఫైనల్‌కు రిజర్వ్ డే ఉంది.

టైటిల్ పోరుకు చేరాయిలా...

భారత్

లీగ్ దశలో...
- ఆస్ట్రేలియాపై 100 పరుగులతో విజయం
- పపువా న్యూ గినియాపై 10వికెట్లతో గెలుపు
- జింబాబ్వేపై 10 వికెట్లతో విజయం

క్వార్టర్ ఫైనల్
- బంగ్లాదేశ్‌పై 131 పరుగులతో గెలుపు

సెమీఫైనల్
- పాక్‌పై 203 పరుగులతో విజయం

ఆస్ట్రేలియా

లీగ్ దశలో
- భారత్ చేతిలో 100 పరుగుల తేడాతో ఓటమి
- జింబాబ్వేపై 7 వికెట్లతో విజయం
- పపువా న్యూ గినియాపై 311 పరుగుల తేడాతో గెలుపు

క్వార్టర్ ఫైనల్
- ఇంగ్లండ్‌పై 31 పరుగులతో విజయం

సెమీఫైనల్
- అఫ్గానిస్తాన్‌పై 6 వికెట్లతో గెలుపు

మానవ్... ప్రపంచ నంబర్‌వన్

అండర్–18లో టాప్ ర్యాంక్‌లో నిలిచిన తొలి భారత టీటీ ప్లేయర్

న్యూఢిల్లీ: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ)లో ఇన్నాళ్లూ భారత్ తరఫున ఎవరూ చేరుకోలేని టాప్ ర్యాంక్‌కు యువ ఆటగాడు మానవ్ వికాస్ ఠక్కర్ చేరుకున్నాడు. అండర్–18 బాలుర సింగిల్స్ విభాగంలో అతను 'టాప్' లేపాడు. ఈ ఘనత సాధించిన తొలి భారత ఆటగాడిగా మానవ్ చరిత్రకెక్కాడు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) విడుదల చేసిన తాజా ర్యాంకుల్లో ఈ గుజరాతీ సంచలనం 6,396 రేటింగ్ పాయింట్లతో నంబర్‌వన్ స్థానం దక్కించుకున్నాడు. గత నెలలోనే రెండో స్థానానికి ఎగబాకిన ఈ 17 ఏళ్ల సూరత్ కుర్రాడు రోజుల వ్యవధిలో అగ్రతాంబూలం అందుకున్నాడు.



సాధారణంగా చైనా, జపాన్ ప్లేయర్ల ఆధిపత్యం ఉండే టేబుల్ టెన్నిస్‌లో ఓ భారత ఆటగాడు మొదటి ర్యాంకులో నిలవడం గొప్ప విషయం. చైనా ప్లేయర్ వాంగ్ చుకిన్ (6,220) రెండో స్థానంలో ఉండగా, భారత సంతతికి చెందిన అమెరికన్ కనక్ ఝా (6,159) మూడో ర్యాంక్‌లో నిలిచాడు. హైదరాబాదీ కుర్రాడు సూరావజ్జుల స్నేహిత్ నిలకడగా 24వ ర్యాంకులోనే కొనసాగుతున్నాడు. అగ్రస్థానంపై స్పందించిన మానవ్ 'ఇంత త్వరగా నంబర్‌వన్ అవుతానని ఎప్పుడూ ఊహించలేదు. కానీ ఎప్పుడైతే టాప్–5లో నిలిచానో అప్పట్నించి నాలో ఆత్మ విశ్వాసం అంతకంతకు పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు టాప్ ర్యాంక్ దక్కింది' అని అన్నాడు.

శ్రీలంక భారీ స్కోరు

చిట్టగాంగ్: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో శ్రీలంక బ్యాట్స్‌మెన్ పరుగుల వరద పారిస్తున్నారు. కుశాల్ మెండిస్ (196; 22 ఫోర్లు, 2 సిక్స్‌లు), ధనంజయ డిసిల్వా (173; 21 ఫోర్లు 1 సిక్స్) భారీ శతకాలు నమోదు చేశారు. రోషన్ సిల్వా (87 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ చండిమాల్ (37 బ్యాటింగ్) రాణించడంతో శుక్రవారం ఆట ముగిసే సమయానికి లంక 3 వికెట్ల కోల్పోయి 504 పరుగులు చేసింది. ప్రస్తుతం బంగ్లా స్కోరుకు 9 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 187/1తో మూడోరోజు ఆట కొనసాగించిన మెండిస్, డిసిల్వా రెండో వికెట్‌కు 308 పరుగులు జోడించారు. అనంతరం ముస్తఫిజుర్ బౌలింగ్‌లో డిసిల్వా ఔట్ కాగా... మెండిస్ ద్విశతకానికి 4 పరుగుల దూరంలో తైజుల్ ఇస్లాంకు దొరికిపోయాడు.




కుశాల్ మెండిస్

సెమీస్‌లో పేస్ జంట

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ డాలస్ ఏటీపీ చాలెంజర్ టోర్నీ డబుల్స్ విభాగంలో సెమీస్‌కు చేరుకున్నాడు. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ పేస్–జో సాలిస్‌బరీ (బ్రిటన్) జోడీ 6-3, 2-6, 17-15తో 'సూపర్ టైబ్రేక్'లో రూబెన్ గొంజాలెజ్ (ఫిలిప్పీన్స్)–హంటర్ రీస్ (అమెరికా) జంటపై గెలుపొందింది.

దాసన్‌కు కాంస్యం



టెహ్రాన్: ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండో పతకం లభించింది. పురుషుల 60 మీటర్ల రేసులో ఎలాకియా దాసన్ కాంస్య పతకాన్ని సాధించాడు. అతను 6.67 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచాడు. ఈ ప్రదర్శనతో దాసన్... 6.87 సెకన్లతో సమీర్ మోన్ పేరిట ఉన్న భారత జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు. అయితే దాసన్ ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ అర్హత ప్రమాణాన్ని (6.63 సెకన్లు) అధిగమించడంలో సఫలం కాలేకపోయాడు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం
3-2-2018



సీతమ్మ వాకిట్లో సిరిచెట్టు

జీవితంలో బంధాలు, అనుబంధాలు ఉంటే అంతకు మించిన సిరి లేదు. బడ్జెట్‌లు వస్తాయి. పోతాయి. మధ్య తరగతికి వచ్చేది లేదు, పోయేది లేదు. ఒకచోట తగ్గితే ఇంకోచోట పెరుగుతుంది. ప్రభుత్వాల పనే అది.. బ్యాలెన్స్ చెయ్యడం! డబ్బుతో.. కిందా మీదా అయ్యే రిలేషన్స్‌ని బ్యాలెన్స్ చేసుకోవడం మన పనే. ఇంట్లో సంతోషం ఉంటే డబ్బు ఉన్నట్లే. సిరిచెట్టు ఉన్నట్లే. 'డబ్బులు... చెట్లకు కాస్తాయా?' అంటారు! కాయవు. కానీ సిరిచెట్టుకు సంతోషం కాస్తుంది. అంతకు మించిన సంపద ఏముంటుంది?

'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలో క్లైమాక్స్ సీన్. పెళ్లి మండపంలో వెంకటేశ్, మహేశ్‌బాబు కూర్చొని ఉంటారు. వాళ్లను వెతుక్కుంటూ వస్తాడు ప్రకాష్‌రాజ్. వచ్చి ఇద్దరి మధ్యా కూర్చుంటాడు. వాళ్లిద్దరూ కొడుకులు. ఆయన తండ్రి.

''ఏమిచ్చార్రా నేను మీకు. ఆస్తులిచ్చానా ఏదైనా ఇచ్చానా? రెక్కలిచ్చాను... పోరాడండ్రా అని. ఒక సామాన్యుడిగా.. మనం ఏమివ్వగలంరా ఈ సమాజానికి? ప్రేమతో కూడిన ఒక మంచి కుటుంబం తప్ప. దానికి మించింది ఇంకేదైనా ఉందేంట్రా? ఆ భగవంతుడిని మన కోసం ఏం కోరుకోనక్కర్లేదురా. అలా కోరుకోవాల్సి వస్తే పక్కోడి గురించి కోరుకోవాలి. భగవంతుడా నిజాయితీ బతికే ఏ ఒక్కడినీ చిరునవ్వుకు దూరం చేయకు తండ్రీ.. చిరునవ్వు నుంచి దూరం చెయ్యకు'' అని.. అంటాడు.

చిరునవ్వు ఎక్కడి నుంచి వస్తుంది? అనుబంధాల నుంచి. అనుబంధాలు ఎక్కడి నుంచి వస్తాయి? డబ్బు నుంచా? డబ్బు లేకపోవడం నుంచా?

కలిమి లేములు.. కష్టసుఖాలు

చేతిలో డబ్బుంటే నొప్పి తెలీదు. నొప్పి తెలియడం లేదని ఖర్చు పెట్టేస్తే చెయ్యే ఉండదు. అదీ డబ్బు వ్యాల్యూ. మరి చేతికి వ్యాల్యూ లేదా? ఉంటుంది. పట్టు విడుపులు ఉన్న చేతికి మాత్రమే ఆ వ్యాల్యూ ఉంటుంది. డబ్బుని ఎక్కడ పట్టుకోవాలో అక్కడ పట్టుకోవాలి. ఎక్కడ వదలాలో అక్కడ వదలాలి.

పట్టుకోవడం కోసం వదిలేవాడు బిజినెస్‌మేన్.

వదల్లేక వదల్లేక పట్టుకునేవాడు టాక్స్‌పేయర్.

పట్టు బిగించడం కోసం వదిలేసేవాడు ఇన్వెస్టర్.

పట్టు విడుపులు పట్టనివాడు కన్‌జ్యూమర్. ఏవరేజ్ కుటుంబీకుడు.

ఏ బడ్జెట్ అయినా టోటల్‌గా ఈ నలుగురి చుట్టూనే తిరుగుతుంది. నిన్న జైట్లీ బడ్జెట్ కూడా ఇంతే. సుఖ దుఃఖాలన్నీ ఈ నలుగురివే. లాభ నష్టాలన్నీ ఈ నలుగురికే. ఆర్థిక లోకంలోని స్వర్గం నరకం ఈ నలుగురి కోసమే!

బడ్జెట్‌ని బట్టి కలిమి లేములు.. కష్టసుఖాలు.

మనుషుల్లోనే ఎక్కువ తక్కువలు

చేతిలో ఉన్న పది నోటు.. అది మిగులైనా, తగులైనా.. అందులోంచి మళ్లీ.. వచ్చే రూపాయి, పోయే రూపాయి అని బడ్జెట్ వేసుకునే మనుషులమే మనమందరం. ఊహించని విధంగా వచ్చిన ఒక్క నోటుతో.. స్విచ్ వేసినట్లుగా మన ముఖం వెలిగిపోతుంది. ఊహించని విధంగా చెయ్యిజారిన ఒక్క నోటుతో 'టప్'మన్న బల్బులా మన ముఖం మాడిపోతుంది.

డబ్బులో ఎక్కువ తక్కువలుండొచ్చు. డబ్బు దగ్గర మాత్రం అందరూ ఒక్కటే. రూపాయొస్తే సంతోషం. రూపాయి పోతే సారో ఫీలింగ్.

లోక్‌సభలో జైట్లీ మొన్న.. సూట్‌కేస్ ఓపెన్ చేస్తున్నప్పుడు లోపలంతా సీరియస్‌గా కూర్చొని ఉన్నారు. రాష్ట్రపతికీ, ఉప రాష్ట్రపతికీ, గవర్నర్‌లకు జీతాలు పెరుగుతున్నాయ్ అని బడ్జెట్ చదువుతూ, జైట్లీ ప్రకటించగానే ఎంపీల ముఖాల్లో ఒక్కసారిగా చిరునవ్వులు విరిశాయి! వాళ్లకు పెరిగితే ఆటోమేటిగ్గా వీళ్లకు పెరుగుతాయి. అదీ సంతోషం.

ఎందుకంత సంతోషం? వాళ్లకేం తక్కువ? తక్కువనీ కాదు, ఎక్కువనీ కాదు. పెరగడం సంతోషం. డినామినేషన్ ఎంతైనా డబ్బు డబ్బే. అదొక డివైన్ గిఫ్ట్. మోదీ ఇచ్చేదో, జైట్లీ ఇచ్చేదో కాదు. దేవుడిచ్చిన నోటు. కింద పడిన నోటును ప్రైమ్ మినిస్టర్ అయినా, ప్రింట్ కొట్టేవాడైనా కళ్లకు అద్దుకోవాల్సిందే.



సుఖ దుఃఖాల లెక్క

చార్ల్ డికెన్స్ లెక్క ఒకటి ఉంది. వార్షిక ఆదాయం 20 పౌండ్లు. వార్షిక వ్యయం 19 పౌండ్ల 6 షిల్లింగ్స్. ఫలితం.. సంతోషం. వార్షిక ఆదాయం 20 పౌండ్లు. వార్షిక వ్యయం 20 పౌండ్ల 6 షిల్లింగ్స్. ఫలితం.. విచారం. డబ్బు లెక్క ఇలాగే ఉండాలి. దేశానికైనా, మనిషికైనా. సూట్‌కేస్‌లోని బడ్జెట్‌కైనా, పర్సులోని అరల్లోనైనా. చార్ల్స్ ఆర్థికవేత్త కాదు. చాణక్యుడు కాదు. డబ్బుల్లేని మనిషి. డబ్బుల్లేక పస్తులున్న మనిషి. తండ్రి చేసిన అప్పుల్ని తీర్చడానికి ఉద్యోగం చేసిన మనిషి. తల్లికి, తోబుట్టువులకు ఇంత గోధుమ రొట్టెను సంపాదించడానికి రెక్కలు ముక్కలు చేసుకున్న మనిషి. పుస్తకాలు రాయడం కూడా నాలుగు పౌండ్ల కోసమే చేసిన మనిషి. 'డేవిడ్ కాపర్‌ఫీల్డ్' ఆయన ఆటోబయోగ్రఫీ. అందులో డబ్బు గురించేమీ లేదు. కానీ డబ్బున్నవాళ్లు, డబ్బు లేనివాళ్లు, డబ్బుంటే ఇంట్రెస్ట్ లేనివాళ్లు కూడా చదవాల్సిన పుస్తకం. బుక్‌గా వెయ్యకూడదనుకున్నాడు చార్ల్స్ మొదట. 'నా తలనొప్పులెందుకు ఈ ప్రపంచానికి?' అనుకున్నాడు. కానీ పబ్లిషర్‌లు వేయించారు. ముందు సీరియల్‌గా (1849–59), తర్వాత బుక్‌గా! బ్రిటన్‌లో ఆ సీరియల్‌ని అప్పట్లో చదవనివారు దాదాపుగా లేరు.

పెట్టినంత పెట్టాలి

మనిషికి దేవుడు రెండు చేతులు ఇచ్చింది.. పట్టినంత తీసుకుని, పెట్టినంత పెట్టమనే! కోట్ బాగుంది. ఎవరి కోట్ అయి వుంటుంది? బాగా డబ్బున్న మనిషిదా? డబ్బులేని బికారిదా? చూశారా.. డబ్బున్న వాళ్లను మనిషి అనీ, డబ్బు లేని మనిషిని బికారి అనీ అనేస్తున్నాం. డబ్బు ఉన్నవాళ్లు, లేనివాళ్లు ఎలా ఉంటారో చెప్పలేం. ఏం ఆలోచిస్తారో చెప్పలేం. కానీ డబ్బు ఉన్నవాళ్ల పట్ల, లేనివాళ్ల పట్ల మనం ఎలాగుంటామో మన మనసుకు తెలుసు. ఎవరు ఎలా ఉన్నా.. ఇవ్వడం అనేది గొప్ప. డబ్బు ఇవ్వడం ఇంకా గొప్ప. కష్టపడి సంపాదించినదాన్ని ఇష్టపడి ఇవ్వడం మరీ మరీ గొప్ప. గొప్పే కానీ, డబ్బు దగ్గర జాగ్రత్తగా ఉండాలి. డబ్బు విలువ తెలియనివాళ్లకు డబ్బివ్వడం.. డబ్బు అవసరం లేనివాళ్లకు పిలిచి డబ్బివ్వడమే! మన కష్టం విలువను మనం తగ్గించుకున్నట్లు.

తాత్వికులు చాలా చెప్పారు. డబ్బుదేముంది? పోయేటప్పుడు కట్టకట్టుకుపోతామా అని! పోము నిజమే. ఉన్నప్పుడు (డబ్బు కాదు.. మనుషులం) పోయినట్లు ఎందుకుండాలి? ఎలాగూ పోతాం కదా అని చేతిలోనిది ఎందుకు పోగొట్టుకోవాలి?

డబ్బుకు ఎన్ని మరకలైనా అంటుకోవచ్చు. చెల్లుబాటు అవుతుంది. ఫిలాసఫీ అంటుకోకూడదు. జీవితాన్ని చెల్లుబాటు కాకుండా చేస్తుంది. 'డబ్బు బ్రెయిన్‌లో ఉండాలి కానీ హార్ట్‌లో ఉండకూడదు' అంటాడు జొన్నాథన్ స్విఫ్ట్. ఆయన సెటైరిస్టు. అందుకని అలా అనలేదు. డబ్బంటే కూడికలు, తీసివేతల లెక్క. లెక్కల్లో గుండె.. పూర్ స్టూడెంట్. ఆన్సర్లు కరెక్టుగా చేయలేదు. బ్రెయిన్.. క్లవర్ స్టూడెంట్. పర్‌ఫెక్టుగా చేస్తుంది. చివరికి మిగిలిందేదో అదే.. గుండె ఉన్నవాడి ఆన్సర్. చివరికి ఏం మిగలాలో అదే.. బ్రెయిన్ ఉన్నవాడి ఆన్సర్.

లేనప్పుడే ఉన్నట్లుండాలి

డబ్బు విషయంలో నిజాయితీ, ఉదారత పనికిరావంటాడు చాణక్యుడు. మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని గురువు ఈయన. ఆయన రాసిన 'అర్థశాస్త్రం' రెండువేల మూడొందల ఏళ్ల తర్వాత కూడా ఇవాళ్టికీ ప్రపంచ దేశాలకు ఒక ఎకనమిక్ గైడ్. కష్టం వచ్చినప్పుడు మనిషి దేవుడివైపు చూసినట్టుగా, చేతిలో డబ్బుల్లేనప్పుడు అగ్రరాజ్యాలు సైతం చాణక్యుడి బుక్‌ని తిరగేస్తాయి. 'పూట గడవడం ఎలా?' అని తెలుసుకోవడం కోసం. అయితే అంత 'లేని పరిస్థితి' ఎందుకొస్తుంది!

ఉన్నవాళ్లు లేనివాళ్లకు ఇస్తే సమాజం 'ఈక్వల్ ఈక్వల్' అవుతుందంటుంది కమ్యూనిజం. ఉన్నవాళ్లు వ్యాపారాలు చేస్తే సమాజం 'డెవలప్' అవుతుంది అంటుంది క్యాపిటలిజం. ప్రపంచంలో కమ్యూనిస్టులూ ఉన్నారు, క్యాపిటలిస్టులూ ఉన్నారు. సహజంగానే ఈ రెండు ఇజాల మధ్యా క్లాష్ మొదలౌతుంది. అభివృద్ధితో సమానంగా అసమానతలూ పెరిగితే క్లాష్ కాక మరేమొస్తుంది? చివరికది 'క్యాష్ క్రంచ్'కి దారితీస్తుంది. ఏ పాపమూ తెలియని డబ్బు నలిగిపోతుంది. బ్లాక్ అయిపోతుంది. అప్పుడు మళ్లీ చాణక్యుడు సీన్‌లోకి వస్తాడు.

డబ్బు ఒకేచోట ఉండిపోకూడదు. ఒకే దారిలో తిరక్కూడదు. ఎప్పుడూ ఒకే పని చేస్తుండకూడదు. ఇవన్నీ పెద్ద పెద్దవాళ్లకు.

డబ్బే లోకంగా బతక్కూడదు. డబ్బు ఏ దారిలో ఉంటే ఆ దారిలోకి వెళ్లిపోకూడదు. డబ్బును దాచేయడమే జీవిత లక్ష్యం కాకూడదు. ఇవన్నీ చిన్న చిన్నవాళ్లకు.

బంధాల వల్లే విలువ

చేతి నిండా డబ్బుండీ ఊరికే కూర్చుంటే ఆర్బీఐ గవర్నర్ సంతకం ఉన్నా సరే, ఆ డబ్బుకు వ్యాల్యూ ఉండదు!

చేతిలో అసలేం లేకుండా అవీ ఇవీ ఇంటికి తెచ్చేసుకుంటూ ఉంటే.. ఎన్ని సౌఖ్యాలున్నా ఆ మనిషికి వ్యాల్యూ ఉండదు.

డబ్బుని కష్టపడి సంపాదించాలి. జాగ్రత్తగా ఖర్చుపెట్టాలి. అప్పుడే ఆ డబ్బుకి, ఆ మనిషికి విలువ. ఇలాంటి విలువే బంధాలను, అనుబంధాలను నిలబెడుతుంది. ఆ నిలబెట్టే వ్యాల్యూ 'మనీ'ది కాదు. మనిషిది!

ఘటన



• సనూష

ఇదా లోకం!

మలయాళీ నటి సనూషకు బుధవారం రాత్రి రైల్లో కన్నూర్ నుంచి తిరువనంతపురానికి ప్రయాణిస్తున్నప్పుడు ఒక చేదు అనుభవం ఎదురైంది! సమాజం మీద సనూషకు నమ్మకం పోగొట్టిన ఘటన అది! రాత్రి ఒంటిగంటప్పుడు తన పెదవులకు ఏదో తగిలినట్లనిపిస్తే చప్పున నిద్ర నుంచి లేచి చూశారు సనూష. ఒకతను ఆమెను ముద్దుపెట్టుకోబోతున్నాడు. సనూష అతడిని గట్టిగా పట్టుకుని, చెయ్యి మెలితిప్పుతూ, లైట్లు వేసి బోగీలోని మిగతా ప్రయాణికుల్ని అలెర్ట్ చేసింది. 'ప్లీజ్.. దీన్ని ఇష్యూ చెయ్యకండి'' అని అతను బతిమాలుతున్నాడు. ఇదంతా గమనిస్తూ కూడా.. బోగీలోని ఒక్కరూ సనూషకు సపోర్టుగా రాలేదు. అతడినీ ఏమీ అనలేదు! చోద్యం చూస్తున్నట్లుగా ఉండిపోయారు. సనూషతో పాటు ప్రయాణిస్తున్న రైటర్ ఉన్ని, రంజిత్ ఇంకొకతను మాత్రం అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తెల్లారే మీడియాకు ఈ విషయం చెబుతూ, సనూష ఎంతో బాధపడ్డారు. ''ఇదే విషయాన్ని నేను ఫేస్‌బుక్‌లో పెట్టి ఉంటే 'ఐయామ్ విత్ సనూష' అని కామెంట్లు పెట్టేవాళ్లు. వాళ్ల డిస్‌ప్లే పిక్‌లను కూడా నాకు మద్దతుగా మార్చుకునేవారు. కానీ ఇదంతా సోషల్ మీడియా వరకేనా? నిజ జీవితంలో ఎవరూ బాధితులకు అండగా నిలబడే ధైర్యం చేయలేరా?'' అని సనూష అన్నారు. అంతేకాదు, ''రాత్రి జరిగిన ఘటన ఈ సమాజంపైన నాకు నమ్మకాన్ని పోగొట్టింది'' అని ఆవేదన చెందారు. బోగీలో ఆమెను ముద్దుపెట్టుకోబోయిన వ్యక్తి పేరు 'ఆంటో బోస్'. 'నేను సనూష అభిమానిని' అని పోలీసులకు చెప్పుకున్నాడు. అతడి మీద కన్నా కూడా, అతడిని చూస్తూ ఊరుకున్న వారిపైనే సనూష ఎక్కువ కోపంగా ఉన్నారు.

ఇన్‌టిప్



పండ్లను, కూరగాయలను మామూలు నీటితో ఒక సారి కడిగేస్తే వాటికి అంటిన దుమ్ము, ధూళి, రసాయనాలు అంత తొందరగా వదలవు. అలా కాకుండా రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, ఒక టేబుల్‌స్పూన్ బేకింగ్ సోడాను రెండు కప్పుల గోరువెచ్చటి నీటిలో వేసి బాగా కలపాలి. ఈ ద్రవాన్ని ఒక ఖాళీ స్ప్రేబాటిల్‌లో పోసి, పండ్లు, కూరగాయలపైన స్ప్రే చేయాలి. ఓ అయిదు నిమిషాల తర్వాత, వాటిని కుళాయినీటిలో లేదా నీటిపాత్రలో వేసి కడిగేస్తే శుభ్రపడతాయి.

చెట్టు నీడ

పనికొచ్చే పేటిక

ఒక జెన్ కథ ఇలా సాగుతుంది. ఒక రైతు ముసలివాడయ్యాడు. ఒంట్లో శక్తి ఉడిగింది. పొలానికి వెళ్లడం మానేశాడు. ఊరికే ఇంటి అరుగు మీద కూర్చుని ఉండేవాడు. ఇది ఆ రైతు కుమారుడికి నచ్చేది కాదు. తండ్రి వల్ల ఏం ఉపయోగం? పైగా తిండి దండగ. ఈ ఆలోచన రావడంతోనే చెక్కతో ఒక శవపేటిక తయారుచేశాడు. దాన్ని ముందర పెట్టి, అందులోకి వెళ్లమని తండ్రిని ఈడ్చాడు. మారు మాట్లాడకుండా ఆ వృద్ధుడు శవపేటికలోకి వెళ్లి పడుకున్నాడు.

> **కొండ శిఖరానికి చేరుకున్నాక, ఉన్నట్టుండి ఆ పేటికలోంచి ఏదో వెలుగు వచ్చింది.**

మూత బిగించి, ఆ పేటికను ఒక కొండ దగ్గరకు మోసుకెళ్లాడు కొడుకు. కొండ శిఖరానికి చేరుకున్నాక, ఉన్నట్టుండి ఆ పేటికలోంచి ఏదో వెలుగు వచ్చింది. చూద్దామని మూత తీశాడు కొడుకు. లోపల ప్రశాంతంగా పడుకుని వున్న తండ్రి, 'నాయనా, ఎటూ ఈ కొండ అంచు నుంచి నన్ను తోస్తావు; కానీ చనిపోయేముందు నీకో సలహా ఇవ్వనా?' అన్నాడు. 'ఏమిటది?' అడిగాడు కొడుకు. 'కావాలంటే నన్ను తోసెయ్; కానీ ఇంత కొత్త పేటికను ఎందుకు వృథా చేస్తావు? ఇది రేపు నీ కొడుకులకు పనికి రావొచ్చుగదా' అన్నాడు.

కథ ఇంతే. ఆ తండ్రి ఇచ్చిన వెలుగు ఆ కొడుకు హృదయంలోని చీకటిని తొలగించిందో లేదో కథ చెప్పదు. ఆ కొడుక్కు భవిష్యత్ దర్శనం కలిగిందో చెప్పదు. కానీ ఒక పరంపర పట్ల చూపాల్సిన మర్యాదను చెబుతుంది. చేసినదానికి చూపాల్సిన కృతజ్ఞతను చెబుతుంది. ఈ గుణాలే కదా, మన లోపలిని వెలిగించేవి!

టీజర్



• 'పరీ' చిత్రంలో అనుష్క

అప్సరస


'**వ**న్ మంత్ టు గో'! నిన్ననే రిలీజ్ అయిన 30 సెకన్ల 'పరీ' టీజర్ చివర్లో కనిపించే లైన్ ఇది. ఇంకో నెల రోజుల్లో మార్చి 2న 'పరీ' విడుదల కాబోతోంది. ఈ సూపర్ నేచురల్ హారర్ మూవీలో అందాల రాశి అనుష్కాశర్మ డెవిల్‌గానో, దెయ్యం పట్టిన మనిషిగానో నటిస్తున్నారని.. టీజర్‌లను బట్టి ఊహించుకోవచ్చు. ఈ టీజర్‌కి నిర్మాతలు 'స్క్రీమర్ 2' అని పేరు పెట్టారు. ఇందులో అనుష్క కాళ్లు మెల్లిగా సాగుతూ, కాలి గోళ్లు పెరుగుతూ పోతుంటాయి! అది కూడా ఎప్పుడు? అనుష్క కుర్చీలో ఊగుతూ టీవీలో 'టామ్ అండ్ జెర్రీ' చూస్తున్నప్పుడు!! మొదటి టీజర్‌లో అనుష్క ముఖం నిండా రక్తపు చారికలు ఉంటాయి. కళ్లు అగ్నిగోళాల్లో ఉంటాయి. అదే భయంకరం అనుకుంటే, రక్తపు మరకలు అంతగా కనిపించని ఈ రెండో టీజర్ మరీ భయానకంగా ఉంది. 'పరీ' అంటే 'అప్సరస' అని అర్థం. అయితే ఇదేమీ ఫెయిరీ టేల్ కాదని మూవీ మేకర్స్ హెచ్చరిస్తున్నారు. 'పరీ'లో కాకుండా అనుష్క మరో రెండు సినిమాల్లో కనిపించబోతున్నారు. షారుక్ పక్కన 'జీరో'లో, వరుణ్ ధావన్ పక్కన 'సూయ్ ధాగా'లో. మరి 'పరీ'లో ఎవరి పక్కన? పరీ పక్కన ఎవరుంటారూ! పరుగెత్తి ఉంటారు. అన్నట్టు పరి అంటే అప్సరస అని అర్థం.



• 'సూయ్ ధాగా' చిత్రంలో

సాక్షి ఫ్యామిలీ
సినిమా
విజయవాడ
శనివారం
3-2-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా. నేను తొమ్మిదో తరగతి నుంచి ఒకరి(వన్ ఇయర్ సీనియర్)ని లవ్ చేస్తున్నాను. కానీ ఆ విషయం అతనికి చెప్పలేదు. తను టెన్త్ తరువాత ఇంటర్ కాలేజ్‌లో జాయిన్ అయ్యాడు. నేను వాళ్ల ఫ్రెండ్‌తో చాట్ చేస్తుంటానని తెలుసుకుని, నా నంబర్ తీసుకున్నాడు. ఆ తరువాత నుంచి నైట్ 12 వరకు నాతో చాట్ చేసేవాడు. ఐతే ఉన్నట్టుండి నా నంబర్ బ్లాక్ చేశాడు. ఎందుకు బ్లాక్ చేశాడో అర్థం కావడం లేదు. కనీసం లవ్ చేస్తున్నానన్న విషయం కూడా తనకి చెప్పలేదు. తనని ఇప్పటికీ లవ్ చేస్తున్నాను. మొన్న మా ఫ్రెండ్‌కి ఫోన్ చేసి.. "ఆ అమ్మాయికి నాకు ఏ రిలేషన్ లేదు, తనని బ్లాక్ చేసేశాను" అని చెప్పాడట. కానీ వాడంటే నాకు ప్రాణం. లవ్ చేసుకుంటున్నట్లు ఒకరికి ఒకరం చెప్పుకోలేదు. అసలు అతడిని లవ్ చెయ్యాలా వద్దా అన్నయ్యా? ప్లీజ్ గుడ్ రిప్లై ఇవ్వండి అన్నా.

\- కీర్తి

చేపను పట్టుకోవడానికి వాడు వేశాడు గాలం...
వెయ్యకు చెల్లెమ్మా వాడి ఆటలకు తాళం...
అసలు పట్టించుకోకుండా వేసెయ్ మనసుకు తాళం...
కరగనియ్యి కాసింత కాలం...!

'సార్ ఈ పిచ్చి ఎప్పటి నుంచి పట్టింది సార్? ఈ పొయెట్రీ ఒకటే నసా...!! భరించలేక పోతున్నాం. చెవుల నుంచి రక్తం వస్తోంది సార్. నన్నడగొద్దు ప్లీజ్ అని కాలమ్ పెట్టుకున్నా.. ఇన్నేసి ఉత్తరాలు వస్తున్నాయని మీకు బాగా ఎక్కింది సార్.. పొగరుగా రాస్తున్నారు సమాధానాలు.. ఎందుకు సార్ రీడర్లకు ఈ టార్చర్??'

ఏదో భారలో రాస్తాం కదా నీలా..!? మరీ కరుసుగా సమాధానాలు చెబితే.. మనసు చలిస్తుందని ఇలా చెల్లెమ్మ కవిత్వంతో ఉత్తమ మెసేజ్ ఇద్దామని..!

'చెల్లిని చెల్లెమ్మగా మార్చారు.. మీరు మారరు సార్. కీర్తికి విషయం చెప్పండి..'

కీర్తమ్మా.. వాడు కాసేపు నీతో ఆడుకున్నాడు.. అసలు సీరియస్‌గాడు కాదు వాడు.

వాడికే అంత తలపొగరు ఉంటే.. మనకెంత ఉండాలి చెల్లె??
పట్టించుకోకు మళ్లీ..
శుద్ధ వేస్ట్‌గాడు ఈ గోడ మీద పిల్లి...!!

'సార్... మళ్లీ రక్తం కారిపోతుంది. ఈ అరటిపండు కుక్కండి. మాటలు ఆపండి సార్?'

lovedoctorram@sakshi.com

కాకురో సుడోకు

	1				8			3
	9		6		3			7
		5		7			1	
5					1	3		6
		9	4		5	7		
1		3	9					2
	2			5		6		
9			3		6		7	
3			7				4	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	4	5	8	1	7	6	9	3
8	6	9	2	4	3	5	7	1
7	1	3	5	9	6	2	4	8
4	3	2	7	8	1	9	5	6
5	9	1	6	2	4	8	3	7
6	8	7	3	5	9	1	2	4
9	2	4	1	7	8	3	6	5
3	5	8	4	6	2	7	1	9
1	7	6	9	3	5	4	8	2

జోస్యం చెబుతా!


మైరా సరీన్


లొకేషన్లో నాగ్, మైరా

నాగార్జునకి సూపర్ న్యాచురల్ పవర్స్ వచ్చాయండీ. చేయి చూసి భవిష్యత్తు చెప్పేస్తున్నారు. అదేంటి నాగార్జున 'రాజుగారి గది 2'లో చేసిన రుద్రా పాత్ర గురించి ఇప్పుడు ఎందుకు చెబుతున్నారు అనుకుంటున్నారా? ఆ సినిమా గురించిన విషయం కాదు ఇది. "నాగార్జునగారు ఫ్యూచర్‌ని ప్రెడిక్ట్ చేస్తున్నారు" అని అంటున్నారు మైరా సరీన్. ఎవరీ మైరా సరీన్ అంటే నాగార్జున హీరోగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు మైరా. ఈ చిత్రానికి 'శపథం: మై రివెంజ్ కంప్లీట్' (పరిశీలనలో ఉన్న టైటిల్) అనుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ముంబైలో షూటింగ్ జరుపుకుంటోంది. "షూటింగ్ గ్యాప్‌లో సరదాగా నాగ్ సార్ నా చేతి రేఖలను చూసి, 'ఫిల్మ్ ఇండస్ట్రీలో నీకు చాలా బ్రైట్ ఫ్యూచర్ ఉంది' అని జోస్యం చెప్పారు" అని పేర్కొన్నారు మైరా సరీన్. ఈ బ్యూటీకి ఇది ఫస్ట్ మూవీ. ఇంతకీ ఈ మైరా సరీన్‌ని రామ్‌గోపాల్ వర్మ ఎక్కడ చూశారు? ఎలా సెలెక్ట్ చేశారో తెలుసా? "మైరాను నేనో పార్టీలో చూసి, నీకు యాక్టింగ్ అంటే ఇంట్రెస్ట్ ఉందా? అని అడిగాను. ఆ తర్వాత ఆడిషన్‌లో తన నాచ్యురల్ పెర్ఫార్మెన్స్ చూసి షాక్ అయ్యాను. తను చాలా ఎక్స్‌ప్రెసివ్" అన్నారు వర్మ. మరి నాగార్జున జోస్యం చెప్పినట్లుగా, వర్మ షాక్ అయినట్లుగా మైరా సరీన్ ఆడియన్స్‌ను కూడా ఇంప్రెస్ చేస్తారో లేదో చూడాలి. కంపెనీ పతాకంపై సుధీర్ చంద్ర- రామ్ గోపాల్ వర్మ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను సమ్మర్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

శర్వాకి హలో


శర్వానంద్, కళ్యాణి

'హలో.. మీ యాక్టింగ్ నచ్చింది. మీరు చక్కగా ఉన్నారు' అంటూ 'హలో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పిన కల్యాణీ ప్రియదర్శన్‌కి ప్రేక్షకులు కితాబులిచ్చారు. మొదటి సినిమాలో అఖిల్‌కి హలో చెప్పిన కల్యాణి ఇప్పుడు రెండో సినిమాకి శర్వాకి హలో చెప్పారు. యస్.. శర్వానంద్ హీరోగా సుధీర్‌వర్మ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో కల్యాణిని కథానాయికగా ఎంపిక చేశారట. ఈ చిత్రంలో శర్వాకి జోడీగా ముందు కాజల్ అగర్వాల్, ఆ తర్వాత నిత్యామీనన్‌ల పేర్లు వినిపించాయి. తాజాగా కల్యాణి పేరు లైన్లోకొచ్చింది. వరుస విజయాలతో దూసుకెళుతోన్న శర్వా, మొదటి చిత్రంతోనే మంచి మార్కులు కొట్టేసిన కల్యాణిలది మంచి 'పెయిర్' అవుతుందని యూనిట్ సభ్యులు భావిస్తున్నారట. దాదాపు ఆమెనే ఖరారు చేస్తున్నారని టాక్. ఇదిలా ఉంటే.. ఈ చిత్రంలో శర్వానంద్ రెండు పాత్రల్లో కనిపించనున్నారట. ఒకటి తన వయసుకి మించిన పాత్ర అని సమాచారం. ఈ పాత్ర సరసన మరో నాయిక నటిస్తారు.

నవ్వులే నవ్వులు


నిత్య, మానస్

మానస్ హీరోగా, నిత్య నరేష్, కారుణ్య హీరోయిన్స్‌గా నటించిన చిత్రం 'సోడ గోలీ సోడ'. 'మొత్తం గ్యాస్' అన్నది ట్యాగ్‌లైన్. మల్లూరి హరిబాబు దర్శకత్వంలో చక్రసీద్ సమర్పణలో భువనగిరి సత్య సింధూజ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ– ''పూర్తి వినోదాత్మకంగా రూపొందిన చిత్రమిది. ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకోవాలనే ఈ సినిమా తీశాం. క్లీన్ యు సర్టిఫికెట్ వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు. ''సీనియర్ కమెడియన్స్ అందరూ మా చిత్రంలో ఉన్నారు. కుటుంబం మొత్తం కలిసి చూసేలా సినిమా ఉంటుంది. పాలకొల్లు, హైదరాబాద్‌లోని అందమైన ప్రదేశాల్లో షూటింగ్ జరిపాం. భరత్ మంచి మ్యూజిక్ అందించారు'' అన్నారు మానస్. ''అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే చిత్రమిది. అతి త్వరలో విడుదల చేయనున్నాం'' అన్నారు సత్య సింధూజ.

మహానటుల్లో ఆయన ఉంటారు


మదన్

"గాయత్రి' సినిమా తండ్రి, కూతుళ్ల కథ. పూర్తిగా వారి మధ్యన నడుస్తుంది. గాయత్రిగా నిఖిలా విమల్ నటించారు. మోహన్‌బాబుగారు ద్విపాత్రాభినయం చేశారు. ఒక పాత్ర పేరు గాయత్రీపటేల్.. మరొకటి శివాజీ. గాయత్రీపటేల్ పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది" అని దర్శకుడు మదన్ రామిగాని అన్నారు. మోహన్‌బాబు హీరోగా విష్ణు, శ్రియ, నిఖిలా విమల్, అనసూయ భరద్వాజ్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'గాయత్రి'. అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో మోహన్‌బాబు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు మదన్ చెప్పిన విశేషాలు..

- మన జీవితంలో చాలా విషయాలు కష్టమైనవి, ఇష్టమైనవి ఉంటాయి. రెండూ ముడిపడి ఉండేదే గాయత్రి. ఓ విభిన్నమైన అంశం ఈ సినిమాలో ఉంటుంది. అదేంటన్నది తెరపై చూడాలి.
- 'గాయత్రి' సినిమా మోహన్‌బాబుగారికి రీ–లాంచ్ లాంటిది. ఆయన మంచి సలహాలు ఇచ్చారు. ఎవరు సలహా చెప్పినా ఒకటికి నాలుగుసార్లు ఆలోచిస్తారు. అదే మోహన్‌బాబుగారిలోని గొప్పదనం. కేవలం ఒక్క సిట్టింగ్‌లో సినిమా ఓకే చేసేశారు. ఆయనతో పనిచేయడం గర్వంగా ఉంది.
- మోహన్‌బాబుగారు మహానటుడు. అంతటి నటుణ్ణి ఎలా హ్యాండిల్ చేయగలనా? అనిపించేది. ఎస్వీ రంగారావు, ఎన్టీఆర్, ఏయన్నార్, శివాజీ గణేశన్ గార్లు మహానటులు. ఆ జాబితాలో ఆయనుంటారు. ఆయనకు గొప్ప పాత్రలు రాయాలంతే. విష్ణు పాత్ర ఇద్దరు మోహన్‌బాబుల్లో ఒకరికి యంగర్ వెర్షన్‌గా ఉంటుంది.
- ఫ్యామిలీ డ్రామాల్లో కొత్త.. పాత ఉండదు. అన్నిటిలోనూ ఎమోషన్ ఉంటుంది. ట్రెండ్‌తో సంబంధం లేకుండా ఎప్పుడు తీసినా పండుతాయి. నేను తక్కువ సినిమాలు చేయడానికి ప్రత్యేక కారణం ఏం లేదు. ఎందుకో అలా కుదిరింది. కొత్త కథలు రాసుకుంటున్నా. ఈ ఏడాదే మరో చిత్రం ఉంటుంది. అది ఎవరితో అన్నది తర్వాత చెబుతా.

ప్రేమ.. వినోదం


సమత, యువరాజ్

యువరాజ్, సమత జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. రావ్ దుర్గం దర్శకునిగా పరిచయం చేస్తూ ఎస్.కె.యమ్.ఎల్. మోషన్ పిక్చర్స్‌పై కాండ్రేగుల ఆదినారాయణ నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఊటీలో ప్రారంభమైంది. ఆదినారాయణ మాట్లాడుతూ– ''సోషియో ఫాంటసీ కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రమిది. లవ్, కామెడీతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలున్నాయి. ఊటీతో పాటు హైదరాబాద్‌లోనూ చిత్రీకరణ జరపనున్నాం. కీలక పాత్రలో నాగబాబుగారు నటిస్తున్నారు. ఆయన పాత్ర సినిమాకు హైలెట్‌గా నిలుస్తుంది. త్వరలో టైటిల్ ప్రకటిస్తాం. వేసవిలో సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు.

కట్ చేశారా


సోనాక్షీ సిన్హా

'మెటీరియల్ సెలెక్ట్ చేశారా? లెంగ్త్ సరిగ్గా చూసుకున్నారా? జాగ్రత్తగా... కరెక్ట్‌గా కట్ చేయండి!' సినిమాల్లోకి రాకముందు తన గ్రూప్‌తో సోనాక్షీ సిన్హా ఇలాంటి మాటలే మాట్లాడేవారు. ఎందుకంటే తను అప్పుడు ఫ్యాషన్ డిజైనర్. సినిమాల్లోకి వచ్చాక వేరే డిజైనర్స్‌తో కాస్ట్యూమ్స్ డిజైనింగ్ చేయించుకుంటున్నారీ బ్యూటీ. ఇప్పుడు మళ్లీ ఫ్యాషన్ డిజైనర్ అవతారం ఎత్తారు. అదీ సినిమా కోసమే. 'వెల్కమ్ టు న్యూయార్క్' అనే సినిమాలో సోనాక్షి ఈ పాత్రను చేస్తున్నారు. ఇందులో దిల్జిత్ హీరో. ''రియల్ లైఫ్‌లో ఫ్యాషన్ డిజైనర్ స్టూడెంట్‌ని. ఇప్పుడు రీల్‌పై ఆ పాత్ర చేస్తున్నాను. కట్టింగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ వంటి అంశాలపై నాకు గ్రిప్ ఉంది. అప్పట్లో మా బ్యాచ్‌లో టాపర్ నేనే. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు కూడా వచ్చింది నాకు'' అన్నారు సోనాక్షి. సో.. ఈ పాత్రలో జీవించేస్తారన్నమాట. పైగా ఆమె పాత్రలో రెండు షేడ్స్ ఉంటాయట. ఈ చిత్రానికి మన తెలుగు కుర్రాడు చక్రి తోలేటి దర్శకుడు. కమల్ హాసన్ 'ఈనాడు' చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయం అయ్యారు చక్రి. ఆ తర్వాత అజిత్ 'బిల్లా 2'కి దర్శకత్వం వహించారు. ప్రస్తుతం నయనతార 'కొలైయుదిర్ కాలమ్'కి, అదే చిత్రం హిందీ వెర్షన్ 'కామోషీ'కి దర్శకత్వం వహిస్తున్నారు.

రాశి ఫలాలు (సౌరమానం)



జన్మనక్షత్రం తెలియదా?
నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా?
మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం
(ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు)
మీ రాశి ఫలితాలు

డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం
(మార్చి 21 - ఏప్రిల్ 19)

అసలే కోతి – అందునా తాగింది – ఆ గంతులేయడంలో ఓ ముల్లు గుచ్చుకుంది... ' అంటూ చిన్నప్పుడు అమ్మ ఓ కథ చెప్పింది కదూ! అలాగే ఇంటి ఋణానికో పిల్లల చదువుకో కట్టవలసిన సొమ్ముని కట్టాల్సి వస్తుంటే, ఇవి కాకుండా వాహనాల మరమ్మతూ తాత్కాలిక అనారోగ్యాలూ అత్యవసరంగా కొనాల్సిన పాత్ర సామాన్లూ... వంటి వాటి కోసం ఖర్చు ఊహకి మించి పెరగచ్చు. కొంత జాగ్రత్తగా ఖర్చు చేసుకోవడం అవసరం. ఋణం తీసుకోవద్దు.

వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో సమయ నియమం ప్రకారం ఉంటాననంటే వ్యవహారం కుదరకపోవచ్చు. తప్పనిసరిగా ఎక్కువసేపు ఉండవలసి రావడం – ఒకవేళ పనిని తొందరగా ముగించుకుని ఇంటికి పోవడానికి సిద్ధమైయున్న వేళ పై అధికారి నుండి వచ్చిన పిలుపు మేరకు అదనపు పనిని చేయవలసి రావడం – యథాప్రకారంగా రోజూ వెళ్లే సమయానికే ఇంటికి వెళ్లాల్సి రావడం జరగచ్చు. దీన్ని అనవసర శ్రమగా భావించకండి. ఈ కొత్త పనిలో వస్తున్న అనుభవం, మీరు ఆ పనిని చేస్తున్న తీరు కారణంగా మీకు ప్రతిష్ఠతో పాటు ఓ గుర్తింపు కూడ వస్తుంది ఈ కాలంలో. శరీరానికి శ్రమే అయినా కాదనకుండా చెయ్యండి.

మీరు ఏ పనిని చేయబోయినా – 'అలా చేయడం కంటె ఇలా చేయడం మంచిది' అంటూ సూచనలిచ్చే వారిని పట్టించుకోకుండా మీ పనిని మీరు గుంభనంగా చేసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీకు మీరుగా నిర్ణయించుకుని చేసిన పనిలో ఏ మాత్రపు తేడా వచ్చినా, కంగారుపడిపోకండి – ఆందోళనకి గురి కాకండి. 'సమస్య వచ్చినప్పుడు మమ్మల్ని అడుగుతాడు – తీరా చెప్పాక కాదంటాడు'వంటి విమర్శలూ, ఖర్చుకి వెనకాడుతాడు, ఖర్చు పెట్టడానికి మనసొప్పదు – వంటి మాటల్ని ఎవరైనా మీ పరోక్షంలో గాని, ప్రత్యక్షంగా గాని అన్నట్లైతే అస్సలు పట్టించుకోకండి – సమాధానాన్ని చెప్పాలనుకోకండి. ఒంటి చేత్తో చప్పట్లు రావు. దాన్ని అసమర్థత అనుకోకండి. ఇప్పటికి ఈ ఉపాయమే సరైనది అని భావించండి.

లౌకిక పరిష్కారం: వాగ్వివాదానికి దిగకండి. మీ రోజువారీ పని చెడుతుంది.

అలౌకిక పరిష్కారం: ప్రతిరోజూ లక్ష్మీ అష్టోత్తర శతనామాలని పఠిస్తూ ఉండండి.

మిథునం
(మే 21 - జూన్ 20)

ఏ పనికైనా ముందువెనుకలూ దీర్ఘాలోచనలూ పదిమందితో సంప్రదింపులూ చేసి మాత్రమే ముందుకి అడుగు వేసే మీరు, అకస్మాత్తుగా ఓ స్థలమో, పొలమో ఇల్లో మొదలైన స్థిరమైన ఆస్తి కొనుగోలుకి ఒప్పందాన్ని చేసుకుంటారు. ఇది ఒక శుభపరిణామం. అయితే ఈ లావాదేవీకి సంబంధించిన ప్రతి కాగితాన్ని స్వయంగా పరిశీలించుకోండి. పెళ్లిలో భోజనాలకి కావలసిన వస్తువులన్నింటినీ ఖరీదైన వాటిన తెచ్చి వంటవాణ్ని బేరమాడి అసమర్థుణ్ని తెచ్చి అపకీర్తి పాలైనట్లుగా – ఇంత ఆస్తి కొనుగోలుకీ ఎవరో సామాన్యుణ్ని సలహాదారుగా పెట్టుకోకండి. పది రూపాయలు ఎక్కువైనా గట్టి న్యాయవాదితో పనిని పూర్తి చేయించుకోండి. ప్రస్తుతం నడుస్తున్న దశలో మీకు గట్టిదనం అవసరం – భరోసాతో ఉండడం అనర్థదాయకం. గుర్తించండి. సంతానపు చదువునీ దానితో పాటు వారి ప్రవర్తననీ కూడా బాగా పట్టించుకుంటారు. ఇది అవశ్యం. మీ కుటుంబంలో ఓ పెద్ద మీ యోగక్షేమాలని పర్యవేక్షిస్తూ ఉండచ్చు. వారి అండదండల్ని జారవిడుచుకోకండి. వైద్యుని దగ్గర సిగ్గు కారణంగాద అనారోగ్యాన్ని దాచిపెట్టకూడదన్నట్లు ఎంతోకాలం నుండి మీకు న్యాయబద్ధమైన సలహాదారుగా ఉన్న విషయాన్ని పూర్తిగా గాని, కొంతగా గాని దాచిపెట్టకండి. మీ బంధం పూర్తిగా తెగిపోవడం గాని, అదే బంధం విడిపో (లే) నంత గట్టిగా బలపడడం గాని జరిగేది ఈ కాలంలోనే సుమా!

వ్యవహారాల్లో మధ్యవర్తిత్వం – ఎదుటివారి దీనాతిదీన కథని విని కరిగిపోయి అప్పులియ్యడం – మనవాడే కదా! అని హామీని మౌఖికంగా/లేఖాపరంగా ఇయ్యడం – ఒకపక్క కొనుగోలుకి ఒప్పందం చేసుకుని విహార వినోద విజ్ఞాన యాత్రల కోసం వ్యయం చేసుకోవడం ఏ మాత్రమూ సరి కాదు.

లౌకిక పరిష్కారం: ఆర్థికంగా బాగున్న మీరే ఆస్తి కొనుగోలు కోసం డబ్బు సంచిని ఖాళీ చేస్తూ, పోనీ అప్పునిద్దామా? అనే ఆలోచనని చేయడం కూడ సరికాదు.

అలౌకిక పరిష్కారం: లక్ష్మీ అష్టోత్తర శతనామాలని, ఆవునేతి దీపం పెట్టి ప్రతిరోజూ చదువుకోండి.

సింహం
(జూలై 23 - ఆగస్ట్ 22)

ముహూర్తాన్ని పెట్టించుకో! ఆ ముహూర్త బలమే నీకు కావలసిన ధనాన్ని రప్పించి వివాహాన్ని అదే చేయిస్తుందని వెనకటికెవరో అన్నారట. అప్పటిరోజు శ్రోత్రియులూ నియమనిష్ఠలూ ఈ వేళ లేవు కాబట్టి దాన్ని మార్గదర్శకంగా తీసుకుని ముందు పనిని ప్రారంభిద్దాం! ఏదోవిధంగా ధనం రాకపోతుందా? పని పూర్తి కాకపోతుందా? అనే దృక్పథంతో అసలుండద్దు. ఇప్పటికే ప్రారంభించిన పని మందకొడిగా సాగుతూ ఎలా ఉందో మీకు తెలియనిది కాదు.

ఓ పక్క ఖరీదైన విద్యాలయాల్లో పిల్లల చదువులూ, ఇంకొక పక్క భార్య/భర్త అనారోగ్యానికి వైద్యాలూ, మరోపక్క సొంత ఇంటి నిర్మాణమో పెద్ద ఎత్తులో మరమ్మతులూ చేయించుకుంటూ ఉంటే, ఇప్పటికే ఋణాలనిచ్చి ఉన్న వారు ఒక్కుమ్మడిగా మీదికి రావడంలో ఆశ్చర్యం ఉండబోదు. యోచించి అడుగులు వేయండి. బయానాలు (అడ్వాన్స్) ఇచ్చినంత మాత్రాన పని పూర్తికి సొమ్మునిచ్చినట్లు కాదు కదా! మీరు ఇల్లు అలకడం వరకే అది కూడా అసంపూర్తిగా చేశారు. గమనించుకోండి!

ఏ క్షణానికాక్షణం గడిచిపోయింది గదా అనే దృక్పథం వద్దు– మానుకోండి. ఒక్కొక్క వర్షపు చుక్కా ఒకటికొకటి చొప్పున చేరి చేరి వరదగా మారుతుంది. అసత్యం అధర్మం కొద్దిగా వంచన... ఇవన్నీ కట్టకలుపుకుని వసేత ఎలా ఉండబోతోందో గమనించుకుని పూర్తి నిజాయితీతో వ్యవహరించండి. ఈ రాశికి చెందిన అందరూ ఇలాగే ఉండకపోవచ్చుగాని ఎక్కువ శాతం తాత్కాలిక కాలప్రభావం కారణంగా ఇలాగే ఉంటారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. సర్దుకోండి పరిస్థితిని.

చేస్తున్న ఉద్యోగాన్ని పాడికుండలాగా, వృత్తిని దైవస్వరూపంగా, వ్యాపారాన్ని కన్నతల్లిలాగా భావిస్తూ అంకిత భావంతో చెయ్యండి. ఒక్కసారిగా స్వర్గానికి బంగారపు నిచ్చెన వేయాలనుకోకండి. పిల్లలు చదువుల్లో బాగా రాణిస్తున్నందువల్లా, మీరు కొని ఉన్న ఆస్తులు బాగా పెరిగినందువల్లా మీరు ధైర్యంగా ఉన్నారు. మంచిదే!

లౌకిక పరిష్కారం: నిజాయితీతో ఉండండి. అత్యాశకి సంబంధించిన ఆలోచనల్ని మానండి.

అలౌకిక పరిష్కారం: దగ్గరలో ఉన్న దేవాలయాన్ని మీ దంపతులు స్వయంగా శుభ్రపరిచి ఒకరోజున దైవానికి పుష్పమాలని సమర్పించండి.

వృషభం
(ఏప్రిల్ 20 - మే 20)

ఓ వినోదయాత్రకో విహార పర్యటనకో బయలుదేరి ఎంతో దూరం వెళ్లాక అకస్మాత్తుగా – పాట కింద మంటని ఆర్పానా? ఇంటికి తాళం వేసానా?... అని ఈ తీరు ఆలోచన రావడం, తిరిగి ఇంటికొచ్చేవరకూ ఇదే మానసికాందోళనతో గడపడమనేది కొందరిలో సర్వసాధారణం. సరిగ్గా ఈ వారంలో మీ పరిస్థితి ఇలాగే ఉంటుంది. చేసేపనిని ఏకాగ్రతతో పూర్తిచేసి, ఆ పని ముగిసాక మీ కళ్లతో ఓ చిత్రాన్ని తీసుకుని, బుద్ధిలో పడేసుకోండి. భయం ఆందోళన అనేవి ఉండనే ఉండవు. ఒక బండరాతిని సుత్తితో కొడుతుంటే మొదటి రెండు మూడు ... దెబ్బలకే పగలదు. ఏ 236వ దెబ్బకో పగలచ్చు. అయితే కొట్టిన ప్రతి దెబ్బకి సంబంధించిన ఫలితమూ ఆ రాతి మీద ఉండనే ఉంటుంది. అలాగే మీ మానసికాందోళన చిన్నదైనా పెద్దదైనా సరే, గుండె అనే బండరాతి మీద పడుతుం(తోం)ది. అందుకే పైజాగ్రత్త పాటించండి. వాగ్వివాదం ఘర్షణ... వంటివి ఏవి వచ్చినా మీకు మాత్రమే అంతిమ విజయం లభిస్తుంది. ఆ కారణంగా కావాలని ఇతరులతో వివాదాలను పెట్టుకోకండి. వివాదం వచ్చినా – మంటని ఆర్పడానికి ప్రయత్నించినట్లు – తగ్గి మాట్లాడండి. ఇక లాభం లేదని పెంచిన పక్షంలో యుద్ధానికంటూ జెండాని ఎగరెయ్యండి. విజయం మీ వైపే అని గ్రహించండి. సాధారణంగా మీరిలాంటి మనస్తత్వంతోనే ఉంటూ ఉంటారు కాబట్టి, అందరి సానుభూతీ కూడా మీ వైపే ఉంటుంది. మీ విజయానికి ఈ పద్ధతే సరైనది. ఏ విజ్ఞాన శాస్త్రానికీ హేతువాదానికీ అందకపోవచ్చు గాని, మీ కుటుంబ సభ్యుల్లో ఏ ఇద్దరు అనుకూలంగా ఉన్నా, వ్యతిరేకించినా మీరు చేయబోయే పని లేదా చేయదలచిన పని ఏ మాత్రమూ ప్రారంభింపబడదు. ఆ కారణంగా మీరు చేయాలనుకున్న పనిని అందరి అంగీకారానికీ లోబడి ఉండేలా మెత్తగా చెప్పి ఒప్పించి పనికి కదలండి. తప్పక పూర్తవుతుంది. కీర్తి ప్రతిష్ఠలూ, ఆర్థిక లాభాలూ ఈ వారంలో లభిస్తాయి.

లౌకిక పరిష్కారం: మీ అంతట మీరే కయ్యానికి కాలు దువ్వకండి. నిష్కారణంగా కయ్యానికొస్తే మాత్రం ఊరుకోకండి.

అలౌకిక పరిష్కారం: నువ్వులూ బెల్లమూ కలిపి శివలింగాన్ని చేసి శివాష్టోత్తర నామాలతో అభిషేకించి ఇష్టమైన పదార్థాన్ని నివేదన చేయండి.

కర్కాటకం
(జూన్ 21 - జూలై 22)

పుట్టలోపల పాముందని తెలిసి కూడా ఆ తోవలోనే తరచు నడక సాగిస్తున్నట్లుగా, శరీరంలో అనారోగ్యముందని తెలిసి కూడా తగిన ఔషధ సేవ చేయకపోవడం మీలో కనిపిస్తోంది. గండి పడకముందే చెరువుగట్టుని ఎత్తు చేసుకోవడం సరైన పని కదా! ఆరోగ్య జాగ్రత్త తప్పనిసరి.

పాలని పొంగించవలసిందన్నారే తప్ప, మరిగించి, మరిగించి ఆవిరైపోయే వరకూ ఉదాసీనంగా ఉండడం సరికాదు. ఇతర ప్రదేశాల్లో మీకున్న ఆస్తులని చూసుకోవడంలో ఒకట్రెండు రోజులు వాయిదాని తీసుకోవడం మంచిది కాని, పూర్తిగా వాటిపట్ల పట్టించుకోనితనం, నిరాసక్తత, ఏదో కారణం చెప్పుకుంటూ ఆలస్యాన్ని సమర్థించుకుంటూ ఉండడం ఎంతమాత్రమూ సరికాదు. ఈ పట్టించుకోని ఆస్తులు అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉంది కాబట్టి చేస్తున్న వృత్తి ఉద్యోగ వ్యాపారాలని తాత్కాలికంగా విడిచి వెళ్లి సరి చూ(చే)సుకోండి. మరచిపోకండి. దీన్ని చదివి విడిచెయ్యకండి.

మంచి వారితో పరిచయాలు నిదానంగా ప్రారంభమై కొనసాగుతూ క్రమంగా బలపడతాయనీ, దుర్మార్గులతో పరిచయాలు అకస్మాత్తుగా ప్రారంభమై ఆదిలోనే ఆ స్నేహం అతిగా అవుతూ ఒక్కసారిగా తెగిపోతుందని పంచతంత్రం రాసిన విష్ణుశర్మ చెబుతాడు సంస్కృతంలో. ఈ రెండు తీరులూ మీకు అనుభవమౌతాయని తెలుసుకోండి.

దోసిలిపట్టిన నీరు అలా చూస్తుండగానే తరిగిపోతూ ఒట్టి దోసిలిని మిగిల్చినట్టు, మీ సొమ్ము కూడా అలా క్షణాలలో వ్యయం అయిపోతూ ఆశ్చర్యానికి గురి చేస్తుంది మిమ్మల్ని. మీ శత్రువుల్ని గెలవగలిగానని ఆనందపడకండి. ఓడిన శత్రువు కొమ్మలు నరికిన చెట్టులాంటివాడు. మళ్లీ చిగిర్చి ఇబ్బందిని కలగజేసేందుకు ప్రయత్నిస్తాడు. కాబట్టి ఎవరితోనూ శత్రుత్వమూ వద్దు– గెలుపు దాకా తెచ్చుకోనూ వద్దు.

లౌకిక పరిష్కారం: కొత్తవారితో స్నేహాలు వద్దు. అతి పరిచయం అసలొద్దు.

అలౌకిక పరిష్కారం: గణపతి అష్టోత్తర నామాలని ప్రతిరోజూ చదివి బెల్లం ముక్కని నైవేద్యంగా సమర్పించండి.

కన్య
(ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

కష్టం వస్తే లోపల ధైర్యంగా ఉంటూ పైకి పిరికితనంతో కన్పించే గుణం, ధనం బాగా వచ్చినప్పుడు ఎలా దాచుకోవాలో, ఎంత మాత్రమే ఖర్చు చేసుకోవడం మంచిదో ఆ నేర్పరితనం, ఎదుటివారితో ఎంతమాత్రం ఎలా మాట్లాడాలో ఆ విధానం మీ సొంతమైన కారణంగా మంచి పేరుని మీ వృత్తి ఉద్యోగ వ్యాపారాల ద్వారా సాధించుకోగలుగుతారు. ఇది మీకు కలిసొచ్చే కాలం కాబట్టి, ఏదో గృహాన్ని కొనడమో లేక తాత తండ్రులిచ్చిన ఇంటిని మరింత దృఢం చేసుకోవడమో జరగవచ్చు. పరుగెత్తుతుండే వ్యక్తి, తన వెనక పరిగెత్తుతున్న వాళ్లు ఎంత వెనక ఉన్నారో చూసుకుంటూ పరిగెత్తితే ఎలా ఓడిపోతాడో, అలా మీ భూతకాల విశేషాలని నింతరం గుర్తు చేసుకోకండి. భవిష్యత్ ప్రణాళికల మీదే దృష్టిని సారించండి. మీ జీవన యానంలో ఓ మంచి గుర్తింపును పొందే శుభ వార్తని వింటారు. అహంకారం లేని మీ జీవనశైలి మెచ్చుకోదగ్గదే. దాన్నే కొనసాగించండి. ఉద్యోగస్థులైన వానికి అధర్మాదాయానికి సంబంధించిన ఆశాపథకాలని తెచ్చే వాళ్లు సిద్ధంగా ఉంటారు. ఏమాత్రం ఆశకి లొంగినా అధఃపాతాళపు లోతెంతో తెలుసుకునే స్థితికి ఈ రాశి వారు వెళ్లిపోతారు. మంచిది కాదు. నిదానంగా నీళ్లే మంచివి. మీ విలువైన సమయాన్ని ఇతరుల అభివృద్ధికీ, వారికి అభివృద్ధి సాధించేందుకు కావలసిన విధానాలని వివరించడానికీ ప్రస్తుతం దుర్వినియోగం చేసుకోకండి. ముందు మీ జీవితాన్ని ఒక తీరుకి తెచ్చుకుని– మీరుద్ధరింపబడ్డాక వాళ్లని పైకి తెచ్చే మార్గాన్ని గురించి ఆలోచించండి. ఎంత బాగా రథం ప్రయాణిస్తుంటే చక్రాల ఇరుసుకి కందెన అవరమైనట్లు, మీ భౌతిక శక్తీ, ధీశక్తీ మీకు మరింత ఆనందదాయకమే అయినా, దైవశక్తి కూడా తోడయితే మరింతగా మీరు సంతోషించగలుగుతారు కదా! కొద్దిగా దైవకృపకోసం ప్రయత్నించండి.

లౌకిక పరిష్కారం: అవకాశం చూసుకుని సమీప దైవక్షేత్రాన్ని ఆధ్యాత్మిక దృష్టితో మాత్రమే (వినోద/విహార దృష్టి కాకుండా) సందర్శించండి.

అలౌకిక పరిష్కారం: మీకిష్టమైన ఓ రోజున పన్నెండుమంది యాచకులకి యథాశక్తి దధ్యోదనం పొట్లాలని ప్రేమతో అందించండి.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
విజయవాడ
శనివారం
3-2-2018

పరి పరిశోధన

కేన్సర్‌కు వినూత్నమైన వ్యాక్సిన్!

ప్రాణాంతకమైన కేన్సర్‌పై పోరాటంలో స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్ర వేత్తలు మరో కీలక విజయం సాధించారు. శరీర రోగ నిరోధక వ్యవస్థను ప్రేరేపించగలిగే రెండు రసాయనాలతో కేన్సర్ కణుతులన్నింటినీ నాశనం చేయవచ్చునని వీరు ఎలుకలపై జరిపిన పరిశోధనల ద్వారా తెలుసుకున్నారు. రోగ నిరోధక వ్యవస్థతోనే కేన్సర్ కణాలపై దాడులు చేసేందుకు ఇమ్యునోథెరపీ పేరుతో కొంతకాలంగా ప్రయత్నం జరుగుతున్న విషయం



తెలిసిందే. మొత్తం శరీరాన్ని కాకుండా, కణుతులున్న ప్రాంతంలో మాత్రమే రోగ నిరోధక వ్యవస్థ చైతన్యవంతమయ్యేలా చేయగలిగామని, ఫలితంగా అతి తక్కువ దుష్ప్రభావాలతోనే కేన్సర్‌ను దూరం చేయగలిగామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త రొనాల్డ్ లెవీ తెలిపారు. అతితక్కువ ఖర్చుతో ఇమ్యునోథెరపీకి ఇది మేలైన మార్గమని అన్నారు. అంతేకాకుండా కణుతుల్లోని కణాలకు మాత్రమే సంబంధించిన రోగ నిరోధక వ్యవస్థను చైతన్యవంతం చేయాల్సిన అవసరం తప్పుతుందని ఆయన చెప్పారు. తాము ఉపయోగించే రెండు రసాయనాల్లో ఒకదానికి ఇప్పటికే అనుమతులు ఉన్నాయని, రెండో రసాయనాన్ని కూడా మానవుల్లో పరీక్షించి చూశామని లెవీ వివరించారు. ఈ రెండు రసాయనాల సమ్మేళనాన్ని లింఫోమా రకం కేన్సర్లతో పాటు ఇతర కేన్సర్లలోనూ ఉపయోగించవచ్చునని తెలిపారు. పరిశోధన వివరాలు సైన్స్ ట్రాన్స్‌లేషనల్ మెడిసిన్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

నాలుగు లక్షల ఏళ్ల క్రితమే భారత్‌లో మానవ సంచారం?


అంచనాలు తారుమారు కావడం అంటే ఇదే. ఈ భూమి మీద ఆధునిక మానవుడు (హోమో సేపియన్) అవతరించి దాదాపు మూడు లక్షల ఏళ్లు అయిందని.. ఆఫ్రికాలో పుట్టి.. ఆ తరువాత ప్రపంచమంతా విస్తరించాడని అనుకుంటున్నామా? తాజా పరిశోధనలు ఈ అంచనాలన్నీ తప్పు అంటున్నాయి. భారత్ విషయాన్నే తీసుకుంటే సుమారు నాలుగు లక్షల ఏళ్ల క్రితమే హోమోసేపియన్ జాతి మానవులు ఇక్కడ సంచరించారనేందుకు



తగ్గ ఆధారాలను పురాతత్వ శాస్త్ర వేత్తలు వెలికితీశారు. అలాగే ఇజ్రాయెల్‌లో లభించిన అవశేషాలు కూడా సుమారు రెండు లక్షల ఏళ్ల క్రితం నాటివని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. భారత్‌లో లభించిన పురాతన రాతి పనిముట్లకు, ఆఫ్రికాలో లభించిన వాటికి ఉన్న దగ్గరి పోలికల ఆధారంగా తాము ఈ అంచనాకు వచ్చినట్లు చెన్నైలోని శర్మ సెంటర్ ఫర్ హెరిటేజ్ ఎడ్యుకేషన్‌కు చెందిన పురాతత్వ శాస్త్రవేత్త పప్పు శాంతి తెలిపారు. చెన్నైకు నైరుతి దిక్కులో లభించిన ఈ పని ముట్లు నిజంగానే ఆఫ్రికా నుంచి వలస వచ్చిన హోమో సేపియన్లు తయారు చేశారా? లేక స్థానికంగానే అభివృద్ధి చెందిన మానవుల్లాంటి జంతువులు అభివృద్ధి చేశాయా? అన్నది ప్రస్తుతానికి స్పష్టం కావడం లేదని.. పనిముట్లతోపాటు శిలాజాలేవీ లభించకపోవడం దీనికి ఒక కారణమని వివరించారు.

మడతేసుకునే బ్యాటరీలు వస్తున్నాయి...

మడత పెట్టేయగల టెలివిజన్లను ఈ నెలలోనే చూశాం. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్ పీసీలు ఇదే దారి పట్టనున్నాయి. ఎందుకంటే కొలంబియా ఇంజనీరింగ్‌కు చెందిన యువాన్ యాంగ్ అనే శాస్త్రవేత్త ఎటు కావాలంటే అటు వంచగలిగే లిథియం అయాన్ బ్యాటరీలను సిద్ధం చేశారు. మనిషి వెన్నెముక నిర్మాణం స్ఫూర్తిగా తయారైన ఈ కొత్త బ్యాటరీలు తక్కువ



స్థలంలోనే ఎక్కువ విద్యుత్తును నిల్వ చేసుకోగలవని యాంగ్ అంటున్నారు. వెన్నెముకలోని కీళ్ల మాదిరిగా అవసరాన్ని బట్టి సామర్థ్యం పెంచుకోవచ్చు కూడా అని యాంగ్ తెలిపారు. సంప్రదాయ బ్యాటరీల్లో వాడే ఆనోడ్, సెపరేటర్, క్యాథోడ్/సెపరేటర్లను పొడవైన పట్టీల్లా చేయడం... పొడవైన ఆధారంపై వీటిని వెన్నెముక కీళ్లమాదిరిగా ఏర్పాటు చేయడం ఈ కొత్త బ్యాటరీ ప్రత్యేకతలు. ఈ నిర్మాణం కారణంగా బ్యాటరీలను అడ్డంగా ఒంపేసేందుకు వీలేర్పడింది. విద్యుత్తును నిల్వ చేసుకునే భాగాలు విడివిడిగా ఉండటం వల్ల సామర్థ్యం పెరిగింది. వోల్టేజీ హెచ్చు తగ్గులను తట్టుకోవడమే కాకుండా పలుమార్లు చార్జింగ్, డిస్‌చార్జింగ్ చేసినా సామర్థ్యం తగ్గలేదని యాంగ్ వివరించారు.

గుడ్డు అదే ఆమ్లెట్ ఇది

గుడ్డు చూసినప్పటి నుంచి ఆమ్లెట్‌ను చూస్తూనే ఉన్నాం. కోడి ముందా? గుడ్డు ముందా? అంటే ఆమ్లెట్టే ముందు అని చెప్పాం. అంత సుపరిచితమైన ఆమ్లెట్లలో సూపర్ రుచివంతమైన ఆమ్లెట్లు ఇవి.





మష్రూమ్ ఆమ్లెట్

కావలసినవి: అన్‌సాల్టెడ్ బటర్ – 2 టీ స్పూన్లు, బటన్ మష్రూమ్స్ (చిన్న పుట్ట గొడుగులు) – అర కప్పు (నీళ్లలో శుభ్రంగా కడిగి, సన్నగా తరగాలి), కోడి గుడ్లు – 2 (లేదా నాలుగు తెల్ల సొనలు), నీళ్లు – 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు – తగినంత, మిరియాల పొడి / కారం– కొద్దిగా, చీజ్ తురుము – టేబుల్ స్పూను

తయారి: ● పెనం స్టౌ మీద పెట్టి, టీ స్పూను అన్‌సాల్టెడ్ బటర్ వేసి కరిగించాలి ● సన్నగా తరిగిన మష్రూమ్స్‌ని వేసి వేయించాలి ● ఉప్పు, మిరియాల పొడి/కారం జత చేసి దోరగా వేయించి, ఒక ప్లేట్‌లోకి తీసుకుని మూత పెట్టి, పక్కన ఉంచాలి ● ఒక పాత్రలో కోడి గుడ్లు, నీళ్లు వేసి బాగా గిలకొట్టాక, ఉప్పు, మిరియాల పొడి జత చేసి బాగా కలపాలి ● పెనం మీద బటర్ వేసి పెనమంతా పరుచుకునేలా చేయాలి ● బాగా కాగాక... గిలకొట్టిన కోడిగుడ్డు మిశ్రమం వేసి పెనం మీద సమానంగా పరవాలి ● బాగా ఉడికిన తరవాత, వేయించి ఉంచుకున్న మష్రూమ్ ముక్కల మిశ్రమాన్ని ఆమ్లెట్ మీద సమానంగా వేయాలి ● మధ్యకు మడతపెట్టి ప్లేట్‌లోకి తీసుకోవాలి ● సన్నగా తురిమిన చీజ్‌ను పైన చల్లి అందించాలి.





పీనట్ చికెన్ ఆమ్లెట్ రోల్స్

కావలసినవి: కోడి గుడ్డు – 1, నీళ్లు – టేబుల్ స్పూను, ఆలివ్ ఆయిల్ – 2 టేబుల్ స్పూన్లు, స్వీట్ చిల్లీ సాస్ – టేబుల్ స్పూను, జ్యూస్ అండ్ ఫిష్ సాస్ – టీ స్పూను, చికెన్ ముక్కలు – అర కప్పు, ఉడికించిన బఠాణీ + క్యారట్ ముక్కలు – కప్పు, కీరా తురుము – పావు కప్పు, మిరియాల పొడి – టీ స్పూను, పుదీనా ఆకులు – గుప్పెడు, ఉల్లి కాడల తరుగు – పావు కప్పు, ఉప్పు – తగినంత, పీనట్స్ సాస్ – రెండు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర కాడలు – తగినన్ని

తయారి: ● ఒక పాత్రలో కోడిగుడ్డు, టేబుల్ స్పూను నీళ్లు, ఉప్పు చేసి బాగా గిలకొట్టాలి ● సన్నటి మంట మీద పాన్ వేడయ్యాక ఆలివ్ ఆయిల్ వేసి కాగాక, గిలకొట్టిన కోడి గుడ్డు మిశ్రమం వేసి, ఆమ్లెట్ కొద్దిగా మందంగా వచ్చేలా జాగ్రత్తపడాలి ● బాగా కాలిన తరవాత ఆమ్లెట్‌ను ఒక ప్లేట్లోకి తీసుకోవాలి ● ఒక పాత్రలో స్వీట్ చిల్లీ సాస్, జ్యూస్ అండ్ ఫిష్ సాస్ వేసి కలపాలి ● బాణలిలో నూనె కాగాక చికెన్, మిరియాల పొడి, ఉప్పు వేసి వేయించాక, తయారుచేసి ఉంచుకున్న స్వీట్ చిల్లీ సాస్ మిశ్రమం జత చేయాలి ● ఆమ్లెట్ మీద ఉడికించిన కూరల తరుగు, చికెన్ మిశ్రమం సమానంగా పరిచి, పుదీనా ఆకులు ఉంచి, రోల్ చేయాలి ● కొత్తిమీర కాడలతో ముడి వేసి, పీనట్స్ సాస్‌తో అందించాలి.







స్టఫ్‌డ్ ఆమ్లెట్

కావలసినవి: ఆలివ్ ఆయిల్ – టీ స్పూను, రెడ్ క్యాప్సికమ్ తరుగు – 2 టేబుల్ స్పూన్లు (సన్నగా పొడవుగా తరగాలి), ఉల్లి తరుగు – టేబుల్ స్పూను, చిన్న మెంతి కూర ఆకులు – కప్పు, జీడి పప్పు ముక్కలు – టేబుల్ స్పూను, కోడి గుడ్లు – 2, నీళ్లు – టేబుల్ స్పూను, ఉప్పు – తగినంత, మిరియాల పొడి / కారం – తగినంత, చీజ్ – టేబుల్ స్పూను.

తయారి: ● స్టౌ మీద పెనం ఉంచి ఆలివ్ ఆయిల్ వేసి, సన్న మంట మీద కాగనివ్వాలి ● రెడ్ క్యాప్సికమ్ తరుగు, ఉల్లి తరుగు, జీడి పప్పు ముక్కలు వేసి ఆపకుండా కలుపుతూ, దోరగా వేయించాలి ● రెండు నిమిషాల తరవాత మెంతి కూర జత చేసి, పచ్చి వాసన పోయేవరకు వేయించి తీసేయాలి ● ఒక పాత్రలో కోడి గుడ్లు, టేబుల్ స్పూను నీళ్లు వేసి బాగా గిలకొట్టాలి ● ఉప్పు, మిరియాల పొడి / కారం పొడి జత చేసి మరోమారు గిలకొట్టాలి ● స్టౌ మీద పెనం వేడి చేసి, చీజ్ వేసి, కరిగించాలి ● గిలకొట్టిన కోడిగుడ్డు మిశ్రమాన్ని వేసి, సమానంగా పరవాలి ● బాగా కాలిన తరవాత, తయారుచేసి ఉంచుకున్న స్టఫ్‌ను వేసి, ఆమ్లెట్ మీద సగ భాగం వరకు సర్ది మధ్యకు మడత వేయాలి ● పైన చీజ్ తురుము వేసి, వెంటనే అందించాలి.





స్వీట్ ఫ్రూట్ ఆమ్లెట్

కావలసినవి: కోడి గుడ్లు – 2 (తెల్ల సొన మాత్రమే), పంచదార పొడి – టేబుల్ స్పూను, నీళ్లు – టేబుల్ స్పూను, అన్‌సాల్టెడ్ బటర్ – టేబుల్ స్పూను, అరటి పండు ముక్కలు – అర కప్పు, ఆపిల్ ముక్కలు – పావు కప్పు, స్ట్రా బెర్రీలు – 4 (చిన్న చిన్న ముక్కలుగా చేయాలి), తేనె – కొద్దిగా

తయారి: ● ఒక పాత్రలో తెల్ల సొనలు, పంచదార పొడి, నీళ్లు వేసి బాగా గిలకొట్టి పక్కన ఉంచాలి ● మరో పాత్రలో పండ్ల ముక్కలు, తేనె వేసి బాగా కలపాలి ● స్టౌ మీద పెనం పెట్టి, వేడయ్యాక బటర్ వేసి పెనం మీద అంతా పరచాలి ● గిలకొట్టిన కోడి గుడ్డు మిశ్రమం వేసి బాగా కాలనివ్వాలి ● రెండవ వైపు కూడా కాలాక, ఆమ్లెట్‌ను ప్లేట్లోకి తీసి, పండ్ల ముక్కల మిశ్రమం వేసి, ఆమ్లెట్‌ను మధ్యకు మడిచి, వెంటనే అందించాలి.



ప్రాన్స్ ఆమ్లెట్

కావలసినవి: ఉల్లి తరుగు – పావు కప్పు, వెల్లుల్లి రేకలు – 1 (చిన్న చిన్న ముక్కలుగా చేయాలి), క్యాప్సికమ్ తరుగు – టేబుల్ స్పూను, రొయ్యలు – 12 (శుభ్రం చేయాలి), కోడి గుడ్లు – 5, నీళ్లు – టేబుల్ స్పూను, పాలు – కప్పు, కరివేపాకు పొడి – టీ స్పూను, ఉప్పు – తగినంత, మిరప పొడి – టీ స్పూను, మిరియాల పొడి – తగినంత, ఆలివ్ ఆయిల్ – టేబుల్ స్పూను, చీజ్ తురుము – 3 టేబుల్ స్పూన్లు, టొమాటో తరుగు – అర కప్పు

తయారి: ● బాణలిలో ఆలివ్ ఆయిల్ వేసి కాగాక, ఉల్లి తరుగు, వెల్లుల్లి తరుగు వేసి దోరగా వేగాక, రొయ్యలు, తగినంత ఉప్పు, మిరప పొడి జత చేసి మరోమారు వేయించాలి ● తగినన్ని నీళ్లు జత చేసి దగ్గర పడే వరకు ఉడికించి, తీసేయాలి ● ఒక పాత్రలో కోడి గుడ్లు వేసి గిలకొట్టాక, పాలు, కరివేపాకు పొడి, ఉప్పు, మిరియాల పొడి జత చేసి మరోమారు గిలకొట్టాలి ● స్టౌ మీద పెనం వేడయ్యాక ఆలివ్ ఆయిల్ వేసి కాగాక, కలిపి ఉంచుకున్న కోడి గుడ్ల మిశ్రమం వేయాలి ● బాగా కాలిన తరవాత చీజ్ తురుము, టొమాటో ముక్కలు, క్యాప్సికమ్ తరుగు, తయారుచేసి ఉంచుకున్న రొయ్యల మిశ్రమం వేసి ఆమ్లెట్‌ను మధ్యకు మడిచి అందించాలి.

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)



'వాగ్భూషణం భూషణ'మ్మని సంస్కృతంలో ఓ మాట. మనం మాట్లాడే మాట ద్వారానే సమ్మానం, అవమానం కలుగుతాయని దానర్థం. తీవ్రంగా ప్రతిస్పందించడం, మొగమాటం లేకుండా చిన్న పెద్ద తారతమ్యాన్ని పాటించకుండా మాట్లాడటం, ఆవేశాన్ని అదుపు చేసుకోకుండా తెగబడి ప్రవర్తించడం... ఇవన్నీ మీ ఆందోళనకి కారణాలని మీకు తెలిసే ఉంటుంది ఇప్పటికి. ప్రవర్తనలో మార్పుకి ఇది సరైన సమయం. నిశ్శబ్ద విప్లవం సాగే తరుణమిది. మౌనం – అంటే – ఆత్మ సంయమనం ఎంతగా పాటిస్తే అంత మోతాదులోనూ విజయం మీదే. ఎంతగా నోరు తెరిస్తే అంత పరాజయమూ మీ సొంతమేనని గుర్తించండి.

లోగడ ఎవరికైనా హామీ సంతకాలని పెట్టి ఉన్నా, ఎవరికైనా మాటతో అండగా నిలబడి ఉన్నా, వాటిని తెలివిగా పరిష్కరించుకోండి. నాటేటప్పుడు వేప మొక్కే అయినా, పెద్దదై చెట్టుగా మారాక దాన్ని కొట్టవలసి వచ్చినప్పుడు అంతా 'లక్ష్మీదేవి' అంటూ అడ్డుపడతారు. మీ హామీ సంతకాలూ వాగ్దానాలూ 'లక్ష్మీదేవి' చందంగా కాకుండా జాగ్రత్తపడక తప్పదు.

సంతానం బాగానే చదువుతున్నప్పటికీ, మీ ఆత్రుత వాళ్లని మానసికంగా బాధిస్తోందేమో గమనించుకోండి. ఇతర విద్యార్థులతో పోల్చడం, తిట్టడం, కొట్టడం... వంటివి సరికాదు ప్రస్తుత దశలో. అలాగని మందలించకుండా ఉండద్దు గాని, శ్రుతి మించకుండా ఉండాలి. ఏ సూచన/ సలహా మీకు కావలసి ఉందో అలాంటి సందర్భంలో ఆ రంగంలో నిష్ణాతులైనవారి నుండి మాత్రమే వాటిని పొందండి తప్ప, లౌకికానుభవంతో చెప్పేవారి సలహా/ సూచనలు ఇంకా కొద్ది ఇబ్బందిని తెచ్చిపెట్టేవిగా కావచ్చు. సమస్యా పరిష్కారానికి ప్రయత్నించుకోవడం సరైనది తప్ప, గెలుపు కోసం ఎదురు తిరిగి వ్యవహార దిశగా వెళ్లడం మంచిది కాదు. ఇప్పటికే వ్యవహారంలో ఉన్నా పరిష్కార దిశగా వెళ్లడమే ఉత్తమం.

లౌకిక పరిష్కారం: మీ ఒత్తిడిని సంతానం మీద ప్రదర్శించకండి. మందలింపు అతి మాత్రం కాకూడదు.

అలౌకిక పరిష్కారం: మానసికాందోళన ప్రతీకార విధానం తొలగడానికి దక్షిణమూర్తి స్తోత్రాన్ని పఠించండి.

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)



సహజంగా ప్రయత్నించి ఓ విషయం మీద పట్టు సాధించే మనస్తత్వమున్న మీకు ఏదైనా పరాజయమంటూ కలిగితే, అది దైవం అననుకూలత కారణంగానే తప్ప మరొకటి కాదు. అయితే ప్రస్తుతానికి దైవానుకూల్యం ఉంది కాబట్టి, మీ అంచనాకి తగ్గట్టుగా ఫలితం ఉంటుంది. ఇది శుభ పరిణామమే. ఈ మధ్య మీకు మీరుగానో లేక మరెవరి ప్రేరణ కారణంగానో దృష్టి స్థిరమైన ఆస్తిని సంపాదించాలనే ఆలోచన మీదకి ప్రసరిస్తుంది. అనుకున్నాం కదా! – మీరు అనుకుంటే సాహసంతోనైనా సాధించి తీరుతారని. తప్పక అనుకూలిస్తుంది. కార్య రంగంలోకి దూకండి. అయితే తగినంత వ్యవహార జ్ఞానం లేకపోవడమో లేక ఆప్తులు ఆ వ్యవహారాన్ని చూస్తారు గదా అనే నమ్మకం కారణంగానో ఈ బాధ్యతని ఇతరుల మీద పెట్టడంతో పాటు మీరు కూడా ఆ వ్యవహార విధానాన్నీ శైలినీ నేర్చుకోండి. విజయం మీదే. అతికష్టంలో ఉన్నామంటూ మీ ఆప్తులు చెప్పిన కారణంగా రుణంగా ఇస్తానని వాగ్దానం చేసి ఉంటే – ఆస్తి గాని మీకు చేకూరే పరిస్థితి కన్పిస్తే, దాపరికం లేకుండా ఉన్నదున్నట్టుగా చెప్పి మీమీది నమ్మకాన్ని జారిపోకుండా ఉండేలా చూసుకోండి. ముందుకి ముందుగానే ముందస్తు సూచనగా ఈ విషయాన్ని చెప్పి ఉంచండి. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగ, వ్యాపారాల కంటే కొంత ఉన్నతమైన అవకాశం లభించే సూచన రావచ్చు. సూచనని గమనించి వెంటనే నిర్ణయాన్ని తీసుకోకండి. ముందు వెనుకలాలోచించి మాత్రమే నిర్ణయాన్ని ప్రకటించడం మంచిది. ముఖ్యంగా ఈ కొత్త ఉద్యోగ ప్రతిపాదన కారణంగా దంపతులు వేరు వేరు ప్రదేశాల్లో ఉండవలసి వస్తుందేమో గమనించుకుని, దంపతులు కలిసి ఉంటే వీల్లేని పరిస్థితే గనుక ఉంటే, ఉద్యోగ ప్రతిపాదనని తిరస్కరించడం కుటుంబపరంగా మంచిది. ఆర్థికంగా, బలంగా ఉండడం కంటే హార్దికమైన బలంతో (దంపతులు హృదయపూర్వకమైన అన్యోన్యత) ఉండడం ముఖ్యంగా మీ రాశివారికి అవసరం ప్రస్తుత దశలో.

లౌకిక పరిష్కారం: మీ నైపుణ్యంతో పనిని సాధిస్తారు. మంచిదే. దంపతులు వేర్వేరు ప్రదేశాల్లో కాక ఒక్క చోటనే ఉండడం మంచిది.

అలౌకిక పరిష్కారం: లలితాసహస్ర నామాలని నిరంతరం పఠిస్తూ ఉండండి.

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)



వైద్య పరీక్షలన్నీ కూడా మీరు ఆరోగ్యవంతులే అని తేల్చి చెప్తాయి. కుటుంబ వాతావరణమంతా ఆనందకరంగా ఉంటుంది. బంధుమిత్ర వర్గంలో మిమ్మల్ని గురించిన ప్రశంసలే వినిపిస్తుంటాయి. ఆర్థికంగా కూడా దృఢంగా ఉండే అవకాశముంది. ఇన్ని అనుకూలంగా ఉంటే మరి దుఃఖించాల్సిన అవసరమే లేదనుకోకండి. మీ మిత్రులో ఆప్తులో బంధుజనంలో ఎవరో మీకు 'అత్యాశ' అనే వ్యాధిని మాటలు అనే సూదిమందు ద్వారా ఎక్కించి ఉంటారు ఇటీవలే. ఆ కారణంగా ఎంత వచ్చినా ఎంత ఉన్నా ఏదో అసంతృప్తితోనే ఉంటారు. అత్యాశ ఏమాత్రమూ మంచిది కాదు.

'కుటుంబంలో మరింత దగ్గరివా'రనే ఓ జాబితా ప్రతి వ్యక్తికీ ఉంటుంది. వారిలో ఎవరో మిమ్మల్ని తమకొక సహాయాన్ని చేయవలసిందిగా కోరడం – మీరు సరేననడం – అది వాయిదా పడుతూ పడుతూ వారు అడిగిన సహాయాన్ని మీరు చేయలేని పరిస్థితి రావడంతో మీమీద కొంత అననుకూలత కలగవచ్చు. ఇలాంటి సందర్భాల్లోనే కుటుంబాల్లో అశాంతి అనేది బీజ రూపంగా పుడుతుంది. వీలయినంత శీఘ్రంగా కారణాలని వివరించి పని జరగకపోవడంలో కారణం మీరు కాదనే యదార్థాన్ని ఆ అనుకూల వ్యక్తుల సమక్షంలో చెప్పేయండి ఉదాహరణ పూర్వకంగా. అయినా వారు నమ్మని పక్షంలో మీ దోషం లేదు కాబట్టి నిశ్చింతగా ఉండండి!

వ్యాపార విషయంలో ఓ శుభవార్తని వినే అవకాశముంది. పనుల ఆధిక్యం ఒత్తిడీ కారణంగా ప్రధానంగా మీరు చేస్తున్న వృత్తి వ్యాపారాలకి తగినంత సమయాన్ని కేటాయించలేని కారణంగా... మీరు కొంత నిర్లక్ష్యాన్ని చూపిస్తున్న ధోరణిగా అనిపిస్తుంది చూసేవారికి. విడమరిచి మీ పరిస్థితిని చెప్పి పరిస్థితిని సానుకూలపరుచుకుని – వ్యక్తుల్ని మీ అధీనంలోకి తెచ్చుకోండి!

లౌకిక పరిష్కారం: దంపతి మధ్య అశాంతి భావం రాకుండా చూసుకోండి!

అలౌకిక పరిష్కారం: మానసిక వ్యగ్రత తొలగేందుకు సకుటుంబంగా ఓ క్షేత్రానికి వెళ్లి రెండ్రోజులని చక్కగా గడిపి రండి!

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)



వాదించగల ధైర్యం, నేర్పరితనం, అన్నింటికీ మించి మీ వాదంలో ధర్మం, సత్యం ఉండచ్చు గాని, వాదించే సమయం ఇది కాదు మీకు. ఎదుటివారు వాదానికొచ్చినప్పుడూ, తగిన సమాధానం కావాలని ఒత్తిడి తెచ్చినప్పుడూ మాత్రమే వాదానికి దిగండి తప్ప, మీకు మీరుగా తెరతీయద్దు వాదానికి. అటు నుండి బంతి మనకొచ్చినప్పుడు మనం కొట్టి అటుగా పంపడం మంచిది ప్రస్తుత దశలో.

ధనం – అలాగే పైచదువుల కోసం ప్రయత్నాలూ – పోటీ పరీక్షలకి సిద్ధం కావడం... ఇవన్నీ సక్రమంగా ఉంటాయి. మనసుతో సంతోషంతో ఉంటారు. అయితే న్యాయస్థానంలో ఏదైనా సమస్య గాని ఉంటే తాత్కాలిక ఆందోళనతో ఉండొచ్చు. విజయం మాత్రం మీదే అయినా ధనం మంచినీటిలా అయిపోతూ ఉంటుంది. తప్పదంతే. నేలమీద నీరు ఆవిరైనప్పుడే మేఘం పట్టి మరింత జలం వర్ష రూపంగా పడుతుందని సిద్ధపడి ఉండండి. ఇది జరుగబోయే యదార్థం కూడా.

మీ విలువైన కాలం భవిష్యత్ప్రణాళికలూ మరొకరి అనాలోచిత వివాదం కారణంగా తరిగిపోతూ ఉంటాయి – మిమ్మల్ని నిష్ప్రయోజకులుగా చిత్రీకరిస్తూ ఉంటాయి పరిస్థితులు. ఇక ఒడ్డుకి రాబోతున్నారు – దిగులు పడకండి.

పిత్రార్జితం గురించిన విషయం, సంపాదించి కూడబెట్టిన ఆస్తుల సమాచారం – దాన్ని సంతానానికి ఎలా ఇయ్యాలా? అనే ఊహ... వంటివాటిని ప్రస్తుతం తెరమీదికి తేవద్దు. ఆస్తులకి సంబంధించిన ముఖ్యమైన పత్రాలన్నింటినీ ఒకచోట భద్రపరచడం, సరి చూసుకోవడం తప్పనిసరిగా చేసుకోండి. ధనాదాయం ఉద్యోగంలో పదవీ ఉన్నతి వేతనంలో ఆధిక్యం కలుగుతాయి.

లౌకిక పరిష్కారం: సూర్యుడికీ చంద్రుడికీ కూడా గ్రహణం బాధ ఉన్నట్టుగా మీరు ఈ తాత్కాలిక బాధకి తట్టుకోండి. మంచికాలం సమీపిస్తోంది.

అలౌకిక పరిష్కారం: శనికి సంబంధించిన స్తోత్రాన్ని లేదా శ్లోకాన్ని 19 మార్లు రోజుకి 3 మార్లు చేసుకుంటూనే ఉండండి.

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)



పట్టుకున్న పని పూర్తిగా సాధింపబడేవరకూ ప్రయత్నించడం, ఒకవేళ కొంత నష్టపోయినా, దాని గురించి ఒక అవగాహన కలిగిందని సంతృప్తి పడడం స్వభావంగా కలిగిన మీకు – నిండు బండికి చేట బరువౌతుందా? – అన్నట్టు ఎంతటి శ్రమకి అదనంగా మరో సమస్య వచ్చినా జంకనే జంకరు. అయితే ప్రస్తుత దశలో మీ శ్రమకి అనుకూల ఫలితమే వస్తుంది తప్ప, శ్రమ అనేది ఓ అనుభవంగా మిగిలిపోదు. మంచిదే కదా!

ఎక్కువసేపు కుటుంబసభ్యులతో గడిపే అవకాశం లేకుండా కార్యభావాన్ని భుజాన వేసుకుని తిరుగుతూండే కారణంగా, జీవిత భాగస్వామి/భాగస్వామిని పరిస్థితి కొంత అసహనంతో, నిరాశతో ఉం(టోం)టుందేమోనని కొద్దిగా ఆలోచించండి. ఇనుము మెత్తబడ్డప్పుడు చిన్న సుత్తితో కొట్టినా ఇనుప వస్తువు ఆకారంలో మార్పు వచ్చినట్టు, ఈ నిరాశాస్థితిలో మీ భాగస్వామి/ని ఉన్నప్పుడు మిత్రులో బంధువులో వచ్చి మరింత నిరాశా పూర్వకమైన ఇతర కుటుంబ కథలని గాని చెప్తే పరిస్థితిలో కొంత మార్పు వచ్చే వీలుంది. అన్నిటికంటే కుటుంబం ముఖ్యం. గమనించండి!

'నేను ముక్కుసూటి మనిషిని – ఉన్నదున్నట్టుగా మాట్లాడటం నా స్వభావ'మని ఎవరు చెప్పినా, ఇక వారికి వేరే శత్రువులక్కర్లేదు – వారికి వారే శత్రువుల్ని ఆకర్షించుకోవడంలో దిట్ట అని అర్థం చే(సే)సుకోవచ్చు. అందుకని కొన్ని కొన్ని సందర్భాల్లో లౌక్యంతో తెలివిగా వ్యవహరించక తప్పదు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకోండి. ఇది అసత్యం కిందికి రాదు. ఇతరులకి హాని కలిగించే అబద్ధమనేది పాపానిక్కారణం తప్ప మరో తీరుగా అసత్యమాడితే నేరం కాదు. వినాయక చవితి కథలో విందుల్ని ఒకరిమీద మరొకరు పోటాపోటీగా వినాయకునికి పెట్టినట్లు, మీకూ భోజన ఆధిక్యం కలిగి తాత్కాలిక అనారోగ్యం కలిగే అవకాశముంది కాబట్టి, ఆహార విహారాల్లో జాగరూకత తప్పనిసరి.

లౌకిక పరిష్కారం: కొద్ది లౌక్యాన్ని చూపించండి. ఇతరులకి హాని కలిగించే అసత్యాన్ని పలకకండి.

అలౌకిక పరిష్కారం: ఒక నెలకి ఓ దేవాలయానికి దీపారాధనకి ఎంత నువ్వులనూనె కావాలో అడిగి యథాశక్తి సమర్పించుకోండి.

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)



స్థిరమైన వ్యాపారాన్ని ఎంచుకుని తదనుగుణంగా వ్యాపారాభివృద్ధి కోసం పాటుపడతారు. అందరి సహకారమూ మీకు లభిస్తుంది కూడా. ఒక వ్యాపారం చేయాలనుకుంటూ ఓ నిశ్చయానికొచ్చాక మళ్లీ మరో ఆలోచనకి రాకండి. ఇంతకు ముందొకసారి ఇలా రెండు పడవల మీద ప్రయాణిస్తూ ఇబ్బందిపడ్డ అనుభవాన్ని గుర్తుచేసుకోండి! వ్యాపారంలో కొత్తగా పరిచితులయ్యేవారిని వెంటనే నమ్మేయకండి. వ్యాపారం ఒక స్థితికి వచ్చేవరకూ అనుభవజ్ఞుల్నీ పెద్దల్నీ ప్రతి చిన్న విషయానికీ కూడా సంప్రదిస్తూనే ఉండండి. వారికి – ఇలా సంప్రదిస్తూనే ఉంటా–ననే విషయాన్ని ముందుకు ముందుగానే చెప్పి వారి అనుమతిని పొందండి. వారు వద్దంటున్నప్పటికీ యథాశక్తి కొంత ముట్టజెప్తూ ఉండండి. చేసిన రుణాల గురించిన ఆలోచనలని పక్కన పెట్టండి కొంతకాలం. చెల్లించవలసిన వడ్డీ(ల)ని సక్రమంగా చెల్లిస్తూ రుణ దాతలకి సంశయం రాకుండానూ అనుమానం తలెత్తకుండానూ వ్యవహరిస్తూ మీ వ్యాపారానికి వారిని కూడా సహకరించవలసిందిగా అభ్యర్థించండి. వాహనాలని కొనుక్కుంటారు. కుటుంబ సభ్యులంతా వ్యాపార విషయంలో అనుకూలిస్తారు.

వ్యాపార స్థలం సమీపానికి ఇల్లు మారడమో, లేక వ్యాపారాన్ని గృహ సమీపానికి మార్చుకోవడమో చేస్తారు. మీ శత్రువులు మీ వ్యాపారానికి విఘ్నాలనేర్పరచాలని ప్రయత్నించి ఏమీ చేయలేకపోతారు. శత్రువని తెలిసినా చక్కగా పలకరించండి. వ్యాపారం బాగా సాగాలంటూ మొక్కుబడుల్నీ వాగ్దానాల్నీ చేసే కాలం ముందుంది. అప్పుడు చే(చూ)ద్దురు గాని! సంతానంలో ఒకరికి వివాహం గాని అలాంటి శుభ కార్యం గాని కలిసొచ్చే అవకాశముంది. దాంతో కొంత సద్వ్యయం (శుభకార్యం నిమిత్తం చేయాల్సిన ఖర్చు) కావచ్చు కాబట్టి వ్యయం విషయంలో కొంత నియంత్రణని పాటించండి.

లౌకిక పరిష్కారం: నిరుత్సాహపరులని దరిజేరనీయకండి. జీవితంలో ఓడిపోయినవారి కథలని వింటూ గడపకండి.

అలౌకిక పరిష్కారం: శంకరునికి బిల్వ జలాలతో (మారేడాకులు ముంచిన నీరు) అభిషేకించి బిల్వార్చన చేయించుకోండి.

ప్యాడ్‌మ్యాన్ చాలెంజ్





● ఆమిర్ ఖాన్

ఐస్ బకెట్ చాలెంజ్, రైస్ బకెట్ చాలెంజ్ అంటూ ట్రెండ్‌కు తగ్గట్టు చాలా చాలెంజ్‌లు చూశాం. ఇప్పుడు మరో చాలెంజ్‌ను మన ముందుకు తీసుకు వస్తున్నారు ఆమిర్ ఖాన్. అదే 'ప్యాడ్‌మ్యాన్ చాలెంజ్'. అక్షయ్ కుమార్, రాధికా ఆప్టే, సోనమ్ కపూర్ ముఖ్య తారలుగా ఆర్.బాల్కీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్యాడ్‌మ్యాన్'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమిర్‌ఖాన్ ఈ 'ప్యాడ్‌మ్యాన్' చాలెంజ్' స్టార్ట్ చేశారు.


అరుణాచలమ్ మురుగనాథమ్ అనే వ్యక్తి తక్కువ ధరకు లభ్యమయ్యే శానిటరీ నేప్‌కిన్‌లను తయారు చేసి, తన గ్రామంలో ఉన్న మహిళలకు అందజేసేవారు. ఆ విధంగా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన అరుణాచలమ్ కథతో ఈ 'ప్యాడ్‌మ్యాన్' తీశారు. ఇతరుల్లో అవగాహన కలిగించే ఈ చిత్రం ప్రేక్షకులకు చేరువ అవ్వాలని ఆమిర్ ఈ 'ప్యాడ్‌మ్యాన్' చాలెంజ్‌కు నాంది పలికారు. ఇంతకీ 'ప్యాడ్‌మ్యాన్' సినిమాకి, ఆమిర్‌కీ సంబంధం ఏంటీ అనుకుంటున్నారా? ఈ సినిమాను అక్షయ్ కుమార్ వైఫ్ ట్వింకిల్ ఖన్నా నిర్మించారు. ట్వింకిల్, ఆమిర్ మంచి స్నేహితులు. ట్వింకిల్ అడగ్గానే ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్నారీ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్. ఫొటోలో చూస్తున్నారుగా! ఆమిర్ ఖాన్ శానిటరీ ప్యాడ్‌ను ఇలా పట్టుకొని ఫొటో పోస్ట్ చేసి ''అవును.. నా చేతిలో ఉన్నది శానిటరీ ప్యాడే. ఇందులో సిగ్గుపడాల్సింది ఏమీ లేదు'' అని పేర్కొన్నారు. అంతే కాదు.. బాలీవుడ్ బిగ్ బీ అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్‌లను కూడా ఇలా శానిటరీ ప్యాడ్ పట్టుకొని ఫొటో పోస్ట్ చేయమని చాలెంజ్ విసిరారు. ఇది ఎంటర్‌టైన్‌మెంట్ కోసం చేస్తున్నది కాదు. సోషల్ అవేర్‌నెస్ కోసం స్టార్ట్ చేసిన చాలెంజ్. ఈ చాలెంజ్ ముఖ్య ఉద్దేశం ప్యాడ్స్ గురించి మాట్లాడటానికి మనం సిగ్గుపడకూడదని. 'ప్యాడ్‌మ్యాన్' సినిమా ఈ నెల 9న విడుదల కానుంది.

ముక్కు వద్దు.. కాళ్లు తీసుకోండి

...ఇలాంటి ఆఫర్ ఎవరైనా ఇస్తారా? కోట్లు ఇస్తామన్నా ఇవ్వరు. కానీ దీపికా పదుకోన్ మాత్రం చాలా ధైర్యంగా ఈ స్టేట్‌మెంట్ ఇచ్చారు. బాలీవుడ్‌లో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్. అసలు సంగతి ఏంటంటే.. దీపికా పదుకోన్ లీడ్ రోల్‌లో సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పద్మావత్'. ఈ సినిమా పట్టాలెక్కినప్పుడు మొదలైన వివాదాలు సినిమా విడుదలైనా ఆగడం లేదు. భన్సాలీని చంపేస్తామని, దీపిక తల.. ముక్కు నరికిన వారికి లక్షల్లో నజరానా ఇస్తామని 'పద్మావత్' సినిమాని వ్యతిరేకిస్తున్న వారు బహిరంగంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ బెదిరింపుల గురించి దీపిక స్పందించారు. ''పద్మావత్'లో నటించినందుకు నా తల, ముక్కు నరికేస్తామని బెదిరింపులు వస్తున్నాయి. నాకు నా ముక్కు అంటే చాలా ఇష్టం కాబట్టి దాన్ని కత్తిరించొద్దు. కావాలంటే పొడవైన నా కాళ్లు కత్తరించుకోండి. ఇలా బెదిరించే వాళ్లను లైట్‌గా తీసుకోకూడదు. ధైర్యంగా ఎదుర్కోవడానికి నేను భయపడను'' అంటూ చిన్నప్పుడు జరిగిన ఓ సంఘటన గుర్తు చేసుకున్నారీ బ్యూటీ. ''నాకు 14ఏళ్ల వయసులో అమ్మానాన్నలతో కలిసి బయటికెళ్లాను. అప్పుడో వ్యక్తి కావాలనే నన్ను రాసుకుంటూ వెళ్లాడు. అతని చెంప ఛెళ్లుమనిపించా'' అన్నారు దీపికా పదుకోన్.

● దీపికా పదుకోన్

రైటర్ రజనీ!



● రజనీకాంత్

గాల్లోకి సిగరెట్ ఎగరేసి అలవోకగా నోటితో రజనీకాంత్ క్యాచ్ చేయడం చూశాం.

నేను.. ఒక్కసారి చెబితే వందసార్లు చెప్పినట్లే అని రజనీ డైలాగ్స్ చెప్పడమూ చూశాం.

స్టైలు స్టైలు రా.. ఇది సూపర్‌స్టైలు రా అంటూ ప్రేక్షకుల చేత ఈలలు కొట్టించిన రజనీ స్టైలిష్ డ్యాన్స్ చూశాం.

కానీ ఆయనలో ఎవరికీ తెలియని ఇంకో స్టైల్ ఉంది. అదే ఆయన రైటింగ్ స్టైల్. యస్.. రజనీ కథ రాశారని నటుడు–దర్శకుడు సముద్రఖని చెబుతున్నారు. 'కబాలి' ఫేమ్ పా. రంజిత్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా రూపొందిన సినిమా 'కాలా'. ఇందులో సముద్రఖని కీలక పాత్ర చేశారు. 'కాలా' షూటింగ్ అనుభవాలను ఆయన పంచుకున్నారు. ''ఈ చిత్రం కోసం ఎక్కువగా నైట్ షూట్స్ చేశాం. రజనీసార్ ఫుల్ ఎనర్జీతో ఉండేవారు. ఫస్ట్ షాట్‌కు ఎలా ఉంటారో మార్నింగ్ 4 గంటల లాస్ట్ షాట్‌కు సేమ్ ఎనర్జీ. ఇది చూసి మేం అందరం షాక్ అయ్యాం. అంతేకాదు రజనీసార్ ఓ కథ రాశారు. ఆ కథ నాకు చెప్పారు. అందులో నన్నే నటించమన్నారు. ఆ సినిమాకి రైటర్‌గా రజనీసార్ పేరు ఉంటుంది'' అని చెప్పుకొచ్చారు సుమద్రఖని. అయితే ఈ సినిమాను ఎప్పుడు తీయాలనుకుంటున్నారో మాత్రం సముద్రఖని చెప్పలేదు.

రత్నం లాంటి చాన్స్



● అదితీరావ్ హైదరి

మరోసారి గోల్డెన్ ఛాన్స్ కొట్టేశారు అదితీరావ్ హైదరి. మణిరత్నం సినిమాలో హీరోయిన్ ఛాన్స్ అంటే గోల్డెన్.. గోల్డెన్ ఏంటి? డైమండ్ అని కూడా అనొచ్చేమో. ''మణిరత్నంగారి దర్శకత్వంలో గతేడాది 'చెలియా' చేశాను. ఆ తర్వాత సంజయ్‌దత్ సినిమా 'భూమి'లో కీలక పాత్ర చేశాను. గతేడాది చాలా పాజిటివ్‌గా గడిచింది. ఇప్పుడు మణి సార్ సినిమాలో మళ్లీ నటించబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ప్రస్తుతానికి నా క్యారెక్టర్ డిటైల్స్ సీక్రెట్'' అని పేర్కొన్నారు అదితీరావ్ హైదరి. ప్రజెంట్ మణిరత్నం దర్శకత్వంలో విజయ్‌సేతుపతి, శింబు, జ్యోతిక, ఐశ్వర్య రాజేష్, ఫాజల్ కాంబినేషన్‌లో ఓ మల్టీస్టారర్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకే అదితీని తీసుకున్నారట మణి. ఇటీవల ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది.

హ్యాండిల్ విత్ కేర్



● జితన్ రమేష్, శృతి యుగల్

సూపర్‌గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఒకటే లైఫ్'. 'హ్యాండిల్ విత్ కేర్' అన్నది ఉపశీర్షిక. శృతి యుగల్ కథానాయిక. ఎం.వెంకట్ దర్శకత్వంలో లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. వెంకట్ మాట్లాడుతూ –''టెక్నాలజీ పేరుతో పరుగులెడుతోన్న నేటి తరం హ్యూమన్ రిలేషన్స్, ఎమోషన్స్‌కి ప్రాధాన్యత ఇవ్వాలని సినిమాలో చూపిస్తున్నాం. ఓ మంచి సినిమా చూశామన్న సంతృప్తి ప్రేక్షకులకు కలుగుతుంది'' అన్నారు. ''మంచి కథాంశంతో రూపొందిన చిత్రమిది. మా టీమ్‌కి మంచి పేరు తీసుకొస్తుందనే నమ్మకం ఉంది. అతి త్వరలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నారాయణ్ రామ్. సుమన్, నల్ల వేణు, జబర్దస్త్ రామ్, బాబి, రిషి, శ్యామ్, దిశ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అమ్రీష్, కెమెరా: వై.గిరి.